# సస్పెన్స్, థ్రిల్లర్ కథలు

## వసుంధర



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net

ప్రచురణ సంఖ్య: ౧౨


# విషయసూచిక


| | |
|---|---|
| నేలమాళిగ | 3 |
| నేరస్థుడి తీర్పు | 11 |
| ధైర్యానికి చావు లేదు | 19 |
| చోరలీల | 28 |
| నిజం చెప్పే యంత్రం | 36 |
| దెయ్యాలున్నాయి | 45 |
| అభిరుచి | 53 |
| గోవిందరావూ - కథా! | 61 |
| సాక్షికోసం అన్వేషణ | 70 |
| బానిస | 78 |
| అదృష్టవంతుడు | 86 |
| కిరాయి హంతకుడు | 95 |

# సస్పెన్స్, థ్రిల్లర్ కథలు ......



## వసుంధర



# నేలమాళిగ

వందలాది నవలలూ, వేలాది కథలూ, కథానికలూ, బాల సాహిత్యం, సినిమా కథలూ, విశ్లేషణలూ, సాహితీ విమర్శలూ..ఇలా అనేక ప్రక్రియల్లో దశాబ్దాలపాటు కృషి చేసిన, చేస్తున్న వసుంధర దంపతులు దాదాపు 30 సంవత్సరాల క్రిందట విరివిగా డిటెక్టివ్ కథలు కూడా వ్రాసేవారన్న సంగతి చాలా మందికి తెలియకపోవచ్చు. అప్పట్లో 'అపరాధపరిశోధన' అనే మాసపత్రిక వస్తుండేది. అందులో వైవిధ్యభరితమైన సస్పెన్స్,థ్రిల్లర్ కథలు అనేకం వాసారు వసుంధర గారు. వాటిల్లో కొన్నింటిని 'కౌముది' పాఠకులకోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం. - సంపాదకుడు.

**వామనరావు, వైకుంఠం** పక్క పక్క ఇళ్ళలోనే ఉంటున్నారు. ఇద్దరికీ దూరపు బంధుత్వం కూడా ఉంది. అయినా ఎందుకో చాలాకాలం నుంచీ మాట్లాడుకోరు, అలాగని ఆ ఇంటిమీద కాకి ఈ ఇంటిమీద వాలకూడదన్న సిద్ధాంతమూ లేదు. ఇద్దరూ అంటీ ముట్టనట్లుగా ఉంటారంతే!

వామనరావుకూళ్ళో రెండు కిరాణా, రెండు ఫ్యాన్సీ - దుకాణాలున్నాయి. డబ్బు బాగా సంపాదించాడు, సంపాదిస్తున్నాడు. ఆయనకిద్దరు కూతుళ్ళు, ఓ కొడుకు. ఓ కూతురికీ, కొడుక్కీ కూడా పెళ్ళిళ్ళైపోయాయి. ఇక మిగిలింది పద్దెనిమిదేళ్ళ రాజేశ్వరి. దానికోసం సంబంధాలు చూస్తున్నాడు తండ్రి.

నిజానికి మరో రెండేళ్ళదాకా రాజేశ్వరి పెళ్ళి చేయాలని వామనరావనుకోలేదు. కానీ వైకుంఠం కొడుకు గణేష్ రాజేశ్వరిని ప్రేమిస్తూ ఆమె చుట్టూ తిరుగుతున్నాడు. అతడిలో ఏమి మాయ ఉందో ఏమో - రాజేశ్వరి కూడా అతణ్ణి ప్రేమించడం ప్రారంభించింది.

విషయం తెలిసిన వామనరావు కూతురిని మందలించాడు. ఫలితంగా రాజేశ్వరి వీలైనంత రహస్యంగా గణేష్‌ని కలుసుకోసాగింది. అందుకే రాజేశ్వరికి త్వరగా మంచి సంబంధం చూసి పెళ్ళి చేయాలని వామనరావనుకుంటున్నాడు.

అసలు గణేష్‌నే ఆయన అల్లుడిగా చేసుకోవచ్చు. కుర్రాడు బాగుంటాడు. రాజేశ్వరికి ఈడూ జోడులా కనబడతాడు. కానీ వచ్చిన ఇబ్బందల్లా అతగాడెప్పుడూ గాంబ్లింగ్ హౌసుల్లో గడుపుతుంటాడు. అక్కడ బాగా డబ్బు సంపాదిస్తాడని వినికిడి. ఇంతవరకూ ఏ నేరమూ చేయలేదు. కానీ అతణ్ణి గురించి పట్టుబడని నేరస్థుడని వామనరావనుకుంటాడు.

పోనీ తండ్రి సంప్రదాయం చూద్దామా అనుకుంటే వైకుంఠం చేసేది కమీషన్ వ్యాపారం. వ్యాపారంలో అతడి పెట్టుబడి కనపడదు. ఏం చేస్తున్నాడో కూడా సరిగా తెలియదు. కానీ డబ్బు బాగా సంపాదించాడు. సంపాదిస్తున్నాడు. ఆయన పద్ధతుల గురించి చాలామందికి సదభిప్రాయం లేదు. అలాంటివాడితో వియ్యమందడం వామనరావు కిష్టంలేదు.

ప్రస్తుతం వైకుంఠం పక్షవాతంతో మంచం పట్టాడు. ఇది జరిగి ఆర్నెల్లయినా, పక్కింట్లోనే ఉన్న వామనరావొక్కసారి కూడా ఆయన్ను చూడ్డానికి వెళ్ళలేదు, కానీ ఈ రోజు వెళ్ళక తప్పలేదు.

ఎందుకంటే వైకుంఠం ఆయన్ను పిలిచాడు.

వామనరావు వెళ్ళి వైకుంఠాన్ని పలకరించి - ఆయనకు జబ్బు చేసిందన్న విషయం తనకు వారం రోజుల క్రితం మాత్రమే తెలిసిందనీ, వద్దామంటే వీలుపడడం లేదనీ అన్నాడు.

ఆయన కేవలం మర్యాద కోసం ఆ మాటలన్నాడు.

వైకుంఠం అతి కష్టం మీద కూడబలుక్కుని మాట్లాడుతున్నాడు. ఆయన వామనరావుతో - "వ్యాపారంలో లక్షపనులుంటాయి. మీరు రాకపోయినందుకు నేనేమీ అనుకోలేదు. నేను మిమ్మల్ని పిలవడానికి కారణం మా అబ్బాయి! వాడు మీ అమ్మాయిని ప్రేమిస్తున్నాడు -" అన్నాడు.

"ఈ పెళ్ళికి నా కిష్టంలేదు -" అన్నాడు వామనరావు ఖచ్చితంగా.

"ఈ పెళ్ళికి మీ ఇష్టం అడ్డురాదు. అమ్మాయి కూడా వాడంటే ఇష్టపడుతోంది. మీరు వేరే బలవంతం పెళ్ళి చేసినా అన్నింటినీ కాదని ఆ సంబంధం కూడా తెంచుకుని మావాడి దగ్గరకు వచ్చేస్తానంటోంది...-" అన్నాడు వైకుంఠం.

"జూదమాడడం మంచి అలవాటు కాదు. అలాంటివాడు - ఎలాంటి నేరాలైనా చేయడానికి సిద్ధపడతాడు. ఏదో ఒకరోజున అతడు చెరసాలపాలు కాక తప్పదు -" అన్నాడు వామనరావు.

"మీరు జూదం గురించి మాట్లాడుతున్నారు. అంత కంటే చెడ్డది దొంగతనం. కానీ పుట్టుకతోనే నాకది కళగా పట్టుబడింది. ఆ కళను నేను సామర్థ్యం నిరూపించుకుందుకే తప్ప స్వప్రయోజనానికి వాడుకోలేదు -..."

"దొంగతనం కళ ఎలా అవుతుంది? అది నేరం..."

"నడిరోడ్డుమీద ఎవరినైనా పిడిగుద్దులతో రక్తం వచ్చేలా కొడితే అది అమానుషం. నేరం. అదే ఒలింపిక్సులో బాక్సింగ్ పేరిట చేస్తే అది వినోదం. ఆట - అలాగే దొంగతనం నాకు సంబంధించినతవరకూ కళ..."

"ఈ కళ తెలిసినవారితో సంబంధ బాంధవ్యాలు నాకిష్టముండవు -"

"ఎందుకని?"

"చెప్పానుగా - దొంగతనం చేసేవారు నా దృష్టిలో కళాకారులు కాదు - దొంగలు!"

వైకుంఠం ఎలాగో కష్టపడి నవ్వగలిగాడు - "నా కళను నేను స్వార్థానికి ఉపయోగించుకుని ఉంటే మీ పక్కన ఇలా మేడ కట్టుకుని ఉండేవాణ్ణి కాదు. ఏమహానగరం నడిబొడ్డునో పాలరాతి మేడ కట్టేవాణ్ణి. అందులో నెమలి సింహాసనం మీద కోహినూరు వజ్రం పొదిగిన కిరీటం ధరించి కూర్చునేవాణ్ణి."

"అంటే?"

"నేను చేస్తున్న కమీషన్ వ్యాపారం - నిజాయితీకి నిదర్శనం -"

"నా కర్థంకాలేదు -...."

"నేను తలచుకుంటే బ్యాంకులు కొల్లగొట్టగలను. లాకర్లలో డబ్బు దోచగలను. మ్యూజియాల్లో అపూర్వ వస్తువులు సంగ్రహించగలను. అవేమీ చేయలేదు నేను. అందుకు కారణం నా నిజాయితీ -... నా సామర్థ్యం మరొకడికుంటే - అదంతా దొంగతనానికే వినియోగపడేది -..."

"మీరు దొంగ - మీ అబ్బాయి జూదరి - మీతో వియ్యమెలా అందగలను?..." అన్నాడు వామనరావు.

"మా గణేష్ కూడా దొంగతనంలో అత్యంత ప్రతిభావంతుడు. అర్జునుడికి అభిమన్యుడిలా - వాడు నా కొడుకయ్యాడు. అయితే జీవితంలో వాడింతవరకూ ఒక్క దొంగతనం కూడా చేయలేదు. ధనసంపాదనకు జూదాన్నే ఎన్నుకున్నాడు. అదీ న్యాయమార్గంలో -...."

"నాకు నచ్చదు మీ మార్గం!"

"వామనరావుగారూ - మిమ్మల్ని మీరు మోసగించుకుంటున్నారు తప్ప దొంగతనమంటే మీకూ ఇష్టమే! వ్యాపారంలో మీరు సాధించే ప్రగతి - దొంగతనం కారణంగా కాదా!" అన్నాడు వైకుంఠం.

"ఇలాంటి వితండవాదనలు నాకు నచ్చవు. వ్యాపారంలో ప్రజాసేవ ఉంది " అన్నాడు వామనరావు.

"అయితే శేఠ్ చందనదాసుని మోసగించి రెండుమణులు తీసుకోవడంలో ఎలాంటి ప్రజాసేవ ఉంది?" అన్నాడు వైకుంఠం.

వామనరావు తడబడ్డాడు.

నాలుగేళ్ళక్రితం జరిగిన విషయమది.

చందనదాసుకి అర్జంటుగా నాలుగులక్షలు కావలసివచ్చాయి. అతడికి డబ్బిచ్చే నాథుడు దొరక్క వామనరావు నాశ్రయించాడు. తాకట్టుకి ఎనిమిది మణులిచ్చాడు. ఒక్కొక్క మణి లక్షాయాభైవేల రూపాయల విలువ చేస్తుంది. ఆ మణులు చందనదాసింట తరతరాలుగా ఉంటున్నాయి. ఎట్టిపరిస్థితుల్లోనూ వాటి నాయన విక్రయించడు.

చందనదాసుకి వామనరావు డబ్బిచ్చాడు. అప్పుడాయనకి దుర్బుద్ధి పుట్టింది. అందుక్కారణం ఓ స్మగ్లరు. పురాతనకాలపు మణులకు విదేశాల్లో విలువెక్కువ. ఒక్కొక్కటి నాలుగు నాలుగులక్షలు చొప్పున ఆ స్మగ్లరు రెండు మణులను వామనరావు వద్ద కొన్నాడు. ఆ రెండు మణుల స్థానంలో మామూలు మణుల నుంచాడు వామనరావు.

చందనదాసు డబ్బిచ్చి మణులు తీసుకునేందుకు వచ్చాడు. అతడికి వెంటనే జరిగిన మోసం తెలిసిపోయి పెద్ద రగడ చేశాడు.

"నాకేమీ తెలియదు - నువ్విచ్చినవే తిరిగిచ్చాను. కావాలంటే పోలీస్ కంప్లయింటు చేసుకో -" అన్నాడు చందనదాసు.

వామనరావు కరగలేదు.

చందనదాసు విచారంగా వెళ్ళిపోయాడు.

ఈ నేరం గురించి వామనరావెవరికి చెప్పలేదు. ఇంట్లో భార్యాబిడ్డలకు చెప్పలేదు. అటు చందనదాసూ ఎవరికీ చెప్పుకోలేదు.

మరి - వైకుంఠానికెలా తెలిసింది?

"చెప్పండి - మీరు చేసింది దొంగతనం కాదా?"

"నాకేమీ తెలియదు. మిమ్మల్ని మీరు సమర్థించుకునేందుకు నా మీద నేరారోపణ చేస్తున్నారు -" అన్నాడు వామనరావు.

"ఆరోపణలు నా రక్తంలోనే లేవు. నిజాయితీ మా ఇంటి ఆరోప్రాణం. మా ఇంట్లో ఎవరొక పైసా సంపాదించినా అది పద్దు రాస్తాం. నేను కొన్న ప్రతి వస్తువుకూ అకౌంటుంది. న్యాయంగా పన్ను కడుతూ ఇంతవాడినయ్యాను..."

వామనరావు నవ్వి - "నిజాయితీ గురించి మీకులా సంజాయిషీ ఇచ్చుకోవాల్సిన అవసరం రాలేదు నాకు..." అన్నాడు.

"నాకు సంజాయిషీ భయంలేదు. అందుకే నా ఇంట్లో నేలమాళిగ లేదు. మీ ఇంట్లో నేలమాళిగ ఎందుకున్నట్లో?"

"మా ఇంట్లో నేలమాళిగ ఉందా?" ఆశ్చర్యంగా అడిగాడు వామనరావు.

"మీరాశ్చర్యాన్ని నటించవద్దు. మీ నేలమాళిగలో ఏమున్నాయో కూడా నాకు తెలుసు -..." అన్నాడు వైకుంఠం

వామనరావు ఆశ్చర్యంగా ఆయనవంక చూశాడు. వైకుంఠం ముఖంలో ఇప్పుడు కొత్త ఉత్సాహం కనబడుతోంది.

"ఏమున్నాయో చెప్పండి - తెలుసుకుంటాను -..."

"మీకు తెలిసింది చెప్పటం కన్నా - తెలియంది చెప్పటంలో నాకు థ్రిల్లెక్కువుంది -" అన్నాడు వైకుంఠం.

"అంటే..."

"నేలమాళిగలో - గోడకు పాదిగిన బీరువాలో - ఒక పెద్ద నగలపెట్టె... అందులో ఒక చిన్న భరిణ... అందులో వజ్రాలు పొదిగిన నాలుగుంగరాలు... ఇప్పుడక్కడ మూడే ఉన్నాయి..."

"వాట్!...." అన్నాడు వామనరావు తెల్లబోయి.

"అవును - మూడే ఉన్నాయిప్పుడు?"

"ఎవరు తీశారు?"

"ఎవరు తీసినా అది స్వార్థంతో కాదు..."

"ఎవరు తీశారు?" రెట్టించాడు వామనరావు.

"అయితే నేలమాళిగలోకి మీకు తెలియకుండా ప్రవేశించిడం మరెవరికీ సాధ్యం కాదు - ఆ ఉంగరం నా దగ్గరుంది -" అన్నాడు వైకుంఠం.

వామనరావు మ్రాన్పడిపోయాడు. పక్షవాతం తనకే వచ్చిందా అన్న అనుభూతి కలిగిందతడికి. అందులోంచీ తేరుకున్నాక - "ఏదీ - చూపించండి -..." అన్నాడాయన.

అంతవరకూ ముడిచి ఉన్న కుడిచేతి గుప్పెట తెరిచాడు వైకుంఠం - "చూడండి!" అన్నాడు.

వామనరావు కళ్ళు జిగేల్మన్నాయి.

వైకుంఠం అరచేతిలో వజ్రపుటుంగరముంది. కానీ అదెలా సాధ్యం?

వామనరావు ఊహలు పరిపరి విధాల పోయాయి.

"ఈ ఉంగరం మాదై ఉండదు. మాదే గనుక అయుంటే మీరిది ఎందుకు తీసినట్లు?" అన్నాడు వామనరావు.

వైకుంఠం కుడిచేతి గుప్పెట మళ్ళీ మూసేసి - "నేను జబ్బుపడటానికి వారంరోజుల ముందు నేనిది మీ నేల మాళిగ నుంచీ తెచ్చాను. నా సామర్థ్యాన్ని మీకు నిరూపించుకోవాలని నా అభిప్రాయం. మీలో లేని నిజాయితీ నాలో ఉంది. అసమర్థుడూరుకోవటం గొప్ప విశేషం కాదు. సమర్థుడి శాంతమే గొప్పది. మీరు నామాట విని రెండు అమాయక హృదయాలను కలిపి పుణ్యం కట్టుకోండి. వివాహం పెద్దల ఆశీర్వాదంతో జరిగితే - అది ఇరుపక్షాల పిన్నలకూ మంచిది -" అన్నాడు.

"ఈ ఉంగరం మాదికాదు -" అన్నాడు వామనరావు చటుక్కున.

"ఇది మీది కాదని ఋజువు చేయండి. అప్పుడు నేనే వివాహం జరక్కుండా చేస్తాను...-" అన్నాడు వైకుంఠం.

"అంటే?"

"మీ ఉంగరాలు మీ నేలమాళిగలోనే ఉన్నాయని మీరనుకుంటున్నారు. మీ ఊహ తప్పని నేనంటున్నాను. నే నన్నది తప్పని ఋజువు చేస్తే - ఈ ఉంగరాన్ని కూడా మీకు బహూకరిస్తాను. గణేష్ వివాహం రాజేశ్వరితో జరక్కుండా ఆపుతాను..." అన్నాడు వైకుంఠం.

"ఉంగరం మాదే అయితే?"

"నా సామర్ధ్యం మీరు తెలుసుకుంటారు. నాది సదుద్దేశ్యమే ననడానికి చిహ్నంగా ఈ ఉంగరం మీకు తిరిగిచ్చేస్తాను. పైసా కట్నం లేకుండా మీ అమ్మాయిని నా ఇంటికోడల్ని చేసుకుంటాను..."

"మీరసలు నేలమాళిగలోనికి ఎలా వెళ్ళారు?"

"అది రహస్యం..."

రహస్యం కాదు - అసాధ్యం..."

"ఎవరికైనా అసాధ్యమేమో - నాక్కాదు. నా మాటలకు ఋజువు నా అరచేతిలో ఉంగరం -...."

"అసాధ్యాన్ని సాధ్యమెలా చేశారో నాకు చెప్పండి. మీమాటలు నమ్ముతాను..."

"నేలమాళిగలోకి వెళ్ళి చూస్తే నా మాటలెలాగూ నమ్ముతారు -..."

"అయితే ఆ రహస్యం చెప్పరా?

" ఆ రహస్యం మీకే కాదు, నా కథ రాస్తానంటే ఆ రచయిత క్కూడా చెప్పను..." అన్నాడు వైకుంఠం.

## 2

వైకుంఠంతో మాట్లాడి వచ్చాక వామనరావు దీర్ఘాలోచనలో పడిపోయాడు.

వైకుంఠం నిజంగా నేలమాళిగలోకి వెళ్ళగలిగాడా...?

ఆ నేలమాళిగలోకి వెళ్ళడం తనకే సులభంకాదు.

వామనరావు తండ్రి ప్రత్యేకంగా కట్టించాడది. అయిదేళ్ళ క్రితం దానిలో ప్రత్యేకమైన మార్పులు చేయించాడు తను.

నేలమాళిగ ఓ గదిలో ఉంది. ఆ గదిలో నేలమీద పలక ఒకటి ఎత్తితే వస్తుంది నేలమాళిగ. లోపలకు మెట్లుంటాయి.

వామనరావుకా ఏర్పాటు నచ్చలేదు. చూడగానే నేలమాళిగకు ప్రవేశద్వారం ఎక్కడున్నదీ తెలిసిపోతుంది. అందుకని తండ్రి ఆ గదిలో నేలపై ఖరీదయిన తివాచీ పరిపించాడు.

కానీ వామనరావు - నేలలో మార్పులు ప్రవేశపెట్టాడు. గదిలో గచ్చు మార్పించి మొజాయిక్ పలకలు పరిపించాడు. పలకల డిజైన్‌లో కీ హోల్ ఉంటుంది. ఆ కీ హోల్‌ను ప్రత్యేకంగా తయారు చేసిన తాళంతో తాకితే పలక తెరుచుకుంటుంది. అయితే కీ హోల్ ప్రత్యేకంగా ఒకచోటే ఉండదు. గడియారంలో తేదీలు మారినట్లుగా - రోజు రోజుకీ కీ హోల్ స్థానం మారుతుంది.

గదిలో మొత్తం నూట ఇరవై ఎనిమిది కీ హోల్ డిజైన్లు ఉన్నాయి. అందులో ఏ కీ హోల్ నా రోజు తాకాలో అన్నది తెలుసుకునేందుకో రిమోట్ కంట్రోల్ స్విచ్ బోర్డుంది. అది చూడ్డానికి కాల్కులేటర్లా ఉంటుంది. ఆ సాధనాన్ని తీసుకుని ఆ గదిలోకి వెళ్ళి ఓ మీట నొక్కితే ఆ రోజుకు తాకవలసిన కీ హోల్ ప్రకాశవంతమవుతుంది. పొరపాటున తాళంతో మరో కీ హోల్‌ను తాకితే ఆ రోజుకిక నేలమాళిగ తెరుచుకోదు.

కీ హోల్ ఎక్కడున్నా - తెరుచుకునే పలక మాత్రం ఒక్కటే! ఒక ప్రముఖ ఎల్క్ట్రానిక్ ఇంజినీరు సాయంతో వామనరావీ ఏర్పాటు చేయించాడు. అయిడియా వామనరావుది. డిజైన్ ఇంజినీరుది. ఆ ఇంజినీరు ప్రస్తుతం అమెరికాలో ఉంటున్నాడు.

"నేనే కావాలన్నా మీ ఇంట్లో దొంగతనం చేయలేను. అంత పక్కా ఏర్పాటిది. అయినప్పటికీ జాగ్రత్త కోసం - మీరో పని చేయండి. రిమోట్ కంట్రోల్‌ని తాళాన్నీ వేరు వేరు ప్రదేశాల్లో ఉంచండి. మీరు తప్ప ఇంకెవ్వరూ నేలమాళిగను వాడకుండా చూడండి -" అన్నాడా ఇంజినీరు.

వామనరావు రెండిటినీ రెండూ వేర్వేరు బ్యాంకు లాకర్లలో ఉంచాడు. దాచేముందు ఇంజినీరు నడిగి ఎక్కువకాలం వాడకపోయినా ఆ ఎలక్ట్రానిక్ పరికరాలకేమీ కాదని రూఢీ చేసుకున్నాడు.

సాధారణంగా నేలమాళిగ ఉన్న గదిని ఆయన తాళం వేసి ఉంచేవాడు. ఆ తాళం తనవద్దనే ఉంచుకునేవాడు.

ఇంట్లో నేలమాళిగ ఉన్న విషయం ఆయన పిల్లలకు తెలియదు. భార్యకు మాత్రం తెలుసు. తెలిసినా ఆమె నేలమాళిగను తెరవలేదు.

అలాంటిది వైకుంఠం ఆ నేలమాళిగ గురించి ఎలా తెలుసుకున్నాడు? తెలుసుకున్నా ఎలా ప్రవేశించాడు?

వామనరావుకు బుర్ర పనిచేయడం మానేసింది.

ఆ రోజుకిక నేలమాళిగను తెరవడం తనవల్ల కాదు. ఎందుకంటే బ్యాంకులాకర్లు ఆపరేట్ చేసే టైమయిపోయింది.

వామనరావుకు స్థిమితం లేక తనొక్కసారి కూతురిని పిలిచి మాట్లాడాలనుకున్నాడు. సాయంత్రం ఆరింటికి రాజేశ్వరి కాలేజీ నుంచీ తిరిగిరాగానే ప్రత్యేకంగా తన గదిలోకి పిలిచాడు.

"నువ్వు గణేశ్ నెందుకు ప్రేమిస్తున్నావు" అన్నాడాయన.

"తెలియదు -" అంది రాజేశ్వరి.

"గణేష్ నాన్న నన్ను పిలిచి - నా ఇష్టం లేక పోయినా మీ పెళ్ళి జరుగుతుందన్నాడు. అందుకు నువ్వు సహకరిస్తావా?" అన్నాడు వామనరావు.

రాజేశ్వరి మాట్లాడలేదు.

"నువ్వు మాట్లాడకపోతే నీకు నాకంటే ఆ గణేష్ ఎక్కువనుకోవాలి. నీకిచ్చిన స్వతంత్రాన్ని దుర్వినియోగం చేస్తున్నావనుకోవాలి. ఈ రోజునుంచీ నీవిల్లు కదలకూడదు -...

"ఎందుకని?"

"కొంతకాలం పాటు నువ్వు, గణేష్ కలుసుకో కూడదు -..."

రాజేశ్వరి నవ్వి - "నాన్నా! గణేష్ నన్ను కలుసుకోకుండా మీరాపలేరు -" అంది.

వామనరావు ముఖం ఎర్రబడింది - "ఎందుకాపలేను! నీకు నామీద గౌరవం లేకపోతే తప్ప -...!"

"నాన్నా! నాకు మీరంటే గౌరవం. మీ మాటలు విని నేను గణేశ్‌ను కలుసుకోవడం మానేశాను. కానీ అతడు కాలేజీలో నా క్లాసుకి వచ్చి ఏదో సాకు చెప్పి నా టీచర్న్ కన్విన్సు చేసి నన్ను బయటకు తీసుపోయేవాడు..." అంది రాజేశ్వరి.

"తీసుకుపోతే నువ్వెలా వెళ్ళావు?"

"అతడిలో ఏదో సమ్మోహనశక్తి ఉంది. ఆ శక్తికి టీచరు, నా క్లాస్‌మేట్సు, ఆఖరికి నేనుకూడా లోబడి పోయాం. ఇంకా విచిత్రమేమంటే - అతడు తరచుగా నన్ను కలుసుకుందుకు వచ్చినా - ఎవరూ మా సంబంధం గురించి తప్పుగా అనుకోవటం లేదు. మా వివాహం నిశ్చయమయ్యేవరకూ మా గురించి తప్పుడు ప్రచారం జరుగనివ్వనని గణేష్ నాకు మాటిచ్చాడు -" అంది రాజేశ్వరి.

"సమ్మోహన శక్తి అన్నది నీ భ్రమ!" అన్నాడు వామనరావు. కూతురు మంచి వయసులో ఉంది. అందమైన యువకుణ్ణి చూసి ఆకర్షించబడింది. అతడికి లేనిపోని శక్తులంటగడుతోంది... అదీ ఆయన అభిప్రాయం.

"నాన్నా! అతడి శక్తిని నేను కళ్ళారా చూశాను. ఒకసారి మేమిద్దరం సినిమాకు వెళ్ళాం. టిక్కెట్లు లేవు. ఎనిమిది రూపాయల టికెట్ బ్లాకులో ఎనభైరూపాయలమ్ముతుంటే దానిక్కూడా పెద్ద క్యూ ఉంది గణేష్ ఏం మంత్రం వేశాడో - ఆ అమ్మేవాడు - అన్ని లాభాలూ వదులుకుని మాకు టిక్కెట్టు ఎనిమిది రూపాయలకే ఇచ్చేశాడు...."

"ఊఁ!..." అన్నాడు వామనరావు. ఇంకా చెప్పమన్నట్లు.

"ఒకసారి స్టార్ హోటలుకి వెళ్ళాం. కావలసింది తిని బయటకు వచ్చేశాం. అక్కడ అంతా గణేష్‌కు సలాములు చేశారు....

ఒకసారిద్దరం బీచికి వెళ్ళాం. నలుగురమ్మాయిలతడి చుట్టూ చేరి ప్రేమకబుర్లు చెప్పారు. ముందుగా ఏర్పాటు చేసుకున్నాడా అంటే వాళ్ళలో నాకు తెలిసిన అమ్మాయి కూడా ఉంది. మగాళ్ళను చూస్తే చాలు దాని బుర్ర భూమిలోకి దిగిపోతుంది. చాలా భయం దానికి, ఆ అమ్మాయి చేత అప్పటికప్పుడు నేనడిగిన డైలాగులన్నీ చెప్పించాడు గణేష్.."

"ఊఁ! అయితే నువ్వు ఆ గణేష్‌గాడితో సినిమాలకీ, హోటళ్ళకీ, బీచిలకీ తిరుగుతున్నావన్నమాట. ఇదన్న మాట నామీదున్న గౌరవం..."

"నాలుగురోజులు కాలేజీకి సెలవులొస్తే ఇల్లు కదలలేదు నేను. అప్పుడు గణేష్ మనింటికొచ్చి మీ అనుమతి తీసుకుని నన్ను బయటకు తీసుకుని వెళ్ళాడు -...." అంది రాజేశ్వరి.

"అద్భుతశక్తులు నీవంటి ఆడపిల్లల్ని మోసం చేయడానికి పనికివస్తాయి. మరెందుకూ పనికి రావు. అందుకే వాడా శక్తులు నీకు చూపిస్తున్నాడు - ..." అంటూ ఎగిరి పడ్డాడు వామనరావు.

"ఇంతకీ నన్నెందుకు పిలిచినట్లు...?" అంది రాజేశ్వరి.

"గణేష్‌ని మర్చిపో -" అన్నాడు వామనరావు.

"నా శక్తికొద్దీ ప్రయత్నిస్తాను. మీశక్తి కొద్దీ ఆపండి" అని వెళ్ళిపోయింది రాజేశ్వరి.

వామనరావు ఆశ్చర్యంగా - "నా కూతురేనా ఇది! నా శత్రువు కొడుకును పొగుడుతోంది!" అనుకున్నాడు.

## 3

మర్నాడు వామనరావు రెండు బ్యాంకులకు వెళ్ళి లాకర్లలోంచి రిమోట్ కంట్రోలు, తాళం తీసుకున్నాడు. ఆ రెండూ యధాస్థానంలో ఉండడం చూసి ఆయన తేలిగ్గా నిట్టూర్చాడు.

నేలమాళిగ ఉన్నగది తాళం కూడా భద్రంగా ఉంది దానినెవరూ మారుతాళంతో తెరవడానికి ప్రయత్నించినట్లులేదు.

ఆ గది తాళచెవి దేవుడి మందిరంలో ఉంటుంది - దేవుళ్ళ విగ్రహాల మధ్య! ఆ తాళాన్ని వామనరావు భార్య తప్ప ఇంకెవరూ తాకనైనా తాకరు. భర్త కావాలన్నప్పుడామె స్నానం చేసి పూజావిధులు నిర్వర్తించి ఆ తాళం తీసిస్తుంది. తనకా తాళం కావాలని ముందురోజే చెప్పడం వల్ల వామనరావు భార్య ఆ తాళాన్నాయనకుదయమే ఇచ్చేసింది.

వామనరావు గదితాళం తెరిచాడు.

ఎయిర్‌కండిషన్డు గది.

నేలంతా శుభ్రంగా ఉంది. కీహోల్సు డిజైన్లున్న మొజాయిక్ ఫ్లోరింగ్ - తమాషాగా అందంగా కనబడుతోంది.

వామనరావు గది తలుపులు లోపల్నుంచీ వేసేశాడు.

ఎందుకో ఆయనకు శరీరం వణికింది.

ఎవ్వరికీ తెలియదనుకుంటున్న ఆ నేలమాళిగ రహస్యం వైకుంఠానికి తెలిసిపోయింది. ఎవ్వరూ ప్రవేశించలేరనుకుంటున్న ఆ నేలమాళిగలోనికి వైకుంఠం ప్రవేశించినట్టున్నాడు.

"అదెలా సాధ్యం?" అన్నదే ఆయన ఆలోచన.

వామనరావు రిమోట్ కంట్రోల్‌తో కీహోల్‌ను కనిపెట్టి తాళంతో దాన్ని తాకి నేలమాళిగ ప్రవేశద్వారాన్ని తెరిచి మెట్లు దిగి లోపల ప్రవేశించాడు. మెట్లకు పక్కనే తడుముకుంటూ స్విచ్ వేశాడు.

నేలమాళిగ ప్రకాశవంతమయింది.

వామనరావు వెంటనే తనక్కావలసిన బీరువాదగ్గరకు వెళ్ళాడు. దానికి నంబరు సిస్టం తాళం ఉంది. అందులో వరుసగా ఆరునంబర్లు తిప్పాడు. బీరువా తెరుచుకుంది.

ఆయన హడావుడిగా ఉంగరాలకోసం చూశాడు. నాలుగుండవలసిన చోట మూడే ఉంగరాలున్నాయి.

అంటే వైకుంఠం నిజమే చెప్పాడన్నమాట!

కానీ - అదెలా సాధ్యం?

వామనరావాలోచిస్తుండగానే ఎక్కణ్ణించో సన్నగా మూలుగులా వినిపించింది. ఆయన ఉలిక్కిపడి అటు చూశాడు.

నేలమాళిగలో ఒకవ్యక్తి పడుకుని ఉన్నాడు. గోడవారగా ఉన్న మూలాన అతణ్ణి వామనరావు గుర్తించలేదు.

వామనరావు చటుక్కున బీరువా మూసి ఆ వ్యక్తిని సమీపించి చూసి ఆశ్చర్యపోయాడు.

అతడు గణేష్!

"నువ్విక్కడికెలా వచ్చావు?" అన్నాడు వామనరావాశ్చర్యంగా.

మాట్లాడే ఓపిక లేదన్నట్లు గణేష్ సైగచేశాడు. వామనరావతణ్ణి పరీక్షించి మనిషి బాగా నీరసంగా ఉన్నట్లు గ్రహించాడు. ఆ సమయంలో ఆయనలో మానవత్వం మేలుకుంది. అతణ్ణి మోసుకుని నేలమాళిగలోంచీ బయటకు వచ్చాడు. నేలమాళిగ ప్రవేశద్వారం మూసి - గణేష్‌కి శీతలోపచారాలు చేశాడు. కొద్దిగా ఫలరసం పుచ్చుకున్నాక గణేష్‌లో కాస్త ఓపిక వచ్చింది.

"ఎలా వచ్చావిక్కడికి? వచ్చిన వాడివెందుకు తప్పించుకోలేకపోయావు?" అన్నాడు వామనరావు.

"నాన్న మీ నేలమాళిగలోంచీ ఓ వజ్రపుటుంగరం తెచ్చాడు. అది చూసిన రాజేశ్వరి అలాంటిది తనకీ ఒకటి కావాలంది. నాన్ననడిగితే అదివ్వనన్నాడు. నేనే వెళ్ళి తెచ్చుకుంటానంటే - నీకు వెళ్ళడం మాత్రమే వచ్చు తిరిగి రావడం చేతకాదు. అది నేర్చుకునేదాకా వెళ్ళకు - అన్నాడాయన.

నేర్చుకుందామనుకునేలోగా నాన్నకు పక్షవాతం వచ్చింది. కొంతకాలం ఆయన జబ్బు హడావుడితో సరిపోయింది. రాజేశ్వరి ఉంగరం గురించి వారంరోజుల క్రితం మళ్ళీ అడిగింది. నేను నాన్నని అడిగితే - తను బాగా స్థిమిత పడేదాకా తిరిగివచ్చే ఉపాయం నేర్పలేననీ ప్రస్తుతానికా ఉంగరం గురించి మర్చిపొమనీ అన్నాడు.

ఆయన మాట లెక్కచేయకుండా మూడురోజుల క్రితం నేలమాళిగలో ప్రవేశించాను. వెళ్ళినవాణ్ణి వెనక్కు రాలేనా అనుకున్నాను కానీ రాలేకపోయాను. తిండీ తిప్పలూ లేక నీరసించి పడిపోయాను. సమయానికి దేవుడిలా వచ్చి మీరు రక్షించారు -" అన్నాడు గణేష్.

నేలమాళిగలో తన కొడుకు చిక్కుకుపోతాడని తెలిసే వైకుంఠం తన్ను వాళ్ళింటికి పిలిచి ఉంగరం విషయంలో తనను సవాలు చేశాడని వామనరావు గ్రహించాడు.

"నా కొడుకు అభిమన్యుడిలాంటివాడు -" అని వైకుంఠం అనడం ఆయనకు గుర్తుకొచ్చింది.

గణేష్ వామనరావు దగ్గిర సెలవు తీసుకుంటూ - "మీరు నా ప్రాణాలు రక్షించారు. మీ మనసుకు కష్టం కలిగించే పనేదీ చేయనని మాటిస్తున్నాను" అని వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత ఓ గంటలో వామనరావు వైకుంఠం ఇంటికి వెళ్ళాడు - తన కూతుర్ని వాళ్ళింటి కోడలిగా చేసుకోమని చెప్పడానికి!

ఆ తండ్రీ కొడుకుల అద్భుత శక్తులపై ఆయనకూ నమ్మకం కుదిరినట్లుంది.

# నేరస్తుడి తీర్పు

చంద్రావతి బీచి వద్ద ఒంటరిగా కూర్చుని ఉంది. సాగరుడి ఘోష వింటూ ఏమేమో ఆలోచనల్లో పడి పోయిన ఆమె, తనకు కాస్త దూరంలో ఉండి తన్నే చూస్తున్న నలుగురు యువకుల్ని గమనించలేదు.

ఆ నలుగురు యువకుల్లో ఒకడు నాయకుడిలా హుందాగా ఉన్నాడు. మనిషి కూడా ఖరీదైనవాడిలా కనిపిస్తున్నాడు.

"పిట్ట చాలా బాగుంది గురూ!" అన్నాడు నలుగురిలో ఒకడు.

"నాకు నచ్చింది" అన్నాడు నాయకుడు.

"అయితే చాలా అదృష్టవంతురాలు" అన్నాడు నలుగురిలో ఒకడు.

"నాకూ నచ్చింది" అన్నాడు నాయకుడు.

"అయితే చాలా అదృష్టవంతురాలు" అన్నాడు నలుగురిలో ఒకడు.

"ఆమె అదృష్టం గురించి మనకెందుకు? నేను మన అదృష్టం గురించి ఆలోచిస్తున్నాను" అన్నాడు నలుగురిలో ఇంకొకడు.

"అవునా - ఆ విషయమే మర్చిపోయాను" అన్నారు మిగతా ఇద్దరూ ఒకేసారి.

తమ అదృష్టం గుర్తుకొచ్చిందేమో మొత్తం ముగ్గురి కళ్ళూ ఒక్కసారి మెరిసాయి.



"ఏమిట్రా మీ అదృష్టం!" అన్నాడు నాయకుడూ.

"నీకు తెలియదా?" అన్నాడు నలుగురిలో ఒకడు.

నాయకుడు తల అడ్డంగా ఊపాడు.

"మాకూ నీకూ ఒక్కటే తేడా. నువ్వు హీరోవి - మేము ప్రేక్షకులం..."

"అంటే?"

"సినిమాల్లో హీరోయిన్ ఎంతో అందంగా ఉంటుంది. వీలైనంత తక్కువ బట్టలు వేసుకుని - శరీర సౌందర్యాన్ని ప్రదర్శిస్తుంది. మనోహరంగా నవ్వుతుంది. మననేడిపించడానికా అన్నట్లు ఏడుస్తుంది. ఆమె ప్రతికదలికా - మా గుండెల్ని కదిలిస్తాయి. ఆమె అందాన్ని పదే పదే చూడ్డానికే మేము మళ్ళీ మళ్ళీ సినిమాలు చూస్తుంటాం! అయితే మా అనుభవం అంత వరకే...! హీరో సంగతి వేరు. హీరో ఆమెను చేత్తో తాకుతాడు. బలంగా కౌగలించుకుంటాడు. వళ్ళంతా తడుముతాడు. పెదాలపై ముద్దు పెట్టుకుంటాడు. "

" ఊఁ చాల్లెండి - అది సినిమా! నిజజీవితంలో అలా కుదరదు. ప్రియురాలితో అనుభవం పదిమంది ముందూ బాగుండదు.

కనీసం నాకలా నచ్చదు -" అన్నాడు నాయకుడు.

"నేను చెప్పేది సరిగ్గా అర్థం చేసుకోలేదు గురూ నువ్వు! నిన్ననే మేం ముగ్గురం కలిసి ఒక నిర్ణయానికి వచ్చాం....."

"ఏమిటది?"

"ఇలాటి విషయాల్లో నీకు సాయపడ్డం మినహా ఇంకేమీ చేయలేం మేము. కాబట్టి మేము కోరినదేమిటంటే అందమైన ఆడపిల్లను నీవనుభవించబోయేముందు - ఒక్కసారి ఆమె అసలైన అందాలను మమ్మల్ని కళ్ళారా చూడనివ్వాలి. ఆ తర్వాత నీ ఇష్టం..."

నాయకుడు నవ్వాడు "ఓస్ - ఇంతేనా!" అన్నాడు.

"అంతే మరి..."

"ఒప్పుకున్నాను. మరి రంగంలోకి దిగండి"

నలుగురిలో ఒకడు వెంటనే లేచి చంద్రావతిని సమీపించాడు.

ఆలోచనల్లో ఉన్న చంద్రావతి అతణ్ణి చూసి ఉలిక్కిపడింది.

అతడామెను రెండు చేతులూ జోడించి నమస్కరించాడు.

చంద్రావతి కూడా అతనికి అప్రయత్నంగా నమస్కరించి ప్రశ్నార్థకంగా చూసింది.

"నా పేరు సత్యం. మిమ్మల్ని చూడగానే చనిపోయిన నా చెల్లెలు గుర్తుకొచ్చింది" అన్నాడతడు.

చంద్రావతి తడబడి "కూర్చోండి" అంది.

అతడు కూర్చుని "మిమ్మల్ని చూస్తే అమ్మ ఎంతో సంతోషిస్తుంది" అన్నాడు.

"నాకేమీ అర్థంకావడంలేదు" అంది చంద్రావతి.

"నా చెల్లెలు అచ్చం మీకులాగే ఉండేది. పెళ్ళి సంబంధం కూడా నిశ్చయమయింది. రెండు నెలల క్రితం కాలేజీకి వెళుతుండగా ఎవరో దుర్మార్గుడు దాన్ని బలవంతంగా ఎత్తుకుపోయి మానభంగం చేశాడు. అది ఆత్మహత్య చేసుకుంది..." చెప్పడానికి తడబడినట్లు నటించాడతను.

చంద్రావతి మాత్రం ఇబ్బంది పడలేదు "మానభంగం జరిగితే ఆత్మహత్య చేసుకోవడమెందుకు? ధైర్యంగా బ్రతకాలి కానీ..." అంది.

"మీరు చాలా ధైర్యంగా మాట్లాడుతున్నారు. నా చెల్లెలి కీ ధైర్యముండిఉంటే బాగుండేది" ఏడుపు గొంతుతో అన్నాడతడు.

"తప్పు మీ ఇంటి పద్ధతిలో ఉండి ఉంటుంది. ఆమెకు అన్యాయం జరిగినా - ఆమెవల్లే తప్పు జరిగినట్లు మాట్లాడి ఉంటారు. ఒక చిన్న సంఘటనతో ఆమె జీవితాధ్యాయం ముగిసినట్లే భావించి ఉంటారు. ఆమెక్కావలసిన మనో ధైర్యం, ప్రోత్సాహం లభించక ఆమె ఆత్మహత్య చేసుకుని ఉంటుంది."

అతడు తలవంచుకుని - "మీరనుకున్నది పొరపాటు. మా ఇంట్లో అందరివీ ఆధునిక అభిప్రాయాలు. ముఖ్యంగా మా అమ్మవి. నా చెల్లెలు కూడా కబుర్లు గొప్పగా చెప్పేది. కాలేజీలో డిబేట్లలో విప్లవకారిణిలా మాట్లాడేది. ఆ సంఘటన జరగ్గానే మాతో మాట మాత్రం అనలేదు. మాకు ముఖం కూడా చూపించలేదు. ఓ ఉత్తరం రాసి పోస్టు చేసి తన్ను తానంతం చేసుకుంది" అన్నాడు.

"మీ చెల్లెలి పేరు...? అంది చంద్రావతి.

"పేరెందుకండీ - ఫొటోయే చూపిస్తాను. ఒక్కసారి మా ఇంటికి రండి. మిమ్మల్ని చూస్తే మా అమ్మ ఎంతో సంతోషిస్తుంది. ఏదో రూపంలో మరో చోట నా చెల్లెలు బ్రతికే ఉందని భావిస్తుంది - మీకెప్పుడు వీలో చెప్పండి మా ఇంటికి వెళదాం!" అన్నాడతడు.

"ఎప్పుడో ఎందుకు? మీ కభ్యంతరం లేకపోతే ఇప్పుడే వెడదాం" అంది చంద్రావతి.

"ఇప్పుడా - ఇప్పుడు మీరెవరికోసమో ఎదురు చూస్తున్నట్లున్నారు" అన్నాడతను సంకోచంగా.

"ఇప్పుడెవరూ నాకోసం ఇక్కడికి రారు - రండి మీ అమ్మగారిని చూస్తాను" అంది చంద్రావతి అక్కణ్ణించీ లేస్తూ.

"ఒక్కరే బీచ్ దగ్గరుంటే అనుమానించాను. మీరేమీ అనుకోనంటే నాదొక్క సలహా" అన్నాడతడు.

"ఊ" అందామె.

"మీ కెవరైనా స్నేహితులుంటే వాళ్ళను నమ్మకండి. ఒంటరిగా వాళ్ళను కలుసుకోకండి."

"ఎందుకని?"

" స్త్రీని మోసం చెయ్యడమే మగాడి పరమోద్దేశ్యం..."

చంద్రావతి నవ్వి "మోసపోయేవాళ్ళు అమాయకులు. నేను అమాయకురాలిని కాదు" అంది.

"ఏమో - అనుభవంలో నాకు తోచింది చెప్పాను. ఆ పైన మీ ఇష్టం" అన్నాడతడు.

"అయితే - నేనిప్పుడు మీతోనూ రాకూడదు..."

అతడు తడబడకుండా "నిజం చెప్పారు. ఏదో మా అమ్మ సంతోషిస్తుందని రమ్మన్నాను. కానీ ముక్కు ముఖం తెలియని నన్నెందుకు మీరు నమ్మాలి? అయాం సారీ నాతో రావద్దు మీరు" అన్నాడు.

చంద్రావతి నవ్వి "సత్యంగారూ! అనుమానిస్తూ కూర్చుంటే ఈ ప్రపంచంలో స్నేహం, ఆత్మీయత, మానవత్వం మచ్చుకి కూడా కనిపించకుండా పోతాయి. నేను మిమ్మల్ని అనుమానించడం లేదు. మీ ఇంటికి వస్తున్నాను. పదండి" అంది.

"మీరు నన్ను గౌరవిస్తున్నారు! థాంక్స్" అన్నాడతడు.

"అందమైన ఆడపిల్ల కంటపడగానే - వెకిలిచూపులు చూస్తూ అసహ్యంగా ప్రవర్తించే యువకులున్న ఈ రోజుల్లో మీరు నన్ను చూడగానే మీ చెల్లెల్ని గుర్తు చేసుకున్నారు. మీ సంస్కారం నన్ను ముగ్ధురాలిని చేసింది" అందామె.

ఇద్దరూ ఇసుకలోంచి రోడ్డు మీదకి వచ్చారు.

అక్కడ కారొకటుంది. బ్యాక్ డోర్ తెరిచాడతడు.

"మీకు కారుందా?" అందామె ఆశ్చర్యంగా.

"కారు నాది కాదు. నాకు డ్రైవింగ్ వచ్చు" అన్నాడతడు.

నిజానికి నాయకుడి బృందం రెండు కార్లలో వచ్చారు. రెండూ కార్లూ నాయకుడివే! ముందు చూపుతో రెండోకారు తెస్తే చంద్రావతి దొరికింది. అతడు చంద్రావతితో కబుర్లు చెబుతుండగా మిగతా ముగ్గురూ మరో కార్లో స్థావరం చేరుకున్నారు.

"కారెవరిచ్చారు మీకు?" అందామె.

"మా అమ్మ దుఃఖం భరించలేక నేనుత్తరం రాస్తే పిన్ని వచ్చింది. పిన్ని వచ్చాక అమ్మక్కొంత ఓదార్పు లభించింది. ఇక పిన్ని వెళ్ళిపోదామనుకుంటోంది. ఆమెకు ఊరంతా చూపించాలని ఈ కారు సంపాదించాను" అన్నాడతడు.

ఆమె బ్యాక్ సీట్లో కూర్చుంది.

అతడు ముందునుంచీ కారెక్కాడు.

డ్రైవ్ చేస్తుండగా అతడామెను పలకరించలేదు. ఆమె అతణ్ణి ప్రశ్నలు వేయలేదు. ఇద్దరూ దీర్ఘాలోచనలో ఉన్నట్లున్నారు.

కాసేపటికి కార్లోంచీ దిగి బ్యాక్ డోర్ తెరిచి పక్కకు తప్పుకున్నాడు.

ఆమె కారు దిగి "ఇదేనా మీ ఇల్లు?" అంది.

"ఊఁ"

"ఊరికి కాస్త దూరంగా ఉంది" అందామె.

"ఇల్లు బాగోలేదా?"

"బాగుంది - చాలా బాగుంది" అంటూ ఆమె ముందడుగు వేసింది.

ఇద్దరూ ఇంట్లో ప్రవేశించారు.

హాలామె ఊహించినకంటే ఎక్కువ అందంగా ఉంది.

"నిజంగా ఇది మీ ఇల్లేనా?

అందామె అనుమానంగా.

అతడు మాట్లాడలేదు.

తను ఖరీదైన మనిషిలా కనబడనని అతడికి తెలుసు.

"నిజంగా ఇది మీ ఇల్లేనా?" అంది చంద్రావతి మళ్ళీ.

అతడేదో బదులిచ్చేలోగా "ఇది నా ఇల్లు" అన్నమాట వెనకనించీ వినబడింది.

చంద్రావతి వెనక్కి తిరిగింది.

నాయకుడు ఇద్దరు అనుచరులతో అక్కడున్నాడు.

"ఎవరు మీరు?" అందామె

"ఈ జీవితమే ఒక సినిమా. అందులో మనమిద్దరం కాసేపు తాత్కాలికంగా హీరోహీరోయిన్లం" అంటూ అతడామెను సమీపించాడు.

"వాటీజ్ దిస్?" అంది చంద్రావతి కంగారుగా.

నాయకుడామె చేయి పట్టుకున్నాడు. ఆమె విడిపించుకునేలోగా బలవంతంగా పక్కగదిలోకి లాక్కుని పోయాడు.

అనుచరులు ముగ్గురూ అక్కడే ఉండిపోయారు.

"భలే తీసుకొచ్చావు గురూ" అంటూ - ఇద్దరు సత్యం నామధేయుణ్ణి అభినందించారు.

"నాముఖంలో ఎప్పుడేభావాలు కావాలంటే అవి పలుకుతాయి. సినిమాల్లోకి పోతే బాగా రాణిస్తాను. ఇంత వరకూ నా నటన ఎందరినో మోసం చేసింది" అంటూ సత్యం గర్వంగా నవ్వాడు.

"ఏం చేశావో చెప్పు గురూ! మేమూ నేర్చుకుంటాం" అన్నారా ఇద్దరూ.

"చెప్పి ఏం లాభం? కథ చాలా పాతది. అంతా నటనలో ఉంది" అన్నాడు గర్వంగా సత్యం.

ముగ్గురూ కబుర్లలో ఉన్నారు. ఈలోగా లోపల్నుంచీ ముగ్గురికీ పిలుపు వచ్చింది.

ఉత్సాహంగా ముగ్గురూ గదిలోకి పరుగెత్తారు.

ముందు వారు నాయకుణ్ణి చూశారు. అతడి చేతిలో కొరడా ఉంది.

"చూస్తానన్నారుగా చూడండి. అయిదే అయిదు నిమిషాలు టైము. ఎంత దగ్గరనుంచైనా చూడండి - కానీ ఆమెను తాకడానికి వీల్లేదు" అన్నాడు నాయకుడు.

ముగ్గురూ ఆమెను సమీపించారు.

చంద్రావతి ఏడుస్తోంది.

ఆమె వంటిమీద ఒక్క గాయం కూడా లేదు.

ధైర్యంగా బీచ్ వద్ద ఎన్నో కబుర్లు చెప్పిన ఆ యువతి కొరడాను చూడగానే భయపడిందన్నమాట!

"అయిదు నిమిషాలూ అయిపోయింది. ఇక మీరు వెళ్ళొచ్చు" అన్నాడు నాయకుడు.

వాళ్ళు గదిలోంచీ బయటకు వెళ్ళిపోగానే - గది తలుపులు మూసుకున్నాయి.

✡✡✡

2

రామం గదిలో ఒక్కడే ఉన్నాడు. కాలక్షేపానికతడు ఇంగ్లీషు నవల చదువుతున్నాడు.

అప్పుడు టైము రాత్రి ఎనిమిదయింది.

ఎవరో తలుపు తట్టారు.

రామం పుస్తకం మడిచి కిందపెట్టి వెళ్ళి తలుపు తీశాడు. గుమ్మం బయటి వ్యక్తిని చూసి ఆశ్చర్యపడి "చంద్రా నువ్వా!" అన్నాడు.

"లోపలకు రావచ్చా?" అంది చంద్రావతి.

"రా" అన్నాడు రామం పక్కకు తప్పుకుని.

ఇద్దరూ కుర్చీల్లో కూర్చున్నాక "నేనిప్పుడెక్కణ్ణించి వస్తున్నానో ఊహించగలవా?" అంది చంద్రావతి.

"ఇంటినుంచి?" అన్నాడతడు.

"బీచినుంచీ కూడా కాదు" అంది చంద్రావతి.

"మరెక్కణ్ణుంచి?"

"ఓ దుర్మార్గుడి బాహు బంధాల్లో నలిగి మానభంగం పొందాను.."

రామం నిశ్చేష్టుడైపోయాడు. అతడు తేరుకున్నాక చంద్రావతి అతడికి జరిగిందంతా చెప్పింది.

రామం నిట్టూర్చి "ఏం చెయ్యాలనుకుంటున్నావు?" అన్నాడు.

"నాకు నీ సాయం కావాలి" అంది చంద్రావతి.

"నీకు నా సాయమెప్పుడూ ఉంటుంది!"

"థాంక్స్- అయితే పోలీస్ స్టేషన్‌కు పద" అంది చంద్రావతి.

"ఎందుకు?"

"జరిగింది నేరం. ఇప్పుడే అయితే ఆ నేరాన్ని ఋజువు చేయగల అవకాశముంది. నా జీవిత మెలాగూనాశనమయింది. ఆ భయంకర నేరస్థుడిని పోలీసుల కప్పగించేవరకూ నా స్థిమితముండదు."

"ఒక్క క్షణం స్థిమిత పడి నేను చెప్పేది విను" అన్నాడు రామం.

"చెప్పు - వింటాను" అంది చంద్రావతి.

"నువ్వు పోలీసులవద్దకు వెళ్ళడం వల్ల ముందుగా అపహాస్యం పాలయ్యేది నువ్వు. నలుగురూ నిన్ను చిన్న చూపు చూస్తారు. నీ గురించి అసభ్యంగా మాట్లాడుతారు" అన్నాడు రామం.

"అలాగని ఓ భయంకర నేరస్థుడిని చూస్తూ చూస్తూ వదిలిపెడతామా?" అంది చంద్రావతి.

"నువ్వు పోలీసుల వద్దకు వెడితే వాడికి శిక్ష లభిస్తుందని నీ నమ్మకమా? వాడు ధనవంతుడు. బలవంతుడు. చట్టాన్నీ, న్యాయాన్నీ కొనేయగల సమర్థుడు. ఇన్సాఫ్‌కాతరాజ్ చిత్రం చూసేవుంటావు. అందులో విధంగా తప్పు నీదేనని ఋజువువైతే - చివరి నువ్వేం సాధించినట్లు?" అన్నాడు రామం.

"అయితే నన్నేం చేయమంటావు? నా జీవితం నాశనం చేసినవాడిని నిస్సహాయంగా చూస్తూ వదిలిపెట్టమంటావా?"

"నీ జీవితం నాశనమయిందని ఎవరన్నారు?" అన్నాడు రామం.

"అంటే?"

"చంద్రా! జరిగింది మర్చిపో. ఏమీ జరగలేదనే అనుకో. అప్పుడు...?!" అన్నాడు రామం.

రామం, చంద్రావతి ప్రేమించుకున్నారు. పెళ్ళి చేసుకుందామనుకున్నారు. దానికీ సంఘటన అడ్డు రాదని రామం చెపుతున్నాడు.

"రామం - నువ్వు దేవుడివి..."

"నేను దేవుడినెందుకయ్యాను?"

"ఒక పతితను రక్షిస్తున్నందుకు..."

"నేను దేవుడినే అయితే నా ప్రియురాలు పతిత కాకుండా రక్షించుకోగలిగేవాడిని కదా! కాబట్టి నేను దేవుడిని కాదు. నేను దేవుడినే అని నువ్వంటావా? అప్పుడు నువ్వు పతితవు కాదు. దేవుడి ప్రియురాలివి" అన్నాడు రామం.

"రామం నాలో ఆవేశం దిగిపోతోంది. మనసు తేలిక పడుతోంది" అంది చంద్రావతి.

"ఇంకాసేపు ఇక్కడే కూర్చో! అప్పుడీ రహస్యం మనిద్దరి మధ్యనే ఉండిపోతుంది - నీ అన్నయ్యక్కూడా తెలియదు..." అన్నాడు రామం.

"లాభం లేదు - నా అన్నయ్య దగ్గర ఏ రహస్యమూ దాచలేను నేను -" అంది చంద్రావతి.

"నీ అన్నయ్యకు విషయం తెలిస్తే వ్యవహారం హత్యకు దారితీస్తుంది. అదతడికే క్షేమం కాదు -" అన్నాడు రామం

"కానీ అన్నయ్య దగ్గర రహస్యం దాచడం నావల్ల కాదు. అన్నయ్య నా ప్రాణం. నా సంతోషం, దుఃఖం వాడితో పంచుకోకుండా నేనుండలేను. ఇది అసాధ్యం" - అంది చంద్రావతి.

ఇద్దరూ కాసేపాలోచించారు.

"చూడు చంద్రా! నీ కన్యాయం జరిగినమాట నిజం. ఒక దుర్మార్గుడు తప్పించుకుంటున్న మాట కూడా నిజం. కానీ మనచుట్టూ ఎందరో దుర్మార్గులున్నారు. వాళ్ళంతా నేరాల్చించీ తప్పించుకున్నవాళ్ళే! తెలిసి కూడా సమాజం వాళ్ళను భరిస్తోంది. గౌరవిస్తోంది. నీకు జరిగిన అన్యాయం కారణంగా నీ జీవితం నాశనం కావడం లేదు. నిన్ను పరమ పవిత్రురాలిగా భావించి జీవితాంతం - జీవిత భాగస్వామిగా గౌరవించడానికి నేనున్నాను. ఆ దుర్మార్గుడి గురించిన బాధ నీకెందుకు? వాడి మీద ఆగ్రహం మనకే వినాశన హేతువు. ఇదంతా నేను నీ అన్నయ్యకు విడమరచి చెపుతాను. ఆ పద్ధతి నాకు వదిలి పెట్టూ. విషయం తెలిసి మీ అన్నయ్య శాంతించేక అప్పుడు అతడికి నువ్వీ రహస్యం చెబుదువుగానీ. అంతవరకూ ఓపికపట్టలేవా?" అన్నాడు రామం.

చంద్రావతి చటుక్కున వంగి రామం పాదాలకు నమస్కరించి "భర్తను దైవంగా పూజించాలని మన మతం చెబుతుంది. నువ్వింకా నా భర్తవు కాదు. కానీ నిన్ను పూజించకుండా నేనుండలేను -" అంది.

"అయితే నాకూ నీ చేత పూజించబడాలనే ఉంది. నీ పూజలకు సమాజం విపరీతార్థాలు తీయకుండా ఉండడానికి వెంటనే మన వివాహం జరిగితే మంచిది. నీ అన్నయ్యతో నేనా విషయం మాట్లాడతాను -" అన్నాడు రామం.

✡✡✡✡

## 3

చిన్న పెంకుటిల్లు అది.

ఆ ఇంటి ముందో కారు ఆగింది. కార్లోంచీ దిగాడో యువకుడు. ఖరీదైన మనిషిలా కనబడుతున్నాడతడు. అతడా ఇంటిమెట్లెక్కి తలుపు తట్టబోయి - అవి పూర్తిగా వేసి లేవని గ్రహించి చటుక్కున తోశాడు.

అక్కడ మడత మంచం మీద వెల్లకితలా పడుక్కి తెలుగు పేపరు చదువుతున్న యువకుడు చటుక్కున లేచి కూర్చున్నాడు. తను కట్టుకున్న గళ్ళలుంగీ సవరించుకున్నాడు.

"జగ్గన్న నువ్వేకదు?" అన్నాడా ఖరీదైన యువకుడు.

"అవును - నువ్వు...? అన్నాడూ జగ్గన్న ప్రశ్నార్థకంగా.

"నా పేరు ప్రభాకర్ - చాలా ఖరీదైన మనిషిని.."

జగ్గన్న అతడికి కుర్చీ చూపించాడు. తన గోడవారకు వెళ్ళి హాంగర్‌కు తగిలించుకుని ఉన్న చొక్కా వేసుకున్నాడు. అప్పుడు ప్రభాకర్ కెదురుగా ఉన్న కుర్చీలో కూర్చుని - "నాతో నీకేం పని?" అన్నాడు.

జగ్గన్న మనిషి మొరటుగా ఉన్నాడు. మాట మొరటుగా ఉంది.

"పదివేల రూపాయలిస్తాను. నువ్వో హత్య చేయాలి." అన్నాడు ప్రభాకర్.

జగ్గన్న ప్రభాకర్ వంక చురుగ్గా చూశాడు - "ఎందుకు?"

"కారణాలడగొద్దు...."

"కారణం తెలియందే నేను నేరం చేయను..."

"కారణమెందుకు నీకు?"

"నేను కిరాయి గూండాని. కానీ నేనెప్పుడూ అమాయకుల జోలికి వెళ్ళలేదు. ఒకరి స్వార్థానికి సహకరించడానికి నేను నేరం చేయను. కోర్టు శిక్ష విధించలేని చోట - నేరస్తుడిని నేను శిక్షిస్తాను. ఒక నేరస్తుడు సమాజంలో గౌరవంగా బ్రతుకుతుంటే - వాడి నేరానికి ఫలితాన్ననుభవిస్తూ అసహాయంగా ఉండిపోయే అభాగ్యులకు సాయపడతాను నేను..." అన్నాడు జగ్గన్న గంభీరంగా.

ప్రభాకర్ చాలాసేపటిదాకా అసలు విషయం బయట పెట్టకూడదనే అనుకున్నాడు కానీ అది తప్పనిసరి అని గ్రహించాక - "నేరస్థుడి పేరు భాస్కరరావు. వాడూ నా చెల్లెల్ని మానభంగం చేశాడు...." అన్నాడు.

జగ్గన్న పేలవంగా నవ్వి "అయితే?" అన్నాడు.

"అయితే అంటావేమిటి? నా రక్తం మరిగిపోతుంటే...!" అన్నాడు ప్రభాకర్.

"ఎందుకు మరిగిపోతోంది నీ రక్తం! జరిగిన అవమానానికి నీ చెల్లి ఆత్మహత్య చేసుకుందా?"

"లేదు..."

"ఆమె జీవితం నాశనమయిందా -?"

"లేదు..."

"ఆమెకిక వివాహం కాదన్న భయం నీకుందా?"

" నాక్కావలసినంత డబ్బుంది. ఆ డబ్బు నా తప్పులన్నింటినీ మాఫ్ చేయగలదు. కేవలం డబ్బుకోసమే కాక - నా చెల్లెల్ని ప్రాణప్రదంగా ప్రేమిస్తున్న స్నేహితుడున్నాడు నాకు. అతడు వెంటనే ఆమెను వివాహం చేసుకుంటానన్నాడు.."

"అయితే నీలో ఆగ్రహం దేనికి?" అన్నాడు జగ్గన్న.

"జగ్గన్నా! నా ఆవేశం నీకర్థం కాదు. ఎలా చెప్పాలో నాకు తెలియదు. పదివేలిస్తాను. ఆ భాస్కరరావు ప్రాణాలు తీయి -" అన్నాడు ప్రభాకర్.

"మనచుట్టూ ఎందరో నేరస్థులు తిరుగుతున్నారు. వాళ్ళవల్ల అనుక్షణం నష్టపోతూ కూడా మనమేమీ చేయలేకపోతున్నాం. మన జీవితం సాఫీగా నడిచిపోవడానికి అడ్డం రానంతకాలం - ఎలాంటి నేరాన్నయినా సహించడమే మంచిది. నా మాట విను. ఉత్తపుణ్యాన నా

చేత హత్యచేయించకు -" అన్నాడు జగ్గన్న.

"జగ్గన్న - నీ గురించి విన్నాను తప్ప నిన్ను చూడటం నాకిదే ప్రథమం. నువ్వు చదువుకోలేదు కాబట్టి నీ కర్థం కాదు. నేను చెప్పేది జాగ్రత్తగా విను..." అన్నాడు ప్రభాకర్.

"ఎందుకు నాకింతగా నచ్చజెప్పటం?" అన్నాడు జగ్గన్న విసుగ్గా.

"నువ్వు తలచుకుంటే ఆ యమధర్మరాజుకి కూడా తెలియకుండా హత్యలు చేయగలవు. నీ పేరూ నా పేరూ బైటకు రాకుండా హత్య జరగాలి. ఈ హత్య కారణంగా నాకేమో అవుతుందని నా చెల్లి భయం. ఆ భాస్కరావునేమీ చేయనని నన్ను హామీ అడిగింది..."

"సరే చెప్పు..."

"ఆడది ఈ సృష్టికి వరం. ఆమె తను స్వార్థపరురాలన్న పేరు తెచ్చుకుని తనవారికోసం తన శ్రమను ధారపోస్తుంది. ఆమె మనసెంతో సున్నితమైనది. ఇతరుల కోరికలు తీర్చటంలోనే ఆమె కానందం. అలాంటి స్త్రీకి జీవితంలో దుర్భరమైన దేమిటో తెలుసా?"

జగ్గన్న తల అడ్డంగా ఊపాడు.

"ఇష్టపడిన పురుషుడి కోసం ప్రాణాలైనా ఇవ్వగల స్త్రీ - ఇష్టంలేని పురుషుడికి లొంగిపోయేటప్పుడు పడే వేదన దుర్భరం. అది ఏ నరకంలో లభించే శిక్షకన్నా ఎన్నో రెట్లు పెద్దది. ఈ విషయం నేనెన్నో గ్రంథాలలో చదివాను. విదేశాల్లో ఆడవాళ్ళతో ఇంటర్వ్యూలు చదివాను. నా చెల్లెలీ అన్యాయానికి గురయిందంటే నాకు బాధగా ఉండదూ?"

జగ్గన్న మాట్లాడలేదు.

" జగ్గన్నా! మానభంగం వల్ల ఆడదాని కాపురం చెడిపోకపోతే ఫరవాలేదనుకునే మనస్తత్వం నశించాలి. మానభంగం హత్యకు మించిన శిక్ష. ఆ నేరం చేసిన వాడికి మరణమే తగిన శిక్ష..." అన్నాడు ప్రభాకర్.

"అంటే అది నీ తీర్పా?"

"అవును..."

అయితే ఆ భాస్కరరావు పనైపోయిందనే అనుకో."

ప్రభాకర్ అక్కడ ఓ వందరూపాయల నోట్ల కట్ట వదిలి వెళ్ళాడు.

✡✡✡✡

## 4

"ఏమిటిలా వచ్చావు?" అన్నాడు ప్రభాకర్ ఆశ్చర్యంగా.

"భాస్కరావును రెండో కంటివాడికి తెలీకుండా హత్యచేసి వస్తున్నాను" అన్నాడు జగ్గన్న.

ప్రభాకర్ ముఖంలో సంతోషం కనబడింది. "వెరీగుడ్! కానీ నేనిక్కడుంటానని నీకెలా తెలుసు?"

"కిరాయి గుండాని. హంతకుణ్ణి. నాకు తెలీని ప్రదేశాలుండవు" అన్నాడు జగ్గన్న.

"చాలా సంతోషం. వెంటనే విషయం చెప్పినందుకు థాంక్స్!"

"నేను నీకు హత్య విషయం చెప్పటానికి రాలేదు..."

"మరి?"

"చిన్నప్పుడే నా తలితండ్రులు పోయారు. బంధువులింట్లో పెరిగాను. వాళ్ళు నన్ను తిన్నగా చూడలేదు. ఎదురు తిరిగాను. కొట్టేవారు. ఇంట్లోంచి పారిపోయాను. జులాయివాడినయ్యాను. గూండాగా మారాను. కానీ నా దృష్టి ఎప్పుడూ బంధువులింట్లో పెరుగుతున్న నా చెల్లి మీదనే ఉండేది. నాకు భయపడి వాళ్ళు దాన్ని లోటులేకుండా పెంచుతున్నాను. నేను దాని అన్ననన్న విషయానికి

ఎక్కువ ప్రచారం రానివ్వలేదు....."

"ఇదంతా నాకెందుకు చెబుతున్నావు?"

"నా చెల్లెలు కూడా మానభంగానికి గురయింది. అందువల్ల దాని జీవితం నష్టపోలేదు అని సరిపెట్టుకున్నాను. దానికి వెంటనే వివాహంకూడా అయింది. సుఖంగా ఉంది కదా అని సంతోషించాను. తన కన్యాయం చేసినవాడి జోలికి వెళ్ళవద్దని నన్ను హామీ అడిగింది నా చెల్లెలు..."

"అయితే?"

"కానీ నువ్వు చెపింది విన్నాక - నేనూరుకోవటం మంచిది కాదనిపించింది. ఎవరి చెల్లెలికో జరిగిన అన్యాయానికి ప్రతీకారం తీర్చుకున్న నేను - నా చెల్లెలికి జరిగిన అన్యాయానికి ప్రతీకారం తీర్చుకోనూ..."

"నువ్వేం చెబుతున్నావో నా కర్థంకావటం లేదు..."

"నా చెల్లెలి పేరు చంద్రావతి. దానిని నువ్వు మానభంగం చేశావు. అందుకు ప్రతీకారంగా ఏం చేయాలో తెలీక సతమవుతున్న నాకు నువ్వే దారి చూపించావు. ఒక నేరం విషయంలో నువ్వే దారిచూపించావు. ఒక నేరం విషయంలో న్యాయాధికారికి మించి తీర్పునివ్వగలవాడు నేరస్థుడు మాత్రమే! నేరంలోని లోతు, నేరానికి గురైన వ్యక్తి బాధ - నేరస్థుడికి మించి మరెవ్వరికీ అర్థంకావు ..... నీ తీర్పును నేను గౌరవిస్తున్నాను... నీ చెల్లెలికి జరిగిన అన్యాయానికి ప్రతీకారం తీర్చుకునేందుకు నన్నే ఎన్నుకుని పెద్దపొరపాటు చేశావు నువ్వు... నీ తీర్పు నీ ప్రాణాలు తీస్తోంది" అన్నాడు జగ్గన్న.

మన చుట్టూ తీర్పులు చెప్పే పెద్దలెందరో ఉన్నారు. తీర్పు చెప్పిన ప్రభాకరానికి పట్టిన గతి తెలిస్తే - పెద్దలందరూ తీర్పులు చెప్పడం మానేస్తారేమో..! అందుకే ఈ కథ!! (ఐపోయింది) ***

## ధైర్యానికి చావు లేదు

"**ఏమే - ఇంకా రెడీ కాలేదు.** ఈ రోజు కాలేజీకి వెళ్ళవా?" అంది తాయారమ్మ.

"కాలేజీకి వెళ్ళాలంటే భయంగా ఉందమ్మా...." అంది సరోజ జాలిగా ముఖం పెట్టి.

"ఏం - కుర్రాళ్ళల్లరి చేస్తున్నారనా? ఇలా భయపడితే చదువేం సాగుతుంది? అందుకే నేను సంబంధాలు చూసి త్వరగా పెళ్ళి చేసేయమని చెబుతూంటే మీ నాన్నేమో నీకు చదువు బాగా వస్తోంది - అప్పుడే తొందరేమొచ్చిందంటారు. కాలేజీకి వెళ్ళనని ఒక్క మాట చెప్పు. ముందు సంతోషించేదాన్ని నేనే!"

సరోజ భయానికి అర్థముంది.

ఇంటికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది కాలేజ్ అది దగ్గర దారి. లేదంటే అయిదు కిలోమీటర్ల చుట్టు దారి ఉంది. దగ్గరి దారిలో ఓ అరకిలోమీటరు కేవలం నడకకే వీలవుతుంది. ఆ దారిలో కొందరు మగపిల్లలు కాసి, వచ్చే పోయే ఆడపిల్లల్నేడిపిస్తుంటారు. వాళ్ళలో కొందరు పుర ప్రముఖుల పిల్లలు ఉండటం వల్ల - వాళ్ళనెవరూ ఏమీ చెయ్యలేకపోతున్నారు.

అయితే ఆ మగపిల్లలు కూడా కొన్ని హద్దులు దాటరు. వాళ్ళు దారిన పోయే ప్రతి ఆడపిల్లనీ అంగాంగ వర్ణన చేసి అసభ్యకరంగా మాట్లాడి వినోదిస్తారు తప్ప చేతితో కూడా తాకరు. కానీ పరువైన ఆడపిల్లకామాటలు వినడమే కష్టం.

నిన్నటి రోజున ఓ కుర్రాడు సరోజ శరీరపు సొగసులు వర్ణించాడు. ఆమె సిగ్గుతో కుచించుకుపోయింది.



"నిన్న రాత్రి వంటిమీద చేయివేసి మాట్లాడుతుంటే ఇవే కబుర్లు కళ్ళలోకి కళ్ళు పెట్టి మరీ వింది. ఇప్పుడు చూడు ఎంత సిగ్గుపడుతుందో? ఆడాళ్ళకు నటన పుట్టుకతోనే వస్తుంది కాబోలు...." అన్నాడా కుర్రాడు.

"పిట్ట చాలా బాగుంది గురూ - ఎలా పట్టావు?"

"చాలా సింపుల్. వేరుశెనక్కాయలు కొనిపెడతానన్నాను. అంతే రాత్రికి నా గదికి వచ్చేసింది..."

"ఏయ్ పిల్లా - నేనైతే జీడిపప్పు కొనిపెడతాను. రాత్రికి నా గదికిరా..." అన్నాడింకో కుర్రాడు.

సరోజకు కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

ఏం జరిగిందో తల్లికి కూడా చెప్పుకోలేదు. కానీ ఇప్పుడామెకా దారిలో వెళ్ళాలంటే భయంగా ఉంది. చుట్టుదారిలో వెళ్ళాలంటే రిక్షా కావాలి. రిక్షాలో వెళ్ళాలంటే మాటలు కాదు. ఏరోజు కా రోజు డబ్బిచ్చి ఎక్కాలంటే నెలకు రెండువందలవుతుంది. ఎంతగా బేరమాడుకున్నా నెలకు వందరూపాయలివ్వాలి.

సరోజ కాలేజీకి రిక్షాలో వెడతానంటోంది. తల్లి ఆమెను కాలేజీ మానేయమంటోంది.

ఆ సమయంలో ఆ సంభాషణలో కలగజేసుకుంది పద్మ. పద్మ సరోజ చెల్లెలు. వయసు పద్నాలుగు. టెంత్ చదువుతోంది. మనిషి మహా ధైరస్తురాలు. ఆపైన పెంకితనం,  మొండితనం ఉన్నాయి.

"అమ్మా! అక్కకు నేను సాయం వెడతాను..." అందామె.

"నువ్వెళ్ళి ఏం చేస్తావే?"

"అల్లరి వెధవలకి బుద్ధి చెపుతాను...."

"వద్దు. ఆ వెధవలు నోటితీట వదుల్చుకుంటున్నారు. వాళ్ళ మీద తిరగబడితే దేనికైనా తెగిస్తారని భయం అందరికీ!"

"అక్కా! నువ్వు ఇన్‌స్పెక్టర్ విజయ్ పేరు వినలేదా?"

"లేదు - ఏం?"

"ఆయన కొత్తగా ఈ ఊరికి వచ్చాడు. రౌడీలకూ, గూండాలకూ, అల్లరి వెధవలకూ సింహస్వప్నంగా ఉంటున్నాడు. ఆయనకు న్యాయమే తప్ప - నేరస్తుడి హోదాతో నిమిత్తం లేదు. మనమాయనకు ఫిర్యాదు చేద్దాం...."

"సరే - ఆ విజయ్ నిజంగా అంత గొప్పవాడైతే ఈ పాటికీ అల్లరి వెధవల ఆటకట్టించి ఉండకపోయేవాడా? అంతా ప్రచారం....

ఆయన పత్రికలవాళ్ళకి డబ్బులిచ్చి తన గురించలా రాయించుకుని ఉంటాడు..."

"అక్కా! ఆ విజయ్ మనిషేకానీ దేవుడు కాదు. ఈ అల్లరి కుర్రాళ్ళ గురించెవరూ ఆయనకు ఫిర్యాదు చేసి ఉండరు..."

సరోజ మాట్లాడలేదు.

"అక్కా! నువ్వాయనకు ఫిర్యాదు చేయకూడదూ?" అంది పద్మ.

"అయ్యబాబోయ్ - నాకు భయం..."

"నువ్వింక భయపడకు. ఈరోజు నుంచీ నేను నీకు సాయంగా వస్తాను. దేనికైనా ధైర్యముండాలి. ధైర్యమున్నవాళ్ళ నెవరూ ఏమీ చేయలేరని ఈ రోజు నేను ఋజువు చేస్తాను..." అంది పద్మ.

2

"అదిగో జీడిపప్పు పిల్ల వచ్చిందిరోయ్ -" అన్నాడొకడు.

"జీడిపప్పెంత కొన్నావేమిటి?"

"వందగ్రాములు. మొత్తమంతా తనే తినేసింది. తింటే తిందిలే కానీ ఏం సుఖం?" అంటూ వాడూ వర్ణన ప్రారంభించాడు.

"పిల్లా నేను బాదంపప్పు కొనిపెడతాను. నన్నూ సుఖపెట్టు..."

పద్మ చటుక్కున ఆగి "పాపం బాదం పప్పు కొనాలంటే నీకోసం - మీ అమ్మ ఎన్ని మిరపకాయ బజ్జీలమ్మాలో?" అంది.

"మా అమ్మ బజ్జీలెందుకమ్ముతుంది?" అన్నాడు వాడు.

"నీలాంటి బుజ్జీని కన్నందుకు....."

"ఎవరీ పిల్ల? చాలా పొగరుగా ఉంది..."

"కన్నెమొగ్గరా? ఇంకా వికసించని పుష్పం... దీన్నే ఓ పట్టుపడితే...."

"ఇన్స్పెక్టర్ విజయ్ మిమ్మల్నందరినీ ఓ పట్టు పట్టాడంటే - మీరంతా జైల్లో మొగ్గల్లా ముడుచుకు కూర్చుంటారు...."

"ఏయ్ పిల్లా! ఆ విజయ్ దగ్గర కెళ్ళకు. వాడికంటే నేనే ఎక్కువ సుఖపెడతాన్నిన్ను....." అన్నాడింకొకడు.

"అమ్మో భయమేస్తోంది. ఎక్కడ దాక్కుందామ్రా?"

"దాక్కుంటే ఎలాగరా? విజయ్ మన్ని వెతుక్కోలేడు కదా!"

"ఎదురుగుండా కనబడితే మన్ని చూసి భయపడి పారిపోతాడు కదా! అప్పుడీ పిల్లేం చేస్తుంది?"

పద్మ హుంకరించి ముందుక్కదిలింది.

"ఏయ్ పిల్లా - వెళ్ళిపోకు మరి..."

"వెళ్ళనివ్వరా..... నడుస్తూంటే చూడు...." అసభ్యవర్ణన ప్రారంభమయింది.

"పద్మా - అనవసరంగా వాళ్ళను రెచ్చగొట్టి ఏం సాధించావు?"

"ఏం సాధించానా? మన పాకెట్ టేపురికార్డర్లో వాళ్ళ మాటలు రికార్డు చేశాను. రెచ్చిపోవడం వల్ల వాళ్ళు మరిన్ని కారుకూతలు కూశారు..."

"రికార్డ్ చేసి రోజూ వింటావా?"

"నేను వినడానికికాదు. ఇన్స్పెక్టర్ విజయ్‌కి వినిపించడానికి. మన పోలీసులు, కోర్టులు - కళ్ళముందు హత్యజరిగినా సరే సాక్ష్యం కావాలంటారు. ప్రధాన మంత్రిని హత్యచేసిన హంతకులకే - ఇంకా ఉరికంబం ప్రమాదం రాలేదంటే సాక్ష్యాల గొప్పతనం నీకింకా తెలియలేదన్నమాట..."

"ఏమిటో - రేపటినుంచీ వాళ్ళు మరింత రెచ్చిపోతారేమోనని నా భయం...""

"నీ భయం బంగారంగానూ - నాకంటే నాలుగేళ్ళు పెద్దదానివి - నాకున్నపాటి ధైర్యం లేదా నీకు? భయపడ్డ వాళ్ళకి రోజూ అవస్థ..."

"నీకేం - నీ స్కూలుకు వెళ్ళే దారి బాగుంది కాబట్టి ఎన్ని కబుర్లయినా చెబుతావు..."

"అదేమిటే - నేను నీకోసం నీ దారిలోకి వచ్చి నా స్కూలుకు చుట్టుదారిని వెడుతున్నాను...."

"అవును - ఒక్క రోజుకే కదా!"

"నేను నీతో వచ్చానుగా... ఒక్కరోజు చాలు... రేపటినుంచీ నీ దారి నిష్కంటకం...."

అక్కా చెల్లెళ్ళిద్దరూ విడిపోయారు.

3

ఇన్‌స్పెక్టర్ విజయ్ ఆశ్చర్యంగా - "నువ్వు చెప్పేది నాకు నమ్మశక్యం కాకుండా ఉంది" అన్నాడు.

"అందుకే సార్... వాళ్ళ మాటలు రికార్డు చేసి తెచ్చాను..."

విజయ్ టేపు విన్నాడు. ఆయన కళ్ళెర్రబడ్డాయి.

"ఎంతకాలంగా జరుగుతోందిది?"

"చాలా ఏళ్ళుగా జరుగుతోంది సార్! వాళ్ళు ఊళ్ళో పలుకుబడి ఉన్నవాళ్ళ పిల్లలు కావడం వల్లేవ్వరూ పోలీసులకు ఫిర్యాదివ్వడం లేదు. ఇచ్చినా ప్రయోజనం కనబడలేదని కొందరన్నారు. నేను మీ గురించి విని మీమీద నమ్మకంతో వచ్చాను సర్...." అంది పద్మ.

"వెరీగుడ్! నీ వంటి ఆడపిల్లలే దేశానిక్కావాలి. పెద్దయ్యాక నువ్వు పోలీసు ఫోర్సులో జేరు..."

"అలాగే సర్... ఇప్పుడు మీరేం చేస్తారు!!"

"నేనేం చేస్తానో - రేపు పేపర్లో చూడు.. నువ్విక స్కూలుకు వెళ్ళొచ్చు..."

"థాంక్యూ సర్...."

"నీకు సాయంగా ఓ కానిస్టేబుల్ని పంపనా?"

"వద్దు సార్... అర్ధరాత్రే నాకు సాయం అక్కరలేదు. పట్టపగలు సాయం కావాలంటే అవమానం..."

విజయ్ ఆమెని భుజం తట్టి మెచ్చుకున్నాడు.

పద్మ స్కూలుకు వెళ్ళిపోయింది.

సాయంత్రం సరోజ కాలేజీ నుంచి వచ్చే సమయానికి పద్మ ఇంటికి వచ్చేసింది.

"మళ్ళీ ఏమైనా విశేషాలా?" అంది పద్మ.

"ఆశ్చర్యంగా ఉందే! వచ్చేటప్పుడు దారిలో ఆ కుర్రాళ్ళు లేరు. అక్కడ ఓ బీటు కానిస్టేబులు తిరుగుతున్నాడు. పలకరించాలనుకుని మళ్ళీ నాకెందుకూ అని భయపడ్డాను."

"అంటే విజయ్ అప్పుడే రంగంలోకి దిగిపోయాడన్నమాట!" అంది పద్మ.

"ఏమో నాకు నమ్మకంగా లేదు. ఈ పోలీసులు కూడా గూండాల మనుషులే! అసలు వాళ్ళే పెద్ద గూండాలు. పత్రికల్లో చూస్తున్నావుగా?"

"పత్రికలు చూసి అదే ప్రపంచమనుకున్నావంటే ఈ ప్రపంచం నిండా నేరాలు, ఘోరాలు, మోసాలు, దోపిడీలు... కానీ మనమంతా ఎలా బ్రతుకుతున్నామంటావు? సామాన్యంగా జరిగేదానికి భిన్నంగా ఉండే విశేషాలే పత్రికల్లో వేస్తారు. నిత్య సంఘటనల్లో వాటి శాతం

పాయింట్ వన్ కూడా ఉండదు. పోలీసులు కూడా మనలాంటి మనుషులే. ఎక్కడో ఓ పోలీసు గడ్డి తిన్నాడని మిగతావాళ్ళందరూ గడ్డి దుకాణాల చుట్టూ తిరుగుతున్నారనుకోవడం తెలివి తక్కువ..."

"చాలా తెలివిగా మాట్లాడుతున్నావు. నాకే తెలియవు ఇన్ని విషయాలు... నీకెలా తెలిశాయే?"

"ఇవి నా మాటలు కాదు. ఇన్స్పెక్టర్ విజయ్ మాటలు - ఆయన అగురించి ఎన్నోసార్లు పేపర్లో వచ్చింది..."

"ఈసారి వచ్చినప్పుడు నాకు చెప్పవే.. నేనూ చదువుతాను."

"ఎప్పుడో ఎందుకు! రేపే పేపరు చూడు. మొదటి పేజీలో ఇన్స్పెక్టర్ విజయ్ గురించి ఉండకపోతే నన్నడుగు..." అంది పద్మ.

పద్మ మాటలు నిజమే అయ్యాయి. మర్నాటి పేపర్లో మొదటి పేజీలోనే ఇన్స్పెక్టర్ విజయ్ - కొందరు అల్లరి కుర్రాళ్ళను పట్టుకుని జైల్లో వేసిన ఉదంతం ఉంది. వాళ్ళందరికీ గుండు గీయించి, పిలక పెట్టించి, ఫోటోలు తీసి పేపర్లో వేయించి పేర్లు కూడా వ్రాయించాడు విజయ్. పేపర్లో పద్మ ప్రసక్తి కూడా ఉంది.

పద్మ ఆ ఫోటోలు చూసి పకపకా నవ్వింది.

"వాళ్ళు గొప్పవాళ్ళ పిల్లలే - ఏమైనా చేస్తారు. మన మీద పగ పెంచుకుంటే? అందులోనూ విజయ్ వార్తలో నీ గురించి కూడా వ్రాశాడు..."

"ఎందుకే ఇంకా భయపడుతావు ధైర్యానికి చావుకూడా భయపడుతుందని నీకు తెలియదా?" అంది పద్మ.

"ఏమో - నీకున్న ధైర్యం నాకు లేదు..." అంది సరోజ.

4

"ఏమిటే అక్కా అదోలాగున్నావు? మళ్ళీ ఆ కుర్రాళ్ళుగానీ కనబడ్డారా?" అంది పద్మ అప్పుడే కాలేజీ నుంచి వస్తున్న సరోజను చూసి.

"లోపలకు రా - నీకో రహస్యం చెప్పాలి..." అంది సరోజ నెమ్మదిగా.

పద్మ సరోజ ననుసరించి వెళ్ళింది. సరోజ జాకెట్లోంచి ఓ ఉత్తరం తీసి చెల్లెలికిచ్చింది. పద్మ ఆ ఉత్తరం చదివింది.

"నువ్వు, నీ చెల్లెలు మాకు చేసిన అన్యాయానికి మీ ఇద్దరిమీదా పగతీర్చుకుంటాం. ఘోరంగా, క్రూరంగా పగతీర్చుకుంటాం. అప్పుడే ఇన్స్పెక్టరూ మిమ్మల్ని రక్షించలేడు. సిద్ధంగా ఉండడి - మా ప్రతాపం చూడ్డానికి."

ఉత్తరం ఎవరికి వ్రాసిందో, ఎవరు వ్రాసారో తెలియదు.

"నీకీ ఉత్తరమెలా వచ్చింది?" అంది పద్మ.

"కాలేజీలో ఎవరో ఇది నా నోట్సులో పెట్టారు."

"మీది ఉమన్స్ కాలేజీ కదా...?" అంది పద్మ సాలోచనగా.

"అవును... ఎవరో ఆ వెధవల తాలూకువాళ్ళు పెట్టారని నా అనుమానం."

"ఎవరో నువ్వూహించగలవా?"

సరోజ తల అడ్డంగా ఊపింది.

"ఈ ఉత్తరాన్ని వెంటనే ఇన్స్పెక్టర్ విజయ్కి అందజేస్తాను."

"వద్దు - ఇప్పటికే వాళ్ళు మనమీద పగబట్టారు. అనవసరంగా కొరివితో తలగోక్కున్నామనిపిస్తోంది.. "

"కొరివితో ఎవరూ తలగోక్కోరు.. అవసరమైనంత సేపు వంటచేసుకుని తర్వాత నీళ్ళు పోసి ఆర్పేస్తారు..."

"అయితే నువ్వీ ఉత్తరం విజయ్కిస్తావా?"

"ఇస్తాను... ఇప్పుడే." అంది పద్మ.

ఆమె ఆ ఉత్తరం తీసుకుని పోలీస్ స్టేషన్‌లోకి వెళ్ళింది. విజయ్ ఆమెను చూసి - "మళ్ళీ ఏమైనా విశేషమా!" అన్నాడు.

పద్మ అవునన్నట్లు తలూపి విజయ్ కా ఉత్తరమిచ్చింది.

"విజయ్ ఆ ఉత్తరం వంక చూసి - ఆ వెధవలకింకా బుద్ధిరాలేదన్నమాట!" అన్నాడు.

"వాళ్ళు నాకూ మా అక్కకూ బుద్ధి చెప్పాలనుకుంటున్నారు" అంది పద్మ నవ్వుతూ.

"నువ్వు జాగ్రత్తగా ఉండాలి ఎందుకైనా మంచిది మా ఇల్లు కూడా నీకు తెలియాలి నాతో వస్తావా మా ఇల్లు చూపిస్తాను..." అన్నాడు విజయ్.

"మీ ఇల్లే కాదు - ఆంటీని కూడా చూస్తాను..." అంది పద్మ.

"ఆంటీతో నీకేం పని?"

"మీ అంత గొప్పవారి భార్యను చూడాలన్నది నా కోరిక."

ఎందుకో ఇన్‌స్పెక్టర్ ముఖం అదోలాగయిపోయింది.

"మా ఇంటికి వెడితే నా గురించి నీ అభిప్రాయాలు మారవచ్చు. అయినా లోపలకు వస్తావా?" అన్నాడు విజయ్.

ఇద్దరూ జీపులో విజయ్ ఇంటికి వెళ్ళారు.

"అంకుల్! మీ ఇల్లు నాకు బాగా గుర్తుంది. ఒక్కసారి చూస్తే చాలు - ఏమైనా గుర్తుంటుంది నాకు..." అంది పద్మ.

"లోపలికి రావూ మరి!"

"అయ్యో .. ఆంటీని చూడకుండానా నేను వెళ్ళేది." అంటూ అతడిని అనుసరించింది పద్మ.

ఇద్దరూ లోపలకు వెళ్ళారు.

ముందు గదిలో విజయ్ బూట్లు విప్పుతున్నాడు. పద్మ తన చెప్పులు విడిచింది. ఇద్దరూ పక్కగదిలోకి వెళ్ళారు.

ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది.

"ఇంట్లో ఎవరూ లేరా అంకుల్?" అంది పద్మ.

"ఉండు..చీకటిగా ఉంది. గదిలో దీపం వేసి అప్పుడు నీకన్నీ చెపుతాను..." అన్నాడు విజయ్.

మరుక్షణం గదిలో దీపం వెలిగింది.

పద్మ గుమ్మం అవతల నుంచీ గదిలో అడుగుపెట్టింది.

విజయ్ ఆమె చేయి పట్టుకుని - "పద్మా! ఈ లోకంలో నేను ఒంటరిని" అన్నాడు

పద్మ చేయి విడిపించుకోలేదు - "ఒంటరి అయితే ఆంటీని చూపిస్తానని ఎలా చెప్పారు?" అందామె.

"ఆంటీ - అదుగో ... అటు చూడు..." అంటూ విజయ్ ఆమె చేయి వదిలిపెట్టాడు.

గదిలో గోడకు వ్రేలాడుతోంది ఓ ఫోటో.... అందులో నవ్వులు చిందిస్తోందో అందమైన యువతి. ఆ ఫోటోకు చేమంతి పూలదండ వ్రేలాడుతుంది.

"అంటే... ఆంటీ..." అని ఏదో అనబోయి ఇటు తిరిగేసరికి పద్మకు విజయ్ ఏడుపు వినిపించింది.

"పద్మా! నీవంటి పిల్లలు ఆంటీని చూస్తానన్నప్పుడల్లా నేను పసివాడికన్నా ఘోరంగా మారిపోతాను. నేనేనా - దొంగలకు, గూండాలకు సింహస్వప్నమైన ఇన్‌స్పెక్టర్ విజయ్‌ని - అన్న అనుమానం నీవంటివారిలో కలుగుతుంది. కానీ నేను నిజంగానే ధైర్యవంతుణ్ణి పద్మా! అందుకే ప్రాణం కంటే మిన్నగా ప్రేమించిన భార్యను పోగొట్టుకుని ఇంకా బ్రతికే ఉన్నాను.." అన్నాడు విజయ్.

"ఆంటీకేమయింది? ఎలా పోయింది?" అంది పద్మ.

"ఇన్స్పెక్టర్ విజయ్‌కి భార్య కావడమే ఆమె చేసిన తప్పు. నా మీద పగబట్టిన కొందరు దుష్టులామెనెత్తుకుని పోయారు. ఆమెకు మారుగా ఓ నరరూప రాక్షసుణ్ణి జైల్లోంచి విడిచిపెట్టాలన్నారు. లేకుంటే ఆమెను చంపేస్తామన్నారు. ఆమెను నాతో ఫోన్లో మాట్లాడనిచ్చారు. అప్పుడామె నాతో – "నేను ధైర్యంగా ఉన్నాను. ధైర్యానికి చావులేదని మీకు తెలుసు. నా కోసం మీరు నరరూప రాక్షసులను విడిచిపెట్టకండి.." అని చెప్పింది. నేను ధైర్యం చిక్కబట్టుకున్నాను. నేరస్తుల ఆరాతీసి వాళ్ళను చుట్టుముట్టాను. ఆ కసితో వాళ్ళామెను తుపాకీతో కాల్చి పేల్చారు. కొనప్రాణంతో ఆమె నాకు దక్కింది. చనిపోయేటప్పుడు కూడా ఆమె నాతో – 'ధైర్యానికి చావులేదు. మీరు ధైర్యం కోల్పోనంతకాలం నేను మీతోనే ఉన్నాననుకోండి...' అంది..." అంటూ విజయ్ కళ్ళు తుడుచుకున్నాడు.

"అంకుల్ – యూఆర్ రియెల్లీ గ్రేట్!" అంది పద్మ అప్రయత్నంగా.

"గొప్పతనం నాదికాదు. నా భార్యది. ఆమె ప్రోత్సాహంతోనే నేనెన్నో సాహసకార్యాలు చేశాను తలచుకుంటూనే ఇప్పటికీ నా విద్యుక్త ధర్మాన్ని నిర్వహిస్తున్నాను...." అన్నాడు విజయ్.

"అంకుల్ – మీరు, ఆంటీ నా ధైర్యాన్ని మరింతగా పెంచారు. వస్తాను – సెలవు" అంది పద్మ.

5

పద్మ, సరోజ పిక్నిక్కి వెళ్ళారు. ఆ కార్యక్రమం జయప్రదంగా ముగిసింది. వెనక్కు వచ్చేసరికి రాత్రి తొమ్మిది కావచ్చింది.

వాళ్ళు మొత్తం పదిమందమ్మాయిలు. బస్సులో వెళ్ళి బస్సులో తిరిగొచ్చారు. దారిలో బస్సు చెడిపోవటం వల్ల బాగా ఆలస్యమయింది. బస్‌స్టాండు నుంచీ అందరిదీ తలో దారీను..'

అప్పుడు వాళ్ళముందు రెండు కార్లాగాయి.

"హాయ్ గీతా!" అంటూ ఓ యువకుడు కార్లోంచి దిగి పలకరించాడు సరోజ స్నేహితురాండ్రలో ఒకామెను.

అంతే!

క్షణాల మీద గీత ఆ రెండు కార్లనూ తమకోసం ఏర్పాటు చేసింది. పద్మ, సరోజ మరో ముగ్గురితోపాటు ఓ కార్లో ఎక్కారు. పద్మ, సరోజ వెనుక సీట్లో కూర్చున్నారు.

కార్లో యువకుడు – ఒక్కొక్కరినే వాళ్ళ వాళ్ళింటి దగ్గర డ్రాప్ చేశాడు. చివరికి కార్లో పద్మ, సరోజ మిగిలారు.

"ఊళ్ళోకి వచ్చాంగా... ఇక్కణ్ణించీ మేమెలాగో ఇల్లు చేరుకోగలం..." అంది సరోజ.

"అయ్యో! అలా చేస్తే మా గీత ఊరుకోదు. మిమ్మల్ని కూడా మీ ఇంటి వద్ద దిగబెడతాను. అప్పుడే నాకు తృప్తిగా ఉంటుంది..." అన్నాడా యువకుడు మళ్ళీ కారు స్టార్ట్ చేస్తూ.

సరోజ మాట్లాడలేదు. పద్మ మాత్రం విండో సీట్లో బైటకు చూస్తూ పిక్నిక్ అనుభవాలు నెమరువేసుకుంటోంది.

నిజానికామె పిక్నిక్కి వెళ్ళవలసింది కాదు. సరోజ స్నేహితురాండ్రు పిక్నిక్కి వెళ్ళాలనుకుంటే మొత్తం తొమ్మండుగురయ్యారు. ఎవరైనా వింటే నవగ్రహాల్లా అంటారంటే సరోజ కూడా పద్మను తీసుకొచ్చింది.

"మా ఇంటికి దారి ఇది కాదు –" అంది సరోజ ఉన్నట్లుండి. అప్పుడు పద్మ ఈ లోకంలోకి వచ్చింది.'

ఉన్నట్లుండి కారు వేగం హెచ్చింది.

"ఏయ్ కారు ఆపు!" అంది పద్మ.

అప్పటికే కారు జనసంచారం లేని దారిలో పడింది. పద్మ కారపమన్న పది నిమిషాలకి కారు ఓ బంగళా ముందాగింది.

"ఏమిటది – ఎవరు నువ్వు?" అంది పద్మ.

"నన్నింకా గుర్తుపట్టలేదా? మీ కారణంగానే కదా ఇన్‌స్పెక్టర్ విజయ్ మమ్మల్ని పట్టుకున్నాడు..." అన్నాడా యువకుడు. అప్పుడా అక్కచెల్లెళ్ళతణ్ణి గుర్తించగలిగారు. ఈలోగా కారాగిన చప్పుడు విని బంగళాలోంచి బయటకు వచ్చారు కొందరు యువకులు. వాళ్ళందరినీ అక్కచెల్లెళ్ళిద్దరూ వెంటనే గుర్తుపట్టేశారు.

పద్మ, సరోజ కారుదిగి పారిపోవాలనుకున్నారు. కానీ ఒకరు కాదు... ఇద్దరు కాదు... మొత్తం ఆరుగురు యువకులు...

వాళ్ళ అక్క చెల్లెళ్ళిద్దర్నీ బంగళా లోపలకు నడిపించారు. వారిలో ఒక యువకుడు పద్మతో - "పాపా! తప్పు చేసింది నువ్వే కానీ - చేయించింది నీ అక్క! అందుకని శిక్ష ఆమెకే వేస్తున్నాం. ఆ శిక్ష ఎలాగుంటుందో నువ్వు చూద్దువుగాని..." అన్నాడు.

సరోజ చటుక్కున వంగి ఆ యువకుడి పాదాలపై పడిపోయి - "నన్ను క్షమించండీ. ఇంకెప్పుడూ ఇలాంటి పొరపాటు జరగదు. మమ్మల్నిద్దరినీ వదిలిపెట్టండి -" అంటూ ఏడ్వసాగింది.

"ఎందుకే అక్కా ఏడుస్తావు? తప్పుచేసింది వాళ్ళు. వాళ్ళ తప్పు గురించి మనం పోలీసులకు చెబితే అది తప్పెందుకవుతుంది? నువ్వేం భయపడకు. నేనిప్పుడే ఇన్‌స్పెక్టర్ విజయ్ ఇంటికి వెళ్ళి జరిగింది చెబుతాను. దాంతో వీళ్ళ ఆటకట్టవుతుంది..." అంది పద్మ ధైర్యంగా.

"పాపా - వెళ్ళాలని నీకుంటే మాత్రం మేము నిన్ను వెళ్ళనిస్తామనుకున్నావా?" అన్నాడో యువకుడు వెటకారంగా.

"ధైర్యవంతుల్ని ఎవ్వరూ ఆపలేరు..." అంది పద్మ.

"ఓహ్ - మరి ఈ కత్తి కూడా ఆపలేదా?"

ఈ మాటన్నది ఒకడు కాదు. నలుగురు యువకులు. నలుగురి చేతుల్లోనూ తళతళ మెరిసే కత్తులున్నాయి.

వాళ్ళ నలుగురూ పద్మను చుట్టుముడితే ఇద్దరు సరోజను చెరో రెక్కా పట్టుకుని పైకి లేపారు.

"మీ చేతుల్లో ఆ కత్తులెందుకు?" అంది పద్మ.

సరోజ ఏడుస్తున్నందువల్ల ఆమె తన స్వరాన్ని పెంచింది.

"పారిపోడానికి ప్రయత్నిస్తే - చంపడానికి..."

"ధైర్యానికి చావులేదని మీకు తెలియదా?" అంటూ పద్మ వారి నలుగురి మధ్యనుంచీ తప్పించుకుని పరుగెత్తింది.

6.

ఎవరో తలుపు దబదబ బాదుతున్న చప్పుడై ఉలిక్కిపడి లేచాడు విజయ్. ఆరోజతడు ఏదో కేసు ఇన్వెస్టిగేట్ చేసి బాగా అలసిపోయి ఉన్నాడు. ఎనిమిదిన్నరకల్లా నిద్రపోయాడు.

విజయ్ బెడ్‌లైట్ వెలుగులో వాచీ చూసుకుంటే టైము పదకొండు కావస్తోంది. తలుపు లింకా దబదబా బాదుతున్నారెవరో!

"ఎవరూ?" అంటూ విజయ్ వెళ్ళి తలుపు తీసి గుమ్మం అవతల ఉన పద్మను చూసి ఆశ్చర్యపోయాడు.

పద్మ అతడికి క్లుప్తంగా జరిగింది చెబుతోంది. ఆయాసంతో మధ్య మధ్య రొప్పుతోంది.

విజయ్ కళ్ళెర్రబడ్డాయి. అతడు వెంటనే పోలీస్ స్టేషన్‌కి ఫోన్ చేసి కొంత బలగాన్ని సరోజ ఉన్న బంగళాకు రమ్మన్నాడు. తను వెంటనే జీపులో బయలుదేరాడు పద్మను వెంటబెట్టుకుని.

అతడు బంగళా చేరుకునేసరికి లోపల దీపాలు దివ్యంగా వెలుగుతున్నాయి. అక్కడ హాల్లో ఆరుగురు యువకులు నేలమీద కూర్చున్నారు వలయాకారంలో. వారందరి ముందూ విస్కీ బాటిల్సు ఉన్నాయి. వారి మధ్య సరోజ నిలబడి ఉంది. ఆమెకు కన్నీళ్ళాగడంలేదు.

అలా నిలబడి ఏడుస్తోందామె.

వాళ్ళారుగురూ ఆమెను అసభ్యంగా వర్ణిస్తూ బట్టలు విప్పమని తిడుతున్నారు.

"యూ బాస్టర్డ్స్..." అన్నాడు విజయ్ ఆవేశం పట్టలేక.

అప్పుడా యువకుల దృష్టి విజయ్ పైకి మళ్ళింది.

తర్వాతేం జరిగిందో విజయ్‌కి తెలియదు. అతడు పూనకం వచ్చినవాడిలా ఆ ఆరుగురినీ ఇష్టం వచ్చినట్లు తన్నాడు. అతడి బలచాతుర్యాల ముందు - ఆ యువకుల సంఖ్యాబలం ఎందుకూ కొరగాలేదు.

ఆ ఆరుగురూ కదలలేని పరిస్థితి ఏర్పడిన సమయానికి మిగతా పోలీసు సిబ్బంది అక్కడకు చేరుకున్నారు.

"అరెస్ట్ దెమ్!" అన్నాడు విజయ్.

సరోజ జరుగుతున్న విశేషమంతా విచిత్రంగా చూస్తోంది. ఆమె ఆశ్చర్యంగా - 'ఇన్‌స్పెక్టరుగారూ! మీరిక్కడికి సమయానికెలా వచ్చారు?" అంది.

"నీ చెల్లెలు పద్మ చెప్పింది."

"పద్మ చెప్పిందా? అంటే అది బ్రతికే ఉందా!" అంది సరోజ ఆశ్చర్యంగా.

"ధైర్యవంతుల్నెవరూ ఏమీ చేయలేరమ్మా - నీకా అనుమానమెందుకొచ్చింది?" అన్నాడు విజయ్.

"అంటే అన్ని కత్తిపోట్లు తిని కూడా అది బ్రతికే ఉందా? ఇన్‌స్పెక్టరుగారూ! మీరు వెంటనే దాన్ని హాస్పటల్లో చేర్పించారా? డాక్టర్లు ప్రమాదం లేదన్నారా?" అంది సరోజ ఆత్రుతగా.

"కత్తిపోట్లేమిటమ్మా - మనిషి నిక్షేపంలా ఉంటేనూ?" అన్నాడు విజయ్.

"అదెలా సాధ్యం? వాళ్ళు నా కళ్ళ ముందే దాన్ని పొడిచి పక్క గదిలోకి ఈడ్చుకుపోయారు..." అంది సరోజ.

విజయ్ తెల్లబోయి - "పద్మా!" అన్నాడు. అక్కడతడికి పద్మ కనబడలేదు. అతడు సరోజ చెప్పిన గదిలోకి వెళ్ళి చూస్తే అక్కడ పద్మ శరీరం రక్తసిక్తమై పడి ఉంది.

"పద్మా!" అని బిగ్గరగాఅరిచాడు విజయ్.

పద్మ కదలడం లేదు.

అంటే తనింటికొచ్చి తన్ను లేపి తనకూడా వచ్చిందెవరు? పద్మ ధైర్యం, సంకల్ప బలం - మరో మనిషి రూపం ధరించి తనకు విషయం చేరవేశాయా?

విజయ్ వంగి పద్మ నాడి పరిశీలించి - " ఇంకా నాడి కొట్టుకుంటోంది. అర్జంటుగా ఈమెను హాస్పటల్‌కి తీసుకు వెళ్ళాలి..." అన్నాడు.

"ఇన్‌స్పెక్టరుగారూ... నా చెల్లి బ్రతుకుతుందా?" మళ్ళీ అంది సరోజ.

"ధైర్యానికి చావుండదమ్మా..." అన్నాడు విజయ్ చటుక్కున. ఆ జవాబులోనే అతడికెన్నో ప్రశ్నలకు సమాధానాలు స్ఫురించాయి.



# చోరలీల

అదొక చిన్న ప్రశాంతమైన కాలనీ, అందులో సుమారు రెండువందల ఇళ్ళున్నాయి. అలాంటి ఇళ్ళల్లో ఓ ఇంటిలో ఒక రోజు మధ్యాహ్నం...

శారద భర్త వామనరావు మధ్యాహ్నభోజనం చేసి దగ్గర్లోనే ఉన్న ఆఫీసుకు వెళ్ళిపోయాడు. అప్పుడు టైము ఒంటిగంటన్నరయింది.

శారద ఇల్లు సర్దుకుని తలుపులు తాళం వేసుకుని - ఇంటి వెనుకనే ఉన్న పనిమనిషితో "జాగ్రత్త! నేను బయటకు వెడుతున్నాను -" అని చెప్పి ఓ వీధి అవతల ఉన్న స్నేహితురాలింటికి కబుర్లకు వెళ్ళింది.

పనిమనిషి శారద చెప్పిన మాటలు వింది. ఆమెకో ఏడాది కొడుకున్నాడు. వాడు సాధారణంగా అల్లరి చేస్తూ ఆ సమయంలో పడుకోడు. పనిమనిషికి రోజూ ఆ సమయంలో నిద్ర ముందుకు వస్తూంటుంది. ఆ కుర్రాడీవేళ ఎందుకో నిద్రకుపడ్డాడు. పనిమనిషి తనూ సుఖంగా పడుకోవాలనుకుంది.

కానీ యజమానురాలు తననిల్లు చూడమని చెప్పి వెళ్ళింది. పడుకుంటే ఎలా? ఏ దొంగతనమైనా జరిగితే ఇంట్లోంచి పొమ్మంటారు తనని. ప్రత్యేకంగా పనివాళ్ళకని కట్టిన ఆ చిన్న వాటా ఆమెకెంతో సదుపాయంగా ఉంటోంది. అద్దె లేకుండా ఊరికే అందులో ఉంటోంది పనిమనిషి కుటుంబం.

పనిమనిషింకా సందిగ్ధంలో ఉండగానే దొడ్లో అటు వయిపుగా ఓ మనిషి కనిపించాడు. అతడు సన్నగా సుమారయిన ఎత్తులో ఉన్నాడు. మనిషి చూడ్డానికి ఉద్యోగస్తుడిలా ఉన్నాడు. అతడినంతవరకూ పనిమనిషి చూసి ఉండలేదు.

"ఇంటికి తాళం పెట్టి ఉందేమిటి?" అన్నాడతడు.

"అయ్యగారాఫీసుకు వెళ్ళారు. అమ్మగారు పేత్తనాలకు వెళ్ళారు. పిల్లలు స్కూలుకు వెళ్ళారు" అంది పనిమనిషి

అతడు పనిమనిషి ద్వారా అయ్యగారు అయిదున్నరకీ, అమ్మగారు నాలుగున్నరకీ, పిల్లలు నాలుగింటికీ వస్తారని తెలుసుకున్నాడు.

పనిమనిషి ముంచుకు వస్తున్న నిద్రనాపుకుంటూ - "ఎవరు మీరు?" అనడిగింది.

అతడు రెండు చాక్లెట్లు జేబులోంచి తీసి - "నీ బాబు బొద్దుగా ముద్దుగా ఉన్నాడు - ఈ చాక్లెట్లు చాలా బాగుంటాయి. మనూళ్ళో దొరకవు. ఒకటి నువ్వు తిను ఇంకోటి బాబుకి..." అన్నాడు.

పనిమనిషి చాక్లెట్లందుకుంది. అతడింకా అక్కడే నిలబడ్డాడు. ఆమె ఇబ్బందిగా చూస్తుంటే - "మా వాళ్ళకు చెప్పు - నేను వచ్చివెళ్ళానని! వీలుంటే రేపు మళ్ళీ వస్తానన్నానని చెప్పు..." అన్నాడు.

పనిమనిషి తలూపింది.

"మరో విషయం. నేనిచ్చిన చాక్లెట్లు అద్భుతమైనవి. నువ్వు తిన్నా తినకపోయినా - బాబుకు మాత్రం పెట్టు. పిల్లలంటే నాకు ప్రాణం" అని అక్కడినుంచీ కదిలాడతడు.



అతడలా వెళ్ళగానే గేటు చప్పుడయ్యేవరకూ ఆగిందామె. ఇంటికి ముందువైపున్న ఆ గేటు చప్పుడు కాస్త శ్రద్ధగా వింటే - ఇంటి వెనక పనిమనిషి వాటాలోకి కూడా వినబడుతుంది. గేటు చప్పుడు కాగానే కుతూహలంగా పనిమనిషి చాక్లెట్లను ఒకటి విప్పి నోటిలో వేసుకుంది. మరుక్షణం ఆమెకు నిద్ర ముంచుకు వచ్చింది.

ఈలోగా అగంతకుడు గేటు దగ్గిరకు వెళ్ళి గేటు చప్పుడు చేశాడు. అప్పుడే గేటు దగ్గరికో యువకుడు వచ్చాడు.

"వీధుల్లో జనం తిరగటం లేదు. ఈ ఇంట్లో సంగతేమిటి?" అన్నాడా యువకుడు.

"అంతా అనుకూలంగానే ఉంది పద" అన్నాడాగంతకుడు.

ఇద్దరూ గేటు దగ్గిర్నుండి ఇంటి గుమ్మం చేరుకున్నారు. ఇంటికి చాలా పెద్ద సైజులో నవతాళ్ వేసి ఉంది.

"యాసిడ్ పోద్దామా?" అన్నాడు యువకుడు.

"యాసిడ్ పోసి నిక్షేపంలాంటి తాళం కప్ప పాడు చేస్తామా?" అంటూ అతడు తన మెడకు వ్రేలాడుతున్న సంచిలోంచి చిన్న ప్యాకెట్ తీశాడు. అప్పటికప్పుడు అందులోని పరికరాలుపయోగించి - చిన్న సయిజు క్రోబార్ అసెంబుల్ చేశాడు. దాంతో తలుపు గడియను సులభంగా పెకలించాడు.

"ఇది గవర్నమెంటు క్వార్టరు. ఇంటి గడియలనేమిటి కావాలంటే ఇంటి కిటికీనే పెకలించి వేయవచ్చు" అన్నాడాగంతకుడు - తన పని సక్రమంగా ముగిశాక.

ఇద్దరూ ఇంట్లో ప్రవేశించారు. ముందుగా డ్రాయింగ్ రూం వచ్చింది. అక్కడ ఓ పెద్ద సోఫా సెట్టుంది. కలర్ టీవీ, స్టీరియో ఉన్నాయి.

"టీవీ ఎలా వస్తుందో?" అన్నాడు యువకుడు.

"సమయానికి ప్రోగ్రాములేవీ లేవు. కనీసం క్రికెట్ మ్యాచ్ ఉన్నా సరిపోయేది" అన్నాడాగంతకుడు.

"కానీ - టీవీనెలా మోసుకుపోతాం? బాగా పెద్దదిగా ఉంది" అన్నాడు యువకుడు.

"మోసుకుపోయేందుక్కాదు. ఎవరింటికి వెళ్ళినా ఓసారి టీవీ చూస్తుంటాను నేను.షాపుల్లో ఎలా పనిచేస్తున్నాయనేది కాదు - ఇళ్ళల్లో ఎలా పనిచేస్తున్నాయన్నదే ముఖ్యం. నేడో రేపో మనమూ ఓ మంచి కలర్ టీవీ కొనుకోవాలనుకుంటున్నాంగా - ఇది షాపింగన్నమాట..." అన్నాడాగంతకుడు.

ఇద్దరూ డ్రాయింగ్‌రూం పరిశీలించారు. నేలమీద ఖరీదయిన కార్పెట్ పరచి ఉంది. అక్కడ చిన్న షో కేసు గోడకు తగిలించి ఉంది. అందులో నాలుగు బొమ్మలు, ఓ క్వార్ట్జ్ అలారం ఉన్నాయి. పక్కగా టైపురైటరుంది.

"అలారం బాగుంది - తీసుకుందామా?" అన్నాడు యువకుడు.

"అలారం వద్దు" అన్నాడాగంతకుడు.

"ఏం?"

"అది ప్రిస్టేజికి భంగం. బొత్తిగా అలారానిక్కూడా కక్కుర్తి పడ్డామని మనగురించి చెప్పుకుంటారు. సాటివారిలో మనకెంత అవమానం?"

"అయితే మనమేం తీసుకుంటాం?"

"వెండి, బంగారం - అంతే?"

"అవెక్కడ దొరుకుతాయి?"

"ఇంట్లో ఎక్కడో ఉంటాయి. డ్రాయింగ్ రూం చూస్తే తెలియడం లేదూ? వీళ్ళు బాగా ఉన్నవాళ్ళే?" అన్నాడాగంతకుడు.

ఇద్దరూ డ్రాయింగ్ రూంలోనుండి బయటకి వచ్చారు. లోపల మరో మూడు గదులకు తలుపులు తాళాలు వేసి ఉన్నాయి. తలుపు పక్కనే ఉన్న కిటికీల్లోంచి గది లోపలి వస్తువులు కనబడుతున్నాయి.

"అది వంటిల్లు... స్టీలు గిన్నెలు తప్ప ఇంకేమీఉండవక్కడ..." అన్నాడాగంతకుడు.

"ఒక వేళ వెండికంచం, గ్లాసులు ఉంటే?"

"వెర్రివాడా? ఈ రోజుల్లో వెండికంచాలనెవరూ భోంచెయ్యడాని కుపయోగించరు..." అన్నాడాగంతకుడు.

"మరి?"

"అవి బీరువాల్లోనే ఉంటాయి."

"అలాంటప్పుడు చేయించుకోవడమెందుకు?"

"వెండికంచాలు, చెంబులు, గ్లాసులు - ఎవరూ కావాలని చేయించుకోరు. అవి పెళ్ళిళ్ళలో బహుమతిగా వస్తాయి..." అన్నాడు.

"నువ్వు చాలా తెలివయినవాడివి..."

"నన్ను మెచ్చుకోవడం కాదు - చూసి నేర్చుకో..."

బయట్నించి కిటికీల ద్వారా చూస్తుంటే మిగతా రెండు గదుల్లోనూ స్టీలు బీరువాలు కనిపించాయి.

తను తయారు చేసిన క్రోబారుతో - ఓ గది గడియను పెకిలించాడాగంతకుడు.

"ఈ గడియకూడా సంచిలో వేసి దాచేదా?" అన్నాడు యువకుడు.

"ఇది మంచమ్మీద పడేద్దాం. తాళం ఆర్డనరీది..." అన్నాడాగంతకుడు.

గదిలో బీరువా తాళం వేసిలేదు. ఆగంతకుడు బీరువా తెరిచాడు. సరిగా అపుడే కాలింగ్‌బెల్ మ్రోగింది.

యువకుడు కంగారుపడ్డాడు. అతడిలో కొదిగా వణుకుప్రారంభమయింది.

"భయపడకు. గడియ పెకిలించినట్లు తెలియకూడదని తలుపులు బార్లా తీసి ఉంచాం. ఇంటివాళ్ళయితే కంగారుగా లోపలకు వస్తారు. వచ్చిందింటివాళ్ళు కారు..." అన్నాడాగంతకుడు.

"కానీ మనం దొంగలంకదా..."

"దొంగతనం చేస్తున్నంతసేపూ మనం దొంగలమని గుర్తుంచుకోకూడదు. మనింటికి మనం వచ్చి మన వస్తువులు తీసుకు పోతునట్లుగా భావించాలి. అప్పుడే తాపీగా పని చేయగలుగుతాం. మన భయమే మనని పట్టిస్తుంది...." అంటూ ఆగంతకుడు వీధి గుమ్మం దగ్గరకు వెళ్ళాడు.

అక్కడో పదేళ్ళ కుర్రాడున్నాడు. వాడి చేతిలో రెండు నవలలున్నాయి. ఆగంతకుణ్ణి చూస్తూనే ఆ కుర్రాడాశ్చర్యంగా - "మీరెవరు?" అన్నాడు.

"అక్కయ్య ఇంటిలో లేదు. ఇంకో గంటలో వస్తుంది." అన్నాడాగంతకుడు గంభీరంగా.

"అమ్మ ఆంటీకి నవలిమ్మంది. కొత్తగా వచ్చాయంట" అన్నాడా కుర్రాడు.

"సరే - నా కివ్వు. నేను అక్కయ్యకిస్తాను..." అంటూ చేయి సాచాడాగంతకుడు.

"అంకుల్ - ఒక్కసారి స్వాతిముత్యంలో చిన్నారి పొన్నారి కిష్టయ్యా పాట వేయరూ?" అన్నాడా కుర్రాడు.

"అవన్నీ ఎక్కడున్నాయో నాకు తెలియదు..."

"నాకు తెలుసంకుల్. నాకీ రోజు స్కూలు లేదు. అమ్మ మీ ఇంటికి వెళ్ళమంటే ఆ పాట ఓ సారి వినొచ్చుకదా అని వచ్చాను.."

"సరే - నీ ఇష్టం - పద..." అంటూ ఆగంతకుడా కుర్రాణ్ణి డ్రాయింగ్ రూంలోకి తీసుకుని వెళ్ళాడు.

కుర్రాడు రికార్డు పెట్టాడు. వాడు పాట వింటూంటే ఆగంతకుడు పక్క గదిలోకి వెళ్ళి యువకుడితో - "నువ్వు గదంతా బాగా గాలించు. నేనే కుర్రాణ్ణి పంపించి వస్తాను." అన్నాడు.

"భయం లేదా?"

"మనింటిలో మనం ఉన్నాం. భయమెందుకు?"

యువకుడు సరేనన్నాడు. ఆగంతకుడు డ్రాయింగ్ రూం చేరుకున్నాడు.

చిన్నారి పొన్నారి కిష్టయ్య పాట అయిపోయింది.

"ఇక చాలా?" అన్నాడాగంతకుడు.

"ఒక్కసారి బోనీయం వింటానంకుల్..... స్టీరియో ఎఫెక్ట్స్ చాలా బాగుంటాయి...."

ఆగంతకుడు విసుగ్గా - "ఊ" అన్నాడు.

రికార్డు నడుస్తుండగా ఆగంతకుడు పక్క గదిలోకి వెళ్ళి - "ఏమైనా దొరికాయా?" అన్నాడు.

"పిల్లల ఆటవస్తువులున్నాయి. బాగున్నాయి. కొన్ని విదేశీవి అనుకుంటాను..." అన్నాడు యువకుడు.

"పెళ్ళి చేసుకుని పిల్లల్ని కన్నాక - మళ్ళీ రావాలీ ఇంటికి - అదిసరే - ఇంకేం లేవా??"

"లేవు - అన్నీ బట్టలు.... అవీ పిల్లలవి..."

"అయితే ఇది పిల్లల గది అయుంటుంది. ఆ మిగిలిన గది గడియను క్రోబార్‌తో పెకిలించు. చప్పుడు కాకూడదు. నీకిది శిక్షణ అన్నమాట... జాగ్రత్తగా పనికానీ..." అన్నాడాగంతకుడు.

"నువ్వే ఆ పని చేయకూడదూ?"

"నేను చేస్తే నువ్వెప్పుడు నేర్చుకుంటావు? ప్రయత్నించు - ఈలోగానేనా కుర్రాడిని వదుల్చుకుని వస్తాను" అన్నాడాగంతకుడు.

యువకుడు తలాడించాడు. ఆగంతకుడు డ్రాయింగ్ రూంలోకి వెళ్ళాడు. కుర్రాడు బ్రహ్మాండంగా తలూపుతూ ఆనందిస్తున్నాడు. ఆగంతకుడు వాడి భుజం తట్టి - "ఇక చాల్లే - నేను పడుకోవాలి...." అన్నాడు.

"అంకుల్ - మీకు పాటలు నచ్చవా?"

"ఏమో - అక్కయ్య తను నాలుగింటిదాకా రానని హాయిగా పడుకోమంది. నా మనసంతా నిద్రమీదే ఉంది."

"ఈ రోజు నాకు సెలవంకుల్ ... ఇక్కడే కాసేపుంటాను...."

ఆగంతకుడతడితో - "అయితే ఓ పనిచేద్దాం. దగ్గర్లో కిళ్ళీకొట్టేదైనా ఉందా?" అన్నాడు.

"ఎందుకు?"

"సిగరెట్లుంటే నాకు నిద్రకూడా అక్కర్లేదు. నా ఆరోగ్యం పాడవుతుందని అక్క సిగరెట్లు తాగద్దంటుంది. నువ్వు నాకో ప్యాకెట్ సిగరెట్లు తెచ్చిపెట్టావంటే నీతోనే కూర్చుని పాటలు వింటాను...."

"అంకుల్ - సిగరెట్లు తాగటం తప్పు. నాకు పాటలు వద్దులెండి. మీ ఆరోగ్యం కంటే పాటలు వినడం ముఖ్యం కాదు..." అన్నాడా కుర్రాడు.

"ప్లీజ్ - సిగరెట్లు తెచ్చిపెట్టు..."

"లేదంకుల్... నేను వెళ్ళిపోతున్నాను..." అంటూ తుర్రుమన్నాడాకుర్రాడు.

ఆగంతకుడు కంగారుగా యువకుడి వద్దకు వెళ్ళాడు. యువకుడప్పుడే గడియ పెకిలించాడు.

"ఇంతసేపా?" అన్నాడాగంతకుడు.

"చప్పుడు కాకుండా తీయాలన్నావు. చాలా కష్టంగా ఉంది. మొత్తం మీద సులువు తెలిసింది. ఇంకోసారైతే సులభంగా తీయగలను..."

"సరే - మనకాట్టే టైము లేదు. ఆ కుర్రాడొచ్చి మన టైం పాడుచేశాడు. మనం మరోసారి పద్ధతి మార్చాలి. తలుపు గడియ పెకిలించాక - ఒకరు లోపలకు వెడితే - ఇంకొకరు మళ్ళీ తలుపుకు గడియ అతికించి ఉంచాలి. అదెలాగో తర్వాత చర్చిద్దాం కానీ ముందు గదిలోకి పద" అన్నాడాగంతకుడు.

గదిలో రెండు మంచాలున్నాయి - దగ్గరగా జేర్చి! మంచాలు, పరుపులు, దుప్పట్లు ఖరీదైనవి.

డ్రెస్సింగ్ టేబుల్, దానిమీద పౌడర్ డబ్బా, క్రీమ్స్ ఉన్నాయి. పక్కగా ఒక లేడీస్ వాచ్ ఉంది.

వాచీ తీసుకున్నాడాగంతకుడు.

"ఇది అలారం టైంపీసుకంటే ఖరీదైనదా?" అన్నాడు యువకుడు.

"ఖరీదుకాదిక్కడ. అభిరుచి. ఇంత మంచి వాచీని తీసుకోకపోతే నా భార్యకే అవమానం..." అన్నాడాగంతకుడు.

"ఇందులో మధ్య నీ భార్యకవమానమెందుకు?"

"వాచీ చాలా బావుంది. చూసి కూడా నా భార్యకు నేనిది ప్రజంట్ చేయకపోతే ఎలా?" అన్నాడాగంతకుడు.

"ఈ గదిలో వాచీ తప్ప ఇంకేం లేవు?"

"డ్రెస్సింగ్ టేబుల్ అరల్లో నువ్వు వెతుకు, నేనేమో పరుపుల కింద చూస్తాను" అన్నాడాగంతకుడు.

ఇద్దరూ గదంతా చిందరవందర చేసేశారు.

గదిలో రెండు బీరువాలున్నాయి. రెండూ గాడ్రెజ్ బీరువాలు. ఎంత ప్రయత్నించినా వాటి తాళాలు తొలిగి రాలేదు. వాటి తాళం చెవులు వాళ్ళకు కనబడలేదు.

ఈలోగా మళ్ళీ కాలింగ్‌బెల్ మ్రోగింది. ఆ గంతకుడు పరుగున వెళ్ళాడు.

"వంటింట్లో ఏదో రిపేరుందట కదా - నేను ఎలక్ట్రీషియన్ని" అన్నాడు వచ్చిన వ్యక్తి.

"అక్కయ్య బైటకు వెళ్ళింది. మీరు మరోసారి రావడం మంచిది" అన్నాడాగంతకుడు మర్యాదగా.

ఎలక్ట్రీషియన్ వెళ్ళిపోతూ - "అయ్యగారు రేపు రమ్మనమని చెప్పారు. ఇంట్లోంచి పాటలు వినబడుతూంటేనూ - అడుగుదామని వచ్చాను" అన్నాడు.

అప్పటికి రికార్డు ఆగిపోయింది. ఎందుకైనా మంచిదని ఆగంతకుడు రికార్డు వెనక్కి తిప్పాడు.

చక్కటి సంగీతంవీనులవిందు చేస్తూంది.

ఆగంతుకుడు యువకుణ్ణి పిలిచాడు.

"మనకిక వేరే - ఏమీ దక్కవు - ఇంట్లో వెండి బంగారాలు లేవు. వచ్చినందుకు బొత్తిగా ఓ వాచీతో పోలేం. స్టీరియో ముద్దుగా బాగుంది. దీన్ని మూటకట్టేస్తాను" అన్నాడు.

"నీ ఇష్టం!" అన్నాడు యువకుడు - తన భూజానికి వ్రేలాడుతున్న సంచిలోంచీ ఓ గుడ్డ తీశాడు. ఆగంతకుడు గుడ్డను వీధి గుమ్మం దగ్గర పరిచాడు. స్టీరియో ప్లేయరు, స్పీకర్సు రెండు తెచ్చి అందులో పెట్టి మూటకట్టాడు. అతడు మూట కడుతూండగా అక్కడికో మనిషి వచ్చింది. ఆమె చూడ్డానికి పనిమనిషిలా ఉంది. ఆగంతకుణ్ణి చూస్తూనే ఆమె కొయ్యబారిపోయింది.

"దొంగ.... దొంగ.." అని అరవాలనుకుందామె. గొంతుపెగలలేదు.

ఆగంతకుడు చటుక్కున జేబులోంచి బటన్ నైఫ్ తీసి బటన్ నొక్కాడు. చాకు వెంటనే తళతళ మెరిసింది.

"వెళ్ళిపో నువ్విక్కడేమీ చూడలేదు. బైటకెళ్ళి గొడవచేసావా - నిన్ను వెతుక్కుంటూ వచ్చి మరీ చంపుతాను - ఫో!" అన్నాడతడు.

ఆ మనిషి చటుక్కున వెనక్కు తిరిగి చకచకా బైటకు వెళ్ళిపోయింది.

ఆగంతకుడు నెమ్మదిగా యువకుణ్ణి పిలిచి - "నన్ను చాలామంది చూశారు. నేను ముందు వెళ్ళిపోతున్నాను. నా వెనుకే నువ్వురా - మరోసారి ఏమైనా దొరుకుతాయేమో చూసి!" అన్నాడు.

యువకుడు తలూపి - "మరేమీ భయంలేదుగా!" అన్నాడు.

"నీకు ధైర్యం చెప్పాలనే కదా - నేను నిన్నిక్కడకు తీసుకొచ్చాను!" అన్నాడాగంతకుడు నవ్వి.

అతడు స్టీరియో మూటతో బైటకు వచ్చాడు. దాపుల్లో ఉన్న రిక్షాను పిలిచి - "సామాను లోపలపెట్టు -" అన్నాడు.

క్షణాల మీద రిక్షా అక్కణ్ణించీ వెళ్ళిపోయింది.

ఈలోగా యువకుడూ మరోసారి లోపలంతా గాలించి బైటకు వచ్చాడు. అతడికి ఇంటి గేటు దగ్గిర - బడి నుంచి వస్తున్న శారద రెండో కూతురెదురయ్యింది. యువకుణ్ణి చూసి ఆమె - "ఎవరికోసం?" అంది.

"కుళాయి రిపేరుకు వచ్చాను - అయిపోయింది..." అన్నాడతడు మామూలుగా.

అతడి భుజానికి వ్రేలాడుతున్న సంచిని చూస్తూ - "అందులో పరికరాలేమైనా ఉన్నాయేమో" అనుకుంటూ ఆమె లోపలకు వెళ్ళింది.

ఆ యువకుడు త్వరగా నాలుగడుగులు వేశాడు. అతడి కోసమున్నట్లుగా అతడి పక్కనే మోటారు సైకిలొకటి ఆగింది. యువకుడు మోటారు సైకిలు వెనక కూర్చున్నాడు.

క్షణాల మీద వాహనం తుర్రుమంది.

ఈలోగా శారద రెండోకూతురు - ఇంట్లో అడుగు పెట్టి అన్నీ చూసింది. జరిగిందేమిటో తెలుసుకునేందుకామెకి కాస్సేపట్టింది. అప్పుడామె పెద్దగా కేకపెట్టింది. ఆర్తనాదంలాంటి ఆ కేక చాలా దూరం వినపడింది.

దొంగతనాల గురించివినడమే తప్ప చూసి ఉండని ఆ చిన్నపిల్ల బాగా భయపడిపోయింది. అప్పుడందరూ పోగయారు. కబురు శారదకేకాక - వామనరావు ఆఫీసుక్కూడా చేరింది.

పోలీసు కంప్లయింటిచ్చారు. పోలీసులు వచ్చి అన్నీ గమనించి రిపోర్టు రాసుకుని - అడగవలసిన వారందరినీ ప్రశ్నలడిగి వెళ్ళిపోయారు.

డేర్ డెవిల్ రాబరీ - అని చాలామంది చెప్పుకున్నారు.

"పట్టపగలే నట్టనడివీధిలో ఇలాంటి దొంగతనమెలా జరిగిందా?" అని చాలామంది ఆశ్చర్యపడ్డారు.

## 2

కాలనీలో దొంగతనం గురించి రకరకాల చర్చలు జరిగాయి. తక్కువ నష్టంతో బయటపడ్డందుకు వామనరావదృష్టవంతుడని కొందరన్నారు. శారద పెత్తనాలకు వెళ్ళకుండా ఉండి ఉంటే దొంగతనం జరిగుండేది కాదని మరికొందరన్నారు.

ఉద్యోగాలు చేసుకునే వాళ్ళకు వందరూపాయలు పోయినా అది పెద్ద నష్టమే! అందువల్ల వామనరావు తన అదృష్టాన్ని గుర్తించలేదు. అతడు దిగులుగా ఉన్నాడు. శారద మాత్రం ఇల్లు కదలడం మానేసింది.

అయితే వాళ్ళింట్లో దొంగతనం జరిగన నాలుగు రోజులకే కృష్ణవేణింట్లో దొంగతనం జరిగింది. దొంగలు మళ్ళీ వాళ్ళే! కానీ ఈసారి - ఇంట్లో కృష్ణవేణి ఉంది. దొంగ కృష్ణవేణిని బెదిరించి ఆమె చేతికున్న బంగారు గాజులేకాక - ఇంట్లో ఉన్న విలువైన వస్తువుల ఆచూకీ ఆమెనే అడిగి తెలుసుకుని - అంతా దోచుకునిపోయాడు కృష్ణవేణి ఇంట్లో ఉండటం వల్ల నష్టం ఎక్కువైందని అంతా చెప్పుకున్నారు.

మళ్ళీ పోలీసుల్ని పిలిచారు. వాళ్ళు వచ్చి పూర్వంలా హడావిడి చేసి వెళ్ళారు.

కాలనీలో సంచలనం ప్రారంభమయింది.

"ఊళ్ళో కొత్తగా దొంగల ముఠా ఒకటి దిగింది. వాళ్ళు బీహార్నించి వచ్చారు. అన్ని భాషలూ మాట్లాడతారు. జాగ్రత్తగా ఉండండి. మేం చేయగలిగింది మేం చేస్తాం. మీరు ప్రత్యేకమైన జాగ్రత్తలు తీసుకోవడం మంచిది" అని పోలీసులు కాలనీ వారిని హెచ్చరించారు.

కృష్ణవేణింట్లో దొంగతనం జరిగిన పదిరోజులకి - దొంగలు మళ్ళీ రాధ ఇంట్లో ప్రవేశించారు. ముందు వాళ్ళు దొంగలని రాధకు తెలియదు.

ఏదో ఇంటి కోసం వాకబు చేస్తున్నట్లుగా వాళ్ళు తిరుగుతూ వచ్చి రాధ ఇంటిముందు ఆగారు. ఒకడు రాధ ఇంట్లో ప్రవేశించి మంచినీళ్ళడిగాడు. ఆమె మంచినీళ్ళు తేవడానికి లోపలకు వెడితే - ఆ సమయంలో మిగతా ఇద్దరు కూడా ఇంట్లో ప్రవేశించారు.

రాధ మంచినీళ్ళు తెచ్చేసరికక్కడ ముగ్గురి చేతుల్లోనూ కత్తులునాయి. వాళ్ళామెతో - "అరిస్తే చస్తావు..." అన్నారు.

ఎవరు మీరు?" అంది రాధ.

దొంగలం" అన్నారు వాళ్ళు.

మీరేనా మా కాలనీలో రెండు దొంగతనాలు చేశారు!" అంది రాధ భయపడకుండా.

అవును" అన్నాడు వారిలో ఆగంతకుడు గర్వంగా.

ఒకే ప్రదేశానికి మళ్ళీ మళ్ళీ వస్తున్నారు. మీకు భయంలేదూ?" అంది రాధ ఆశ్చర్యంగా.

"భయమెందుకు? దొంగతనానికి మీ కాలనీకి మించినదిలేదు. ఇళ్ళన్నీ విసిరేసినట్లు దూరం దూరంగా ఉన్నాయి. సెక్యూరిటీ బాగా తక్కువ. కాలనీ చుటూ మూడూ గేట్లున్నా - గేటు దగ్గర కాపలావాళ్ళుండరు. ఎవరయినా లోపలకు వచ్చి పోతూండవచ్చు. ఇలాంటి ప్రైవేట్ కాలనీలు అరుదుగా ఉంటాయి. అందుకే మేమీ కాలనీని ఎన్నుకున్నాం..."

"కానీ ఒక రోజున పోలీసులు మిమ్మల్ని పట్టుకుంటారు..."

"మాటలు తర్వాత... ముందు నీ వంటిమీదున్న బంగారం వలిచివ్వు..."అన్నాడాగంతకుడు.

"ఇవ్వకపోతే?" అంది రాధ.

"బలవంతంగా తీసుకుంటాం..."

"తరువాత..."

"ఇల్లంతా దోచుకుంటాం..."

"అలాగా..." అంది రాధ.

అంతే!

ఆమె మెరుపు వేగంతో కదిలింది. ఆమె చేతులు కంటికి కనబడని వేగంతో వాళ్ళ చేతుల్ని తాకాయి. ముగ్గురి చేతుల్లోని కత్తులూ ఎగిరి కిందపడ్డాయి. వాళ్ళని అందుకునేలోగా రాధ మళ్ళీ వాళ్ళను దెబ్బ తీసింది.

ముగ్గురూ నేల కూలారు.

"ఇక మీ ఆట కట్టు...." అంది రాధ.

ముగురూ ఆమె వంక అసహాయంగా చూశారు.

"కాలేజీ రోజుల్లో నేర్చుకున్న కరాటే ఇలా పనికొచ్చింది..." అంది రాధ గర్వంగా.

"మమ్మల్ని వదిలిపెట్టు. నీ పేరు చెప్పుకుంటాం!" అన్నారు వాళ్ళు.

"మిమ్మల్ని పోలీసులకి వదిలిపెడతాను. ఇంతవరకూ మీరు తీసుకుని వెళ్ళినవన్నీ వాళ్ళు మీ చేత కక్కిస్తారు..." అంది రాధ.

తర్వాత ఆమె చుటుపక్కలవాళ్ళను పిలిచింది.

దొంగలు పట్టుబడ్డారు. పోలీసులు పిలవబడ్డారు.

అప్పుడు కాలనీలో శారదకు, కృష్ణవేణికి - ఇంకా ఇతరులకు పిలుపులు వెళ్ళాయి.

శారద పనిమనిషి రెండో కూతురు, ఓ కుర్రాడు, ఎలక్ట్రీషియను, మరో పనిమనిషి, కృష్ణవేణి వగైరాలందరూ దొంగల్ని గుర్తుపట్టారు.

"ఇక్కడే నాలుగుతన్ని దొంగలచేత నిజం కక్కించండి..." అన్నారందరూ.

పోలీసు కానిస్టేబులొకడు లాఠీ ఎత్తాడు.

"మమ్మల్ని కొట్టకు..." అన్నాడాగంతకుడు.

"అయితే తీసుకున్న వస్తువులన్నీ ఎక్కడున్నాయో చెప్పు" అన్నాడు పోలీసు కానిస్టేబుల్.

ఆగంతకుడతని పక్కనే ఉన్న ఇన్‌స్పెక్టర్ వంక చూసి - "ఇన్‌స్పెక్టర్ గారూ! మీరు మీవాడికి చెప్పండి మమ్మల్ని కొట్టవద్దని.." అన్నాడు.

"ఏమిటీ - మమ్మల్నే శాసిస్తున్నావు..." అన్నాడు ఇన్‌స్పెక్టర్. అతడు కానిస్టేబుల్ వంకచూస్తూ - "నాలుగు తగిలించు. చూస్తూ ఊరుకుంటావేం?" అన్నాడు.

"ఆగండి" అన్నాడాగంతకుడు. అతడు తమ చుట్టూ మూగిన కాలనీ జనాన్ని చూసి -

"అయ్యలారా - మాదీ ఊరు కాదు: దూర ప్రాంతాలనుండి వచ్చాం. రాగానే రివాజు ప్రకారం పోలీసుల్ని కలుసుకున్నాం. మేం మొత్తం తొమ్మండుగురం. మూడు జట్లుగా విడిపోయాం. ఊళ్ళో సెక్యూరిటీ తక్కువగా ఉన్న మూడు ప్రాంతాలనీ పోలీసులే మాకు చెప్పారు. మూడు జట్లకూ మూడు ప్రాంతాలమ్మేశారు. మేమీ ప్రాంతాన్ని పదివేలరూపాయలకు కొన్నాం. పెట్టుబడికి నాలుగింతలేనా లాభం లేకపోతే ప్రాణాలకు తెగించిన మాబోటి వాళ్ళకేం కిడుతుంది? ఈ కాలనీకి రెండు మూడుసార్లేనా రావలసింది.

దొంగతనం చేయడం మా తప్పుకాదు. పట్టుబడటమే మేము చేసిన తప్పు. అయితే ఫలానా ఇంట్లో కరాటే తెలిసిన ఆడమనిషి ఉంటుందని హెచరించక పోవటం ఈ పోలీసుల తప్పు. వాళ్ళ తప్పుకి మేమెందుకు శిక్షింపబడాలి?..." అన్నాడు.

ఇది విని అంతా తెల్లబోయారు.

"దొంగ మనల్ని తప్పుదారి పట్టిస్తున్నాడు. పోలీసుల మీద నింద వేస్తున్నాడు. నాలుగు తగిలించరా..." అన్నాడిన్స్పెక్టర్ కానిస్టేబులుతో.

"నేను చెబుతున్నది నిజం. అందుకు ఋజువులున్నాయి. మేము దొంగలం. ప్రజల్ని మోసం చేసి బ్రతుకుతున్నాం. కానీ ఈ పోలీసులు ఇటు ప్రజల్నీ అటు దొంగల్నీ కూడా మోసం చేస్తున్నారు...." అంటూండగా ఆగంతకుడి వంటి మీద దెబ్బ పడింది.

ఆగంతకుడి కళ్ళెర్రబడ్డాయి. "నా డబ్బుతో రెండు కోళ్ళు తినుంటావు. దెబ్బ బలంగా వేస్తున్నావు" అన్నాడతడు.

"నువ్వు చెప్పేది నిజమే అనుకుందాం. అలాంటప్పుడు నీ కథ దొంగలందరకూ గుణపాఠమవుతుంది. పోలీసుల మీద దొంగతనానికాధారపడ్డం నువ్వు చేసిన తప్పు..." అన్నాడిన్స్పెక్టరు.

"నా కున్నది మొండిధైర్యమొక్కటే. రకరకాల యుద్ధ విద్యల్లో నన్ను ప్రవీణుణ్ణి చేయాలని ప్రయత్నించి విఫలుడయ్యాడు నాన్న. నేను మా కుటుంబంలో ఎందుకూ పనికిరానివాణ్ణి. దొంగల్లో క్లాస్ ఫోర్ అంటే నాలుగో తరగతివాణ్ణి. అందుకే పోలీసుల సాయం తీసుకున్నాను. వాళ్ళ సాయం, ధైర్యం లేకపోతే నేను దొంగతనాలెలా చేయగలను?

"ఇదుగో - పోలీసులూ! మీరు మీ గుండెల మీద చేయి వేసుకుని చెప్పండి. లేకుంటే నా శాపం మిమ్మల్నీ మీ పిల్లల్నీ కుటుంబాన్నీ కొడుతుంది. మేమిప్పుడిక్కణ్ణించి పారిపోతాం - కృతజ్ఞతా బంధం మిమ్మల్ని కట్టేస్తుంది. మీరు మా జోలికి రారు..." అంటూ ఆగంతకుడక్కడినుంచీ ఉన్నట్టుండీ పరుగు పెట్టాడు. మిగతా ఇద్దరూ అతణ్ణనుసరించారు. అక్కడున్న జనం తేరుకునేలోగా వాళ్ళు ముగ్గురూ సమీపంలోని ఆటో ఎక్కారు.

"పట్టుకోండి...పట్టుకోండి...." అన్నారు జనం.

"పట్టుకోండి... పట్టుకోండి..... అన్నారు పోలీసులు.

దొంగలు పట్టుబడలేదు. అందుక్కారణం పోలీసులు కృతజ్ఞతాబంధానికి కట్టుబడిపోవడమా అన్నది కాలనీలో ఇప్పుడు చర్చాంశమయింది. కాస్త కరాటే తెలిసిన ఆడదాన్ని కూడా ఎదుర్కోలేని బలహీనులు మొండి ధైర్యంతో డేర్‌డెవిల్ రాబరీకి పూనుకున్నారంటే - అందుకు పోలీసుల మద్ధతుండి ఉండాలనే చాలామంది నిర్ణయించారు. అందులో తప్పుండవచ్చు. కానీ అలాంటి దొంగల నరికట్టలేని పోలీసులే తరగతికి చెందుతారు?

## నిజం చెప్పే యంత్రం

"సుమా! ఈ వాచీ నీ కోసం తెచ్చాను. బాగుందా?" అన్నాడు భార్గవ.

సుమలత వాచీవంక చూస్తూ - "నీ ఛాయస్‌కు తిరుగు లేదు. చాలా చాలా థాంక్స్" అంటూ వాచీ అందుకుని తన ఎడమ చేతికి ధరించింది. ఆ వాచీ ఆమె చేతికి నగకంటే అద్భుతంగా అమిరింది.

"మరి నన్నూ నా స్నేహితుణ్ణీ కూర్చోమనవూ?" అన్నాడు భార్గవ.

"అయ్యో! అయాం వెరీ సారీ... నేను ప్రతి విషయానికి ఇట్టే ఎక్సయిటైపోయి కర్టెసీ మర్చిపోతుంటాను..." అని వాళ్ళిద్దరికీ సోఫా చూపించింది సుమలత.

కూర్చునేముందు "ఇతడు క్లాస్‌మేటు. పేరు సునీల్. వృత్తి పోలీస్ ఇన్‌స్పెక్టర్. ఏడాది క్రితం పెళ్ళయింది. ఇక్కడికొచ్చి నెల్లాళ్ళయింది" అన్నాడు భార్గవ.

ముగ్గురూ తలో సోఫాలో కూర్చున్నాక - "సుమా! ఇప్పుడు నేను పెళ్ళికి సిద్ధం. ఇక నీ విషయం చెప్పు..." అన్నాడు భార్గవ మళ్ళీ.

సుమలత నవ్వి "నిజం చెప్పాలంటే నాకు నువ్వంటే అంతిష్టంలేదు నీ పెర్సనాలిటీ నాకు నచ్చలేదు. ఎంత సేపూ ప్రయోగాలంటూ కూర్చుంటావు తప్ప అచ్చటా ముచ్చటా తెలియదు. ఆడపిల్లతో ఎలా మాట్లాడాలో కూడా తెలియదు నీకు. నీతో టాపిక్సెంత బోరింగుగా ఉంటాయో చెప్పలేను" అంది.

భార్గవ దెబ్బతిని "ఇన్నాళ్ళూ ఈ విషయమెందుకు చెప్పలేదు? నువ్వు నా అందాన్నీ, తెలివినీ సంభాషణా చాతుర్యాన్నీ పొగుడుతూంటే అంతా నిజమనుకున్నాను." అన్నాడు.

"అదంతా కర్టెసీ. నాకు భీమారావంటే ఎంతో ఇష్టం. సినిమా హీరోలా డైలాగ్స్ చెబుతాడు. అతడినడకలో, పెర్సనాలిటీలో, అభిరుచిలో అన్నీ ప్రత్యేకతతే... నేను భీమారావుని పెళ్ళిచేసుకుంటానని డాడీకి చెప్పాను. ఆయనకి భీమారావంటే సదభిప్రాయం లేదు. భీమారావు బార్లలోపడి తాగుతాట్ట. నైట్ క్లబ్బుల్లో తిరుగుతాట్ట. అయితేనేం - అదంతా మోడ్రన్ స్టైల్ అని డాడీకి చెప్పాను. ఆయన వినలేదు. ఆయనకు నువ్వే నచ్చావు. నిన్ను పెళ్ళి చేసుకుంటే సమాజంలో గౌరవం, హోదా, సుఖజీవితం లభిస్తాయంటారాయన. నాకు ఛార్మింగ్ లైఫ్ కావాలి. నీ దగ్గరడెక్కడుంది? ఈ పొరపాటంతోనే రెండేళ్ళు గడిచాయి..."



"అంటే నువ్వు నా కోసం ఆగలేదన్నమాట. నా ప్రయోగమొకటి పూర్తయ్యేదాకా మనం ఆగాలని నేనంటే అవునన్నావు. ఆగుతానన్నావు..."

"అది మర్యాద... నాకు నీ ప్రయోగాల మీద ఆసక్తి లేదు..." అని "అయినా అందమైన ఆడపిల్ల పక్కనుంటే సైంటిఫిక్ ఎక్స్‌పెరిమెంట్సు గురించి మాట్లాడాలని నీకెవరు చెప్పారు?" అంది సుమలత.

"అయితే నువ్వు భీమారావుని పెళ్ళి చేసుకుంటావా?"

"లేదు. నాకా అదృష్టం లేదు. నా పోరు పడలేక డాడీ భీమారావుని కదిపారు. అతడికి లక్షరూపాయలు కట్నం కావాలిట....."

"అయితే ఇప్పుడు నీ నిర్ణయమేమిటి?"

"నేను నిన్నే పెళ్ళి చేసుకుంటానని డాడీ దగ్గర ఒప్పుకున్నాను. ఆయన నాకోసం ఏ త్యాగమైనా చేసి లక్షరూపాయలు తెస్తే సంతోషించేదాన్ని. ఆయనా ఉద్దేశ్యంలో లేరు. ఏ కట్నమూ తీసుకోకుండా పెళ్ళి చేసుకుంటానన్న నువ్వు నాకు నచ్చినందుకు పదేపదే బాధపడుతూంటే చివరకు విధిలేక ఒప్పుకున్నాను."

భార్గవ నిరుత్సాహంగా "మీ నాన్న లక్షరూపాయల కట్నం తేలేకపోవచ్చు. కానీ పాతిక వేలలో నీకు నచ్చే మరో సంబంధం తేలకపోడు. నన్నే చేసుకుంటానని ఎందుకు చెప్పావ్?" అన్నాడు.

"నాకు నచ్చినవాణ్ణెలాగూ పెళ్ళిచేసుకోలేను. అలాంటప్పుడు నేను నచ్చానన్న నిన్ను పెళ్ళి చేసుకుంటే జీవితంలో కొంత

సుఖపడవచ్చుగదా! అమ్మకూడా నా కదే చెప్పింది - నువ్వు కంపెనీకి బోర్ అని ఆమె కూడా ఒప్పుకుని - నువ్వంటే ఇష్టం కదా, పెళ్ళయ్యాక నీకోసం మారకపోడులే అని ఆశపెట్టింది..."

"సరే - ఈ నిజం తెలిశాక నేను నిన్ను పెళ్ళాడతాననుకుంటున్నావా?"

"అది నీ ఇష్టం. కానీ పెళ్ళికిముందు ఒకరినొకరు అర్థం చేసుకుని - ఒకరి గురించిన నిజాలొకరు తెలుసుకోవడం అవసరం. నేను నీతికి, పవిత్రతకు. సంప్రదాయానికి విలువనిచ్చే మనిషిని. మోడ్రన్ లైఫ్ నా కిష్టం కావచ్చు. కానీ అది నన్ను మన సంప్రదాయంలోని ముఖ్యాంశాలకు దూరం చేయదు... మన దేశంలో నూటికి తొంభై తొమ్మిది మంది ఆడవాళ్ళు భర్తల ఎన్నికలో సరిపెట్టుకోక తప్పడం లేదు. అయినా కుటుంబాలు ఒడిదుడుకులు లేకుండా నడిచిపోతున్నాయి. మన సమాజంలో ఆడదానికి మగడు నచ్చినా నచ్చకపోయినా మగాడికి భార్య నచ్చితే చాలు - సంసారం పచ్చగా ఉంటుంది. నా విషయంలోనూ అంతే!"

భార్గవ తోటకూర కాడలా వ్రేళ్ళాడిపోయాడు. సుమలత ఆశ్చర్యపడి "అదేంటలాగైపోయావ్?" అంది.

"వాడు కాఫీగత ప్రాణి. బయల్దేరే ముందు మా ఇంట్లో కాఫీ తాగుదాంరా అంటే వినలేదు..." అన్నా సునీల్.

"అయ్యో! ఆ విషయమే మర్చిపోయాను. ఇంట్లో ఎవ్వరూ లేరు. ఒక్కక్షణం కూర్చోండి. నేను కాఫీ కలిపి తెస్తాను. నిజం చెబుతున్నాను. మర్యాదకు వెడుతున్నాను తప్పితే - కాఫీ తాగడంలో ఉన్న ఆసక్తి నాకు కలపడంలో లేదు.." అంటూ లోపలకు వెళ్ళింది సుమలత.

## 2

"ఎలా ఉంది నా వాచీ మహిమ?" అన్నాడు భార్గవ.

"సుమలత నీ గురించి చెప్పినవన్నీ నిజాలే! ఆమె నీ గురించిన నిజాలు చెబుతూంటే నువ్వు డల్‌గా అయి పోవడం కూడా నేను గమనించాను. అంతమాత్రాన మీరిద్దరూ కలిసి నాటకమాడ్డంలేదని నమ్మలేను? " అన్నాడు సునీల్.

"అంటే?"

"వివరించి చెప్పక్కర్లేదు. ఆలోచించు, నీకే అర్థమవుతుంది?"

ఆలోచించకుండానే అర్థమయింది భార్గవకు.

"ఛా - నేను నిన్ను మోసం చేయడం వల్ల నాకేం ప్రయోగం? సత్ఫలితాల నిచ్చిందన్న రుజువు నా కెంతో ముఖ్యం..." అన్నాడు భార్గవ.

సునీల్ నవ్వాడు - "డియర్ భార్గవా! మనిషి తన అపజయాన్ని కూడా జయముగా భ్రమించి నవ్వాలనుకుంటాడు. ప్రతిమనిషీ జయాన్ని కోరుకుంటాడు. అపజయాన్ని భరించలేడు. తను భ్రమను నమ్మాలనుకుంటున్నాడన్న విశేషం తెలిసికూడా అందులో నాలాంటి మూడో వ్యక్తినిరికించి నమ్మించి అతడి నమ్మకంతో తన నమ్మకం బలాన్ని పెంచుకోవాలనుకునే బలహీనత కొందరికుంటుంది. నువ్వలాంటివాడివి..."

"అంటే - నేను నమ్మని విశేషాన్ని నీ చేత నమ్మించి నీ నమ్మకం కారణంగా నేనూ నమ్మాలనుకుంటున్నానని నీ అనుమానం. ఈ అనుమానం నా శ్రమను, నా ప్రయోగ ఫలితాలను వెక్కిరిస్తోంది. నేను ఫిజిక్స్‌లో నైపుణ్యం సంపాదించాను. ఎలక్ట్రానిక్స్‌లో నైపుణ్యం సంపాదించాను. అటుపైన మానవశరీరాన్నర్థం చేసుకునేందుకు నలుగురు డాక్టర్లతో రాత్రంబవళ్ళు చర్చలు జరిపాను. మనిషి మెదడెప్పుడేయే అవస్థలకు గురవుతుందో క్షుణ్ణంగా తెలుసుకున్నాను. ఆపైన ఎన్నో పుస్తకాలు చదివాను. అటు వైద్యశాస్త్రాన్నీ, ఇటు మానవ మనస్తత్వాన్ని అర్థం చేసుకునేందుకు కృషి చేసి చేసి - ఇన్నాళ్ళకు మనిషి చేత నిజాన్ని పలికించే యంత్రాన్ని కనిపెట్టాను. కృత్రిమంగా ఓ కంప్యూటర్ మెదడును సృష్టించి దానిపై నా యంత్ర ప్రభావాన్ని పరీక్షించాను. అన్నివిధాలా రూఢీ చేసుకున్నాక నా యంత్రాన్ని తొలిసారిగా

మనిషిపై ప్రయోగించడానికి నిన్ను సాక్షిగా ఎన్నుకున్నాను..."

"నన్నే సాక్షిగా ఎందుకెన్నుకున్నావు?"

"ఇది నీ డిపార్ట్‌మెంట్ కెక్కువగా ఉపయోగపడుతుంది నిత్యజీవితం సాఫీగా కొనసాగిపోవడానికెన్నో అబద్ధాలు చెబుతాడు. ఆ అబద్ధాల వెనుక నిజం తెలుసుకోవడం వల్ల ఎవరికీ సుఖసంతోషాలుండవు. నాకు సంబంధించి సుమలత ఒక అందమైన అబద్ధం. ఆమెను నేను ప్రేమించాను. ఆమె నన్ను నమ్మించింది తనూ ప్రేమిస్తున్నట్లుగా! నా యంత్రం ఆ అబద్ధాన్ని బయటపెట్టించింది. ఇప్పుడు నా కెంతో బాధగా ఉంది. సుమలతకు నా మీదుండే అసలభిప్రాయం తెలిసిపోయాక ఆమెను నేను నా భార్యగా స్వీకరించలేను. నేనంటే ఇష్టమని చెప్పే మరో అమ్మాయిని చూసుకుని పెళ్ళి చేసుకుంటాను. పొరపాటున కూడా ఆమెపై నేను తయారు చేసిన యంత్రాన్ని ప్రయోగించను... ఈ యంత్రం కేవలం మీ డిపార్టుమెంటు ప్రయోజనానికే! నీ కెందరో నేరస్తులు తటస్థపడుతుంటారు. వారిచేత నిజం కక్కించడానికి మీరు పడే అవస్థ వర్ణనాతీతం ఒకోసారి మీ చేతుల్లో నిర్దోషులు చిత్రహింసలనుభవిస్తారు. ఇలాంటివన్నీ ఆపాలనే నేనీ యంత్రం తయారుచేశాను. దీని ప్రభావం నీకే ఋజువు చేసి చూపాలనుకున్నాను..."

ఇన్‌స్పెక్టర్ సునీల్ సాలోచనగా - "నువ్వు చెప్పింది బాగానే ఉంది. నేను నీ మాటలు నమ్ముతాను. కానీ నీ స్నేహితురాలు సుమలత నిజంగా నిజం చెప్పిందని నమ్మకమేమిటి? ఆమె సరదాగా నా ముందు నిన్ను వేళాకోళం పట్టించిందేమో!" అన్నాడు.

"సుమలత తత్వం అలాంటిది కాదు. ఆమె చురుకైనది. కానీ ఎట్టి పరిస్థితుల్లోనూ ఎదుటివారిని నొప్పించదు. ఒకరి గురించి పొల్లుమాట చెప్పదు. జోక్స్ ఎంజాయ్ చేస్తుంది. తనూ జోక్సు చెబుతుంది. కానీ ఎప్పుడూ ఎదుటివాళ్ళమీద జోక్స్ వేయదు..." అన్నాడు భార్గవ

"అయితే ఆమె ఇక ఎల్లకాలమూ నిజం చెబుతూనే ఉంటుందంటావా?" అన్నాడు సునీల్ ఆశ్చర్యంగా.

"లేదు. నేనామె కిచ్చినది మామూలు వాచీ. ఆ వాచీని నేను తయారు చేసిన యంత్రంలో రేడియేషన్ ట్రీట్‌మెంటిచ్చాను. ఫలితంగా ఆ వాచీ శరీరంపై మాత్రమే ప్రభావం చూపగల అయస్కాంత శక్తిని పొందింది. అది ఎవరు ధరించినా - దాని ప్రభావం సుమారు అరగంట సేపు మాత్రం ఉంటుంది. ఆ వాచీనుండి వెలువడే అయస్కాంత తరంగాలు ధరించిన మనిషి నాడీమండలంపై నిజం చెప్పే ప్రభావాన్ని చూపిస్తాయి...."

"సరే - కొందరు మనుషులు తమ మెదడును. తద్వారా నాడీమండలాన్ని అదుపుచేయగలుగుతారు. వారిమీద నీ యంత్రం ప్రభావముంటుందా!"

భార్గవ నవ్వి - "ఎంతటి బలమైన వ్యక్తిత్వాన్నైనా నా యంత్రం లోబర్చుకోగలదు. తర్వాత దీనిలో మరో విశేషముంది. ఉదాహరణకు సుమలత విషయం తెలుసుకో. ఆమె వ్యక్తిత్వం సామాన్యమైంది కాదు. ఎన్నో విశేషాలను తనలోనే గుంభనగా దాచుకోగల శక్తి ఉందామెకు. కానీ నా యంత్రశక్తి ఆమెను లోబర్చుకుంది. అప్పుడామెకు తనేం మాట్లాడుతున్నదీ తెలియదు. అయస్కాంతశక్తి నశించగానే ఆమె మామూలు మనిషైపోతుంది. తను చెప్పిన నిజాల గురించి ఆమెకు తెలియదు. ఒక విధంగా ఇది హిప్నోటిజం వంటిది..."

"అయితే కొన్ని నిజాల బయటపడటానికి అరగంట వ్యవధి చాలదు. అలాంటప్పుడేం చేయాలి?" అన్నాడు సునీల్.

"అది నేను నా వద్దనున్న యంత్రంలో ఇచ్చే ట్రీట్‌మెంటును బట్టి ఉంటుంది. రిస్టువాచీలు, హారాలు వగైరా మనిషి ధరించే యంత్రాలు గానీ, ఆభరణాలు గానీ - నా యంత్రంద్వారా అయస్కాంత శక్తిని పొందగలవు. నే నిచ్చిన ట్రీట్‌మెంట్‌ను బట్టీ అవి పనిచేసే వ్యవధి నిర్ణయించబడుతుంది. ప్రస్తుతం నేను పదిహేను నిమిషాల నుంచి పన్నెండూ గంటల వరకూ వ్యవధి నిర్ణయం చేయగలను..." అన్నాడు భార్గవ.

"ఇంట్రెస్టింగ్‌గా ఉంది. ఈ యంత్రాన్ని నేను తప్పక ఉపయోగిస్తాను. రేపటికి నీకోసం నాలుగు గొలుసులు, మూడు వాచీలు తెస్తాను.." అన్నాడు సునీల్.

"థాంక్యూ -" అన్నాడు భార్గవ.

## 3

మొత్తం ఏడుగురి ఖైదీల వాఙ్మూలాలు తీసుకోబడ్డాయి.

మొదటి ఖైదీ ఓ కాలేజీ కుర్రాణ్ణి హత్య చేశాడు.. తనను ఎమ్మెల్యే రాఘవులు పురమాయించాడనీ ఆయన కూతురు ఆ కాలేజీ కుర్రాణ్ణి ప్రేమించడంవల్ల హత్య తప్పనిసరి అయిందనీ ఆ ఖైదీ చెప్పాడు. అంతవరకూ హత్య తను చేశాననే ఒప్పుకోవడం లేదా ఖైదీ.

రెండో ఖైదీ లేబర్ కాలనీలో రెండిళ్ళకు నిప్పంటించాడు. మునిసిపల్ ఛెయిర్మన్ బంగార్రాజు ఎన్నికల కక్షతో అతడి చేత ఆ పని చేయించాడు.

మూడవ ఖైదీ స్మగ్లింగ్ ఆపరేషన్‌లో రెండు లక్షల వాటా డీయస్పీకుందనీ ఆ ఖైదీ చెప్పాడు.

ఒకరు కాదు .... ఇద్దరు కాదు.. మొత్తం ఏడుగురు ఖైదీలు... పోలీసులకు కొరకరాని కొయ్యలై ఉన్నవాళ్ళు - ఉన్నట్లుండి తమ నేరాలొప్పుకుని ఊళ్ళోని రాష్ట్రంలోని దేశంలోని - ప్రముఖుల నందులో ఇరికించారు.

ఇన్‌స్పెక్టర్ సునీల్ ఆ స్టేట్‌మెంట్ల వంక భయంగా, దిగులుగా చూశాడు. కేసులన్నీ మంచులా, పువ్వులా విడిపోయాయి. కానీ ఇప్పుడు ముందుకు వెళ్ళేదెలా?

బాగా ఆలోచించి అతడు డియస్పీని కలుసుకుని జరిగింది చెప్పాడు.

డీయస్పీ ఉలిక్కిపడి - "ఇన్నాళ్ళూ నోరు విప్పని ఆ ఖైదీలొక్కసారి ఎలా నోళ్ళు విప్పారు? ఇందులో ఏదో పెద్ద కుట్ర ఉంది. డిపార్ట్‌మెంట్లో నా మీదనే పెద్ద కుట్ర జరుగుతోందని విన్నాను. సిన్సియారిటీకి ఈరోజుల్లో గౌరవం లేదు. రిటర్న్లు లేవు. నువ్వు కూడా నా మీద కుట్ర చేస్తున్న వాళ్ళలో లేవుకదా!" అన్నాడు.

"సర్ - మీమీద కుట్ర చేసేవాడినైతే ఈ విషయం ముందు మీకే ఎందుకు చెబుతాను?" అన్నాడు సునీల్.

"గుడ్ - నిజమే చెప్పావు. ఖైదీలిచ్చిన ఈ స్టేట్‌మెంట్స్ గురించి మన డిపార్ట్‌మెంట్లో ఎవరెవరికి తెలుసు?" అన్నాడు డీయస్పీ.

"నేను. రైటరు రామనాథం - అంతే సర్?"

"గుడ్ - రామనాథం ఈ విషయం నలుగురికీ చెబుతాడా?"

"లేదు సర్! నిజానిజాలు తేలేవరకూ ఈ విషయం మా ఇద్దరి మధ్యనే ఉండిపోవాలనుకున్నాం...."

"వెరీగుడ్! అయాం హాపీ...''" అన్నాడు డీయస్పీ.

"ఇప్పుడెం చెయ్యాలి సర్?" అన్నాడు సునీల్.

"ముందు నా ప్రశ్నకు సమాధానం చెప్పు. ఒక్కసారిగా ఏడుగురు మొండి ఖైదీలు నోళ్ళెలా విప్పారు?" అన్నాడు డీయస్పీ.

సునీల్ ముందు తటపాయించినా తర్వాత భార్గవ తయారు చేసిన యంత్రం గురించి చెప్పేశాడు.

"హు ఈజ్ దిస్ భార్గవ? సీఐఏ ఏజంటు కాదుగదా!" అన్నాడు డీయస్పీ.

"కాదు సర్ - అతనివన్నీ కమ్యూనిస్టు భావాలు..."

"అయితే కేజీబీ ఏజంటేమో?"

"ఏమో - చైనీస్ ఏజంటేమో ఎవరు చూడొచ్చారు? లేకుంటే పాకిస్తాన్ ఏజంటు కూడా కావచ్చు..."

"సర్ - భార్గవను నేను చిన్నప్పటినుంచీ ఎరుగుదును. అతగాడు అసలు సిసలు సైంటిస్టు..." అన్నాడు సునీల్.

"నీకు తెలుసో తెలియదో - బ్రిటిష్ ఇంటెలిజెన్స్ శాఖ అధిపతిగా కేజీబీ ఏజంటుంటే - ఇంగ్లండ్ ప్రభుత్వానికా విషయం తెలుసుకుందుకు కొన్నేళ్ళు పట్టింది. ఏజంట్ల సామర్థ్యాలు మన ఊహలకందవు. ముందు నా ప్రశ్నలకు సమాధానం చెప్పు. భార్గవ ఫైనాన్షియల్ పొజిషన్ ఏమిటి?"

"అతడికి స్వంతంగా ఒక ప్రయివేట్ టెస్టింగ్ లేబరేటరీ ఉంది. దానిమీద సాలుకు పదిలక్షలకు పైగా ఆదాయం వస్తుందతడికి. అయితే అతడా డబ్బునంతా ప్రయోగాల గురించే వెచ్చిస్తాడు..."

"అంతా ట్రాష్.. బ్యాంకులో అతడి పేర్న డబ్బెంతుంది?"

"రెండు లక్షలు..."

డీయస్పీ ఉలికిపడి - "డూయూగెటిట్... టెస్టింగ్ లాబరేటరీ మీద వచ్చే ఆదాయమంతా - దానిమీదే ఖర్చు పెట్టేస్తే అతడికి బ్యాంకులో రెండు లక్షలెక్కడిది?" అన్నాడు.

"సర్ - చదువుకాగానే తండ్రి అయిదు లక్షలిచ్చాడతడికి. టెస్టింగ్ లాబరెటరీమీద వచ్చే ఆదాయంతో కొంత అతడు తండ్రికి వడ్డీతో సహా తీర్చేస్తున్నాడు. ఆ విధంగా తండ్రి బాకీ ఇప్పటికి అయిదింట నాలుగొంతులు తీరిపోయింది. అవసరానికని బ్యాంకులో వేరే డబ్బు వేస్తున్నాడు. అదే రెండూ లక్షలైంది..."

"నువ్వు చెప్పేదేది నాకు కన్విన్సింగ్‌గా లేదు. ముందుగా లెటజ్ ఇన్వెస్టిగేట్ హిజ్ కేస్..."

"సర్ - నా మాట వినండి. భార్గవ కేసుని ఇన్వెస్టిగేట్ చేయడంవల్ల మనకేం ప్రయోజనముండదు. అతడిపై ఎలాంటి నేరాలు లేవు. పైగా అతడిగురించి నాకు బాగా తెలుసు..." అన్నాడు సునీల్.

"అయితే ఇప్పుడేం చేద్దామంటావ్?"

ఈ ఏడు కేసుల్లో ముందుగా ఒకటి ఇన్వెస్టిగేట్ చేద్దాం..."

డీయస్పీ కోపంగా - "అయితే నువ్వు నన్నే అనుమానిస్తున్నావా" అన్నాడు.

"లేదుసార్ - మీరు నా మాట వింటే అన్నీ అర్థమవుతాయి....."

"ముందా భార్గవ కనిపెట్టిన విశేషం హంబగ్ అని చెప్పు. అప్పుడే నీ మాట వింటాను...."

"భార్గవ యంత్రం హంబగ్  కాదుసర్.... అందుకు సాక్ష్యాలున్నాయి..."

"అంటే.... అంటే.. నేను స్మగ్లింగ్ ఆపరేషన్లో రెండు లక్షలు పుచ్చుకున్నానంటావా?"

"లేదు సర్...."

సునీల్ ఇంకా ఏదో అనబోతుండగా - "రెండూ ఎలా నిజమవుతాయి? నీకు బుర్ర పనిచేస్తోందా?" అన్నాడు డీయస్పీ.

"మీరు నా మాట వింటే అన్నీ తెలుస్తాయి సర్..."

"ఊఁచెప్పు..." అన్నాడు డీయస్పీ అయిష్టంగా.

"డ్యూటీలో మీరు చూపే శ్రద్ధ అసామాన్యం సర్. మిమ్మల్ని చూసి చాలామంది అసూయపడుతున్నారు. అందుకే మీకు చెడ్డపేరు తేవాలని పెద్ద ఎత్తున కుట్ర జరుగుతోంది. ఆ కుట్రలో భాగమే ఇది! మన డిపార్ట్‌మెంట్లోనే ఎవరో మీ పేరును దుర్వినియోగం చేసుకుంటున్నారు సర్! ఆ ఖైదీని ఎవరో మీగురించి బాగా నమ్మించారు. ఖైదీ నిజమే చెప్పాడు సర్... కానీ తనకు తెలిసిన నిజం మాత్రమే చెప్పాడు..."

"నాకేం అర్థం కాలేదు. అంతా తికమకగా ఉంది..."

"యంత్రం ఖైదీచేత అతడికి తెలియని నిజాన్ని చెప్పించలేదు సర్.... అతడి మనసులో ఏదైతే నిజమనుకుంటాడో ఆ నిజాన్ని

వెలికితీస్తుంది. అదే అసలు నిజం కావాలనిలేదు..........''

''అలాంటప్పుడు మనకా యంత్రం వల్ల ప్రయోజనమేమిటి?''

''ఉంది సర్! ఆ ఖైదీలో అలాంటి భావం ఎవరు ప్రవేశపెట్టారో తెలుసుకోవాలి. అప్పుడు మీమీద కుట్ర పన్నుతున్న దెవరో తెలిసిపోతుంది.''

''అయితే ఏమటావ్?''

''ఈ ఏడుకేసుల్లో మీ కేసునే శాంపిల్‌గా తీసుకుని నేను ఇన్వెస్టిగేట్ చేస్తాను సర్... మీ అనుమతి కావాలి.''

''వద్దు...'' అన్నాడు డీయస్పీ కంగారుగా.

''ఏమయింది సర్...'' వినయంగా అడిగాడు సునీల్.

డీయస్పీ మాట్లాడేందుకు ఆలోచించవలసి వచ్చింది. ఆలోచించాక ఆయన - ''చూడు సునీల్! నా మీద డిపార్ట్‌మెంట్లో కుట్ర జరుగుతోంది. అది ఈనాటి మాట కాదు. అప్పుడే మూడేళ్ళ నుంచీ ప్రారంభమయింది. అయినా కూడా ఆ కుట్రదారుడెవడో నేను తెలుసుకోలేక పోతున్నాను అదీ డియస్పీగా ఉండీ! అంటే ఆ కుట్రదారుడు సామాన్యుడూ కాడు. అతడి తెలివితేటలు అద్భుతం, అసామాన్యం...''

''శత్రువును దెబ్బతీయాలంటే ముందు శత్రువు గొప్పతనాన్ని గుర్తించాలి. ఈ ప్రాథమిక సూత్రం నీకు తెలియదా?'' గద్దించాడు.

''అయితే ఏమంటారు సర్!''

''ఆ శత్రువు నీ ఇన్వెస్టిగేషన్‌లో బయట పడకపోవచ్చు. ఆ ఖైదీని నమ్మించినట్లే నిన్నూ నమ్మించవచ్చు. అప్పుడేం చేస్తావు?''

''నా ఇన్వెస్టిగేషన్ మీద నాకు నమ్మకం ఉంది సర్...''

''కానీ నాకు నమ్మకం లేదు...''

''మీకు నమ్మకం అలిగించడానికి నేనేం చేయను సర్....''

''ఈ ఏడు కేసుల్లోనూ సెంట్రల్ మినిస్టర్ని ఇన్వాల్ చేసే కేసొకటుందిగా. అది పట్టుకో. ఓ పట్టు పట్టు...''

''అది కష్టం సార్...''

''కొడితే ఏనుగు కుంభస్థలాన్నే పట్టాలి. నీ దృష్టి ఎప్పుడూ నా వంటి చిన్నవాళ్ళ మీదే ఉంటుంది.''

''అలాగనకండి సార్... మీరు నాకంటే వయసులో అధికారంలో హోదాలో, ఆదర్శంలో పెద్దవారు...'' అన్నాడు సునీల్.

''అయితే నా మాట విను.... వెళ్ళు....'' అన్నాడు డియస్పీ.

## 4

ఇన్‌స్పెక్టర్ సునీల్ చెప్పినదంతా శ్రద్ధగా విని ''అయితే నువ్వే నిర్ణయానికి వచ్చావు?'' అన్నాడు భార్గవ.

''మా డియస్పీ నేరస్తుడనడంలో నాకెలాంటి సందేహమూ లేదు. మామూలుగా అయితే ఆయన నాబోటి వాళ్ళను నాలుగు మాటలు కూడా మాట్లాడనివ్వడు. అలాటిది నేను చెప్పేవన్నీ విన్నాడు. నాకంటే చిన్నవాడిలా ప్రవర్తించడమే కాక - మొదటిసారిగా తను చిన్నవాడినని నా దగ్గర ఒప్పుకున్నాడు. అంతకు ముందయితే ఈ ప్రపంచానికే మహారాజులా మాట్లాడేవాడు. నేను తన కేసు ఇన్వెస్టిగేట్ చేస్తానని భయపడుతున్నాడు. పరోక్షంగా డిపార్ట్‌మెంటులో నా గౌరవం పెరిగింది. అది నిలబెట్టుకోవాలంటే నేనాయన కేసు జోలికి వెళ్ళకూడదు'' అన్నాడు సునీల్.

''ఇదేనా నీ నిర్ణయం?'' అన్నాడు భార్గవ.

''అవును.... అయితే ఆ సెంట్రల్ మినిస్టర్ కేసు వదలదల్చుకోలేదు......'' అన్నాడు సునీల్.

"ఏమిటా కేసు?"

"ఆయన కిష్టం లేని ఒక జర్నలిస్టు భార్యకు నడివీథిలో వస్త్రాపహరణ జరిగింది. నేరస్తుడిప్పుడు నా చేతిలోనే ఉన్నాడు. ఇంతకాలం అతగాడు బయటపెట్టని సెంట్రల్ మినిస్టర్ పేరు నా ఖైదీ చేత నీ యంత్రం బయట పెట్టించింది...."

"అయితే?"

"ఇక చూడు – నా వేట ప్రారంభమవుతుంది. మొత్తం ఆ కేసంతా తిరగేసి అపరాధిని ప్రజల ముందు నిలబెడతాను..."

"ఇది నీవల్లనవుతుందా?"

"తెలియని నిజం గురించి నేనేమీ చెప్పలేను. కానీ తెలిసిన నిజాన్ని ఆధారం చేసుకుని ఎలాంటి ఒడిదుడుకుల నయినా ఎదుర్కోగల ధైర్యం నాకుంది..."

"వెరీగుడ్... విష్ యూ ఆల్ ది బెస్ట్..."

"సరిగ్గా పదిరోజుల తర్వాత నాక్కనిపించు. ఆ సెంట్రల్ మినిస్టర్ కథ బయటపెడతాను.... అది నీకు వినిపిస్తాను..."

## 5

సరిగ్గా పదిరోజుల తర్వాత భార్గవ సునీల్‌ను కలుసుకున్నాడు.

సునీల్ బాగా ఉత్సాహంగా ఉన్నాడు.

అతడు బయటపెట్టిన కథ ప్రజల్లో ఆవేశం పుట్టించేదిగా ఉంది.

పూర్వాశ్రమంలో సెంట్రల్ మినిస్టర్ ఆ జర్నలిస్టు భార్యకు కాలేజిమేటు. పరీక్షలో తనకు కాపీ కొట్టడానికి పేపరు చూపించలేదని ఆమె నల్లరి చెయబోయి కాలేజి నుంచి డిబారయ్యాడు. ఆ కసికొద్దీ ఆమె మీద పగబట్టి ఆమెను ఒంటరిగా పట్టి రేప్ చేశాడు. ఆమె తండ్రి మినిస్టర్ తండ్రిని కలుసుకుని తన కూతుర్నాయింటి కోడలుగా చేసుకోమని కోరాడు. మినిస్తర్ తండ్రి రెండు లక్షల రూపాయలు కట్నం అడిగాడు. జర్నలిస్టు భార్య తెగించి మినిస్టర్ మీద పోలీసు రిపోర్టిచ్చింది. కేసు సగంలో ఉండగా మినిస్టరు తండ్రి కలగజేసుకుని జర్నలిస్టు భార్యకు జర్నలిస్టు సంబంధం చూశాడు. జర్నలిస్టు అసహాయస్థితిలో ఆమెను పెళ్ళి చేసుకున్నా క్రమంగా ఆమెను ప్రేమించాడు. ఆమెకు జరిగిన అన్యాయానికి మినిస్టర్‌పై పగబట్టి సమయం కోసం వేచి ఉన్నాడు.

చాలా ఏళ్ళు గడిచేక జర్నలిస్టు ప్రత్యర్థి సెంట్రల్ మినిస్టరయ్యాడు. జర్నలిస్టు అతడినో కంట కనిపెడుతూ ఒకసారి అతడి గురించిన కొన్ని నిజాలను పత్రికాముఖంగా ప్రకటించాడు. మినిస్టర్‌కోపం వచ్చింది కొందర్ని పురమాయించాడు. ఫలితంగా జర్నలిస్టు భార్యకు నడవీథిలో వస్త్రాపహరణం జరిగింది.

ఇందులో సెంట్రల్ మినిస్టర్ హస్తమున్నదని ఎవరూ ఊహించలేనంత పకడ్బందీ ఆ నేరం జరిగింది. అయితే అతడి హస్తమున్నదన్న నిజం బైటపడగానే ఋజువులు, సాక్ష్యాలు చాలా సులభంగా లభించాయి.

"ఈ కేసు దేశాన్నో ఊపు ఊపుతుంది..." అన్నాడు సునీల్.

"నా యంత్రం ప్రజల్లో, నాయకుల్లో పాపభీతిని సృష్టిస్తుంది...." అన్నాడు భార్గవ సంతోషంగా.

"ఈ రోజే మొత్తం కేసు గురించిన రిపోర్టునూ, యంత్రం గురించిన సమాచారాన్నీ పై అధికారులకు పంపుతున్నాను..." అన్నాడు సునీల్.

ఆ తర్వాత రెండు వారాలకు సునీల్, భార్గవను మళ్ళీ కలుసుకుని – "నేను పంపిన సమాచారం గొప్ప సంచలనాన్నే సృష్టించింది. రాష్ట్రముఖ్యమంత్రులూ, కేంద్ర మంత్రులు, ప్రధానమంత్రి ఈ యంత్ర విషయమై చర్చిస్తారుట..." అన్నాడు.

"నిజంగా?" అన్నాడు భార్గవా ఆనందంగా.

"అవును. దేశంలోనేకాక విదేశాల్లో కూడా నేర ప్రవృత్తిని మార్చగల అద్భుత యంత్రమిది..." అన్నాడు సునీల్.

"కానీ దీని గురించి ఎక్కడా పేపర్లలో ప్రచారం రాలేదే?" అన్నాడు భార్గవ.

"ఇది చాలా ప్రమాదకరమైన విశేషం! ఎన్నో ఊహాగానాలకీ, అవాంఛిత చర్యలకీ దారితీసే ఈ విశేషంపై తుది నిర్ణయం జరిగేవరకూ - బహుశా ప్రచారం జరగదు.." అన్నాడు సునీల్.

"ప్రచారం గురించి నాకు బాధలేదు. ప్రపంచంలో మంచిని నిలబెట్టి చెడును తుడిచివేసే ఈ యంత్రం కలకాలం చట్టాన్ని పరిరక్షించే నీబోంట్ల చేతిలో ఉండాలని నా ఆకాంక్ష" అన్నాడు భార్గవ.

"నీది ఉన్నతాశయం. తప్పక నెరవేరుతుంది..." అన్నాడు సునీల్.

6

మరి రెండువారాలు గడిచాయి. భార్గవ ఆత్రుతగా ఎదురు చూస్తున్నాడు సునీల్ నుంచి ఎలాంటి కబురూ లేదు ఉండబట్టలేక ఒకరోజున అతడు స్వయంగా సునీల్ ఇంటికి వెళ్ళాడు.

అప్పుడు సునీల్ ఇంట్లోనే ఉన్నాడు. భార్గవను చూస్తూనే " రా, కూర్చో!" అన్నాడు నీరసంగా.

"నీ నుంచి కబురుకోసం ఎదురుచూస్తున్నాను" అన్నాడు భార్గవ.

"రెండురోజుల్నించి నేను సెలవులో ఉన్నాను."

"ఏం - వంట్లో బాగాలేదా?"

"దెబ్బతిన్నాను గురూ! నిన్ను కూడా దెబ్బ తినిపించాను...."

"ఏమయింది?"

"నీ యంత్రం ఫెయిల్యూర్ అని ఓ హైపవర్ కమిటీ నిర్ణయించింది. అది ఏమాత్రమూ నమ్మతగ్గది కాదనీ - దాన్ని నమ్మడం వల్ల సమాజ విద్రోహకర శక్తులు పెద్ద వాళ్ళని నేరాల్లో ఇరికిస్తాయనీ - అందుకు బుజువు నేను ఇన్వెస్టిగేషన్ చేసిన సెంట్రల్ మినిస్టర్ కేసేననీ అంతా కలిసి నిర్ణయించారు..."

"ఇలా ఎందుకు జరిగింది?" అన్నాడు భార్గవ.

"భార్గవా! మనచుట్టూ ఉన్నది యంత్రాల్లాంటి ప్రజలు. ఆ యంత్రాల్ని నడిపించే స్వార్థపరులు మనకు నాయకులవుతున్నారు. ఏ పార్టీవారైనా నాయకులందరూ ఒక్కటే! అధికారులైనవారికి నీ యంత్రం ఓ పెద్ద ప్రతిబంధకం అందుకే అది నిజం చెప్పించినా - తన నిజాయితీని నిరూపించుకునేందుకు స్వార్థపరులైన అధికారుల మీదనే ఆధారపడింది. వాళ్ళు దాని నిజాయితీనెందుకొప్పుకుంటారు?"

"ఈ అన్యాయాన్ని నేను సహించను... ప్రజల ముందుకు నా యంత్రాన్ని తీసుకుని వెళ్ళి దాని గొప్పతనాన్ని బుజువు చేస్తాను..."

"భార్గవా! యంత్రాల్లాంటి ప్రజలు నీ మాటలు వినరు. వాళ్ళు మనుషుల్లాగే ప్రవర్తిస్తే అప్పుడు నీ యంత్రం అవసరమే ఉండదు..."

"అయితే నా యంత్రం ఫెయిల్యూర్ అని బుజువయిందంటావ్!"

"అవునా - అయాం సారీ... ఈ వార్త రెండ్రోజుల క్రితమే నాకు తెలిసింది... నీకెలా చెప్పాలా అని ఆలోచిస్తున్నా!"

"ఓహ్ - నా యంత్రం ఫెయిల్యూర్... అంటే నేను సుమలతను పెళ్ళిచేసుకోవచ్చు..." అన్నాడు భార్గవ సంతోషంగా.

సునీల్ అతణ్ణి పరిశీలించి చూసి ఆశ్చర్యపడ్డాడు.

ఒక ఉన్నతాశయంతో నిజం చెప్పే యంత్రాన్ని కనిపెట్టిన భార్గవ - కొందరు స్వార్థపరులా యంత్రాన్ని ఫెయిల్యూర్ అంటే - సుమలతను పెళ్ళి చేసుకోవాలన్న స్వార్థంతో ఆ వార్తకు నిజంగానే సంతోషిస్తున్నాడు.

సునీల్‌కి సంతోషించాలో, బాధపడాలో తెలియలేదు.

భార్గవ మాత్రం అక్కణ్ణించి సంతోషంగా వెళ్ళిపోయాడు.

మనిషిని ఎలాంటి ఫెయిల్యూర్నించీ కూడా నిరుత్సాహపడకుండా కాపాడేది స్వార్థమే మరి!

✡✡✡

# దెయ్యాలున్నాయి

**నాకు** దెయ్యాలంటే ఏ మాత్రం నమ్మకలేదు. నా స్నేహితుడు రఘునాధ్‌కి మాత్రం అవంటే పిచ్చినమ్మకం, వాడెప్పుడూ రాత్రిళ్ళు ఒంటరిగా ఉండడు. ఎవరో ఒకరు తోడుకావాలి. గ్రాడ్యుయేషన్ పూర్తియ్యేదాకా నేనే తోడుగా ఉండేవాణ్ణి.

మా ఇద్దరివీ పక్క పక్క ఇళ్ళు. మేమిద్దరం ఒకే క్లాసు. తరచుగా కంబైన్డ్ స్టడీస్ చేసేవాళ్ళం.

ఉద్యోగాలొచ్చేక ఇద్దరం విడిపోయాం. ఉన్న ఊరు వదులుకుని పొరుగు రాష్ట్రాల్లో ఉంటున్నాం. అయినా మా మధ్య తరచుగా ఉత్తరాలు నడుస్తున్నాయి.

రఘునాధ్ ట్రైబల్ ఏరియాలో ప్రభుత్వోద్యోగి. ప్రభుత్వం ప్రజలకిచ్చే సదుపాయాలేమిటో వారికి తెలియజెప్పడం. ట్రైబల్స్‌కున్న మూఢవిశ్వాసాలను తొలిగించి, వారి మానసిక వికాసానికి తోడ్పడం వాడి బాధ్యతలు. ఉద్యోగం వాడికి నచ్చినట్లే ఉంది.

దెయ్యాల్ని నమ్మే రఘునాధ్ ఆదిమవాసుల మూఢ విశ్వాసాలను తొలగించగలడా అని నేను వేళాకోళం చేస్తుండేవాణ్ణి. దానికి బదులుగా వాడు - "మానవాతీత శక్తుల్ని విశ్వసించడంలో తప్పులేదు. ఆ విశ్వాసం మూఢాచారాలనరికట్టడానికి అడ్డురాదు" అనేవాడు.

"ఆదిమ వాసుల మూఢ విశ్వాసాలకు మానవాతీత శక్తుల్ని విశ్వసించడం కూడా ఒక కారణం కాదంటావా?" అన్నానొకసారి.

"మూఢవిశ్వాసాలు రెండు రకాలు. ఇతరులకు హాని కలిగించేవి, కలిగించనివి. సర్వమానవ సమానత్వాన్ని గుర్తించకుండా సాటి మనిషిని హీనపరచి కించపరిచేవీ, నరబలులకు దారితీసేవి అయిన మూఢవిశ్వాసాల్ని ప్రతి ఒక్కడూ ఖండించాలి. ఇక మానవాతీత శక్తుల్ని నమ్మడమంటావా - ఎంతోమంది తప్పులు చేయడానికి సంకోస్తున్నారంటే అందుక్కారణం ఉన్నాడో లేడో తెలియని దేవుడికి భయపడడమే కదా!" అన్నాడు రఘునాధ్.

వాడు చెప్పింది అక్షరాలా నిజం.

నేను నీతినీ, నిజాయితీనే తప్ప దేవుణ్ణి కూడా నమ్మను. ఇప్పుడు నా ఉద్యోగం నాకు సవాలయింది. నగరంలో ప్రముఖులందరూ నా చుట్టూ తిరక్క తప్పదు. నేను సాధారణ గుమస్తాని.

ఊళ్ళో కన్‌స్ట్రక్షన్‌కి సంబంధించిన ఫైల్స్ నా ద్వారానే వెడతాయి. వాటిలో లొసుగులు లేకుండా చూడాలి నేను అలా చూసినందుకు ప్రభుత్వం నాకు నెలకు పదిహేనువందల రూపాయల జీతమిస్తుంది. ఎందరో పూట తిండికి అల్లాడుతున్న ఈ దేశంలో

నాకిది పెద్దజీతమే అనిపిస్తుంది. కానీ -

ఫైల్సులో లొసుగుల గురించి మాట్లాడకపోతే, వాటిని చూసి కూడా చూడనట్లు నటిస్తే, లొసుగుల కారణంగా ఫైల్సును ఆపకపోతే కొందరు నాకు నెలకు అయిదారువేలదాకా ఇస్తారు. నాకా డబ్బుమీద ఆశ లేదు, మోజులేదు. అందుకే నేను ఆరంభంలో నీతి, నిజాయితీల కోసం ఫైల్సును శ్రద్ధగా చూసేవాణ్ణి.

ఉడతాభక్తి మంచిదే! కానీ ఉడతా భక్తివల్ల ఉడతకు శ్రమే తప్ప సాధించగలిగిందేమీ ఉండదు.

నాకైతే ఇంకా ప్రమాదాలు కూడా ఎదురొచ్చాయి.

మా సంస్థ మొత్తం మీద నేనొక్కణ్ణే ఒకటి - మిగతా అందరూ ఒకటి!

ఫైల్సులో లొసుగులు చూడడం వల్ల బయట కొందరికే కాక ఆఫీసులో అందరికీ శత్రువయ్యాను నేను.

ఒకసారి బాస్ నన్ను పిలిచాడు.

"మిస్టర్ రావ్! నేను నీ శ్రేయోభిలాషిని" అంటూ ప్రారంభించాడాయన.

నేనాయన చెప్పేది శ్రద్ధగా విన్నాను.

"ఈ దేశమొక విషవలయం. ఇందులో ప్రతిమనిషీ తన్ను తాను రక్షించుకునేందుకు ప్రయత్నించాలి తప్ప పక్కవాడి క్షేమం గురించి ఆలోచించకూడదు. అర్థమయిందా?"

"నా బాధ్యతల్ని నేను సక్రమంగా నిర్వహించకపోతే నన్ను నేను రక్షించుకోగలనా?" ఎదురు ప్రశ్న వేశాను.

"నీ బాధ్యతలు నువ్వు సక్రమంగా నిర్వహించకపోతే మేమందరం నిన్ను రక్షిస్తాం. నీ బాధ్యతల గురించే ఆలోచించావంటే నిన్ను రక్షించాలనుకునేవాడు ఒక్కడు కూడా ఉండడు."

"ఎందుకని?"

"వరదలొచ్చాయనుకో. ఆ వరదల్నాపడానికి నువ్వొక్కడివే మాత్రం ప్రవాహానికి ఎదురునిలిస్తే ఏమవుతుంది? ఆ వరదల్లో నువ్వు కొట్టుకునిపోతావు."

"వరదల్నాపడానికి ప్రయత్నించకపోతే మొత్తం మానవాళికే ప్రమాదం కదా!"

బాస్ నవ్వాడు. ఆ నవ్వులో నా అమాయకత్వం పట్ల జాలి స్పష్టంగా కనపడింది - "డియర్ రావ్ ప్రపంచంలో కొన్ని వేలఏండ్లుగా వరదలొస్తూనే ఉన్నాయి. మానవాళి నాశనమయిందా? వరదలు, క్షామం ప్రకృతి సహజం ఒకోసారి అవి మానవకల్పితాలు కూడా! నీకు తెలుసో తెలియదో - గత సంవత్సరం వచ్చిన వరదలు ప్రకృతి సహజం కదా..."

"అంటే?"

"ప్రజల్లో తమకు పలుకుబడి తగ్గుతోందనిపించినప్పుడు ప్రభుత్వం తన యంత్రాంగాన్నుపయోగించి వరదల్ని సృష్టించి - తర్వాత తన యంత్రాంగంతోనే వరద బాధితులకు సాయపడి పేరు తెచ్చుకుంటుంది. అలాంటి ప్రభుత్వాలను మళ్ళీ మళ్ళీ ఓట్లేసి ఎన్నుకుంటారు ప్రజలు. దీన్ని బట్టి నీకేం తెలిసింది? వరదల కెదురు నిలపడమంటే ప్రభుత్వానికెదురు తిరగడమే అన్నమాట! అంటే నువ్వు ప్రభుత్వోద్యోగిగా ఉంటూ వ్యతిరేకివవుతున్నావు. ఇదేనా నీ బాధ్యత!"

ఈ విపరీత తర్కానికి తెల్లబోయాను.

నాకు తెలుసు. మా ఊరి మునిసిపల్ చెయిర్మన్ మురికివాడలో ఇళ్ళన్నీ తనే అంటింపజేసి ఆ తర్వాత వాళ్ళకు నష్టపరిహారం అందజేసి ఆ కారణంగా ఎన్నికల్లో నెగ్గాడు.

బాస్ మాటలు నాపై ప్రభావం చూపుతున్నాయి.

"నీ కారణంగా ఇబ్బందిపడే ఆ కొందరూ ఎవరనుకుంటున్నావ్? వాళ్ళు ప్రభుత్వ పక్షానికి దగ్గర బంధువులు. ఆ విధంగా ప్రజాబంధువులు. నేనీవిధంగా నీకు చెబుతున్నానని నువ్వు గొప్పవాడిననుకోకు. క్షణాల మీద నిన్ను నల్లిలా నలిపేయొచ్చు. నేను నీ శ్రేయోభిలాషిని. అంతే!"

ఆ తర్వాత బాస్ నాకింకేం చెప్పలేదు. ఆయన నా కింకేమీ చెప్పాల్సిన అవసరమూ రాలేదు.

"దెయ్యాలున్నాయి. వాటికి భయపడాలి" అన్న నిర్ణయానికి వచ్చాను. దెయ్యాలకు భయపడ్డంవల్ల నా ఆర్థిక పరిస్థితి మెరుగవుతోంది. అది మెరుగవుతున్న కొద్దీ నాలో పాపభీతి పెరిగి - క్రమంగా నేను దేవాలయానికి వెళ్ళడం ప్రారంభించాను.

నాకు దెయ్యాలపై నమ్మకం కుదిరినట్లూ దేవాలయానికి వెడుతున్నట్లూ రఘునాథ్‌కు ఉత్తరం రాశాను.

వాడినుంచి వెంటనే బదులు వచ్చింది.

"నువ్వు నిజంగా దెయ్యాల్ని నమ్మితే నాకు సంతోషమే! కానీ నువ్వు వ్రాసిందాన్ని బట్టి నువ్వు మనుషుల్లో దెయ్యాల్ని చూస్తున్నట్లు కనబడుతోంది. ఆ భయంతో నువ్వు దైవభక్తిని పెంపొందించుకుంటే అది విచారించవలసిన విషయం. మానవాతీత శక్తులు నిజంగా ఉన్నాయి. అందుకు సంబంధించి నాకు కొన్ని విచిత్రానుభవాలయ్యాయి. అవన్నీ నీకు మనం కలుసుకున్నప్పుడు చెబుతాను. అన్నింటికీ మించిన అపూర్వానుభవమొకటి రేపే పొందనున్నాను. ఆ వివరాలు వచ్చే ఉత్తరంలో రాస్తాను. వేచిఉండు."

ఆ ఉత్తరం నాలో కుతూహలాన్ని లేపింది.

## 2

సరిగ్గా పదిరోజుల తర్వాత నాకో ఉత్తరం వచ్చింది రఘునాథ్ దగ్గర్నుంచి, ఉత్తరం చదివి తెల్లబోయాను.

ఆ ఉత్తరం ప్రకారం రఘునాథ్ చచ్చిపోయాడు. ఉత్తరం రాసింది రఘునాథ్ ఆత్మ! తను చనిపోయినట్లు తెలిస్తే తలితండ్రులు గుండె ఆగి మరణిస్తారని వాడు కొన్ని అద్భుతశక్తులద్వారా మనిషిలాగే మసులుతున్నాడు. ఈ విషయం ఇంకెవరికీ చెప్పొద్దని రాశాడు. దెయ్యాలున్నాయన్న నమ్మకం నాక్కలిగించడం కోసం వాడు నాకీ ఉత్తరం రాశాడు. త్వరలోనే వాడు నన్ను కలుసుకుంటాడు కూడా! ఉత్తరం రాసింది మానవాతీత శక్తి అనడానికి ఋజువేమిటంటే - నేను చదవడం ఆయ్యేక ఓ గంటలోగా ఉత్తరం దానంతటదే అంటుకుని మండిపోతుంది.

నిజంగానే ఉత్తరం అలాగే మండిపోయింది.

నాకు వళ్ళు జలదరించిందప్పుడు. అయితే శ్రీమతికి కూడా నేనీ విషయం చెప్పలేదు - భయపడుతుందని!

రోజూ సాయంత్రం విధిగా దేవాలయానికి వెడుతుంటాను. శనివారాలైతే కుటుంబ సమేతంగా వెడతాను. నేను గుడికి బయలుదేరగానే శ్రీమతి వంట ప్రారంభిస్తుంది. గుడి మా ఇంటికి సుమారు కిలోమీటరు దూరంలో ఉంది. అక్కడికి వచ్చే జనం తక్కువ. శనివారాలు మాత్రం కాస్త రష్‌గా ఉంటుంది. గుడి పూజారితో నాకు మంచి స్నేహమయింది. నాకు వచ్చే అక్రమ సంపాదనలోంచి రోజూ పదిరూపాయలాయనకు దక్షిణగా ఇచ్చుకుంటాను. అందుకని ఆయనకు నేనంటే అభిమానం!

పూజారితో కాసేపు కబుర్లు చెప్పి ఇంటికి తిరిగి వెళ్ళే సరికి వంటైపోతుంది. అప్పుడు కలిసి భోంచేస్తాం.

పూజారి ఆజానుబాహుడు. ఆయన ముఖంలో దివ్యతేజస్సుంటుంది. ఆయన మాటల్లో బ్రహ్మజ్ఞానం, లోకజ్ఞానం రెండూ ధ్వనిస్తాయి.

పూజారికి దైవశక్తి అంటే అపారమైన నమ్మకం. ఆయన నాకు ధైర్యాన్నిస్తుంటాడు.

"నువ్వు తప్పు చేయడంలేదు. ఈ ఆలయాన్నే నమ్ముకున్న నాకు సాయపడడం కోసం దేవుడు నీచేత కొన్ని కార్యాలు చేయిస్తున్నాడు. ఈ ప్రపంచంలో తప్పొప్పులేవో మనిషివికావు. అన్నీ దేవుడివి -" అంటాడాయన.

"అయితే ప్రతివాడూ దేవుడికే బాధ్యత నంటగట్టి దురాగతాలకు దిగితే?" అని నేనోసారి సందేహాన్ని వెలిబుచ్చాను.

"అదే సృష్టి విచిత్రం. మనిషి కావాలని కూడా దుర్మార్గుడు కాలేడు. అందుకే నాగరికత ఏర్పడి నానాటికీ మానవజాతి వృద్ధి పొందగలుగుతోంది" - అన్నాడు పూజారి.

ఆ రోజుకూడా ఆయనతో నాకు వచ్చిన ఉత్తరం సంగతి చెప్పాను. అది విని పూజారి నవ్వాడు.

"నా కళ్ళెదుటే ఉత్తరం మండిపోయింది" అన్నాను.

"నువ్వు లెటర్ బాంబ్స్ గురించి వినలేదా?" అన్నాడు పూజారి.

కవరు ఓపెన్ చేయగానే పేలి మనుషుల్ని చంపే లెటర్ బాంబ్స్ గురించి చాలాసార్లు పేపర్లో వచ్చింది. కాగితానికి కొన్ని రసాయనాలను పూయడం ద్వారా కవర్లోంచి తీసిన కాసేపటికది మండిపోయేలా చేయవచ్చు. అది మానవాతీత శక్తికాదు.

"మరి రఘునాథ్ నాకలా ఉత్తరమెందుకు రాశాడంటారు?"

"నీ స్నేహితుడు నీతో ఏదో తమాషా చేస్తున్నాడు -"

"ఎందుకు?"

"ఎందుకంటే నేనేం చెప్పను? మీ ఇద్దరి స్నేహం ఎలాంటిదో నాకేం తెలుస్తుంది? చాలామంది స్నేహితుల మధ్య ఇలాంటి తమాషాలు జరుగుతుంటాయి" అన్నాడు పూజారి.

"అంత కచ్చితంగా ఇది తమాషా అని మీరెలా చెప్పగలరు?"

"ఎందుకంటే దెయ్యాలు లేవని తెలిసినవాణ్ణి కాబట్టి!"

"దేవుడున్నప్పుడు దెయ్యాలుండవా?"

"ఈ సృష్టికి మూలం దేవుడు. ఆయన లేనిదే ఈ సృష్టికి ఉనికిలేదు. దేవుడు మనని సృష్టిస్తే మనం దెయ్యాల్ని సృష్టించుకున్నాం" అన్నాడు పూజారి.

"అంతేనంటారా?"

"అంతే నీ స్నేహితుడు నీ దగ్గరేం ట్రిక్కు వేసినాలొంగకు. అతణ్ణి నా దగ్గరకు తీసుకునిరా! అసలు రంగు బయటపెడతాను -"

ఆయన మాటలు నమ్మితే - నా రఘునాథ్ బ్రతికున్నట్లు! అందుకే నమ్మాను.

## 3

ఒకరోజు తెల్లవారు ఝామున నాలుగు గంటలకు మా ఇంటి కాలింగ్‌బెల్ మ్రోగింది.

"పాలవాడొచ్చాడు వెళ్ళి పాలుపోయించుకోరూ!" అంది శ్రీమతి గోముగా.

ఆమె అలా అడిగితే కాదనలేను.

గిన్నె తీసుకుని వెళ్ళి తలుపు తీస్తే బయట నిలబడ్డ వ్యక్తి పాలవాడు కాదు. నా వాలకాన్ని చూసి - "ఏరా - నేను పాలు తీసుకునివస్తే తప్ప లోపలకు రానివ్వవా - ఇదేం బంధు మర్యాదరా!" అన్నాడు రఘునాథ్.

"నువ్వేనా?" అంటూ పక్కకు తప్పుకున్నాడు.

వాడు లోపలకు వచ్చి తలుపేశాడు.

"నీ ఉత్తరం చూసి చాలా కలవరపడ్డాను. నిన్నిలా చూడగలడం నాకెంతో సంతోషంగా ఉంది" అన్నాను.

రఘునాథ్ నిట్టూర్చి - "నువ్వు మాత్రమే నన్ను చూడగలవు. ఆ విషయం దృష్టిలో ఉంచుకో. లేకుంటే నలుగురూ నిన్ను పిచ్చివాడనుకోగలరు" అన్నాడు.

అంతలోనే కాలింగ్ బెల్ మ్రోగింది మళ్ళీ.

"తలుపవతల పాలవాడున్నాడు. ఆ చేతిలో గిన్నెనాకిచ్చి నువ్వు పక్కకు తప్పుకుని తమాషా చూడు" అన్నాడు రఘునాథ్.

నేను వాడు చెప్పినట్లే చేశాను.

రఘునాథ్ తలుపు తీసి పాలు పోయించుకున్నాడు. పాలవాడు వాడితో - "అమ్మగారివంట్లో బాగోలేదా బాబూ - మీరొచ్చారు!" అన్నాడు.

నేనాశ్చర్యపోయాను.

పాలవాడు వెళ్ళిపోగానే రఘునాథ్ తనే తలుపులు వేసి - "నేను వాడికి నీ రూపంలో కనిపించాను" అన్నాడు.

నా వళ్ళు జలదరించింది.

"ఏమిట్రా - నను భయపెట్టాలనుకుంటున్నావా?!" అన్నాను.

"చాలా అన్యాయంరా ఇది! బ్రతికున్నంత కాలం నీ ప్రాణస్నేహితుణ్ణి ప్రాణం పోగానే నేనంటే భయపడతావా - ఇది న్యాయమా? నేను నీకు అపకారం చేస్తానా?" అన్నాడు రఘునాథ్.

"తమాషా చేయక అసలేం జరిగిందో చెప్పు -"

"తమాషా సంగతలాగుంచు. నువ్వు పడగ్గదిలోకి వెళ్ళు. నేనూ నీ పక్కనే నిలబడతాను. అప్పుడేం జరుగుతుందో చూడు" అన్నాడు రఘునాథ్.

వాడి మాటలు, ప్రవర్తన అంతా చిత్రంగా ఉన్నాయి. నాలో రవంత భయ కూడా చోటు చేసుకుంటోంది.

పాలగిన్నె డైనింగ్ టేబుల్ మీద పెట్టి - ఓ స్టీలు కంచాన్ని గిన్నెమీద మూత పెట్టాక - ఇద్దరం బెడ్రూంలో అడుగుపెట్టాం.

శ్రీమతి నిండా ముసుగుతన్ని పడుకుని ఉంది. నేనామెను ముందుకు వంగి తట్టిలేపాను.

"ఊఁ" అని బద్ధకంగా మూలిగిందామె.

"ఇలా చూడు" అన్నాను.

ఆమెకు మత్తులో కళ్ళు విడడం లేదు. నా అరుపు నన్నే భయపెట్టేలా ఉంది.

శ్రీమతి ఉలిక్కిపడి లేచి కూర్చుని - "అదేమిటండీ అలా అరిచారు!" అంది.

ఆమె మత్తు పూర్తిగా విడిపోయింది. రెండు కళ్ళూ పెద్దవి చేసి నా వంక భయంగా చూస్తోంది.

"ఎవరొచ్చారో చూడు -" అన్నాడు పక్కనే నిలబడి ఉన్న రఘునాథ్‌ని క్రీగంట చూస్తూ.

"ఏమిటండీ ఈ తమాషాలు! కాసేపు నిద్రపోనివ్వకుండా ఏమిటది - రండి, పడుకుందాం -" అంటూ శ్రీమతి చేయిపట్టుకుని మంచమ్మీదకు లాగింది. నేను బ్యాలన్స్ తప్పి ఆమె మీద పడ్డవాడినే ఎలాగో తమాయించుకుని లేచి నిలబడ్డాను.

"ఛీ - ఏమిటది - సిగ్గులేకుండా -" అన్న మాటలు అప్రయత్నంగా నా నోట వచ్చాయి.

"ఆమెనేమీ అనకు. నేనామెకు కనబడ్డంలేదు" అన్నాడు రఘునాథ్ నాతో నెమ్మదిగా.

అది నిజమే అయుండాలి, లేకుంటే శ్రీమతి ఇతరుల ఎదుట అలా ప్రవర్తించదు. కానీ నా పక్కనే నాకు కనపడుతున్న రఘునాథ్ ఆమెకు కనబడ్డంలేదంటే ఎలా నమ్మేది?

"ఈ పక్కనెవరూ నీక్కనబడ్డంలేదా?" అంటూ రఘునాథ్ భుజం మీద చెయ్యివేసి ఉలిక్కిపడ్డాను.

నాకు వాడి శరీరం చేతికి తగలడంలేదు.

కంటికి కనబడే శరీరం చేతికి తగలడంలేదు.

కంటికి కనబడే శరీరం చేతికెందుకు తగలదు?అంటే రఘునాథ్ నిజంగానే దెయమయ్యాడా? అప్రయత్నంగానే కెవ్వుమన్నాను!

## 4

ఆ రోజు మధ్యాహ్నందాకా రఘునాథ్ ఇంట్లోనే ఉండి చాలా తమాషాలు చేశాడు. వాడు దెయ్యమయ్యాడనడంలో నాకేం సందేహంలేదు.

శ్రీమతి కూరలు కావాలంటే నేను పక్క సందులో దుకాణం దగ్గరకు వెళ్ళాను. వాడు నాతో వచ్చాడు కానీ ఎవరికీ కనబడలేదు, వాడి మాటలు నేను వింటున్నాను. బదులివ్వాలంటే చుటుపక్కలవాళ్ళు పిచ్చివాడనుకుంటారని భయంగా కూడా ఉంది.

మధ్యాహ్నం వాణ్ణి భోజనానికి బలవంత పెటాను.

"నీ భార్య భయపడుతుంది. నేను నీకు మాత్రమే కనబడగలను. ఆమెకు కనబడలేను" అన్నాడు రఘునాథ్.

"మరి ఇందాకా పాలవాడికి కనబడ్డావు?"

"అది నా రూపంలో కాదు. నీ రూపంలో! కావాలంటే నీ భార్యక్కూడా కాసేపు నీ రూపంలో కనబడగలను. అప్పుడామె కంగారుపడుతుంది."

"ఏమైనా సరే - నువ్వు నా ఇంట్లో భోంచేసి తీరాలి!" అంటూ పట్టుబట్టాను. అప్పుడు రఘునాథ్ నాకో ఉపాయం చెప్పాడు.

ఆ ప్రకారం నేను శ్రీమతితో పందెం కాశాను.

"వంటలు చాలా బాగున్నాయి కాబట్టి వరుసగా రెండుసార్లు మామూలుగా భోంచేయగలను."

కాస్త టిఫినెక్కువ తింటేనే నా భోజనం చెడిపోతుంది. నా పందేనికి శ్రీమతి బాగా ఆశ్చర్యపడింది. మొదటిసారి రఘునాథ్ నా రూపంలో భోంచేశాడు. రెండోసారి నేనే భోంచేశాను. నేను పందెం నెగ్గాను.

శ్రీమతి ఆశ్చర్యపడింది. నా ఆశ్చర్యం వేరేగా ఉంది.

"మనం పూజారి వద్దకు వెడదాం. ఆయన దెయ్యాల్లేవంటాడు. నువ్వేమైనా తమాషాలు చేస్తే తను సమాధానం చెబుతాననీ, నిన్ను నాదగ్గరకు రమ్మనమనీ ఆయనన్నాడు. ఈ రోజు సాయంత్రం మనమాయన దగ్గరకు వెడదాం." అన్నాను నేను రఘునాథ్‌తో.

నేనెంత బలవంతంపెట్టినా వినకుండా వాడు మధ్యాహ్నమే వెళ్ళిపోయాడు. వాడు వెళ్ళగానే నాకు వళ్ళు తెలియని నిద్రపట్టింది. సాయంత్రం శ్రీమతి లేపేదాకా మెలకువ రాలేదు.

"ఈరోజు మీ ప్రవర్తన చిత్రంగా ఉంది. ఆఫీసుకు వెళ్ళలేదు. చాలాసేపు మీతో మీరే మాట్లాడుకున్నారు. నాతో విచిత్రమయిన పందెం కట్టి నెగ్గారు. అసలేం జరిగింది? వంట్లో బాగోలేదా...? అంది శ్రీమతి.

నేనామెకు సరైన సమాధానమివ్వలేదు. సాయంత్రం గుడికి మాత్రం వెళ్ళాను.

పూజారి నన్నాప్యాయంగా పలకరించాడు.

నేనాయనకు జరిగిందంతా చెప్పాను.

"కలగన్నావేమో!" అన్నాడాయన అంతా విని.

"కలకాదు - నిజం! కావాలంటే మా ఇంటికి రండి. మా ఆవిణ్ణడగండి" అన్నాను. కనీసం నేను విచిత్రంగా ప్రవర్తించినట్లామె పూజారికి చెప్పగలదు.

"అవసరంలేదులే - నిన్ను నేను నమ్ముతాను -" అన్నాడాయన.

"నన్ను నమ్మితే మీరిక దెయ్యాల్ని కూడా నమ్మాలి" అన్నాను.

"నీ స్నేహితుణ్ణి నా దగ్గరకు తీసుకునిరా! నీ భ్రమలు తొలిగిస్తాను" అన్నాడు పూజారి గంభీరంగా.

"సరిగ్గా రెండువారాల తర్వాత తీసుకొస్తాను -" అన్నాను

5

రెండు వారాలు తమాషాగా గడిచిపోయాయి. అనుకోకుండా నేను ఆఫీసు పనిమీద టూర్ వెళ్ళాను. తిరిగివచ్చేసరికి శ్రీమతి నాకో విచిత్ర వార్త చెప్పింది.

రఘునాధ్ నుంచి నాకుత్తరం వచ్చిందట అందులో రాసిన ప్రకారం ఈరోజు సాయంత్రం నేను రైల్వేస్టేషన్‌కు వెళ్ళాలి అక్కడ వాణ్ణి ట్రయిన్‌లో రిసీవ్ చేసుకుంటే ఇద్దరం సరాసరి వెళ్ళి పూజారిని కలుసుకుంటాం!

"ఉత్తరమేదీ?" అన్నాను.

"ఏమోనండీ - చదివి బల్లమీద పెట్టాను. ఎవరంటించారో ఏమో- తర్వాత చూస్తే ఉత్తరం బొగ్గయి ఉంది" అంది శ్రీమతి.

నా వళ్ళు జలదరించింది.

ఆమెకు రఘునాధ్ ఉత్తరం వ్రాసినట్లు ఆ తర్వాత  మా ఇంటి కొచ్చి వెళ్ళినట్లూ తెలియదు. అందుకని అతడింటికి రాకుండా సరాసరి గుడికెందుకు వెడదామని రాశాడో అర్థంకావడంలేదు నేనామెకు వివరించి చెప్పదల్చుకోలేదు.

సాయంత్రం స్టేషనుకు వెళ్ళాను.

ట్రయిన్‌లో దిగాడు రఘునాధ్. వాడు సామాను క్లోక్ రూంలో పెట్టి నాతో బైటకు వచ్చాడు.

"నువ్వు మనిషి వేననడంలో నాకు సందేహంలేదు. వెళ్ళేటప్పుడూ, వచ్చేటప్పుడూ కూడా ట్రయిన్ ప్రయాణం చేశావు. ట్రయిన్ అవసరం మనిషికే కదా! ఆత్మకైతే మనోవేగముంటుంది" అన్నాను.

రఘునాధ్ నవ్వి - "నీలో ఆ మాత్రం సంశయం రేగాలనే నేనలా చేశాను. కావాలంటే నేనే కాదు, నువ్వు కూడా మనోవేగంతో ప్రయాణించేలా చేయగలను. ఒక్కసారి కళ్ళుమూసుకో" అన్నాడు.

నేను కళ్ళుమూసుకున్నాను. మరుక్షణానికే రఘునాధ్ కళ్ళు తెరవమన్నాడు. కళ్ళు తెరిచేసరికి ఇద్దరం ఆలయప్రాంగణంలో ఉన్నాము.

"పూజారిని పిలు" అన్నాడు రఘునాధ్.

నాకు చాలా ఆశ్చర్యంగా ఉంది.

"పూజారిగారూ!" అన్నాను.

కొన్ని క్షణాల్లో పూజారి కనబడ్డాడు నాకు - "నా స్నేహితుణ్ణి తీసుకొచ్చాను -" అన్నానాయనతో.

అయితే నా పక్కనే ఉన్న రఘునాధ్ పూజారికి కనబడలేదు. ఆయన ఆశ్చర్యంగా - "ఏడీ - నీ స్నేహితుడు?" అన్నాడు.

రఘునాధ్ నా పక్కనే ఉన్నాడంటే ఆయన నమ్మడు. ఇద్దరికీ కాసేపు వాగ్వివాదమయ్యేక ఆయన నెమ్మదిగా - "నిన్నొకసారి పరీక్షించనీ - నా కేదో అనుమానంగా ఉంది" అన్నాడు.

ఆయన ఉద్దేశ్యం నా కర్థంకాలేదు. ఆయన నన్ను ప్రశ్నలు వేస్తాడనుకుంటే వళ్ళంతా తడిమాడు. నా చొక్కా జేబులో అగ్గిపెట్టెలాంటి వస్తువు దొరికింది. ఆయన దాని వంకే పరీక్షగా చూస్తూ - "అంతా అర్థమయింది నాకు" అన్నాడు.

"ఏమిటర్థమయింది?" అన్నాను.

పూజారి అగ్గిపెట్టెలోకే చూస్తూ - "నాయనా! రఘునాధ్ - నీ నాటకం నాకు తెలిసిపోయింది. ఇక నీ ఆట కట్టిపెట్టి ఇక్కడకు రా -" అన్నాడు. ఆ తర్వాత మరో అయిదునిముషాలకి రఘునాధ్ అక్కడికి వచ్చాడు. పూజారివంక ఆశ్చర్యంగా చూస్తూ - "నా

రహస్యం మీరెలా తెలుసుకున్నారు?" అన్నాడు.

"అన్నీ తర్వాత చెబుతాను. ముందు నువ్వు చేసిన తమాషా నీ స్నేహితుడికి చెప్పు...." అన్నాడు పూజారి.

రఘునాథ్ చెప్పింది విని నేనాశ్చర్యపోయాను. వాడు నన్ను భ్రమలో ఉంచడానికి హిప్నటిజం ప్రదర్శించాడు. వాడు నా ఇంటికి వస్తే నేను వాణ్ణి నా భార్యకు తెలియకుండా దాచిపెట్టాను. పాలవాణ్ణి నేనే పలకరించి వాడు పలకరించాడనుకున్నాను. నేనే రెండుసార్లు ఫోంచేసి వాడొకసారీ, నేనొకసారీ అనుకున్నాను. వాడు చేసిన తమాషా అల్లా ఒక వాకీటాకీ వాడడం. నా జేబులో ఉన్న అగ్గిపెట్టె వంటి వస్తువు అదే! దానికి కార్డ్‌లెస్ ఇయిర్ ఫోన్ ఉంది. అది నా చెవిలో అమర్చాడు. వాడు మాట్లాడినప్పుడల్లా నాకుమాత్రమే వినబడుతోంది. వినబడినప్పుడల్లా వాడు పక్కనే ఉన్నాడని నేను భ్రమపడుతున్నాను.

"ఇలా ఎందుకు చేశావురా?" అన్నాను.

"చూడు. ఇప్పుడు నేను దెయ్యాన్ని కాదని నమ్మితే ఇంకెప్పుడూ నువ్వు దెయ్యాన్ని నమ్మవు. నీవంటివాడిలో మానవాతీతశక్తులపై నమ్మకం మొలకెత్తడం నాకు నచ్చలేదు. అందుకే నేనీపని చేశాను-" అన్నాడు రఘునాథ్.

ఆశ్చర్యము నుంచి తేరుకునేందుకు నాకు కాసేపు పట్టింది. అప్పుడు నెమ్మదిగా పూజారితో - "మీకు వాకీటాకీ గురించి ఎలా తెలుసు?" అన్నాను.

"చంచలావు తెలుసుకదా నీకు - ఆయిల్ మిల్లు ఓనరు. ఆయనిలాంటిదే నాకు చూపించి - 'ఇది నీదగ్గర ఉంచుకుని గుళ్ళో స్మగ్లింగ్ చెయ్యి. ఏడాదిలో లక్షాధికారిని చేస్తాను -' అన్నాడు. అప్పుడు చూశాను -" అన్నాడు పూజారి.

"అయితే ఏడాదిలో మీరు లక్షాధిఖారి అన్నమాట!" అన్నాను.

పూజారి అదోలా నవ్వి - "దేవుణ్ణి నమ్ముకున్నవాణ్ణి. దెయ్యాలమాట వింటానా?" అన్నాడు.

"చంచలావు మిమ్మల్ని కలుసుకుని ఎంతకాలమయింది?" అన్నాను మాటమారుస్తూ.

"నాలుగురోజులు" అన్నాడు పూజారి.

"చంచలావు మాట కాదనడానికి నాలుగురోజులు చాలకపోవచ్చు. మరో వారంరోజుల్లో మీ అభిప్రాయాలు మారతాయి" అన్నాను. నేను పరిస్థితులకు లొంగినవాణ్ణి కావడంవల్ల పూజారివంటి వారి తోడు కోసం ఎదురు చూస్తున్నాను.

పూజారి నవ్వి ఊరుకున్నాడు. రఘునాథ్ పూజారికి వినయంగా నమస్కరించాడు. దైవదర్శనం చేసుకున్నాక ఇద్దరం ఇంటి ముఖం పట్టాం. దారిలో రఘునాథ్ పూజారిని పొగిడి - "ఆయన సాయంలేకపోతే నేను దెయ్యాన్ని కాదని ఋజువు చేయడం నీవల్లనయ్యేదికాదు. అవునా?" అన్నాడు.

"అవును. ఆయన చాలా ప్రాక్టికల్ మనిషి. నా తప్పులు నన్ను క్రుంగదీయకుండా కాపాడుతున్న మహామనిషి. బహుశా తనూ ఇకముందు నా దారిలోనే నడవాల్సి ఉంటుంది. నన్నే ప్రోత్సహించినవాడు తను తప్పు చేయడా?" అన్నాను.

ఇద్దరం ఇల్లు చేరేసరికి ఇంట్లో ఓ పాప ఉంది. ఆమె పూజారి కూతురట. నాలుగురోజుల్నించి పూజారి కనబడ్డంలేదని చెప్పిందామె. పూజారి ఆమెకు మా ఇంటి అడ్రస్ ఇచ్చి ఏ ఇబ్బంది ఉన్నా చెప్పుకోమన్నాట్ట.

ఆమె మాటలు నాకాశ్చర్యాన్ని కలిగించాయి. ఆమెను తీసుకుని గుడికి వెళ్ళాం. అక్కడ ఛాయల్ని బట్టి నాలుగు రోజులుగా దేవుడికి పూజాపునస్కారాలు జరుగుతున్నట్లు లేదు.

పూజారి ఆలయంలోనే ఎక్కడో దాగుంటున్నాడేమో - చంచలావుకి భయపడి! ఈ అభిప్రాయంతో ఆలయమంతా వెతికాం. పూజారి దొరకలేదు.

చివరకు పోలీసు రిపోర్టు ఇచ్చాం.

ఆ రాత్రి ఆలయానికి బాగా వెనుకగా పొదల్లో పూజారి శవం దొరికింది. డాక్టరు చెప్పిన ప్రకారం పూజారి చావు చాలా రోజుల క్రితమే జరిగింది.

అయితే నేను, రఘునాథ్ చూసిందెవరిని?

దెయ్యాలు లేవని ఋజువు చేయడానికి పూజారి దెయ్యమై వచ్చాడా? పాపం చేయనని ప్రాణాలకు తెగించిన పూజారిని దెయ్యామయ్యాడనగలమా? పూజారి చావుకు కారుకుడైన చంచ్రలావు బ్రతికుండీ దెయ్యంకాడా?

నాలో ఎన్నో ప్రశ్నలు రేగుతున్నాయి. ఒకే ఒక్క సమాధానం అన్నింటికీ బదులుగా వస్తూంది. - "దెయ్యాలున్నాయి!"

## అభిరుచి

**అందమైన అమ్మాయిని** భార్యగా చేసుకోవాలని నా అభిలాష. అది మరీ అంత కష్టమైనది కాదని కూడా నాకు తెలుసు.

నెలకెనిమిది వందల జీతం వచ్చే ఉద్యోగం నాది. వెనకా ముందూ ఎవ్వరూ లేరు. కట్నాల బజార్లో నా ధర పదివేలదాకా పలుకుతోంది.

నేను కట్నం వద్దంటే ఆడపిల్లలు నాకోసం ఎగబడతారని నాకు తెలుసు.

నేను పొడగరిని, అందగాణ్ణి కాను. ఎవరినీ ప్రత్యేకంగా ఆకర్షించే లక్షణాలేమీ నాలో లేవు. అందువల్ల అందమైన ఆడపిల్లలెవ్వరూ కట్నమిచ్చి నన్ను పెళ్ళాడరు. ఆ విషయమూ నాకు తెలుసు.

కట్నం లేకుండా నన్ను వివాహం చేసుకున అందమైన ఆడపిల్లకూడా గతిలేక ఆ పని చేస్తుంది తప్ప ఆమెకు నాపై ప్రేమ ఉండదు. కన్నె చెరనుంచి బయటపడటానికి నన్ను సాధనం చేసుకుని ఆ తర్వాత జీవితాంతం అసంతృప్తితో బాధపడుతూ నన్ను సుఖసంతోషాలకు దూరం చేస్తుంది. అందుకే నేను మామూలు పద్ధతిలో అందగత్తెను పెళ్ళి చేసుకోవాలంటే భయపడుతున్నాను.

అయితే మరేం చేయాలి!

నేను నివసిస్తున సమాజంలో ఎన్నో విశేషాలు జరుగుతున్నాయి. అవన్నీ పత్రికల్లో, సినిమాల్లో కథారూపంలో మలచబడుతున్నాయి. నా కోణంలో వాటిన్నింటినీ పరిశీలించి ఒక నిజాన్ని గ్రహించాను. ఆ ప్రకారం ఆడపిల్లలు అత్యాచారానికి గురవుతున్నారు.

అత్యాచారం కేవలం బలవంతంలోనూ, మానభంగంలోనూ లేదు. నయవంచనలో కూడ ఉంది.

ఒకసారి మోసపోయిన ఆడపిల్ల తనకిక జీవితమే లేదనుకుంటుంది. ఆత్మహత్య చేసుకుని ప్రాణాలు తీసుకుంటుంది. లేదా జీవచ్ఛవంలా బ్రతుకు కొనసాగిస్తుంది.

మనుషులందరూ ఒక్కటే అని అన్నిమతాలూ ఘోషిస్తున్నప్పటికీ - మతాలూ సృష్టించిన కులాలూ మనిషిని మనిషి నుంచి వేరుచేస్తున్నాయి. ఆ వేర్పాటు అర్థరహితమని తెలిసినా మనిషి శతాబ్దాలుగా ఈ సంప్రదాయాన్ని పాటిస్తూనే ఉన్నాడు. పురుషుల్లో కంటే స్త్రీలలో ఈ వేర్పాటుకు మరో పదం కూడా జతపడింది. అదే పతిత!

కులమతాలు మనిషిని మనిషి నుంచీ వేరుచేసినట్లే పతిత అన్నపదం స్త్రీని సాటి స్త్రీనుంచి వేరు చేస్తుంది. కులమతాలకు లాగే పతిత అన్నపదం కూడా అర్థరహితం. అందుకే నేనొక పతితను వివాహం చేసుకోవాలన్న నిర్ణయానికి వచ్చాను. ఆ విధంగా ఒక అమాయకురాలికి, అసహాయురాలికి, అభాగినికి కొత్త జీవితాన్నిచ్చిన వాడి నౌతాను. ఆ కృతజ్ఞత కారణంగా ఆ యువతి జీవితాంతం నన్ను దైవంలా ఆరాధిస్తుంది.

నా యీ లోచనలు స్నేహితుడు రామకృష్ణకు చెప్పాను.

రామకృష్ణ ప్రాక్టికల్ మనిషి. ఎన్నో విషయాల్లో నాకు మంచి సలహాలనిచ్చాడు. వయసుకు నా యీడు వాడే ఐనా సమాజాన్ని చాలా విషయాల్లో నాకంటే బాగా అర్థం చేసుకున్నట్లు నాకు తోస్తుంది.

అయితే నేను చెప్పింది విని రామకృష్ణ హర్షించలేదు.

"ఈ సమాజంలో పతితకు గౌరవ స్థానం లేదు. పతితను పెళ్ళాడిన వాడికీలేదు. నీ బుద్ధి పెడదారులు పడుతోంది. పతితను భార్యగా ఆదరించగల మనోబలం నీకు కలకాలముండదు" అని హెచ్చరించాడతడు.

ఇది వినగానే అసలు విషయం నాకు స్ఫురించింది.

రామకృష్ణకో చెల్లెలుంది. ఆమె నాకంటికి అందంగా కనిపిస్తుంది. ఆమెను నాకిచ్చి పెళ్ళిచేస్తే బాగుంటుందని వాళ్ళింట్లో అభిప్రాయమే కానీ ఆమె అభిప్రాయం కాదని నా నమ్మకం. అది రామకృష్ణకు తెలుసు. అందుకే వాడు చొరవచేసి చెల్లెలి పెళ్ళి గురించి మాట్లాడలేకపోతున్నాడు. ఆ విషయం నేను గ్రహించినట్లు కూడా వాడికి తెలుసు. కాబట్టి అటునుంచీ నరుక్కు వస్తున్నాడు.

అంటే పెళ్ళి విషయంలో నేనే అభిప్రాయం వెలిబుచ్చినా అది తన చెల్లెలి వివాహానికి అనుగుణంగా ఉండే వరకూ వాడు నా మాటల్ని ఖండిస్తూనే ఉంటాడు.

రామకృష్ణ ప్రాక్టికల్ మనిషి కావచ్చు. సమాజాన్ని నాకంటే బాగా అర్థం చేసుకుని ఉండొచ్చు. అంతమాత్రాన నేను వాడి ఉద్దేశాల్ని కనిపెట్టలేకపోను.

నేను రామకృష్ణ మాటల్ని లెక్కచేయలేదు.

నాకింకో స్నేహితుడున్నాడు. వాడిపేరు కుమార్.

మనిషి ఎప్పుడూ ఒకేలా ఉండలేడు. తనలో రేగే భావసంచనాలను బట్టి మనిషి కాసేపు ఆస్తికుడు, కాసేపు నాస్తికుడు అవుతాడు. కాసేపు పవిత్రుడు రామకృష్ణ స్నేహం కోరితే, నాస్తికుడు పాపి కుమార్ స్నేహం కోరుతున్నాడు. కుమార్‌కు పద్దెనిమిదేళ్ళ వయసులోనే వివాహమయింది. వాడికిప్పుడు ఇరవైనాలుగేళ్ళు. స్త్రీలంటే సదభిప్రాయం కానీ, గౌరవం కానీ లేదు. అది వాడి మాటల్లో బయటపడుతూంటుంది.

"సమాజం కట్టుబాట్లవల్ల ఆడది అణిగిమణిగి ఉంది. లేకుంటే స్త్రీ అంత నీచస్వభావురాలుండదు" అని కుమార్ నాతో చాలా సార్లన్నాడు.

వాడలాగన్నప్పుడు స్త్రీలోనే తల్లి, చెల్లి ఉన్నారన్న విషయం స్ఫురించి నేనువాడి మాటలను ఖండించడానికి ప్రయత్నించాను.

"దేవాలయం గర్భగుడిలో పట్టుబట్టలు శఠగోపం పూజారిని పరమ పవిత్రుడిలా కనిపించేలా చేస్తాయి. కాసేపటికా పూజారి తనకు వచ్చిన డబ్బులతో ఏ వేశ్యవాటికకైనా వెళ్ళవచ్చునని మనకు స్ఫురించను కూడా స్ఫురించదు. పురుషుడి జీవితంలో తల్లి, చెల్లి అలాంటివారు. ఆడవాళ్ళ గురించి ఆలోచించేటప్పుడు వాళ్ళను మనసులోకి రానివ్వకూడదు."

"అయితే ఏమంటావ్?"

"అనుభవంతో చెబుతున్నాను. ఎంతో పవిత్రంగానూ, సంస్కారవంతంగానూ కనబడే స్త్రీలు నన్ను కోరారు. అది నాకే ఆశ్చర్యాన్ని కలిగించేది. నాలో ఏదో విశేషముంది. నా ప్రయత్నం లేకుండానే ఆడవాళ్ళు నా వెంటబడతారు. అలాంటప్పుడు నేను ప్రయత్నం చేశానంటే ఎవరినైనా ఇట్టే వశపర్చుకోగలను."

"అలా ఎప్పుడైనా చేశావా?"

"వల విసరడమంటే నా కసహ్యం. ఇంతవరకూ నేనెవ్వరినీ మోసం చేయలేదు. నీకు తెలిసో తెలియదో - నేనంటే మోజుపడ్డ ఏ ఆడపిల్లకైనా ముందుగా నేను నా గురించి చెప్పేసుకుంటాను."

"ఏమని?"

"పాపా - నాకు పెళ్ళయింది. నువ్వు నా భార్యకంటే అందంగా ఉనావు. అందువల్ల నువ్వంటే నాకిష్టమే! కానీ ఎట్టిపరిస్థితుల్లోనూ మనపెళ్ళి జరగదు. ఆ విషయం నువ్వు గ్రహించాలి."

"అయినా కూడా?" అంటూ నేనాశ్చర్యపడితే -

కుమార్ గొప్పగా నవ్వి - "అవును నేనేమన్నా సరే ఇష్టపడి ఆడవాళ్ళు తమంత తాము నాకాత్మార్పణ చేసుకుంటున్నారు. అది నీకాశ్చర్యంగా ఉండవచ్చు. మొదట్లో నేనూ ఆశ్చర్యపోయేవాణ్ణి. కానీ అనుభవంతో ఇప్పుడసలు విషయం అర్థం చేసుకున్నాను -" అన్నాడు.

"ఏమిటది?" అని నేను కుతూహలంగా అడిగితే -

"అపురూపమైన అందం, అద్భుతమైన తెలివి ఉన్న ఎందరో ఆడపిల్లలు గతిలేక అనర్హుణ్ణి కట్టుకుంటున్నారు. ఆ అసంతృప్తి వాళ్ళను నావంటి వారికి దగ్గర చేస్తుంది."

వాడు చెప్పిన ఈ కారణం నన్ను చాలా భయపెట్టింది. రామకృష్ణ చెల్లెలు కూడా నన్ను అనర్హుడిగానే భావించి పెళ్ళయిన తర్వాత్ కుమార్ వంటి వాళ్ళ వెంటబడితే!

అందుకే నేను పతితను పెళ్ళిచేసుకోవాలనుకుంటున్నాను. పతిత అయితే ఆ తప్పేదో పెళ్ళికి ముందే అయిపోతుంది. పెళ్ళయ్యాక తప్పుచేయనివాళ్ళు పతితల్లోనే ఉంటారని నా నమ్మకం.

కుమార్ మాటలు నేను నమ్మాను. అయితే కుమార్ భార్య విషయమే నాకాశ్చర్యంగా ఉండేది. వాడూ తన భార్యను నాలుగు గోడలూ దాటనివ్వడు. పరులకంట పడనివ్వడు. తన భార్య గీత దాటుతుందని భయమా అంటే - "అదికాదు. ఆడదాన్నణచి ఉంచాలన్నది నా సిద్ధాంతం" అన్నాడు వాడు.

"తప్పుకదూ!" అని నేనంటే -

"తప్పేమిటి? నేను భర్తను కావడమే దాని అదృష్టం." అన్నాడు వాడు.

"నీ భార్య పరులకంట పడకూడదనుకున్నప్పుడు నీవు పరాయి ఆడవాళ్ళతో తిరగడం తప్పే అవుతుంది." అని నేనంటే -

"వలచివచ్చిన వనితను నిరాకరించడం తప్పని మన పురాణాలు ఘోషిస్తున్నాయి. నేను చేస్తున్నది పాపం కాదు. పాపం చేస్తున్నది మోహన్" అన్నాడు కుమార్.

ఆ విధంగా నేను మొట్టమొదటిసారిగా మోహన్ గురించి తెలుసుకున్నాను.

మోహన్ ఆడపిల్లలకు సంబంధించి మోసగాడు. వాడు పిల్ల చుట్టూ వలపన్ని మాయమాటలు చెప్పి లోబర్చుకుని అవసరం తీరాక చివరకు ఆమె దారి ఆమెదేనంటాడు. నిస్సందేహంగా మోహన్ దుష్టుడు. దుష్టుడికి దూరంగా ఉండాలన్న సామెతను దృష్టిలో ఉంచుకుని నేను వాడికి దూరంగానే ఉన్నాను. కానీ పతితను వివాహం చేసుకోవాలన్న ఆశయం నాకు మోహన్‌పట్ల ఆసక్తిని పెంచి వాడితో పరిచయానికి దారితీసింది.

తొలిపరిచయంలోనే నాతో మోహన్ - "ఆడపిల్లల్ని వలలో వేసుకోవడం చాలా సులభం. ట్రిక్కులు చెప్పమంటే చెబుతాను" అన్నాడు.

"ట్రిక్కులొకరు నేర్పితే వస్తాయా?" అన్నాను.

"అదీ నిజమే! ఐంద్రజాలికుడికి హస్తలాఘవం ఉంటుంది. తెలిసిన ట్రిక్కు కూడా అతడు చేసినట్లు మన వల్లకాదు. కానీ కొంత ప్రయత్నం చేయవచ్చు. నేను నాకు పరిచయమైన మగాళ్ళకి ఆడాళ్ళను వశపర్చుకునే ట్రిక్సు చెప్పి జీవితంలో పైకి వస్తున్నాను" అన్నాడు మోహన్.

నేను అపనమ్మకంగా నవ్వాను.

వాడది గ్రహించినట్లు - "నీకు నా మీద నమ్మకం కుదరాలంటే ఓ పని చేద్దాం. రేపు సాయంత్రం బీచ్‌కో సినిమాహాలుకో వెడదాం. అక్కడ నువ్వు నాకే అమ్మాయినైనా చూపించు. వారంరోజుల్లో ఆ పిల్లను నాదాన్ని చేసుకోకపోతే ఒట్టు" అన్నాడు.

ఈ సవాలు నా సంస్కార్వానికి నచ్చలేదు. కానీ ఎందరో ఆడపిల్లల సంస్కారాన్ని మోహన్‌కు ఋజువు చేసినట్లుంటుందని మనసును సరిపెట్టుకుని నేనంగీకరించాను. ఒకరోజు బీచివద్ద ఇద్దరం ఓ జంటను చూశాం. ఆమె సినీనటిలా ఉంది. వారిద్దరూ మేడ్‌ఫర్ ఈచ్ అదర్ అన్నట్లున్నారు.

"ఆమె నాకు నచ్చింది" అన్నాను.

"నచ్చడమంటే?" అన్నాడు మోహన్ అదోలా.

"ఆమెను వశపరచుకుంటే నీ శక్తిని నమ్ముతాను. నీ ట్రిక్కువల్ల ప్రయోజనముందనుకుంటాను."

మోహన్ పెదవి విరిచి - "నీ అభిరుచి ఇంత చీప్ అనుకోలేదు" అన్నాడు.

"అంటే?" అన్నానాశ్చర్యంగా.

"ఆడపిల్లల్ని వశపరచుకునే ముందు వాళ్ళను ఎన్నిక చేసుకోవడంలో అభిరుచి ఉండాలి. నా అభిరుచికి తగనివాళ్ళు కనబడితే నా ట్రిక్కు పనిచేయవు. ఎందుకంటే నా ట్రిక్కు ఫలించాలన్న గాఢమైన కోర్కె నాకుండాలికదా!" అన్నాడు మోహన్.

"ఆమె నీకు నచ్చలేదంటే నాకాశ్చర్యంగా ఉంది."

"నా అభిరుచి గురించి తెలిస్తే నీవాశ్చర్యపడవు. కొన్ని విశేషాలు చెబుతాను. వింటావా?" అన్నాడు మోహన్.

"చెప్పు" - అన్నాను.

మోహన్ ఒకసారి శ్రీదేవిని అనుకోకుండా ఏదో ఔట్‌డోర్ షూటింగులో చూశాట్ట. వాణ్ణి చూస్తూనే శ్రీదేవి చటుక్కున షూటింగ్ సగంలో ఆపివచ్చేసిందట. వాడితో - "మీవంటి పురుషుడినింతవరకూ నేను చూడలేదు. మీరు నన్ను పెళ్ళిచేసుకుంటానంటే ఈ షూటింగు కూడా ఆపేసి ఈ క్షణంనుంచే సినీరంగం నుంచి నిష్క్రమిస్తాను" అందట శ్రీదేవి.

"ఆశ్చర్యం! అప్పుడు నువ్వు వెంటనే ఒప్పేసుకున్నావా?"

"ఒప్పుకుంటే కథేముంది? ఇంకా జయప్రద సంగతి తెలియదు నీకు. ఆమె నాతో ఏమందో తెలుసా? 'నువ్వు పెళ్ళిచేసుకుంటానని మాటిస్తే ఎంతకాలమైనా సరే వేచి ఉంటాను నేను సినీతారనని నీకభ్యంతరముండవచ్చు. అందుకే నీకు రెండవ భార్యగా ఉండడానికైనా నేను సిద్ధంగా ఉన్నాను' - ఆమె ఈ మాటలు విని నేను కరిగిపోలేదు. నిర్దాక్షిణ్యంగా శ్రీదేవిని నిరాకరించినట్లే ఆమెనూ నిరాకరించాను. అప్పుడామె విరక్తిభావంతో ఏదో ఒక వివాహానికి సిద్ధపడింది" అన్నాడు మోహన్.

"అంత అందమైన ఆడపిల్లలను నిరాకరించావంటే నమ్మబుద్ధి కావడంలేదు. ఆ తారల క్రీగంటి చూపులే చాలునని ఎందరో కలలు కంటున్నారు. కాదంటావా?" అన్నాను.

"అదే అభిరుచుల తేడా! నేను పై పై మెరుగులకు మోసపోయేవాణ్ణి కాదు సినీతారల అందం సహజమైనది కాదు" అన్నాడు మోహన్.

"శ్రీదేవి, జయప్రదల అందం మేకప్ కారణంగా వచ్చినది కాదు. వాళ్ళది సహజ సౌందర్యం -"

"కావచ్చు కానీ మేకప్ చాటున వారి సహజ సౌందర్యం మరుగున పడిపోయింది. నటన కారణంగా ఆ అందంతోపాటే స్త్రీ సహజమైన కోమలత్వం, సుకుమారత్వం, మృదుత్వం, లాలిత్యం వగైరాలన్నీ కూడా మరుగున పడిపోతాయి. బయటి ప్రపంచంలో సినీతారలను మించిన అందగత్తెలున్నారు. వారిలో అసలు సిసలు స్త్రీ ఉంది. నటన తెలియని ప్రేమ ఉంది. అలాంటివారినే నేను ఒకటి రెండుసార్లు అనుభవంతో విడిచిపెట్టేస్తున్నాను. అటువంటప్పుడు సినీతారల గురించి పట్టించుకుంటానా? నా అభిరుచే వేరు...." అన్నాడు మోహన్.

శ్రీదేవినీ, జయప్రదనూ, అప్పుడు బీచివద్ద అమ్మాయినీ కాదన్న వాడి అభిరుచికి తగ్గ పిల్లను నేనెక్కడ చూపగలను? అందుకే ఈ విషయంలో రామకృష్ణ సాయం తీసుకోవాలనుకున్నాను. రామకృష్ణకు మోహన్ గురించి చెప్పి - "మోహన్ అభిప్రాయాలు మార్చే సంస్కారం, అందుకవసరమైన అందం ఉన్నపిల్ల ఎన్నికలో నువ్వు నాకు సాయపడాలి?" అన్నాను.

అంతా విని "నువ్వు చెప్పిందాన్నిబట్టి ఆ మోహన్ మంచివాడు కాదని తేలుతోంది. నువ్వు మంచివాడివి. అమాయకుడివి. నా మాటవిని అలాంటి వాళ్ళకు దూరంగా ఉండు" అని హెచ్చరించాడు రామకృష్ణ.

"అంటే నేను చెడిపోతానని భయమా?"

"ఒకరి కారణంగా చెడిపోయే వాళ్ళకు వ్యక్తిత్వం లేనట్లే లెక్క. నీపై నాకెటువంటి అనుమానములేదు. కానీ మోహన్ వంటివాళ్ళు నీ మానసికారోగ్యాన్ని దెబ్బ తీస్తారు. వాడి భావాలను శాశ్వతంగా నీవెలాగూ ఇముడ్చుకోలేవు. తాత్కాలికంగా కూడా నువ్విబ్బందిపడకూడదని నా ఆశయం" అన్నాడు రామకృష్ణ.

ఆ విషయమై రామకృష్ణకూ నాకు కొంత వాగ్వివాదమయింది. అప్పుడు నాకు వాడి మీద కోపం కూడా వచ్చింది. తనేదో పెద్దవాడూ, సంస్కారవంతుడూ అయినట్లూ - నేనేమో పసివాణ్ణీ చపలచిత్తుణ్ణీ అయినట్లూ మాట్లాడుతున్నాడు.

రామకృష్ణను నేనేమీ అనలేదు కానీ లక్ష్యపెట్టలేదు. రామకృష్ణ మాటలు మోహన్‌కు చేరవేశాను.

మోహన్ ఆవేశపడలేదు. వాడు నెమ్మదిగా "కొంత మంది సామాన్యులు తాము మహాత్మాగాంధీ అనుకుంటారు. అలాంటివాళ్ళకు బుద్ధి చెప్పాలంటే చాలా సింపుల్. నా మాట వింటే నీకు కొన్ని ట్రిక్స్ చెబుతాను. వాటిని రామకృష్ణ చెల్లెలిపై ప్రయోగించి చూడు. అప్పుడా కుటుంబం ఆదర్శాలేపాటివో నీకర్థమవుతుంది" - అన్నాడు.

ముందు ఉలిక్కిపడ్డా తర్వాత నేనాలోచించాను కాస్త లోతుగా.

రామకృష్ణ చెల్లెలు పేరు సత్యవతి. కాలేజీలో బియ్యే ఫైనలియర్ చదువుతోంది. ఆమె అందం నాకెప్పుడో నచ్చింది.

మోహన్ చెప్పిన ట్రిక్కులామెపై ప్రయోగిస్తే ఆమె నా వలలో పడిపోతే అప్పుడు నేనామెను పెళ్ళిచేసుకుందుకు అభ్యంతరముండదు. ఎందుకంటే - పెళ్ళికాకుండానే ఆమె నాకు వశమయిందంటే ఆమె నేనంటే ఇష్టపడుతున్నట్లే అర్థం. నన్నామె అనర్హుడిగా భావిస్తుందన్న బాధ భయం అనుమానం నాకుండవు. పెళ్ళికిముందే వశమైనా ఆమెను నేను పెళ్ళిచేసుకుంటానంటే ఆమెకు నా పట్ల కృతజ్ఞత కూడా ఉంటుంది. ఒక విధంగా పతితను పెళ్ళిచేసుకోవాలన్న కోరిక కూడా నాకు తీరినట్లే నేను తప్ప పరపురుష సంపర్కమెరుగని పతితను వివాహం చేసుకుంటే నా ఆశయానికి అంతకంటే మంచి క్లైమాక్సు ఎక్కడుంటుంది?

నేను మోహన్ని ట్రిక్కు చెప్పమన్నాను.

"అన్నీ ఒక్కసారి చెప్పను. వన్‌బై వన్ చెబుతాను" అన్నాడు మోహన్.

మొదటి ట్రిక్కు చెప్పాడు మోహన్.

ఆ ప్రకారం నేనామెను కాలేజీ దగ్గర పలకరించి - "నాకోసం మీరు కొంత సమయాన్ని వృథా చేసుకోగలనంటే మనం సాయంత్రం పార్కులో కలుసుకుందాం" అన్నాను. నేనాశ్చర్యపోయే విధంగా ఆమె అంగీకరించింది - ముందు కాస్త తటపాయించినా.

పార్కులో ఇద్దరం కలుసుకున్నాం. నాకు చాలా థ్రిల్లింగ్‌గా ఉంది. మొదటిరోజు ఇద్దరం చాలా మామూలు కబుర్లు చెప్పుకున్నాం.

"అనుకున్నది చెప్పడానికీ రోజు ధైర్యం చాలలేదు. రేపు చెప్పడానికి ధైర్యం వస్తుందేమో - మరొక్కసారి మీరు వస్తానంటే!" అన్నాను.

ఆమె నవ్వింది. మర్నాడు మళ్ళీ ఇద్దరం కలుసుకున్నాం.

నేను తన్ని ప్రేమిస్తున్నట్లు చెప్పాను.

"మా ఇంట్లో ఈ విషయం తెలిస్తే అంతా సంతోషిస్తారు. మీరంటే మా ఇంట్లో అందరికీ సదభిప్రాయం" అంది సత్యవతి.

"అందరి విషయం వద్దు. మీ విషయం చెప్పండి!" అన్నాను.

సత్యవతి ముందు సిగ్గుపడింది. తర్వాత నెమ్మదిగా - "మా ఇంట్లో అందరిష్టమే నా ఇష్టం" అంది.

"అది ఆత్మ వంచన" అన్నాను.

సత్యవతి ప్రశ్నార్థకంగా నా వంక చూసింది.

నేను గతంలో రామకృష్ణకు చెప్పినవే నా అభిప్రాయాలామెకు మళ్ళీ చెప్పాను. సత్యవతి అన్నీ వింది.

"ఇప్పుడు చెప్పండి మీ అభిప్రాయం!" అన్నాను..

"మీరూహాలోకంలో ఉన్నారు. నేను వాస్తవంలో ఉన్నాను."

"అంటే?"

"డ్యూయెట్లూ, హానీమూన్లూ కార్లలో షికార్లూ వగైరాలు చదువుకుందుకూ, చూడ్డానికి బాగుంటాయేమోకానీ అనుభవానికి కాదు. మా ఇంట్లో అందరం ప్రాక్టికల్ మనుషులం -" అంది సత్యవతి.

"అయితే నేను మీకు నచ్చేనా?"

సత్యవతి మాట్లాడలేదు.

"నచ్చేననడానికి మనసొప్పడంలేదు మీకు!"

"అవును. ఈ మాట నేను వివాహం నిశ్చయమైనాక వరుడితో మాత్రమే అనాలనుకొంటున్నది" అందామె తెలివిగా.

"నా గురించి మీరేమైనా అనుకోండి. నాలో అలాంటి కాంప్లెక్సుంది. అది పోగొట్టుకోవడానికి మీరు సహకరించగలరా?" అన్నాను.

"ఏం చేయాలి?"

"రేపు నేను సెలవుపెడుతున్నాను ఆఫీసుకి. ఎవరికీ తెలియకుండా. ఇంట్లో చెప్పకుండా నా గదికి రాగలరా!" అన్నాను.

ఆమె ఆశ్చర్యపడ్డట్లు నా వంక చూసింది.

"నాకు తెలుసు. మీకై మీరలా రాలేరు. మీ అసహాయతే తప్ప మీరు నన్ను గౌరవించలేరు" అన్నాను.

ఆ మాటలామెపై మంత్రంలా పనిచేశాయి.

ఆమె వస్తానంది.

నేనాశ్చర్యపోయాను. మనసులో మోహన్‌కి ధన్యవాదాలర్పించుకున్నాను. ఆ తర్వాత వాణ్ణి కలుసుకుని జరిగింది చెప్పాను.

"వచ్చిన అవకాశం వృథాచేసుకోకు. ఉపయోగించుకో. నీకు మరికొన్ని ట్రిక్కు చెబుతాను" అన్నాడు వాడు.

మోహన్ చెప్పే ట్రిక్కు వింటూంటేనే నాలో ఆవేశం రేగింది. ఇక అనుభవంలో ఎలాగుంటుందో?

తినబోతూ రుచి అడగడమెందుకు?

మర్నాడు సత్యవతి అనుకున్న టైముకు నా గదికి వచ్చింది. ఇద్దరం కాసేపు మాట్లాడుకున్నాం.

"ఇక నేను వెడతాను" అందామె.

"వెళ్ళడానికేనా వచ్చింది!" అన్నాను.

ఆమె ప్రశ్నార్థకంగా నా వంక చూసింది.

నేనామె చేయిపట్టుకుని ఆమె కళ్ళలోకి చూశాను. ఆమె ప్రశ్నలన్నింటికీ నా చూపులే బదులిస్తాయని నాకు తెలుసు.

"నేను మిమ్మల్ని గౌరవించాను. మీరూ నన్ను గౌరవించాలి" అందామె చేయి విడిపించుకోకుండా.

"గౌరవమంటే నేనేం చేసినా అభ్యంతరపెట్టకపోవడం. ఆ గౌరవమిస్తే మీకు జీవితాంతం ఋణపడి ఉంటాను" అన్నాను.

"సంప్రదాయం ఒప్పని గౌరవాలు నేనివ్వలేను" అంటూ చేయి విడిపించుకుంది సత్యవతి.

నా ట్రిక్కేమీ ఆమెపై ఫలించలేదు.

"మీ తృప్తికోసం నా తృప్తిని చంపుకోలేను. పెళ్ళి కోసం పెళ్ళిని అవమానించలేను. ఈ క్షణంలో మీరన్న మాటలు మీ మనసుకు నచ్చినవే అయితే మీ వ్యక్తిత్వాన్ని నేనసహ్యించుకుంటున్నాను" అందామె.

"అయితే రమ్మనగానే ఎందుకు వచ్చినట్లు?"

"రావడానికి భయపడితే నా వ్యక్తిత్వాన్ని నేనవమానించినట్లు. కానీ మీరిక్కడ మీ వ్యక్తిత్వాన్నవమానించుకుంటారని నేనూహించలేదు."

ఆమె వెళ్ళిపోయింది.

నేను మోహన్ దగ్గర వాడి ట్రిక్కును తిట్టాను.

మోహన్ చలించకుండా "నా ట్రిక్కు నా అభిరుచికి తగ్గ ఆడవారికోసం తయారయినవి. నీ అభిరుచి నా అభిరుచికి దగ్గర్లో లేకపోవడం నీ దురదృష్టం" అన్నాడు.

"నన్ను రామకృష్ణ చెల్లెలి గురించి ప్రోత్సహించింది నువ్వేకదా - ఇప్పుడిలాగంటావేం?" అనడిగాను.

"నేను చెబితే మాత్రం - ఆ అమ్మాయి బాగుండదని చెప్పి వెంటనే నిరాకరించవద్దూ! నేనైతే వ్యవహారాన్నింతవరకూ తీసుకొచ్చేవాణ్ణికాదు. నిన్ననే నేనా సత్యవతి మొఖం చూశాను... ఎప్పటికి నీ అభిరుచి మెరుగవుతుందో ...... ఆ దేవుడే నిన్ను కాపాడాలి ... "

"పోనీ నీ అభిరుచికి తగ్గ ఆడపిల్ల గురించి చెప్పకూడదూ?" అన్నాను చిరాగ్గా.

"ఉదాహరణకు జానకి.........." అన్నాడు మోహన్.

జానకి గురించి వాడు నాతో ఎన్నోసార్లు అన్నాడు.

వాడివల్ల ఏడాదిక్రితం మోసపోయి జీవచ్ఛవంలా బ్రతుకుతున్న యువతి పేరు జానకి! అందంలో అప్సరసను తలదన్నే జానకి మోహన్ అభిరుచులకి ప్రతిబింబం!

జయప్రదను, శ్రీదేవిని కాదన్న మోహన్ వరించిన జానకి - నాకెందుకు అర్ధాంగి కాకూడదు?

సత్యవతి అసలు రంగు బయటపడ్డాక - పతితను మాత్రమే వివాహం చేసుకోవాలన్న నా కోర్కె మరింతగా బలపడింది.

నేను మోహన్ నడిగి జానకి వివరాలు తెలుసుకున్నాను.

ఆమెదీవూరు కాదు. ఇక్కడికి యాభైకిలోమీటర్ల దూరంలో ఉన్న చిన్నపట్టణంలో ఏదో ప్రయివేటు కంపెనీలో స్టెనోగ్రాఫర్‌గా పనిచేస్తోంది జానకి.

ఆమెను వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నాను. ముందుగా ఆమెను కలుసుకుని మాట్లాడే ధైర్యం నాకు లేదనిపించింది. అందుకే ఓ ఉత్తరం రాశాను. ఒకసారి మోసపోయిన మగువ పురుషుణ్ణి చూస్తూనే రెచ్చిపోయి నానామాటలూ అనవచ్చు. ఉత్తరంలో నా ఉన్నతాశయం గురించి రాస్తూ, ఆమె గత చరిత్ర గురించి నాకు తెలిసినా దాంతో నాకేమీ సంబంధంలేదని స్పష్టం చేశాను. ఆ ఉత్తరాన్ని రామకృష్ణకు చూపించాను. నేను చేయబోయే ప్రతి మంచిపని గురించీ వాడికి సమాచారమందించకుండా ఉండలేను. అయితే జానకిని పెళ్ళాడాలనుకుంటున్నట్లు మోహన్‌కి చెప్పలేదు. చెడ్డవాళ్ళకు చేయబోయే మంచి పనులగురించి చెప్పకూడదు కదా! రామకృష్ణ ఆ ఉత్తరం చదివి నాకేసి జాలిగా చూసి - "మోహన్‌కీ సమాజంలో ఉన్నతస్థానం లేదు. మనిషిని చూడగానే వాడెలాంటివాడో అంచనా వేసేయొచ్చు.. అలాంటివాడిని స్నేహితుడిగా అంగీకరించిన ఆడపిల్ల స్వభావం మంచిదయుండదు. మన్నికయిన ఆడపిల్లలలాంటి వాడితో తిరగరు. నామాట విను. పెడదారులు పట్టిన నీ బుద్ధిని మంచిదారికి మళ్ళించు" అన్నాడు.

కానీ నేను మైకంలో ఉన్నాను. రామకృష్ణ మాటలు లెక్కచేయలేదు. అప్పుడు వాడు - "నామాట విని కనీసం ఒకసారి ఆ పిల్లను కలుసుకో - విషయం చెప్పకుండా పరిచయం చేసుకో - నచ్చితే అప్పుడూ పెళ్ళిచేసుకో. ముందుగా ఇలాంటుత్తరం మాత్రం వ్రాయకు. అనర్థాలకు దారితీస్తుంది" అన్నాడు.

ఈ సలహా నాకు సబబుగానే తోచింది. నేను బస్సు ప్రయాణం చేసి జానకి ఊరు వెళ్ళాను. అప్పుడామె ఊళ్ళో లేదు సెలవు తీసుకుని స్వగ్రామం వెళ్ళిందట. ఒకవిధంగా అదే నాకు మంచిదయింది. ఆమె గురించి అన్నిచోట్లా కొంత వాకబు చేశాను.

ఆఫీసులో జానకికి చాలా మంచిపేరుంది. వర్కులో సిన్సియర్! టైపింగులో ఆమెకు ఆమే సాటి! మనిషి చాలా బుద్ధిమంతురాలు. కానీ పాపం - ఎలా పడిందో ఓ వంచకుడి వలలో చిక్కుకుంది. దెబ్బతింది. అప్పట్నించీ అన్యమనస్కంగా ఉంటోంది. అయినా ఆఫీసు పనిలో లోటు రానివ్వదు. వంక దొరకనివ్వదు.

నాకు చాలా సంతోషమేసింది. జానకి ఆ ఊళ్ళో వేరే గది తీసుకుని ఉంటోంది. ఇంటివాళ్ళు కూడా ఆమె గురించి ఎంతో గొప్పగా చెప్పి - "ఎంతో పుణ్యం చేసున్నవాడికి తప్ప అలాంటి భార్య దొరకదు. ఆమెను మోసం చేసిన వెధవ పురుగులు పట్టిపోతాడు" అన్నారు.

జానకి, మోహన్‌ల ప్రణయం చాలామందికి తెలిసిందంటే జానకి తిరుగుబోతు కాదన్నమాట. ఆమె మోహన్‌ని గ్రుడ్డిగా నమ్మింది - అంతే!

నేను జానకి దూరబంధువునని చెప్పుకుని అక్కడ రెండురోజులున్నాను. జానకి రానే వచ్చింది.

ఆమెను చూడగానే తెల్లబోయాను.

నల్లటిరంగు, పొట్టి జుత్తు, ఎత్తుపళ్ళు........

ఆమెను నా భార్యగా ఊహించుకోవడం ఎలా?

కురూపిని వివాహం చేసుకోవడం తప్పని నా అభిప్రాయంకాదు. నేను ప్రవర్తనలో పతితనే కానీ అందంలో పతితను కోరుకోలేదు. అసలు సంగతి ఆమెకు చెప్పకుండా ఏవో అబద్దాలు చెప్పి అక్కణ్ణించీ బయటపడి మా ఊరు చేరుకుని రామకృష్ణకు జరిగింది చెప్పాను.

"నాకు తెలుసు - ఇలాగే జరుగుతుందని! ఆమె కురూపికాబట్టి ఆమె వెంట మగాళ్ళు పడడం అరుదు. మోహన్ నాలుగు మాయమాటలు చెప్పేసరికి లొంగిపోయి ఉంటుంది" అన్నాడు రామకృష్ణ.

"కానీ - ఇలా జరుగుతుందని నేనూహించలేదు. మోహన్ ఆమె అందానికి అప్సరస అని చెప్పాడు" అన్నాను.

"అన్నవాడి అభిరుచి ఎలాంటిదో ముందు నీవు తెలుసుకోవాలి!"

"వాడి అభిరుచి గురించి జానకిని చూసేవరకూ నేను సందేహించలేకపోయాను...."

"సరే - ఊహలో అయితేనేం - శ్రీదేవి, జయప్రదను నిరాకరించడం సాధ్యపడిన వాడి అభిరుచి గురించి నీకేమోగానీ - నాకేమీ సందేహం లేదు" అన్నాడు రామకృష్ణ.

అందులో నేను రామకృష్ణ మాటలు నమ్మానన్న వెటకారముందేమో నాకు తెలియదు. కానీ అప్పుడు నా అభిరుచి మాత్రం నన్ను వెక్కిరిస్తోంది.

జానకి మానసికంగా పతిత అయితే పెళ్ళిచేసుకోవాలనుకున్నాడు. కానీ అందంలేని కారణంగా ఆమెను స్వీకరించలేక పోతున్నాను. అంటే నేను మనిషి చేసిన తప్పునే గానీ, దేవుడు చేసిన తప్పును క్షమించడానికి సిద్ధంగాలేను.

నా అభిరుచి మోహన్ అభిరుచి కన్నా అల్పమైనది!!

*****

## గోవిందరావ్వూ - కథా!

నేనొక నిరుద్యోగిని. ఉద్యోగం కోసం ఏడాది నుంచి కాళ్ళరిగేలా తిరుగుతున్నాను.



నాకో అన్నయ్యున్నాడు. దూరప్రాంతంలో ఉంటున్నాడు. తనకు వచ్చే జీతంలోంచి అతి కష్టం మీద ఓ వందరూపాయలు నాన్నకు పంపిస్తున్నాడు.

నాకో చెల్లెలుంది. ఇంటర్మీడియట్ చదువుతోంది. అది చాలా అందంగా ఉంటుంది. దానికి ఎన్నికైన సంబంధం చూసి పెళ్ళిచేయాలని నాన్న ఆశ. అందుకోసం చాలా కష్టపడి డబ్బు పోగుచేస్తున్నాడు. తను జబ్బుపడ్డా డాక్టరు దగ్గరకు వెళ్ళకుండా, తనకు ప్రాణం మీదకు వచ్చే అవసరం కలిగినా వాడకుండా ఆయన వేరే పదివేలు పోగేశాడు. ఆ డబ్బు కేవలం చెల్లెలి పెళ్ళికోసం!

ఒకళ్ళిద్దరు నన్ను అయిదేసి వేలు ధరావతు కడితే ఉద్యోగం ఇప్పిస్తామన్నారు. నాన్న

నాతో - "నిన్ను బియ్యేదాకా చదివించాను. నా ఇంట్లో ఉన్నంతకాలం తిండిపెడతాను. నీ ఉద్యోగానికి నా వల్ల పైసా సాయం కూడా లభించదు. నీ బ్రతుకేదో నీది -" అని ఖచ్చితంగా చెప్పేశాడు. కానీ బయటకు అప్లికేషన్సు పెట్టాలంటే డబ్బిస్తాడు పాపం. నా తిండి ఖర్చేకాక నిత్యం ఉతికిన బట్టలు వేసుకునేందుకు, షేవింగ్ వగైరాలకు - ఇంట్లో లోటులేదు.

ఆ కారణంగా బయటకు వెడితే చూసేవాళ్ళకు నేను చాలా దర్జాగా కనపడతాను. అదే నా ప్రాణాలమీదకు తెస్తుందని నేనూహించలేదు.

ఒకరోజున బజార్లో కనబడ్డాడో యువకుడు. అతడికి పద్దెనిమిదేళ్ళుంటాయేమో - అంతే!

మాసిన బట్టలు కట్టుకునాడు. అతడి కళ్ళలో పుట్టెడు దిగులు...

"నమస్కారం!" అన్నాడతడు.

ఎవరా అన్నట్లు చూశాను.

"నన్ను గోవిందరావంటారండి - అందరూ గోవిందా అని పిలుస్తారు. మీరూ అలాగే పిలవచ్చు..." అన్నాడతడు చనువుగా.

"నాకు నిన్ను పిలవాల్సిన అవసరమేమిటి?" అన్నానాశ్చర్యంగా.

"నన్ను పిలిస్తే పుణ్యం, పురుషార్థమూ - " అన్నాడతడు.

నేను చిరాగ్గా చూశానతడివంక. పరిచయం లేనివారితో నేను చనువుగా ఉండను. పరిచయం లేనివారు నాతో చనువుగా ఉంటే చిరాకు.

అతడు వెంటనే "సార్ - అసలు విషయం చెప్పేస్తాను. మా అమ్మ, నాన్న యాక్సిడెంటుకు గురై హాస్పిటల్లో ఉన్నారు. ఇద్దరూ ప్రమాదస్థితిలో ఉన్నారు. ఆపరేషన్ చేయకపోతే వాళ్ళు బ్రతకడం కష్టంట. డాక్టరేమో ఆపరేషనుకి వెయ్యిరూపాయలు కావాలంటున్నాడు..." అన్నాడు.

ఇదేదో అడుక్కునే బాపతని అర్థమయింది "నాకు డబ్బుకాదు కావలసింది - మీ సాయం... చాలా చిన్న సాయం..." అన్నాడు గోవిందరావు.

"హాస్పిటల్లో డాక్టర్లెవరూ నాకు తెలియదు..."

"డాక్టర్లెవరూ మాటవిని సాయం చెయ్యరు సార్. వాళ్ళకు డబ్బుకావాలి..." అన్నాడు గోవిందరావు.

"అయితే నేనేం చేయాలి..." అన్నాడు గోవిందరావు.

"నా కథ పూర్తిగా వింటే నా బాధ అర్థమవుతుంది సార్..."

నేనూ ఖాళీగానే ఉన్నాను కాబట్టి అతడి కథ వినసాగాను.

గోవిందరావు చాలా పేదకుటుంబంలో పుట్టాడు. తలిదండ్రుల కతడు తొమ్మిదో సంతానం. అతణ్ణి తలిదండ్రులు విశ్వనాథం దంపతులకు దత్తత ఇచ్చారు. విశ్వనాథం దంపతులకు పెళ్ళై పదేళ్ళయినా సంతానం లేదు. గోవిందరావును పెంచుకుని ఏడాది తిరక్కుండానే వాళ్ళకో కొడుకు పుట్టాడు. ఆ తర్వాత మరో అయిదేళ్ళలో మరో ముగ్గురు పిల్లలు కలిగారు. గోవిందరావు పాదం మంచిదని అంతా మెచ్చుకున్నారు. కానీ గోవిందరావుకు కష్టాలారంభమయ్యాయి.

అయిదేళ్ళ వయసులో వాడా ఇంట ప్రవేశించాడు. పదేళ్ళ వయసొచ్చేసరికి వాడికా ఇంట్లో అంతా పరాయివాళ్ళై పోయారు. పెంపుడు తల్లి వాడిని నానామాటలూ అనేది. కొట్టేది. వాడేం చేసినా తప్పుపట్టేది.

గోవిందరావు దీనికి తట్టుకోలేక కన్న తల్లిదండ్రుల దగ్గరకి పారిపోయాడు. వాళ్ళతణ్ణి తరిమికొట్టారు.

"మా బ్రతుకే మాకు నరకంలా ఉంది. ఇక్కడున్నా నీకు చాకిరీ తప్పదు. చీవాట్లు తప్పవు. దెబ్బలు తప్పవు. అక్కడైతే నీకు కడుపునిండా తిండి ఉంటుంది. ఇక్కడదీ ఉండదు. వెళ్ళు... అక్కడికే పో..." అన్నాడు తండ్రి.

అంటే గోవిందారావా ఇంట్లో పనివాడిలా బ్రతకాలి. తిండికోసం ఆత్మాభిమానం చంపుకుని అక్కడుండాలి.

గోవిందరావు బాగా ఆలోచించి తిండికోసమే అయితే వాళ్ళింట్లోనే ఎందుకు పనిచేయాలో అనుకుని ఇంట్లోంచి బైటకు వచ్చేశాడు.

అప్పుడు వాడు పడ్డ కష్టాలన్నీ ఇన్నీ కాదు.

మాటలు మోశాడు. కప్పులు కడిగాడు. రాళ్ళు కొట్టాడు.

ఎంత కష్టపడ్డా ఎక్కడా వాడికి గౌరవం లభించలేదు. కడుపునిండా తిండి దొరకలేదు.

ఈలోగా ఓ గూండా వాడిని పట్టుకున్నాడు. వాడు గోవిందరావు సంపాదనలో వాటా అడిగాడు.

"నేను నీకెందుకు డబ్బులివ్వాలి?" అన్నాడు గోవిందరావు.

"నీకెవ్వరూ లేరుగా - నేను నీకు పెద్దన్నను..." అన్నాడా గూండా.

"నాకెవ్వరూ వద్దు. ఒక్కణ్ణే ఉంటాను..."

"ఉంటానంటే కుదరదు. నీకు నా రక్షణ అవసరం" అన్నాడా గూండా.

"ఎందుకు?"

"నువ్వింకా బాగా కుర్రాడివి. ఎవరైనా నీకాళ్ళూ, చేతులూ విరిచేసో, కళ్ళు పొడిచేసో నిన్ను బిచ్చగాణ్ణి చేయవచ్చు. అప్పుడు నువ్వు పూర్తిగా వేరొకరి మీద ఆధారపడాల్సుంటుంది..."

గోవిందరావు హడలిపోయాడు.

"అన్నా - నన్ను రక్షించు..." అన్నాడు.

"రక్షిస్తాను - డబ్బులివ్వు మరి..." అన్నాడు గూండా.

"డబ్బులివ్వు మరి.." అన్నాడు గూండా.

గోవిందరావు గూండాకు డబ్బులివ్వసాగాడు. కొన్నాళ్ళు గడిచేక గూండా గోవిందరావుతో - "ఒరేయ్ నువ్విచ్చే డబ్బులు నాకు చాలడం లేదు. కనీసం రోజుకి పదిరూపాయలైనా ఇస్తే తప్ప నిన్ను రక్షించలేనేమో!" అన్నాడు.

"నా సంపాదనే రోజుకి పదిరూపాయలు లేదు. నీ కెక్కణ్ణించి తెచ్చిచ్చేది?" అన్నాడు గోవిందరావు.

"జేబులు కట్ చేయకూడదూ - రోజుకి ఒకోసారి వెయ్యిరూపాయలు కూడా దొరకవచ్చు...." అన్నాడు గూండా.

"నేను దొంగతనాలు చేయను...." అన్నాను

"జేబు దొంగతనమంటే నేరమేం కాదు. కష్టమూ కాదు..." అంటూ గూండా వాడిని ప్రోత్సహించాడు.

గోవిందరావుకు భయం వేసింది. తను పతనం కావాలని ఇంట్లోంచి బైటకు రాలేదు. గొప్పవాడు కావాలనుకున్నాడు. గౌరవంగా బ్రతకాలనుకున్నాడు.

ఇప్పుడు దొంగతనాలకు దిగితే నలుగురూ ఏమనుకుంటారు?

విశ్వనాథం మంచిపనే చేశాడు - ఓ దొంగ వెధవనింట్లోంచి గెంటేశాడు - అనుకుంటారు.

లేనివాళ్ళవి లేకి బుద్ధులు - అనుకుంటారు.

గోవిందరావు మనసు కూడా దొంగతనం వైపు లాగుతోంది. ఈ ప్రపంచంలో గొప్పవాళ్ళందరూ ఏదోవిధంగా సాటివాణ్ణి దోచి డబ్బు సంపాదిస్తున్నారని అంతా అంటారు. మంచిగా ఉండేవాళ్ళు సామాన్యులుగా మిగిలిపోతున్నారు.

ఒకరోజు గోవిందరావు దొంగతనానికి సిద్ధపడ్డాడు. ఆ సమయంలో అతణ్ణి పోలీసులు పట్టుకున్నారు.

విధం చెడ్డా ఫలం దక్కలేదని గోవిందరావు బాధపడ్డాడు.

"అయినా ఇంకా దొంగతనం చేయకుండానే చేయబోతున్నట్లు పోలీసులెలా గుర్తించారా?" అని అతడికాశ్చర్యం కూడా కలిగింది. తనేమో పోలీసులకు తెలిసిన దొంగ కాదు. తన్ను వాళ్ళెలా అనుమానించారో?

పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టరతడి వంక తీక్షణంగా చూసి - "నువ్విల్లు వదిలి ఎందుకు పారిపోయావు? నీ పెంపుడు తండ్రి ఫిర్యాదు చేశాడు" అన్నాడు.

అప్పుడు గోవిందరావుకు కలిగిన ఆశ్చర్యమింతా అంతా కాదు.

పెంపుడు తండ్రి విశ్వనాథం అతడి కోసం అన్వేషిస్తున్నాడు. ఎందుకో?

ఆ ప్రశ్నకు సమాధానం తొందరగానే లభించింది.

నాలుగు రోజుల క్రితం ఓ స్కూలు బస్సుకు యాక్సిడెంటయింది. అందులో విశ్వనాథం పిల్లలు నలుగురూ ఉన్నారు. వాళ్ళకు బాగా గాయాలయ్యాయి.

గోవిందరావునలక్ష్యం చేయడంవల్లనే పిల్లలు ప్రమాదానికి గురయినట్లు చాలామంది భావించారు.

విశ్వనాథం వెంటనే గోవిందరావుకయి అన్వేషణ ప్రారంభించాడు. ఆయన నలుగురికీ చెప్పకున్నదేమంటే ఇంతకాలం గోవిందరావు తలిదండ్రుల దగ్గర ఉన్నాడనుకుంటున్నానని!

గోవిందరావు విశ్వనాథం ఇంట్లో ప్రవేశించాడు మళ్ళీ.

"ఎందుకు పారిపోయావురా?" అంది పెంపుడు తల్లి.

గోవిందరావు బయటి ప్రపంచాన్ని చూశాడు. అయిన వాళ్ళు లేనివాళ్ళకక్కడ రక్షణ లేదు. వాడిక విశ్వనాథం ఇల్లు వదలకూడదనుకున్నాడు. వాడి పెంపుడు తల్లిదండ్రులు కూడా వాడి నిప్పుడు బాగా చూసుకుంటున్నారు.

గోవిందరావు ప్రయివేట్‌గా మెట్రిక్ కట్టి పాసయ్యాడు. ఇంటర్మీడియట్‌లో చేరి అదీ పాసయ్యాడు. తర్వాత చదువుకోవాలని లేదనీ - ఏదైనా వ్యాపారం చేస్తాననీ అన్నాడు.

"వ్యాపారం చేయాలంటే రెండు ముఖ్యసూత్రాలు తెలుసుకోవాలి. ఒకటి - అందులోని మెలుకువలు నేర్చుకోవడం. రెండు - పెట్టుబడిగా ఒకరి ధనం కాక స్వంత డబ్బునే వాడడం. అప్పుడే పెట్టుబడి విలువ తెలుస్తుంది" అన్నాడు విశ్వనాథం. ఆయన గోవిందరావునో పెద్ద డిపార్ట్‌మెంటల్ స్టోర్‌లో పనికి కుదిర్చాడు. గోవిందరావక్కడే పని చేస్తూ వ్యాపారంలో మెలుకువలు నేర్చుకుంటున్నాడు.

ఇలా ఉండగా అక్కడ విశ్వనాథానికేదో తెలియని జబ్బుచేసి మంచాన పడ్డాడు. ఆస్తివ్యవహారాలు చూడ్డానికాయన బావమరిది కుటుంబంతో సహా వచ్చి అక్కడే మకాం పెట్టాడు. విశ్వనాథం కుటుంబానికి కష్టాలు ప్రారంభమయ్యాయి. అక్కగారిని మంచి మాటలతో మోసం చేస్తున్నాడు విశ్వనాథం బావమరిది. తమ్ముడుకదా అని విశ్వనాథం భార్య అతణ్ణి నమ్మింది.

విశ్వనాథం భార్య మోసపోతోందని గోవిందరావు గ్రహించాడు. తనే ఆ విషయం ఆమెకు చెప్పాలనుకున్నాడు. అయితే విశ్వనాథం బావమరిది గోవిందరావుకంటే తెలివయినాడు. అతడు తను కాజేసే డబ్బును - గోవిందరావు కాజేసినట్లుగా విశ్వనాథం భార్యలో అనుమానం రేకెత్తించాడు.

క్రమంగా విశ్వనాథం బావమరిది ఎత్తు ఫలించింది. విశ్వనాథం భార్య గోవిందరావునేమీ అనలేకపోయేది కానీ అతణ్ణి దగ్గరకు రానిచ్చేది కాదు. అతడి మాటలు వినేదికాదు.

ఈలోగా విశ్వనాథం బావమరిది ఇంకో పెద్ద పథకం వేశాడు. ఫలితంగా ఒక రోజున డిపార్ట్‌మెంటల్ స్టోర్‌లో దొంగతనం చేసినట్లు అతడి మీద తప్పుడు నేరం ఆపాదించబడింది. ఉద్యోగం ఊడింది.

గోవిందరావు తలెత్తుకోలేకపోయాడు.

తప్పు చేసినట్లు అతడి మీద నేరం ఆపాదించబడింది కాబట్టి - ఇంట్లో అంతా అతణ్ణి చిన్నచూపు చూడడమే కాక సూటీపోటీ మాటలనసాగారు. గోవిందరావు అన్నీ సహించాడు. విశ్వనాథానికి ఆరోగ్యం చేకూరితే మళ్ళీ అన్నీ చక్కపడతాయని అతడి ఆశ. కానీ విశ్వనాథం బావమరిది విశ్వనాథానికి సరయిన వైద్యం చేయించడం లేదు. విశ్వనాథం పూర్తి అసహాయ దశలో ఉన్నాడు.

ఇలాంటి సమయంలో దంపతులు చనిపోతే - విశ్వనాథం బావమరిది వాళ్ళ ఆస్తిని మొత్తం గుటకాయస్వాహా చేసి విశ్వనాథం పిల్లలను కష్టాలకు గురి చేస్తాడు. విశ్వనాథం బ్రతకాలంటే వెయ్యి రూపాయలు కావాలి.

"ఎంతో ఆస్తి ఉండి - వెయ్యి రూపాయల కోసం విశ్వనాథం దిక్కులేణి చావు చచ్చేలా ఉన్నాడు. ఆయన నాకు కన్నతండ్రి కాకపోయినా - నాలో కృతజ్ఞత ఉంది. నేను ఈ నాడీమాత్రంగానయినా ఉంటే అందుకాయనే కారణం. ఆయన్ను నేనెలాగైనా బ్రతికించుకోవాలి" అన్నాడు గోవిందరావు.

"అందుకు నేనేం సాయం చేస్తాను?" అన్నాను.

"చాలా సింపుల్ సార్! మనిద్దరం అప్పలస్వామి కిళ్ళీకొట్టు దగ్గరకు వెడదాం! అక్కడ నేను అప్పల స్వామిని పిలుస్తాను. మీరేమో అతడు చూస్తుండగా మీ పర్సు నాకిచ్చి - ఇది అమ్మగారికివ్వడం మరచిపోయాను. నువ్వింటికెళ్ళి ఇచ్చేసొచ్చేయ్ అనండి. నేనా పర్సు తీసుకుని వెళ్ళిపోతాను. అప్పుడు అప్పలస్వామి ఆశ్చర్యపోతాడు. నా నమ్మకాన్ని గురించి అతడివద్ద పొగడండి. సందు చివర మిమ్మల్ని నేను కలుసుకుంటాను..." అన్నాడు గోవిందరావు.

"ఒకవేళ పర్సు తీసుకుని గోవిందరావు వెళ్ళిపోతే?" ఈ సందేహం నా మనసులో కలిగింది. కానీ పైకి అనడానికి మొహమాటపడ్డాను. గోవిందరావు చూడ్డానికి చాలా పెద్దమనిషి తరహాగా ఉన్నాడు. మర్యాదస్తుడిలా కనబడుతున్నాడు.

గోవిందరావు నా మనసులో భావం చదివినట్లున్నాడు.

"సార్! మనం హాస్పిటల్‌కి ఫోన్ చేసి కనుక్కుందాం. విశ్వనాథంగారి పరిస్థితెలాగుందోనని నా మనసు తల్లడిల్లిపోతోంది..." అన్నాడు గోవిందరావు.

ఇందులో నాక్కలిగే నష్టమేం లేదు కదా అని వెంటనే అంగీకరించాను.

ఇద్దరం పక్కనే వున్న హోటల్లోకి వెళ్ళాం. గోవిందరావే డబ్బిచ్చి ఏదో నెంబరు తిప్పాడు - "గర్నమెంటు హాస్పిటలేనా!" అన్నాడు. అవతల్నించి సమాధానం వచ్చిందో ఏమో - ఫోన్ నా కిచ్చి - "సార్! నాకు సరిగా వినబడ్డంలేదు. విశ్వనాథంగారి గురించి తమరే అడగండి" అన్నాడు.

రిసీవర్ అందుకున్నాను. అవతల్నించి ఎవరో - "హలో - జనరల్ హాస్పిటల్.... జనరల్ హాస్పిటల్..." అంటున్నారు.

నేను విశ్వనాథం పరిస్థితిని గురించి అడిగాను.

"అలాగే ఉంది. ఆపరేషన్ చేయాలి. అయినవాళ్ళెవరూ పూనుకోవడంలేదు. సాయంత్రం దాటితే ప్రమాదం కూడా..." అందవతలి గొంతు.

నేను గోవిందరావుకి విషయం చెప్పాను.

గోవిందరావు కళ్ళు తుడుచుకుని - "నాన్నా! సాయంత్రంలోగా నీకోసం వెయిరూపాయలు పోగుచేసే బాధ్యత నాది...." అన్నాడు.

ఫోన్లో అవతల క్లిక్ అన్న శబ్దం వినిపించడం వల్ల నేను రిసీవర్ పెట్టేశాను.

ఇద్దరం హోటల్లోంచి బయటకు వచ్చాం.

"సార్ - మనమిప్పుడు వెంటనే అప్పలస్వామి కిళ్ళీ కొట్టు దగ్గరకు వెడదాం - " అన్నాడు గోవిందరావు.

"అందువల్ల ప్రయోజనం?"

"అప్పలస్వామి కిళ్ళీకొట్టు మీద బాగా సంపాదిస్తున్నాడు సార్! వాడు నాకు వెయ్యిరూపాయలు అప్పుగా ఇస్తానన్నాడు. నాకు ఉద్యోగం కూడా ఇప్పిస్తాడు. నెలనెలా జీతంలోంచి రెండువందలు విరగ్గోసుకునే ఏర్పాటు చేస్తాడు. నా ఉద్యోగానికి చదువక్కర్లేదు. నమ్మకం కావాలి. డిపార్ట్‌మెంట్ స్టోర్‌లో నా మీద దొంగతనం నేరం మోపబడినట్లు అప్పలస్వామికి తెలుసు. ఆ నేరం అన్యాయంగా నా మీద మోపబడిందని వాడికి చెప్పాను. నమ్మడం లేదు. మీరు నాకు పర్సిస్తే నేను మారిపోయినట్లు అప్పల స్వామి గ్రహిస్తాడు...."

"నేనెవరో అప్పలస్వామికి తెలియదు - నువ్వు ముందుగా చెప్పి ఏర్పాటు చేసుకున్నావని ఊహించలేడా?" అన్నాను.

"అప్పలస్వామికి మీరు తెలియకపోవటమేమిటి?" అన్నాడతడు.

"అప్పలస్వామి అనే పేరు నేనెప్పుడూ వినలేదు..." అన్నాడు.

"అదేంటి బాబూ - అప్పలస్వామి అస్తమానూ మీ గురించి నాకు చెబుతుంటాడూ!" అన్నాడు గోవిందరావు.

"అసలు నేనెవరో నీకెలా తెలుసు!" అన్నాననుమానంగా.

"మీరెవరో నాకేం తెలుసు బాబూ? చాలాసార్లు మిమ్మల్ని అప్పలస్వామి కొట్టువద్ద చూశాను. ఎవరని అడిగితే కిళ్ళీకొట్టు పెట్టుకునేందుకు మీ నాన్నగారు తనకు చాలా సాయంచేశారని చెప్పాడు. మీరేమో దానగుణంలో తండ్రిని మించిన కొడుకన్నాడు. మీ వినయవిధేయతల గురించి ఎంతో మెచ్చుకున్నాడు...."

నాకు తెలిసి ఏ కిళ్ళీకొట్టువాడితోనూ నాకు పరిచయం లేదు. అప్పలస్వామి పేరుగల వాళ్ళెవరితోనూ పరిచయమున్న గుర్తులేదు. అదే గోవిందరావుకు చెప్పాను.

"అరే - చాలా ఆశ్చర్యంగా ఉందే... అయితే మీకు సునీతమ్మగారు కూడా తెలియదా?" అన్నాడు గోవిందరావు.

"సునీత ఎవరు?"

"పక్కవీధిలో ఉంది వాళ్ళిల్లు. మీరు, సునీతమ్మ కలిసి తిరగడం చాలాసార్లు చూశాను. ఆమెకు నేను చాలాసార్లు బజారుకు సాయంగా వెళ్ళాను. మీ గురించడిగితే మీరిద్దరూ ప్రేమించుకున్నట్లు చెప్పింది -..."

"నీ మాటలు వింటూంటే నువ్వు మోసగాడివని చాలా అనుమానం కలుగుతోంది. నాకే సునీతా తెలియదు -" అన్నాను.

"నన్ను నిర్లక్ష్యం చేసినా, అగౌరపర్చినా - నా పెంపుడు తండ్రి ఆపదలో ఉన్నాడని అప్పలస్వామివంటి దుష్టిడి దగ్గర అప్పు తీసుకుని ఆయన్ను కాపాడాలనుకుంటున్న నన్ను మీరు మోసగాడని అనుమానించారు. సరే మిమ్మల్ని సాయమడగడం నా పొరపాటు. కానీ మీరు పొరపాటుపడ్డారని నేను రుజువు చేయాలి. రండి... పక్క వీధిలో సునీతమ్మ ఇంటికి వెడదాం. ఆమె మిమ్మల్ని గుర్తుపట్టకపోతే - మీరు నాతో అప్పలస్వామి కిళ్ళీగొట్టు దగ్గరకు రానవసరంలేదు..." అన్నాడు గోవిందరావు.

ఇదేదో తమాషాగా ఉందనిపించింది.

ఇద్దరం పక్క వీధిలోకి వెళ్ళాం. గోవిందరావు నన్నో ఇంటి ఆవరణలో తీసుకుని వెళ్ళాడు. అక్కడ నుంచి పూలతోట ఉంది. తోటలో ఓ అమ్మాయి పూలు కోసుకుంటోంది.

"సునీతమ్మా - ఎవరొచ్చారో చూడు..." అన్నాడు గోవిందరావు.

ఆ అమ్మాయి వెనక్కు తిరిగి నన్ను చూసి - "అరే! రాజూ నువ్వా? ఎన్నడు లేనిది మా ఇంటి ఆవరణలో అడుగుపెట్టావేమిటి?" అంటూ ఒక్క ఉదుటున నన్ను సమీపించి బలంగా కౌగిలించుకుంది.

ఒక్క క్షణం నాకు ప్రపంచం తెలియలేదు. ఆమె చాలా అందంగానూ, ఆకర్షణీయంగానూ ఉంది. చనువుతో కూడిన ఆమె బిగికౌగిలి ఒక్కసారి నన్నే లోకాలకో తీసుకుని వెళ్ళిపోయింది. విడిపించుకోవాలని కూడా నాకు తోచలేదు.

ఆమె నన్ను తనే వదిలిపెట్టి - "ఏమిటీ - మాట్లాడవు? రెండురోజుల్నుంచీ కనిపించడంలేదు. నా మీద కోపం వచ్చిందా? నీ కోసం నెహ్రూ పార్కులో చూశాను. తెలుసా?" అంది.

నేను తమాయించుకుని - "నా పేరు రాజు కాదు. మిమ్మల్ని చూడడం ఇదే మొదటిసారి -" అనాను.

"నువ్వు రాజువి కాదూ?...." అందామె ఆశ్చర్యంగా.

"కాదు. మీరంటున్న ఆరాజెవరో నాకు తెలియదు..."

ఆమెకు నా మాటలమీద నమ్మకం కుదరడానికి కాసేపు పట్టింది. అప్పుడామె ఎంతో సిగ్గుపడి - "అచ్చం రాజులాగే ఉంటే పొరపడ్డాను. నన్ను మన్నించండి" అంది.

ఆమె సిగ్గుకూడా ఎంతో అందంగా ఉంది. ఆమె నా కిచ్చిన అపురూపమైన కానుక- నేను రాజును కాలేకపోయినందుకు బాధగా ఉంది. నేనామెను మన్నించాలా?

"అయినా గోవిందరావేడీ! నాతో ఇలా ఆడుకోవడం తప్పని తెలియదూ?" అందామె.

నేను వెనక్కి తిరిగి చూశాను. గోవిందరావు లేడక్కడ.

"రాజునుచూస్తే నాకు వళ్ళు తెలియదు. గోవిందరావు సిగ్గుతో పారిపోయుంటాడు..." అంటూ సిగ్గుపడిందామె.

"సెలవు..." అంటూ అక్కణ్ణించి కదిలాను.

"మరెప్పుడైనా మా ఇంటికి రండి. మిమ్మల్ని మా బావకు చూపిస్తాను. వచ్చే నెలలోనే మా పెళ్ళి..." అని .... "బావంటే రాజు. మీరు నిజంగా రాజు కాదు కదా!" అందామె.

"నమ్మకం కుదరకపోతే మా ఇంటికి రండి ..." అన్నాను నవ్వుతూ.

"లేదులెండి - బావ మాటకూ మీ మాటకూ కొద్దిగా తేడా ఉంది. అదీకాక పెళ్ళయ్యేదాకా ఈ ఇంట్లో అడుగు పెట్టనని బావ ప్రతిజ్ఞ పట్టాడు. అందుకే మీరొస్తే ఆశ్చర్యపోయాను..." అందామె.

జరిగిన అనుభూతి నన్నింకా వదలడంలేదు. అందుకే నా వళ్ళింకా జల్లుమంటోంది. ఆమె కూడా ఆ అనుభూతి వదలనంటోందేమో - ఆమె కళ్ళలోని సిగ్గులు తొలిగిపోవడం లేదు.

ఆమెను విడిచి వెళ్ళాలంటే కష్టమనిపించింది. అతి కష్టం మీద ఆ ఇంటి ఆవరణంలోంచి బైటపడ్డాను. ఆ తర్వాత ఎటు నడుస్తున్నానో నాకు తెలియలేదు కాసేపు. తెలిసాక గోవిందరావు గుర్తుకొచ్చాడు. ఆ వెంటనే ....

కిళ్ళీ కొట్టు అప్పలస్వామి... పర్సు....

పాపం - అతడు నిజమే చెప్పాడు. అతడికి నేను పర్సునిచ్చి సాయపడాల్సింది. ఇంతమందికి తెలిసిన ఆ వ్యక్తి నన్ను మోసం చేస్తాడా అనుకుంటూ అప్రయత్నంగా జేబులో చేయిపెట్టి ఉలిక్కిపడ్డాను.

జేబులో పర్సులేదు, ఏమయింది? ఒక్క ఉదుటున వెనక్కు తిరిగి మళ్ళీ ఆ ఇంటికి వెళ్ళాను. తోటలో సునీత కనబడలేదు నాకు పర్సుగానీ అక్కడ పడిందేమోనని వెతికాను. కనపడలేదు. ఒకవేళ పర్సు పడిపోతే ఆమె తర్వాత చూసి ఇంట్లో దాచిందేమోనన్న ఉద్దేశ్యంతో తోటలోంచి ఇంటి గుమ్మం దగ్గరకు వెళ్ళాను. అందుకు కొన్ని మెట్లెక్కి పక్కకు తిరగాల్సి వచ్చింది.

అప్పుటికప్పుడు ఇంటికి తాళమెలా పడింది!

నేను జాప్యం చేయలేదు. చుట్టుపక్కల వాకబు చేశాను. ఆ ఇంట్లోవాళ్ళు రెండురోజులుగా ఊళ్ళో లేరు. ఇంకో నాలుగురోజులుదాకా రారు. ఆ ఇంటాయనకు ముగ్గురు కొడుకులు. అందరూ పెద్దవాళ్ళు. ఆ ఇంట్లో పెళ్ళికాని ఆడపిల్లలు లేరట.

అంటే నేను మోసపోయానా?

నా పర్సుకోసం గోవిందరావు, సునీత కలిసి ఇంత పెద్దనాటకమాడారా?

ఎందుకో ఇదంతా పర్సుకోసం నాటకమంటే నమ్మశక్యంగా లేదు. అందుకే నేను ఆ వెంటనే ఉమాపతి ఇంటికి వెళ్ళాను.

ఉమాపతి రచయిత. నాకంటే పదేళ్ళు పెద్దవాడు. మానవ మనస్తత్వాన్ని కాచి వడపోస్తాడు. అందువల్లనేమో ఆలోచనల్లో అతడు నా కంటే పాతికేళ్ళు పెద్ద.

జరిగిందంతా ఉమాపతికి చెప్పుకుని... "ఇదేమిటంటావ్? నేను మోసపోయానా?" అనడిగాడు.

"నువ్వు మోసపోయావు. గోవిందరావు నీపై రకరకాల ప్రయోగాలు చేశాడు. ముందతడు నీనుంచి జాలిగాధ ద్వారా చందా రాబట్టాలనుకున్నాడు. అది కుదరదని తెలియగానే అప్పలస్వామి కథ చెప్పాడు. అదీ నమ్మవని తెలిసాక సునీత మంత్రం వేశాడు. సునీత పూలు కోసుకుందుకన్నట్లుగా ఆ ఇంటి పూలతోటలో చేరి నీకోసం వేచి ఉంది. నువ్వాఖరి మంత్రంలో పడిపోయావు. నువ్వు సునీత కౌగిలి మైకంలో ఉండగా గోవిందరావు నీ పర్సు కాజేసి పారిపోయాడు. నలుగురిలో జేబుకొట్టడం కంటె ఈ పద్ధతి చాలా మంచిది. ఇందులో సేఫ్టీ ఎక్కువ..." అన్నాడు ఉమాపతి.

"తలుచుకుంటే బాధగా ఉంది. పోయిన డబ్బు పదిరూపాయలే! కానీ పర్సు ఖరీదు పాతికదాకా ఉంటుంది." అన్నాను.

"నీ వేషం డాబు చూసి నీదగ్గరింకా ఎక్కువ డబ్బుంటుందనుకుని ఇంత కష్టపడి ఉంటాడు. నువ్వు గోవిందరావు కథ వినగానే జాలిపడి - జేబులోంచి కొంత డబ్బు తీసి - ఇది దగ్గరుంచుకో - మిగతా డబ్బు మరెవరినుంచైనా అడిగి తీసుకో - అంటావని ఆశించాడు. అలా జరుగలేదు. ఈ నేరస్థుల్లో ఓ హిప్నాటిక్ పవర్ ఉంటుంది. ఎంత పెద్దకథ చెబితే అంత బాగా హిప్నటైజు చేయగలరు వాళ్ళు. కథ పెద్దదైన కొద్దీ నీలో అతడి పట్ల ఏకాగ్రత పెరుగుతుందన్నమాట.... ఏది ఏమైనా నీవదృష్టవంతుడివి.... పదిరూపాయల ఖర్చుతో ఓ అందమైన అమ్మాయి కౌగిలి సంపాదించావు..." అన్నాడు ఉమాపతి.

"నేనిప్పుడమ్మాయిల కౌగిలికోసం తపించిపోవడం లేదు. ఉద్యోగం వచ్చేదాకా ఇలాంటి పది రూపాయలు నాకెంతో విలువైనవి...." అన్నాను బాధగా.

ఉమాపతి వెంటనే నవ్వి - "అమ్మాయిల కౌగిలికోసం తపించిపోవడంవల్లనే కదా - నువ్వు పర్సుపోగొట్టుకున్నావు" - అన్నాడు. అనేసి ఊరుకోకుండా నన్ను కాసేపాట పట్టించాడు.

"ఏది ఏమైనా దొంగలు తెలివిమీరిపోతున్నారు. కొత్త కొత్త పంథాలు తొక్కుతున్నారు -" అన్నాను బాధగా.

ఉమాపతి నన్ను చూసి నవ్వుతున్నాడు.

నేనక్కణ్ణించి ఉక్రోషంగా బయటపడుతూ - "నీకూ ఇలాంటనుభవం అయితే అప్పుడు తెలుస్తుంది -" అన్నాను.

"నేను నీకులా తెలివి తక్కువవాణ్ణి కాదు..."

"నాకు సింపతీ చూపిస్తావని కథ చెపితే నన్ను పరిహాసం చేస్తావా? నాకా గోవిందరావు మళ్ళీ కనబడితే నిన్నూ ఓ పట్టుపట్టమని ప్రోత్సహిస్తాను. అప్పుడు చూస్తాను నీ తెలివి..."

"నా తెలివి చూడాలంటే నీకు గోవిందరావు కనబడనవసరంలేదు. సరిగ్గా రెండు నెలల తర్వాత కనిపించు" అన్నాడు ఉమాపతి.

అపుడు నేనా విషయం మర్చిపోవాలనుకున్నాను. కానీ రెండు నెలల తర్వాత ఉమాపతి నాకోసం కబురెట్టాడు.

వెంటనే వెళ్ళాను.

"గోవిందరావు గుర్తున్నాడా నీకు?" అన్నాడుమాపతి.

"నేను మర్చిపోవాలనుకున్న వ్యక్తిని మళ్ళీ గుర్తు చేస్తావా" అన్నాను బాధగా.

"నువ్వు మర్చిపోవాలనుకోలేదు. కనబడితే అతణ్ణి నాపై ప్రయోగించాలనుకున్నావు. మర్చిపోయావా? ఇప్పుడు నేను నీకు గోవిందరావు కనపడే ఉపాయం చెబుతాను..."

"ఏమిటది?"

"ఈ పుస్తకం చూడు -" అంటూ ఓ పుస్తకాన్ని నా కందించాడు ఉమాపతి.

నేనా పుస్తకం చూసి ఉలిక్కిపడ్డాను. అందులో ఉమాపతి వ్రాసిన కథ ఉంది. ఆ కథ నాకూ గోవిందరావుకూ మధ్య జరిగిన అనుభవం.

"ఇది కథగా రాశావా? ఎందుకు?"

"ఎందుకేమిటి? అదే నా తెలివి. గోవిందరావు, సునీత కలిసి తెలివిగా కథలల్లి ప్రజల్ని మోసం చేస్తున్నారు. వాళ్ళ మోసం గురించి పదిమందికీ తెలియబర్చి హెచ్చరించడం కోసమే ఈ కథ! గోవిందరావువంటి వాళ్ళ ఆట కట్టించడం కోసమే ఈ కథ...."

"అయితే?"

"నీ తెలివి నిన్ను మోసం చేసింది. నా తెలివి పదిమందిని హెచ్చరించడానికి పనికొస్తుంది...." అని నవ్వాడు ఉమాపతి.

"మరి గోవిందరావుని చూపిస్తానన్నావ్?" అన్నాను.

"గోవిందరావుని చూడాలంటే రేపట్నించి రోజూ ఈ పత్రికా కార్యాలయానికి వెళ్ళి సంపాదకుణ్ణి కలుసుకో.... అక్కడికేదో ఒక రోజున గోవిందరావు తప్పకుండా వస్తాడు...."

"ఎందుకు?"

"ఒకటి - తన పథకం అందరికీ తెలిసిపోయిందన్న బాధ..."

"పథకంతోపాటు తనూ బైటపడాలనుకోడు కదా!"

"అనుకోడు... కానీ...." అని ఆగి - "ఇంత పెద్ద పథకంలో అతడు నీనుంచి సాధించినది పదిరూపాయల క్యాషూ, పాతిక రూపాయలు విలువచేసే పర్సునూ..... అదే పథకం నుంచి నేను సంపాదించినది...." అని మళ్ళీ ఆగాడు ఉమాపతి.

"ఏమిటి నువ్వు చెప్పేది?"

"ఈ కథకు నాకు వచ్చిన పారితోషికమెంతో తెలుసుకుందుకు గోవిందరావు సంపాదకుణ్ణి కలుసుకుంటాడు. ఏ శ్రమా లేకుండా అతడికంటే పన్నెండున్నర రెట్లు లాభం పొందానని తెలుసుకుని కుమిలిపోతాడు. అతడిదాకా ఎందుకు? నీ నష్టం నాకు లాభం తెచ్చిపెట్టిందని నీ కేడుపుగా లేదూ?" అన్నాడుమాపతి.

నిజమే! నాకు పదిరూపాయలు పోయిందని బాధపడి ఆ కథ చెబితే - దాంతో నూట పాతిక రూపాయలు లాభం కొట్టాడుమాపతి.

ఈ ప్రపంచంలో ఒకో విశేషం కొందరికి లాభాలానూ, కొందరికి నష్టాలనూ కలిగిస్తుంది. కానీ అన్ని విశేషాలనూ తమ లాభానికే ఉపయోగించుకోగలవారొక్క రచయితలే ఏమో!

నేను చటుక్కున ఉమాపతికి దణ్ణం పెట్టి - "గురూ! నాక్కూడా కథలెలా రాయాలో నేర్పు...." అన్నాను.

"నీవంటి వాళ్ళు లేనిదే కథలు నాకెక్కణ్ణించి వస్తాయి నేర్పడానికి?" అన్నాడుమాపతి నవ్వుతూ.

## సాక్షి కోసం అన్వేషణ

"**ధైర్యవంతుడికి** మరణించినా చావులేదు. పిరికివాడు అనుక్షణం చస్తూనే బ్రతుకుతుంటాడు. ఈ విషయాన్ని మీరందరూ గుర్తుంచుకుని ధైర్యంగా ముందుకు వచ్చి మీరు చూసిన ప్రతి నేరాన్నీ, మీకు తెలిసిన ప్రతి నిజాన్నీ పోలీసులకు తెలియబరుస్తూంటే - అలనాటి రామరాజ్యం మళ్ళీ వస్తుంది. దేశంలో నేరస్థులున్నవారు లేకుండాపోతారు. విన్నవారికి నా మాటలు సందేశం. ఆలోచించే వారికి నా మాటలు హెచ్చరిక!"

ఇన్స్పెక్టర్ చంద్రకాంత్ ఈ మాటలు చెప్పి కూర్చోగానే సభంతా కరతాళ ధ్వనులతో దద్దరిల్లిపోయింది.

అది ఆ ఊళ్ళోని ఓ హైస్కూలు, విద్యార్థులందర్నీ ఉద్దేశించి ఇన్స్పెక్టర్ చంద్రకాంత్ సభలకూ, సమావేశాలకూ వెళ్ళడు. ఆ స్కూలుకు మాత్రం కావాలనే వెళ్ళాడు. ఆహ్వానం తనకు రావడం కోసం అతడు తెర వెనుక నుండి కృషి కూడా చేశాడు.

అందుక్కారణముంది.

ఊరి చివర స్మగ్లింగ్ ఆపరేషన్ జరుగుతుండగా కానిస్టేబుల్ మహేష్ అక్కడికి వెళ్ళాడు. ఒక అనుమానితుడిననుసరిస్తూ అతడంత దూరం వెళ్ళాడు. అక్కడ అతడిద్దరు పుర్రప్రముఖుల్ని చూశాడు. కానీ అతడొక్కడు. ముఠావ్యక్తులు పదిమంది. కానిస్టేబులు తన ప్రాణాలు రక్షించుకునేందు కక్కణ్ణించి పారిపోవలసి వచ్చింది. ముఠావ్యక్తులతణ్ణి తరిమారు.

కానిస్టేబుల్ మహేష్ ఎలాగో ఓ సందులోకి చేరుకున్నాడు. అప్పుడే ఆ సందులో ఓ కుర్రాడడుగు పెట్టాడు. అతడు సెకండ్ షో సినిమా చూసి ఇంటికివెడుతున్నాడు. మహేష్ ఆ కుర్రాడి నాపి తను చూసిన విశేషమూ, తన పరిస్థితీ చెప్పి కబురు పోలీస్ స్టేషన్లో చెప్పమన్నాడు.

ఇంతలో ఆ సందులోకి మహేష్‌ను తరుముతున్న వ్యక్తులు పరుగున వచ్చారు. కానిస్టేబుల్ మహేష్ ఆ కురాణ్ణి హెచ్చరించాడు. వేరే దారిలేక ఆ కురాడు పక్కనే ఉన్న చెత్తకుండీ వెనక దాక్కున్నాడు. తరుముతున్న వ్యక్తులు మహేష్‌ని పట్టుకుని కత్తితో పొడిచారు. చెత్తకుండీ వెనక నుంచి ఆ కుర్రాడా దృశ్యం చూశాడు. ఆ మనుషుల్ని స్పష్టంగా చూశాడు.

మహేష్ స్పృహ తప్పి పడిపోయాక ఆ వ్యక్తులు వెళ్ళిపోయారు. ఆ కుర్రాడు అక్కణ్ణించి పారిపోయి దగ్గర్లో ఉన్న ఓ డాక్టరింటికి వెళ్ళాడు. సమయానికి డాక్టరు నిద్ర పోతున్నాడు. వాచ్‌మన్‌కి ఆ కుర్రాడు మహేష్ పరిస్థితిని వివరించి చెప్పి అక్కణ్నించి వెళ్ళిపోయాడు.

తర్వాత ఆ కుర్రాడు ఇంటికి వెళ్ళి పరిస్థితి చెప్పాడు. ఇంట్లోవాళ్ళతణ్ణి తిట్టి ఆ వ్యవహారం మర్చిపొమ్మన్నారు. ప్రమాదంలో తల దూర్చవద్దన్నారు.

ఇన్స్పెక్టర్ చంద్రకాంత్ మహేష్ హత్య కేసును పరిశోధిస్తున్నాడు. ఎవరో మామూలు గుండాలు చేసిన నేరంగా అతడు - భావిస్తున్నట్లు - మహేష్ హత్యకేసు గురించి పేపర్లలో వచ్చింది.

ఆ కుర్రాడు ఇన్స్పెక్టర్ చంద్రకాంత్‌కో ఉత్తరం వ్రాశాడు. అందులో మహేష్ ఏ పరిస్థితిలో చనిపోయాడో వివరించి ఏకారణంగా తనముందుకు రాలేకపోతున్నాడో కూడా వివరించాడు. సమాజంలో పెద్దమనుషులుగా చెలామణీ అవుతున్న ఆ ఇద్దరినీ బయటపెట్టమనీ, తనిలా ఉత్తరం వ్రాసినట్టు కూడా ఎవరికీ చెప్పవద్దనీ అతడా ఉత్తరంలో కోరాడు.

ఆ ఉత్తరం చంద్రకాంత్ నాశ్చర్యపరచింది.

చదవడానికి అంతా కథలా ఉంది కానీ అది నిజంకావడానికి చాలా అవకాశాలున్నాయి. కానీ ఆ ఉత్తరం ఆధారంగా తనేమీ చేయలేడు. ఆ ఉత్తరం ఎవరో గిట్టని వాళ్ళు సృష్టించారని పెద్దమనుషులు వాదిస్తారు.

ఉత్తరం రాసిందెవరో తెలుసుకోవాలి. ఆ ప్రత్యక్షసాక్షి సాయంతో ఏమైనా చేయొచ్చు.

వచ్చిన ఉత్తరంలో వ్రాసిన వ్యక్తి పేరు లేదు. కవర్ మీ ఫ్రం అడ్రసు లేదు. ఏవీధిలో పోస్టయిందీ చూద్దామా అంటే నడిబజార్లో మెయిన్ పోస్టాఫీసు దగ్గర పోస్టయింది.

ఉత్తరం పోస్టు చేసిన వ్యక్తీ, డాక్టరింటికి కబురు చెప్పిన వ్యక్తీ ఒకరే అయుండొచ్చని చంద్రకాంత్ అనుమానించాడు. వాచ్‌మన్‌కి బాగా తెలుసు. ఎందుకంటే వారానికి మూడు రోజులు, రోజుకు మూడుగంటల చొప్పున ఆ డాక్టరు హైస్కూల్లో ఉంటాడు. వాచ్‌మన్ డాక్టరు గదిబైట కూర్చుని ఒకరొకరినే లోపలకు పంపిస్తాడు. డాక్టరంటే కుర్రాళ్ళకు చాలా ఇష్టం. ఎంత చిన్న కంప్లయింటున్నా సరే వాళ్ళు డాక్టర్ని కలుస్తుంటారు. ఆ హైస్కూలులో చక్కగా అమలుజరుగుతున్న వైద్యసదుపాయమది.

వాచ్‌మన్ వయసు మళ్ళింది రాత్రిపూట కళ్ళంత బాగా కనిపించవు. రాత్రి తన్ను పలకరించినది ఫలానా హైస్కూలు కుర్రాడిని చెప్పగలిగాడు కా నీ ఫలానా కుర్రాడని చెప్పలేకపోయాడు. ఎంత తరచి అడిగినా వాచ్‌మన్ తను చెబుతున్నదానికి అదనంగా సమాచార మివ్వలేకపోయాడు.

ఏమైతేనేం చంద్రకాంత్‌కి కొంత ఆధారం దొరికింది. తనక్కావలసిన వ్యక్తి ఆ హైస్కూల్లో ఉన్నాడు. అతడినెలా గుర్తించడం?

తన దగ్గరున్న ఉత్తరంలో దస్తూరీని బట్టి ఆ కుర్రాణ్ణి గుర్తించాలనుకున్నాడు చంద్రకాంత్. కానీ ఆ కుర్రాడీ విషయంలో చాలా తెలివిగా వ్యవహరించాడు. దస్తూరీ కావాలని పెద్ద అక్షరాలు వంకర టింకరగా వ్రాసినట్లుంది. ఆ ఉత్తరం ఆధారంతో ఓ హైస్కూలు కుర్రాడిని పట్టాలనుకుంటే - గడ్డిమేట్లో సూదికోసం వెతకడమే అవుతుంది.

ఆఖరి మార్గంగా చంద్రకాంత్ విద్యార్థుల్ని ప్రభావితం చేయాలనుకుని - ఆ హైస్కూల్లో ఓ ఫంక్షన్ ఏర్పాటు చేయించి ముఖ్య అతిథిగా వెళ్ళాడు. ఆవేశంగా ఉపన్యాసమిచ్చాడు.

చంద్రకాంత్‌కు కరతాళ ధ్వనులు వినబడడంలేదు. అతడి కళ్ళు ఆత్రుతగా తన ముందున్న విద్యార్థుల్ని పరీక్షిస్తున్నాయి. వారిలోనే తనక్కావలసిన ఆ కుర్రాడున్నాడు. అతడు తన ఉపన్యాసానికి ప్రభావితుడయ్యాడా? లేచి ముందుకు వచ్చి సాక్ష్యం చెబుతాడా?

చంద్రకాంత్ చూస్తూనే ఉన్నాడు. ఎవరూ ముందుకురాలేదు.

వేదికపై తంతు ముగిసింది.

తరువాత వినోద కార్యక్రమాలు...

సాధారణంగా చంద్రకాంత్ వినోద కార్యక్రమాలు చూడడు. కానీ ఈరోజతడికి ఆశగా ఉంది. ఆ కుర్రాడేదో సమయంలో తనవద్దకు వస్తాడు. తనకు సహకరించడానికి సిద్ధపడతాడు. అందుకని కాసేపు తనిక్కడే ఉండాలి. తన్ను చూస్తున్నంతసేపూ అతడు ప్రభావితుడౌతూనే ఉంటాడు.

ముందుగా ఫ్యాన్సీ డ్రస్సయింది. ఒక్కటీ చంద్రకాంత్ బుర్రలోకి ఎక్కలేదు. తర్వాత వరుసగా కొందరు పాటలు పాడారు. చంద్రకాంత్ ఒక్కపాట కూడా వినలేదు. ఆ తర్వాత నాట్యప్రదర్శన. అదో పావుగంట ఉంటుందనీ తర్వాత అరగంట నిడివి నాటకం ఉంటుందనీ వేదిక మీద ప్రకటించడం జరిగింది.

నాట్యం ప్రారంభమయ్యేసరికి చంద్రకాంత్‌లో అసహనం ప్రారంభమయింది. టైమైపోతోంది. ఎవరూ రావడంలేదు.

చంద్రకాంత్ తన పక్కనే ఉన్న హెడ్మాస్టరు వంక చూసి నెమ్మదిగా "బాత్రూం ఎక్కడ?" అన్నాడు

"రండి చూపిస్తాను" హెడ్మాస్టరు లేవబోయాడు.

"నాకు దారి చూపించండి చాలు - మీరు రావొద్దు --" అన్నాడు చంద్రకాంత్..

హెడ్మాస్టరతడికి దారి వివరించాడు.

చంద్రకాంత్ ఆడిటోరియంలోంచి బయటకు వచ్చాడు కానీ బాత్రూంలోకి వెళ్ళలేదు. ఇంకా బయటకు వచ్చి చుట్టూ చూశాడు.

అక్కడ పార్కులాంటి చిన్న పూదోట ఉంది.

చంద్రకాంత్ అందులోకి నడిచాడు.

ఈ ఉపాయం ముందుగానే తనకు స్ఫురించనందుకతడు తన్ను తనే నిందించుకున్నాడు.

తన కళ్ళెదుట హత్యజరగడం చూసిన పసివాడు, హంతకులకు భయపడుతున్న హైస్కూలు విద్యార్థి - ఎంతో కొంత ధైర్యం తెచ్చుకుని తన గురించి తెలియనివ్వకుండా విషయం తెలియబరుస్తూ ఉత్తరం రాశాడు. అతడి ధైర్యాన్నభినందించడానికి బదులతడి ఉనికిని బైట పెట్టాలని చూస్తున్నాడు తను. ఈరోజా కుర్రాడు తన ఉపన్యాసానికి ప్రభావితుడై ఉంటాడు. కానీ పదిమందిలో ఎందుకు బయటపడతాడు? తనను ఏకాంతంగా ఇలాంటి చోట కలుసుకోవాలనుకుంటాడు. అతడి కిలాంటి వకాశం తనూ ఇవ్వాలిగా!

చంద్రకాంత్ అటూ ఇటూ పచార్లు చేస్తుండగా వెనకనుంచి - "సర్!" అన్న పిలుపు వినబడి వెనక్కు తిరిగాడు.

అతడి కళ్ళు మెరిశాయి.

ఓ కుర్రాడు...

"నా పేరు ప్రభాకరం సర్... నైన్తు క్లాసు చదువుతున్నాను. మీతో ఓ ముఖ్య విషయం చెప్పాలని వచ్చాను సర్." అన్నాడతడు.

"నేను నీకోసమే వచ్చాను.." అన్నాడు చంద్రకాంత్.

"మీరు నాకోసమా...? నేను మీకెలా తెలుసును..." ఆశ్చర్యంగా అడిగాడా కుర్రాడు.

"కానిస్టేబుల్ మహేష్ హత్యను నువ్వు కళ్ళారా చూశావు. అవునా?"

"మహేష్ ఎవరు సార్? నాకు తెలియదు..." అన్నాడా కుర్రాడు.

చంద్రకాంత్ తడబడి - "నువ్వు నాకు చెప్పాలనుకుంటున్న విశేషమేమిటి?" అన్నాడు.

"మీకు కిళ్ళీ కొట్టు రంగయ్య తెలుసు కదూ సర్..."

"రంగయ్యెవరు?

"ఓహ్ - మీరు కొత్తగా ఈ ఊరొచ్చారా?"

"అంటే?" అన్నాడు చంద్రకాంత్.

"రంగయ్య విషయం వేరు సర్... అతడు మాయమైనట్లు పోలీసు కంప్లయింటుంది. ఇంతవరకూ దొరకలేదు."

"అయితే?"

"రంగయ్య మాయం కాలేదు సర్... హత్య చేయబడ్డాడు."

"నీకెలా తెలుసు?"

"ఆ హత్య నేను కళ్ళారా చూశాను సర్...."

చంద్రకాంత్ ఉలిక్కిపడి - "అంత వివరంగా చెప్పు" అన్నాడు.

ప్రభాకరం చెప్పడం ప్రారంభించాడు.

రంగయ్యకు చిన్నపిల్లలంటే చాలా ఇష్టం. వాళ్ళలో ప్రభాకరం అంటే మరింత ఇష్టం. ప్రభాకరం తరచుగా రంగయ్య కొట్లోనే చాక్లెట్లు కొంటాడు.

రంగయ్య యువకుడు. చురుకయినవాడు. నీతినీ, నిజాయితీనీ నమ్ముకుని వ్యాపారం చేస్తున్నాడు. అతడి సంపాదన బాగుంది.

చావడానికి ఆర్నెల్లకు ముందు రంగయ్యకు పెళ్ళయ్యింది. రంగయ్య భార్య చాలా అందంగా ఉంటుంది. పెళ్ళయ్యాక రంగయ్య ఒక రోజున ప్రభాకరాన్ని తనింటికి పిలిచి టిఫిన్ పెట్టాడు. అప్పుడు రంగయ్య భార్యను చూశాడు.

చనిపోయే రోజు సాయంత్రం రంగయ్య విచారంగా ఉండటం గమనించాడు ప్రభాకరం. కారణమడిగాడు.

"గొప్పవాళ్ళమనే వాళ్ళకి నీతీ జాతీ లేవు" అన్నాడు రంగయ్య. ప్రభాకరానికి అర్థంకాలేదు. రంగయ్య వివరించాడు.

రజనీకాంత్ వ్యాపారస్తుడు. పలుకుబడి ఉన్నవాడు. అండర్ గ్రౌండ్ వ్యవహారాల్లో రంగయ్య కిళ్ళీకొట్టు సాయం కావాల్సొచ్చి అడిగితే రంగయ్య నిరాకరించాడు. కిళ్ళీకొట్టు పెట్టుకునే ముందు రజనీకాంత్ రంగయ్య నిలదొక్కుకునేందుకు అయిదువందలిచ్చి ఆదుకున్నాడు. రజనీకాంత్ అంటే రంగయ్యకు గౌరవం, కృతజ్ఞత ఉన్నాయి.

"నాకు చేతనయిన పని ఏదైనా చెప్పండి, చేస్తాను. చేతకాని పనులు మాత్రం చెప్పొద్దు బాబూ" అన్నాడు రంగయ్య ఆయనతో వినయంగా.

రజనీకాంత్ ఇంట్లో ఏదో శుభకార్యం జరుగుతోంది. సాయానికి రంగయ్య భార్యను పంపమని అడిగాడు రజనీకాంత్. రంగయ్య పంపాడు. రెండు రోజులయింది ఆమె వెనక్కు రాలేదు. రంగయ్య కంగారు పడి ఆ రోజు ఉదయమే రజనీకాంత్ ఇంటికి వెళ్ళాడు.

"నిన్ననే పంపేశానే - ఇంకా ఇంటికి రాలేదా?" అన్నాడు రజనీకాంత్.

"లేదు బాబూ..." అన్నాడు రంగయ్య కంగారుగా.

"రాజును చూసిన కళ్ళతో మొగుడ్ని చూస్తే మొత్తబుద్ధయిందట. అది నేనంటే మోజుపడుతోందిరా. దాని వద్ద మా గెస్ట్‌హౌస్ తాళాలున్నాయి. తిన్నగా అక్కడికి పోయి మకాం పెట్టిందేమో!" అన్నాడు రజనీకాంత్.

రంగయ్య కళ్ళెర్రబడ్డాయి. ఆవేశంతో మాట రాలేదతడికి.

"ఆవేశపడకురా! నా మాట విను - నా పనులకు నీ కిళ్ళీకొట్టుపయోగించుకోనీ! అప్పుడు నీ పెళ్ళాం నువ్వంటే నామీద పడుతున్నంత మోజూ పడుతుంది" అన్నాడు రజనీకాంత్.

రంగయ్య తన్ను తాను తమాయించుకుని - "ఆమాట దాని నోటమ్మట విన్నాక నేనాలోచించి ఏ విషయం చెబుతాను.." అన్నాడు.

"అయితే రాత్రి తొమ్మిదింటికి కిళ్ళీకొట్టూ కట్టేసుకుని గెస్ట్ హౌస్‌కి రా..." అన్నాడు రజనీకాంత్.

రంగయ్య ఇప్పుడా విషయమే ఆలోచిస్తున్నాడు.

ప్రభాకరానికి రంగయ్య సమస్యేమిటో అర్థకాలేదు -

"నీ భార్యకు నువ్వంటే ఇష్టం లేకపోతే నువ్వింకో పెళ్ళి చేసుకో. హాయిగా ఉండు" అన్నాడు.

"అదికాదు ప్రభాకరం - ఆయన బలవంతంగా నా భార్యను గెస్ట్ హౌసులో బంధించాడు. దాన్నెలాగయినా విడిపించాలి..."

"పోలీసు రిపోర్టివ్వచ్చుగా..."

"ఇచ్చాను. ఇన్స్పెక్టర్ కుమార్ రజనీకాంత్ గెస్టు హౌస్‌కి వెళ్ళి వచ్చాడు. నా భార్య అక్కడే ఉందట. నన్ను తిడుతోందట. నాకు భయపడి గెస్ట్‌హౌసులో దాక్కున్నానని. రజనీకాంత్ దగ్గరే తనకు రక్షణ ఉన్నదనీ, ఆ గెస్ట్ హౌస్‌లో వంట మనిషిగా ఉండిపోతాననీ అన్నదట..."

ప్రభాకరం ఆమెతో రంగయ్యను కట్టీ అయిపొమ్మన్నాడు.

"నా భార్య చాలా మంచిది. దానికి నేనంటే చెప్పలేనంతిష్టం. నగలమీదా, చీరలమీదా, డబ్బు మీద దానికి మోజు లేదు, ఏదో నాటకం జరుగుతోంది. అదేంటో తెలుసుకోవాలి. అందుకు నువ్వు సాయం చేయగలవా?"

"నేనేం చేయగలను?"

"రాత్రి తొమ్మిదింటికి నన్ను గెస్ట్ హౌస్‌కు రమ్మన్నాడు రజనీకాంత్. నేను వెడతాను. ఆయన గురించిన ఆయువుపట్లు కొన్ని నాకు తెలుసు. ఈ ఊళ్ళో రెండు కిళ్ళీ కొట్లనాయన స్మగ్లింగ్‌కుపయోగించుకుంటున్నాడు. వాళ్ళిద్దరూ నాకు స్నేహితులు. వాళ్ళ ద్వారా ఆయన రహస్యాలు కొన్ని నాకు తెలుసు. అవి చెప్పి బెదిరించి నా భార్యను నేను వెనక్కు తెచ్చుకుంటాను. మళ్ళీ తప్పు చేస్తే నా భార్య ఆయనపై పోలీసు కంప్లయింటు ఇస్తుంది...."

"మరి నీ భార్య పోలీసులతో నువ్వంటే ఇష్టం లేదని చెప్పింది..."

"అదా! ఆ రజనీకాంత్ దాన్ని భయపెట్టు ఉంటాడు.... అవన్నీ ఈ రాత్రికి తేలిపోతాయిగా..."

"ఇందులో నేను చేయాల్సినదేముంది?"

"పెద్దవాళ్ళతో వ్యవహారం... జాగ్రత్తగా ఉండాలి. అక్కడ నాకోసం ఎలాంటి ప్రమాదం పొంచి ఉందో తెలియదు. నేను వెళ్ళిన కాసేపటికి అంటే ఓ పావుగంట తర్వాత నువ్వు ఆ గెస్ట్‌హౌస్‌లో ప్రవేశించి రహస్యంగా అక్కడేం జరిగిందో గమనించాలి..." అన్నాడు రంగయ్య.

ప్రభాకరానికి సాహసకార్యాలంటే చాలా సరదా. ఇంట్లో కంబైండు స్టడీస్ పేరు చెప్పి అతడు రంగయ్యకు సాయం చేయాలనుకున్నాడు.

రంగయ్య అతడికో పాకెట్ టేపు రికార్డరిచ్చి "వీలున్నప్పుడల్లా విశేషాలు రికార్డ్ చేయి.." అని చెప్పాడు.

ఆ రాత్రి ప్రభాకరం పాకెట్ టేపు రికార్డరు తీసుకుని రజనీకాంత్ గెస్ట్‌హౌస్‌కి వెళ్ళాడు. రహస్యంగా అందులో ప్రవేశించడం అతడికి కష్టం కాలేదు. గేటు వద్ద కాపలా వాడూ లేడు.

లోపల ఓ గదిలో రజనీకాంత్, రంగయ్య, రంగయ్య భార్యా ఉన్నారు.

రజనీకాంత్ కాసేపు మాటల్లో ఘర్షణపడ్డారు. రంగయ్య తనకు ప్రమాదకారిగా మారుతున్నాడని గ్రహించి రజనీకాంత్ రివాల్వర్‌తో రంగయ్యను కాల్చి చంపాడు.

జరిగిన హత్యాకాండ చూసి రంగయ్య భార్య వణికిపోయింది. రజనీకాంత్ ఆమెతో - "నిన్ను వేశ్యాగృహానికమ్మేస్తే నీ బ్రతుకు నరకమవుతుంది. నా మాట వింటే నువ్వు గౌరవంగా బ్రతకొచ్చు. ఇప్పుడు మనమిద్దరం కలిసి ఈ శవాన్ని లోపల పాతిపెట్టేద్దాం.

రంగయ్య తమ్ముడు ప్రసాద్ నిన్ను పెళ్ళిచేసుకుంటాడు. కిళ్ళీకొట్టు కూడా వాడికే చెందుతుంది. నువ్వు, కిళ్ళీ కొట్టు అవసరాన్ని బట్టి నాకుపయోగపడుతుంటారు. రేపు ఉదయమే నువ్వు రంగయ్య కనబడ్డం లేదని పోలీసు రిపోర్టియ్యి'' అన్నాడు.

తర్వాత వాళ్ళిద్దరూ శవాన్ని లోపల పూడ్చిపెట్టారు. రంగయ్య భార్య రజనీకాంత్ ఎలా చెబితే అలా వింది.

మొత్తం దృశ్యాన్ని ప్రభాకరం చూశాడు. కొన్ని కీలక సంభాషణలు రికార్డు కూడా చేశాడు. అతడక్కడుంటాడని రజనీకాంత్ ఊహించలేదు.

ప్రభాకరం ఒక వారం రోజులపాటు మౌనంగా ఉన్నాడు. ఈ వారంరోజుల్లోనూ కిళ్ళీకొట్టు ప్రసాద్‌ది అయింది. రంగయ్య జాడ తెలియక పోలీసులు ప్రయత్నిస్తున్నారు. రజనీకాంత్ పలుకుబడివల్ల రంగయ్య ఏదో నేరం చేసి పరారీలో ఉన్నట్లు ప్రచారం కూడా వచ్చింది.

ఇక ప్రభాకరం ఊరుకోలేకపోయాడు. విషయం ఇంట్లో తండ్రికి చెప్పాడు. తండ్రి అతణ్ణి మెచ్చుకుని ''నువ్వే స్వయంగా పోలీసులకి అంతా చెప్పు. నీకు పేరు కూడా వస్తుంది'' అన్నాడు.

ప్రభాకరం ఎంతో ఉత్సాహపడ్డాడు.

''ఈ విషయం చెప్పడానికి నీకేణ్ణర్థం పట్టిందా?'' అన్నాడు చంద్రకాంత్.

''లేదు సార్... నేను ముందుగా ఇన్‌స్పెక్టర్ కుమార్‌కి ఫిర్యాదు చేశాను... ఆయన నేనిచ్చిన టేపు రికార్డర్నీ, కాసెట్‌నీ నాకళ్ళ ముందే ధ్వంసం చేసి పొమ్మన్నాడు. ఆయన బాగా లంచాలు తింటాడని పేరు సర్. రజనీకాంత్ బాగా లంచాలివ్వగలడు సార్...''

''తర్వాతేం చేశావ్?''

''మళ్ళీ మరో ఇన్‌స్పెక్టర్ దగ్గరకు వెడితే పాతిపెట్టిన శవం కూడా మాయం చేస్తాడని భయం వేసి ఊరుకుండిపోయాను సర్! ఈ రోజు మీ ఉపన్యాసం వింటుంటే మీ వల్ల పని జరుగుతుందనిపించింది. అందుకే మీకు విషయం చెబుతున్నాను సర్...''

చంద్రకాంత్ ప్రభాకరం వంక మెప్పుకోలుగా చూసి - ''నీ నమ్మకాన్ని నేను వమ్ము చేయను. థాంక్స్ ఫర్ ది ఇన్ఫర్‌మేషన్...'' అన్నాడు.

''సర్.... రజనీకాంత్ గెస్ట్ హౌస్‌లో - రెండే రెండు నల్ల గులాబీ మొక్కలున్నాయి. వాటి కింద తవ్వితే మీకు రంగయ్య శవం దొరుకుతుంది. శవాన్ని గుర్తుపట్టడానికి వాచీ చాలు సార్! నా చేతికున్న ఈ వాచీలాంటిదే రంగయ్యకీ ఉంది. చూడండి సార్... నా వాచీ చెయిన్ మీద ఎ.ప్రభాకరం అని పేరుంది. రంగయ్య వాచీ మీద టి. రంగయ్య అని పేరుంది...'' అంటూ ప్రభాకరం తన వాచీ చూపించాడు. చంద్రకాంత్ వాచీని శ్రద్ధగా పరిశీలించి - ''థాంక్స్ - ప్రస్తుతానికీ సమాచారం చాలు'' అన్నాడు.

''సర్ - నిజంగా మీరీ కేసు ఇన్వెస్టిగేట్ చేస్తారా?'' అన్నాడు ప్రభాకరం జాలిగా, ఆశగా, బాధగా.

''ఏం? నామీద నీకు అపనమ్మకంగా ఉందా?''

''ఏం చెప్పను సార్? హత్య జరిగిన వారం రోజుల కసలు సంగతి చెబితేనే - పోలీసులు లెక్కచేయలేదు. ఏణ్ణర్థం తర్వాత చెబుతున్నాను- లెక్క చేస్తారా అని సందేహంగా ఉంది...''

''అలాంటనుమానాలేం పెట్టుకోకు. నీకు నేను బ్రేవరీ అవార్డు కూడా ఇప్పిస్తాను'' అన్నాడు చంద్రకాంత్.

ప్రభాకరం ఇంకా ఏదో అనబోతుండగా - ''మీ రిక్కడున్నారా ఇన్‌స్పెక్టరుగారూ!'' అన్న హెడ్మాస్టారుగారి మాట వినబడింది.

ప్రభాకరం చటుక్కున పొదలచాటుకు వెళ్ళిపోయాడు.

చంద్రకాంత్ వెనక్కు తిరిగి - ''లోపల ఉక్కగా అనిపించి ఈ తోటలోకి వచ్చాను..'' అన్నాడు.

"నాటకం అయిపోవచ్చింది. ఇంత సేపు మీరు బాత్రూంలో ఏం చేస్తున్నారా అని అనుమానం వచ్చి నేనూ బయటకు వచ్చాను...."

చంద్రకాంత్ ఆయన మాటలు వినడం లేదు.

## 2

ముందుగా చంద్రకాంత్ కిళ్ళీకొట్టు ప్రసాద్‌ని కలుసుకుని కొన్ని ప్రశ్నలు వేశాడు. రజనీకాంత్‌కీ అతడికీ సంబంధమున్నట్లు బయటపడింది. తర్వాత ప్రసాద్ ఇంటికెళ్ళాడు.

ప్రసాద్ భార్య నిజంగా చాలా అందమైనది.

ఆమె జీవితం వైభవంగానే ఉంది. చిన్న డాబా ఇల్లు, ఇంట్లో అన్ని హంగులూ ఉన్నాయి. వాళ్ళకి కలర్ టీవీ కూడా ఉంది.

ప్రసాద్ భార్య పోలీస్ ఇన్‌స్పెక్టర్ని చూసి కంగారు పడింది.

"కంగారేం లేదు. స్నేహపూర్వకంగానే వచ్చాను. కిళ్ళీ కొట్టు పెట్టుకున్నవాళ్ళు నాకంటే వైభవంగా జీవిస్తున్నారని ఎవరో చెబితే మీ ఇల్లు చూడాలని వచ్చాను -" అన్నాడు చంద్రకాంత్ నవ్వుతూ.

ఆమె కంగారుగా - "ఈ రోజుల్లో కిళ్ళీ కొట్టుకు మించిన బిజినెస్ లేదు బాబూ! రోజుకు రెండొందలు లాభం కళ్ళజూడొచ్చు -" అంది.

"అవును. అదే రెండు కళ్ళారా చూస్తున్నాను...." అన్నాడు చంద్రకాంత్.

"కాఫీ పుచ్చుకుంటారా, టీ పుచ్చుకుంటారా?" అందామె.

"రెండూ తాగను. కానీ నాకు నిన్నెక్కడో చూసినట్లనిపిస్తోంది..."

"నన్నా - నన్నెవరు చూశారు బాబూ..."

"ఆఁ గుర్తుకొచ్చింది మా ఇంట్లో నీ ఫోటో ఉంది..."

ప్రసాద్ భార్య ఇంకా కంగారుపడి - "నా ఫోటో మీ కెక్కడిది బాబూ! నేను ఫోటో తీయించుకున్నదే తక్కువ" అంది.

"నా మిత్రుడొక్కడు కిళ్ళీకొట్టు పెట్టాడు. నేను విజయవాడలో ఉండగా అతగాడి పెళ్ళయింది. తన పెళ్ళి ఫోటో పంపించాడు. అందులో ఉన్నావు నువ్వు..."

"ప్రసాద్ మీ స్నేహితుడా బాబూ!"

"కాదు..."

"మీ మిత్రుడి పెళ్ళికి నేను వెళ్ళానంటారా?"

"అది గ్రూప్ ఫోటో కాదు. భార్యాభర్తలిద్దరే ఉన్నారు. భర్త నా మిత్రుడు. భార్య నువ్వు..."

"ఎవరు బాబూ మీ మిత్రుడూ?" అందామె.

"అతడి పేరు రంగయ్య -"

ఉలిక్కిపడిందామె.

"రంగయ్యనెందుకొదిలేశావ్?"

"నేను వాణ్ణొదల్లేదు బాబూ - వాడే నన్నొదిలేశాడు. ఏణ్ణర్థం నుంచి ఏమయ్యాడో తెలియదు. వాడి తమ్ముడు ప్రసాద్ అండలో ఉంటున్నాను. నలుగురూ మా గురించి ఆ మాటా ఈ మాట అనుకుంటున్నారని తెలిసి ప్రసాద్ నన్ను మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడు. రంగయ్యెక్కడున్నాడో చెప్పండి బాబూ - వాడిదగ్గరకే వెళ్ళిపోతాను -" అందామె.

"వాడిదగ్గర కెళ్ళాలంటే నేల తవ్వాలి. ఎక్కడ తవ్వాలో నీకు తెలుసు..."

"ఏంటి బాబూ మీరనేది?"

"మా పోలీసు బలగం రజనీకాంత్ గెస్ట్‌హౌసుకు వెళ్ళింది. శవం దొరకగానే ఇక్కడికి కబురొస్తుంది. గుర్తుపట్టడానికి నువ్వు నాతో బయలుదేరి రావాలి..."

ఆమె బాగా కంగారుపడింది. చంద్రకాంత్ ఆమెని బెదిరించి నిజం కక్కించాడు. ప్రభాకరం చెప్పిన కథనంతా ఆమె తన నోటితో మళ్ళీ చెప్పి - "ఈ కథ మీదాక ఎలా వచ్చింది బాబూ!" అనడిగిందాశ్చర్యంగా.

"నీవంటి పాపాత్ములకి ఏదో ఒకరోజున పాపం పండక తప్పదు. అలాంటి రోజున గోడలకు చెవులొస్తాయి. గాలికి నోరొస్తుంది - "అన్నాడు చంద్రకాంత్.

ఆమె తమాయించుకుంది - "బాబూ! నన్ను పాపాత్మురాలనవద్దు. నాకు తెలిసి నేనే పాపమూ చేయలేదు. కావాలని నేనే నేరమూ చేయలేదు..."

"రజనీకాంత్‌వంటి దుర్మార్గుడితో చేయికలిపి కట్టుకున్న భర్తనే తుదముట్టించి మరిదితో కులుకుతున్నావు. నువ్వు పాపాత్మురాలివి కాదా!" అన్నాడు చంద్రకాంత్.

"బాబూ! నేను రంగయ్యను పెళ్ళిచేసుకున్నాను. వాడితోటే నా జీవితమనుకున్నాను. నాకేమీ పెద్ద పెద్ద కోరికలు లేవు. ఆశలు లేవు. రజనీకాంత్ బాబు దగ్గరికి నేను వెళ్ళలేదు. రంగయ్యే పంపాడు. ఆ బాబు నా అందం చూసి పిచ్చెక్కిపోయాడు. తప్పని చెప్పినా వినలేదు. పిస్టల్ చూపించి చెయ్యి పట్టుకున్నాడు. ప్రాణం కాపాడుకోడానికి మించిన నీతి మరోటుందని నాకు తెలియదు. రంగయ్య పోలీసు రిపోర్టిచ్చాడు. పోలీసు నన్నే బెదిరించి వెళ్ళాడు. భయపడిపోయాను. ఆ రజనీకాంత్ బాబు ఏం చెబితే అది చేయడానికి ఒప్పుకున్నాను...."

"స్వార్థపరులు, పాపాత్ములు సాధారణంగా చెప్పే కుంటిసాకులే ఇవి.... మనిషి గొప్పతనం స్వార్థాన్నెదిరించడంలో ఉంది. ప్రాణ త్యాగానికి కూడా సిద్ధపడే ధైర్య ప్రదర్శనలో ఉంది..."

"అలాంటి వాళ్ళెక్కడో గానీ ఉండరు..."

"ఎందుకుండరు? నీ పచ్చ కామెర్ల కళ్ళను పక్కన బెట్టి నా కళ్ళతో చూడు ప్రపంచాన్ని. ఎటుచూసినా సాహసవంతులు, త్యాగధనులు కనబడతారు..."

అదోలా నవ్విందామె - "బాబూ! అదే నిజమైతే ఆ రజనీకాంత్ బాబూ, అలాంటివాళ్ళూ చేస్తున్న నేరాలూ, ఘోరాలు అందరికీ తెలుసు. అలాంటప్పుడు నేరస్తుల్ని పట్టుకునే ఉద్యోగం చేస్తున్న మీవంటి పోలీసులు ఆ బాబుల్నెందుకు అరెస్ట్ చెయ్యరు? జైల్లో వేయరు?"

"అందుకు సాక్ష్యాలు కావాలి..."

"సాక్ష్యాల్దొరికేదాకా నేరస్తులని తెలిసీ మీరు వాళ్ళకి సలాములు కొడతారు. మీ సలాములు చూసి సాక్ష్యాలివ్వడానికి మా వంటి సామాన్యులు హడలి చస్తారు. ఎందుకు బాబూ - మీకూ మీకూ మధ్య మా వంటి సామాన్యుల్నిరికించి నలిపి చంపాలని చూస్తారు? పెద్దవాళ్ళు నేరాలు రహస్యంగా చేయడంలేదు. ఆ విషయం మీకు తెలుసు. కాదని ఒక్కసారి అనండి..." అందామె.

చంద్రకాంత్ ఏదో అనబోయేలోగా రజనీకాంత్ గెస్ట్ హౌస్‌నుంచి కబురు వచ్చింది - "శవం దొరికింది సార్ బాగా పాడైపోయింది. చేతికి వాచీ మాత్రం స్పష్టంగా తెలుస్తోంది..."

చంద్రకాంత్‌కి ప్రభాకరం మాటలు గుర్తుకొచ్చాయి. రంగయ్యను గుర్తుపట్టటానికి వాచీ ఒక మంచి ఆధారం.

"రండి బాబూ! మీరు నిజంగా ఆ రజనీకాంత్‌కు శిక్ష పడేలా చేస్తానంటే నాకంటే సంతోషించే మనిషి వేరే ఉండదు. మా ధైర్యం మా ప్రాణాలు తీస్తుందని భయపడి ఊరుకుంటే మా అసహాయతకు మీరు స్వార్థం అని పేరు పెడతారు. ఆ స్వార్థాన్ని ప్రోత్సహిస్తున్నది మీవంటి పోలీసులేనని గ్రహించరు. ఒప్పుకోరు. రండి బాబూ... నా డ్యూటీ నేను చేస్తాను. మీరేం చేస్తారో చూస్తాను..." అందామె.

పోలీసు జీపులో చంద్రకాంత్, ప్రసాద్ భార్య, రజనీకాంత్ గెస్ట్ హౌస్‌కి వెళ్ళారు. అక్కడ చాలా పోలీసుబలగముంది. అంతా హడావిడిగా ఉందక్కడ.

రెండు నల్లగులాబీల కింద దొరికిన శవం సుమారు పధ్నాలుగేళ్ళ వయసు బాలుడిది. అతడి చేతికి వున్న వాచీ గొలుసు మీద ప్రభాకరం అన్న పేరుంది.

షాక్ తిన్నాడు చంద్రకాంత్.

ఈలోగా - "శవాన్ని పాతిందిక్కడ కాదు-" అంది ప్రసాద్ భార్య.

ఆమె చూపిన ప్రాంతంలో తవ్వగా మరో శవం దొరికింది. ఆ శవం చేతికి రంగయ్య పేరుగల గొలుసుతో వాచీ ఉంది.

ఆ తర్వాత - రజనీకాంత్‌ను అరెస్ట్ చేయటం - అతను తన నేరాలన్నీ అంగీకరించటం జరిగిపోయింది.

తన ఉపన్యాసానికి ప్రభావితుడై హైస్కూల్లో కనబడిన ప్రభాకరం సుమారు ఏణ్ణర్థం క్రితం మాయమై శవంగా మారిపోయాడన్న నిజం మాత్రం చంద్రకాంత్‌ని అయోమయావస్థలో పడేసింది.

శవంగా మారి భూస్థాపితమైన ప్రభాకరం ఆ తర్వాత తనకెలా కనిపించాడు? తను భ్రమపడ్డాడా అనుకుంటే ప్రభాకరం నోట విన్నవన్నీ నిజాలే అయ్యాయి. అంటే ప్రభాకరం ఆత్మ ఓ మంచి పోలీసాఫీసరు కోసం అన్వేషించిందా?

ప్రభాకరం విషయం ఎలాగున్నా - కానిస్టేబుల్ మహేష్ హత్యలో - సాక్షి కోసం మాత్రం చంద్రకాంత్ మరి అన్వేషించదలచుకోలేదు.

## బానిస

"ఒరేయ్ - గదిలో కాస్త పక్కేసి పోరా?" అంది గౌరి.

గవ్రరాజు భయపడుతూనే గదిలో అడుగుపెట్టాడు. అప్పటికే పక్క నీటుగా వేసి ఉంది.

"పక్క వేసే ఉంది -" అన్నాడు వాడు.

"వేసే ఉందా - నేను చూడనేలేదు. అయితే ఇంకేం? పని చేసి చేసి అలిసిపోయున్నావు. కాసేపు పడుకోరా?" అంది గౌరి.

"అయ్యగారు చంపేస్తారు" అన్నాడు గవర్రాజు తనకేమీ అభ్యంతరం లేనట్లు.

అయ్యగారి పేరు భూపతి. ఆయన పేరు చెబితే ఊరు ఊరంతా గజగజ వణుకుతుంది. గౌరి భూపతి కూతురు. అందాల బొమ్మ. ఆమెకు పెళ్ళై నాలుగేళ్ళయ్యింది. మగడికి వ్యక్తిత్వం లేదు. ఆమె కాలుకింద తొత్తులా ఉంటాడు. భూపతి అంటే అతడికీ భయమే! గౌరి అత్తవారితో గొడవపెట్టుకుని నెలరోజులకోసారి పుట్టింటికి వచ్చేస్తుంటుంది. వచ్చినప్పుడల్లా పుట్టింట్లో నెలలతరబడి ఉంటుంది.

గౌరికి భర్తంటే కోపం, చిరాకు. అతడామె మనసుకు నచ్చలేదు. కానీ ఆమె వయసుకో మగాడు కావాలి. ఆరోగ్యంగా పెరిగిన పల్లెటూరి పిల్ల. చిన్నప్పట్నించీ అడిగినవన్నీ లేదనకుండా పొందే గారాల బాల.

గౌరికి గవర్రాజు నచ్చాడు.

గవర్రాజు చామనఛాయలో బలంగా ఎత్తుగా ఉంటాడు. మనిషి కూడా సినిమా హీరోలా ఉంటాడు. వాడు హైస్కూల్లో టెన్తుక్లాసు దాకా చదివి ఫస్ట్‌క్లాసులో పాసయ్యాడు. వాడి తండ్రి భూపతికి బాకీపడ్డ కారణంగా గవర్రాజు పాలేరు కావలసి వచ్చింది. చదువుకున్నవాడైనా గవర్రాజుకి పాలేరు పనులన్నీ తెలుసు.

ఉప్పుకారం తినే ఆరోగ్యవంతుడైన యువకుడు కాబట్టి వాడు గౌరి ఆకర్షణకు లొంగిపోవడంలో ఆశ్చర్యం లేదు.

గవర్రాజు కింకా పెళ్ళికాలేదు. వాడి తండ్రి పెళ్ళి చేసుకోమని పోరుతున్నాడు. అయితే వాడికి చేసుకుంటే గౌరివంటి పిల్లను పెళ్ళి చేసుకోవాలనుంది.

గౌరి వాడి అభిరుచిని పెంచింది. అందువల్ల వాడు పెళ్ళికి విముఖంగా ఉన్నాడు. గౌరి తరచుగా పుట్టింటికి వచ్చి వెడుతున్న కారణంగా వాడికి పెళ్ళి అవసరమూ కనిపించడం లేదు.

మొదట్లో భర్తమీదో, అత్తమీదో అలిగి పుట్టింటికి వస్తుండే గౌరి - ఇప్పుడు గవర్రాజు కోసం పుట్టింటికి వస్తోంది.

చాలాకాలం వారి సంబంధం రహస్యంగానే కొనసాగింది.

ఒకసారి భూపతికి వారిద్దరిమీదా అనుమానం కలిగింది. ఆ అనుమానాన్ని ధృవపర్చుకున్నాక ఆయన భార్యను దెబ్బలాడి కూతురికి బుద్ధి చెప్పమన్నాడు.

"నీ అవసరానికి నన్నే పరాయి మగాడి దగ్గిరకు పంపిన మనిషివి నువ్వు. నీ ఇంట్లో అవినీతేమిటి?" అని ఎదురుతిరిగింది భార్య.

భూపతి భార్యను తప్పుపట్టలేదు. తను గవర్రాజును పిలిచి హెచ్చరించాడు.

"బాబూ - నేను తప్పు చేయను" అన్నాడు గవర్రాజు.

"అరిటాకు ముల్లుమీద పడ్డా, అరిటాకుమీద ముల్లు పడ్డా - నష్టపోయేది అరిటాకే! గుర్తుంచుకో - నువ్వు అరిటాకువి" అన్నాడు భూపతి.

"నాకు తెలుసు బాబూ - కానీ..." అన్నాడు గవర్రాజు.

వాడి కానీ తర్వాత ఏ మాటలున్నాయో భూపతికి తెలుసు. మరో మనిషి కానీ అని ఉంటే చర్మం వలిచేసే వాడు. అసలు కానీ అనే అవకాశమే ఇచ్చేవాడు కాదు.

గవర్రాజు తప్పు చేయడు. తప్పు చేసే ధైర్యం కూడా లేదు. గవర్రాజు తప్పు చేయక పోయినా - అతడివల్లే తప్పు జరుగుతోంది కాబట్టి - శిక్ష అనుభవించక తప్పదు.

భూపతి గవర్రాజును శిక్షించి ఉండేవాడే! ఎటొచ్చీ రామచంద్రుడు గవర్రాజుకు స్నేహితుడై పోయాడు.

రామచంద్రుడు గవ్రాజులాంటి మనిషే! గవ్రాజుతో పాటే చదువుకున్నాడు. గవ్రాజుకంటే ఆరేడేళ్ళు పెద్ద ఉండొచ్చు. గవ్రాజు ప్రతి క్లాసూ ఒక సంవత్సరం మాత్రమే చదువుతుంటే రామచంద్రుడు రెండేసి సంవత్సరాలు చదివాడు. ఇద్దరూ తొమ్మిదో తరగతే కాదు - పది కూడా పాసయ్యారు. ఆ తర్వాత అతడు పల్లె వదిలి పట్నానికి పోయాడు. రెండేళ్ళలో రాజకీయాల్లో ప్రవేశించాడు. అక్కడే ఉంటూ నాలుగు డబ్బులు గడిస్తున్నాడని అంతా అనుకున్నారు. కానీ ఏడాది క్రితం జరిగిన బై ఎలక్షన్లో రామచంద్రుడు ఎమ్మెల్యే అయిపోయాడు. ఎమ్మెల్యే కూడా తన ఊరి ప్రజల ప్రతినిధిగా.

భూపతి రామచంద్రుడికి వ్యతిరేకంగా పనిచేశాడు. ఆ నియోజకవర్గం ప్రజలందర్నీ భయపెట్టాడు. అంతా భయపడ్డట్లే కనబడ్డారు. పరిస్థితులు భూపతికి అనుకూలంగా ఉన్నట్లే కనబడ్డాయి. కానీ ఎన్నికల ఫలితాలు వచ్చేసరికి రామచంద్రుడు అవలీలగా నెగ్గేశాడు. భూపతి తన వాళ్ళందరి మీదా విరుచుకుపడ్డాడు. అంతా అమాయకంగా తమకేమీ తెలియదన్నారు.

రామచంద్రుడు ఎమ్మెల్యేకాగానే - తన ఊరినీ, ఊళ్ళోని వెనకబడిన వర్గాలవాళ్ళనీ బాగుచేస్తానని ఉపన్యాసమిచ్చాడు. ఉపన్యాస వేదికమీదకు గవ్రాజుని పిలిచి - బలంగా కౌగిలించుకుని - వీడు నా ఆప్త మిత్రుడన్నాడు.

గవ్రాజుకు భూపతి కూతురో పెద్ద ఆకర్షణ కావడం వల్ల తండ్రి మాటలకు కట్టుబడ్డాడు. తన జీవితం పట్ల వాడికి అసంతృప్తి లేదు.

ఆ తర్వాత రామచంద్రుడు ఊరి మొహం చూడలేదు. అతడు హైదరాబాదులో మకాం పెట్టాడు.

భూపతికి రామచంద్రుడి మనస్తత్వం తెలుసు. గవ్రాజుకి రామచంద్రుడి మనసులో ఉన్నస్థానమూ తెలుసు. అందువల్ల ఆయన గవ్రాజు జోలికి వెళ్ళాలంటే భయపడుతున్నాడు. కానీ వాడు గౌరితో సంబంధం పెట్టుకోవడాన్నాయన హర్షించలేకపోతున్నాడు భరించలేకపోతున్నాడు.

అందుకే వాణ్ణి హెచ్చరిస్తూంటే - గవ్రాజు ''కానీ' అనే దాకా వచ్చాడు.

వాడు ''కానీ'' అనడానిక్కారణం కూతురి ప్రోత్సాహమే కారణమని భూపతికి తెలుసు.

గవ్రాజు భూపతికి భయపడతాడు. కానీ గౌరి ఆకర్షణకు తట్టుకోలేకపోతున్నాడు. అందుకే ఆమె ఆహ్వానించినప్పుడల్లా - ''అయ్యగారు చంపేస్తారు'' అంటాడు.

అప్పుడు గౌరి నవ్వుతుంది.

ఆ నవ్వు అతణ్ణి మరిపిస్తుంది. మైమరిపిస్తుంది.

ఆ రోజూ అంతే జరిగింది.

ఆ తర్వాత మాత్రం మరోలా జరిగింది.

## 2

గవ్రాజు ఇంటికి వెడుతూంటే దారిలో ఎదురయ్యాడు భూపతి. వాణ్ణి చూస్తూనే - ''ఒక్కసారి నాతో రారా - పనుంది'' అన్నాడు. గవ్రాజు బుద్ధిగా ఆయనననుసరించాడు.

ఇద్దరూ రెండు సందులు తిరిగి ఓ ఇంటికి వెళ్ళారు.

అదో చిన్న పెంకుటిల్లు. అదీ భూపతిదే!

ఇల్లు తాళం పెట్టి ఉంది. భూపతి గవ్రాజుచేత ఆ తాళం కూడా తీయించాడు.

''గదిలో దీపం వేయి''. అన్నాడాయన.

అక్కడ కాస్త చీకటిగా ఉంది. వాడు దీపం వేయగానే ఒక్కసారి గదంతా ప్రకాశవంతమయింది. గదిలో ఒక మూల ఎండుగడ్డి మేటగా పడేసి ఉంది.

"ఇందులో గడ్డి వేయించారేం బాబూ!" అన్నాడు గవర్రాజు.

గవర్రాజు గడ్డిమేటును కదుపుతుండగా ఊచల తలుపులు మూతపడ్డాయి. వాడులిక్కిపడి వెనక్కు తిరిగేసరికి భూపతి తలుపుకు తాళం వేస్తున్నాడు.

గవర్రాజు కంగారుపడి పరుగున వెనక్కి వచ్చి - "ఏంటి బాబూ ఇది!" అన్నాడు.

"ఈ వేళ నేను కళ్ళారా చూశాను. నీకిక బుద్ధి రాదు. నీకు శిక్ష ఈ గదిలోనే!" అన్నాడు భూపతి.

"ఏం చేస్తారు బాబూ నన్ను?" అన్నాడు గవర్రాజు భయంగా.

"పక్కనే కుండ ఉంది. కుండమీద మూతుంది. మూతమీద బోర్లించిన గ్లాసుంది. దాహం వేసినప్పుడల్లా కుండలో నీళ్ళు ముంచుకుని తాగు -" అన్నాడు భూపతి.

"ఏమిటి బాబూ ఇదంతా?" అన్నాడు గవర్రాజు ఏడుపు కంఠంతో.

"గదిలోపల ఇంకో చిన్న గదుంది. గదిలోపల కుండీలో నిండా నీళ్ళున్నాయి. ఆ పక్కనే చెంబుంది. పాయఖానా ఉంది. స్నానానికీ కాలకృత్యాలకూ నీకే ఇబ్బందీ లేదు." అన్నాడు భూపతి.

"తలుపు తీయండి బాబూ - వెళ్ళిపోతాను.."

"తలుపు తీస్తాను. కానీ అప్పుడే కాదు. గదిలో నీకోసం నేనుంచిన ఆహారమంతా తిన్నాక..." అన్నాడు భూపతి.

గవర్రాజు చుట్టూ చూసి - "గదిలో గడ్డితప్ప ఇంకేమీ లేదు బాబూ -" అన్నాడు.

"అదేమరి! నీ బుద్ధి గడ్డి తిందిగా - ఇక నువ్వు కూడా తిను -" అని భూపతి అక్కణ్ణించి వెళ్ళిపోయాడు.

గవర్రాజు తన గతి తల్చుకుని వణికిపోయాడు.

భూపతికి మాటంటే మాటే! తనీ గదిలోంచి బైటపడాలంటే గడ్డి తినాలి. కానీ అదెలా సాధ్యం!

వాడు నిరుత్సాహంగా గదిలో పచార్లు చేయసాగాడు.

## 3

గౌరికి తండ్రిగురించి బాగా తెలుసు. గవర్రాజు తన గదిలో మంచం మీద పడుకుని ఉండడం ఆయన చూసిన విషయాన్నామె గమనించింది. ఆయనంత శాంతంగా వెనక్కు వెళ్ళిపోయాడంటే ఏదో ప్రమాదముందని ఆమె ఊహించింది. అందుకే తండ్రికి తెలియకుండా ఆయన్నో కంట కనిపెడుతోంది.

గవర్రాజింటి పనులు చేస్తుండగానే భూపతి బైటకు వెళ్ళిపోయాడు ఆయన్ననుసరించి కనిపెడుతుండమని గౌరి ఓ పిల్లను నియమించింది. అది బుద్ధిగా పరిశోధన చేసి గవర్రాజు, భూపతి ఓ ఇంట్లోకి వెళ్ళారనీ తర్వాత బైటకు భూపతి మాత్రమే వచ్చి తలుపుకు తాళం పెట్టుకున్నాడని చెప్పింది.

ఆ క్షణం నుంచీ గౌరి తండ్రిని గమనిస్తోంది. ఆయన బట్టలు మార్చుకుని విశ్రాంతి తీసుకున్నాక - గౌరి నెమ్మదిగా తండ్రి చొక్కాజేబులోని తాళాలు తీసుకుని తల్లితో పొరుగింటికి వెడుతున్నట్లు చెప్పింది.

"త్వరగా వచ్చేసేయ్ - ఆయన తిడతాడు -" అంది తల్లి.

గౌరి బుద్ధిగా తలూపి గవర్రాజు బంధింపబడిన ఇంటికి వెళ్ళింది. తాళం తీసి లోపలకు వెళ్ళి గవర్రాజు దుస్థితిని గమనించింది.

"అమ్మాయిగారూ! మీ మూలంగా నా గతి ఏమయిందో చూడండి -" అన్నాడు గవర్రాజు.

గౌరి వాడు చెప్పినదంతా విన్నాక - "అయితే నాన్న నీ మీద పగబట్టాడు. ఇక్కడుంటే నీకిక కాలం మూడినట్లే!" అంది.

"వెళ్ళి అయ్యగారి కాళ్ళ మీద పడతాను..."

గౌరి నవ్వి - "ఈ ప్రపంచంలో అయ్యగారు క్షమించగలిగింది నన్నూ, అమ్మనీ, తనపై వాళ్ళనీ - అంతే!" అంది.

"అయితే నేనేం చేయాలి?"

"నువ్విక్కడి నుంచి వెళ్ళిపోవాలి"

"ఊరొదిలి నేనెక్కడికిపోను?"

గౌరి నవ్వి - "తప్పదు - ఎక్కడికోకక్కడికిపోవాలి -" అంది.

"పోయి ఏం చేయను?"

"ఏదో ఒకటి చేయి - మళ్ళీ ఈ ఊరు తిరిగిరాకు."

"అమ్మాయిగారూ పుట్టి బుద్దెరిగినప్పట్నించీ మరే ఊరెరగను. నేనెక్కడకీ వెళ్ళలేను. ఇక్కడే ఉంటాను. ఇక్కడే చస్తాను.." అన్నాడు గవర్రాజు.

"ఇక్కడే చావాలన్న విషయం సరే - ఇప్పుడే చావాలని కూడా ఉందా నీకు! లేకుంటే మాత్రం ప్రస్తుతానికి ఊరొదిలి వెళ్ళిపో..."

"వెళ్ళిపోయి ఏం చేయనమ్మాయిగారూ!"

గౌరి చిరాగ్గా - "కండ బలం ఉన్నవాడివి. బ్రతకడానికి నీకేం లోటు? ఇక్కడ చేసే చాకిరీలో సగం చేస్తే పట్నంలో నీకిక్కడి దానికి రెట్టింపు డబ్బొస్తుంది -" అంది.

"కానీ - అక్కడ నాకు తెలిసినవాళ్ళెవరైనా ఉండాలిగా."

గౌరి చటుక్కున - "మరిచేపోయాను - మనూరి రామచంద్రుడు హైదరాబాదులోనేగా ఉంటున్నాడు" అంది.

"అవును..."

"రామచంద్రుడు నీకు మంచి స్నేహితుడు..."

"అవును..."

"ఇంకా అవును... అవును అంటావేమిటి? రామచంద్రుడిలాంటి స్నేహితుడు ఎమ్మెల్యే అయితే నీ కెందుకూ భయం? నామాట విని రామచంద్రుణ్ణి కలుసుకో, నీ కథ చెప్పుకో. అతడు నీకూళ్ళో రక్షణ ఏర్పాటు చేస్తానంటే - ఇక్కడకి తిరిగిరా. అక్కడేదైనా మంచి ఉద్యోగమిప్పిస్తానంటే - అక్కడే ఉండిపో. అప్పుడు నేనే నీ దగ్గరకు వచ్చేస్తాను..." అంది గౌరి.

"నిజంగానా?"

"ఊఁ"

"అయితే వెడతాను. కానీ హైదరాబాదు నేనొక్కణ్ణే ఎలా వెళ్ళేది? నాకు సాయంగా వస్తారా?" అన్నాడు గవర్రాజు ఆశగా.

"నేనిప్పుడు నీకు సాయంగా వస్తే మా నాన్న అగ్గిమీద గుగ్గిలమై - ముందుగా నీ వాళ్ళందర్నీ ఓ పట్టు పడతాడు. ముందు నువ్వు రామచంద్రుణ్ణి కలుసుకుని నీ బలం పెంచుకో - అప్పుడు మిగతా విషయం చూద్దాం -"

"అంతేనంటావా?" అన్నాడు గవర్రాజు జాలిగా చూస్తూ.

"అంతేనా, ఇంతేనా అంటూ ఆలోచిస్తూ కూర్చునేందుకు టైములేదు - నేను చెప్పినట్లు చేయి. వెంటనే పారిపో -" అంది గౌరి.

ఆమె వాడికి ఊచల తలుపుల వెనకనుంచి విముక్తి కలిగించి చేతికి అయిదువందనోట్లిచ్చి - "ఇక్కణ్ణించి బస్సెక్కి బెజవాడ వెళ్ళు. బెజవాడ నుంచి హైదరాబాదుకు బస్సులు, ట్రయిన్సూ, టాక్సీలు ఉన్నాయి. ఎలాగో అక్కడికి వెళ్ళు. నోట్లో నాలికున్నవాడికి ఎమ్మెల్యేల చిరునామా తెలుసుకోవడం పెద్ద కష్టం కాదు... అన్నీ బాగా జరిగితే - ఇంటికుత్తరం రాయి. నీ చిరునామా కూడా పంపు. అప్పుడు నేను నీకుత్తరం రాస్తాను....." అంది.

"అమ్మాయిగారూ - మీరు నిజంగా దేవత..."

"బాధ్యతలు నెరవేర్చగలిగుండి బాధ్యతలు నెరవేరిస్తే చాలు. ఆ మనిషి దేవత అనిపించుకుంటాడు. అయినా ఎంతో మంది ఆ మాత్రం కూడా చేయరు. నేను దేవతను కాను. నీకు బానిసను. నా దురదృష్టం కొద్దీ నువ్వు నా తండ్రికి బానిసవు. వెళ్ళి రామచంద్రుణ్ణి కలుసుకుని నీ బానిసత్వం నుంచి విముక్తి కలిపించుకో...." అంది గౌరి గంభీరంగా.

4

ఎమ్మెల్యే రామచంద్రుడింటికి చేరుకునే సమయానికి గవ్రరాజు జేబులో మూడు వందల రూపాయిలున్నాయి. ఆ ఇల్లు, వైభవం చూసేసరికి - "వీడు మా ఊరి రామచంద్రుడేనా?" అని భయం కూడా వేసింది గవ్రరాజుకి.

ఇంటినిండా నౌకర్లు, చాకర్లు. ఇంట్లో రామచంద్రుడి భార్య ఉంది. రామచంద్రుడు లేడు.

గవ్రరాజామెకు తను ఫలానా అని చెప్పుకున్నాడు.

"నీ పేరు విన్నాను. తరచుగా నీ గురించి చెబుతుంటారాయన" అందామె.

ఆమెకు గవ్రరాజు వయసే ఉంటుంది. చూడగానే చదువు, సంధ్య లేని మనిషని తెలిసిపోతుంది.  కానీ ఆమె ఎంతో అభిమానంగా గవ్రరాజు నాహ్వానించింది. ఆమె అభిమానంలో సంస్కారం ఉట్టిపడుతోంది.

"ఆయనిప్పుడు ఊళ్ళో లేడు. చాలా రోజుల్దాకా రాడు. ఆయనొచ్చేదాకా ఇక్కడే ఉంటానంటే నాకేమీ అభ్యంతరం లేదు" అందామె.

"చాలా రోజుల్దాకా అంటే ఎన్నాళ్ళు?" అడిగాడు గవ్రరాజు.

"చెప్పలేం - వారం కావచ్చు. నెలకావచ్చు..."

"నేను కష్టాల్లో ఉన్నాను. మా రామచంద్రుణ్ణి కలుసుకునేదాకా నా కష్టాలు తీరవు. వాణ్ణి కలుసుకునే వెడతాను..... కానీ ఈ ఇంట్లో నేనుండలేను. నేను చాలా సామాన్యుణ్ణి. ఇంత వైభవంగా ఉన్నచోట నేనుండలేను....." అన్నాడు గవ్రరాజు.

ఆమె నవ్వి - "నేనూ సామాన్యురాలినే! ఆయనకింత అదృష్టం పట్టకపోతే పల్లెటూళ్ళో పిడకలు చేసుకోవలసినదాన్ని! ఇప్పుడు పెద్ద పెద్ద సభలకు వెళ్ళి నాకంటే ఎంతో గొప్పవాళ్ళకి నా చేత్తో బహుమతిలిస్తున్నాను" అంది.

ఆమె బలవంతం మీద గవ్రరాజు ఇంట్లో మకాం పెట్టాడు. వాడికక్కడ సకల మర్యాదలూ జరుగుతున్నాయి. కష్టపడి పని చేయటం అలవాటైన గవ్రరాజుకి ఆ సోమరి జీవితం సరిపడలేదు. వాడు తనూ పనిచేస్తానంటే ఆమె వీల్లేదంది.

అలా వారం రోజులు గడిచాయి.

రామచంద్రుడి జాడ లేదు.

"వాడెప్పుడొస్తాడో!" అని వాపోయాడు గవ్రరాజు.

"ఆయన గురించి ఆలోచించకు. నీకేం కావాలో చెప్పు. నేనే చూస్తాను ...." అందామె.

"నిజం చెప్పాలంటే నేనుద్యోగం కోసం వచ్చానిక్కడికి..."

"నీకోసం ప్రాణమైనా ఇస్తాడాయన. నువ్వేం ఉద్యోగం చేస్తావు?" అనడిగిందామె.

గవర్రాజామెకు తన చదువుగురించి చెప్పాడు.

"నీకు పెద్ద ఉద్యోగం రాదు" అంటూ పెదవి విరిచిందామె.

"నాకు పెద్ద ఉద్యోగం అక్కరలేదు. బానిసలా ఆ పల్లెటూళ్ళో పడి ఉండటం కంటె - స్వతంత్రంగా మా రామచంద్రుడింట్లోనే ఏ పనివాడిగానో జీవితం వెళ్ళబుచ్చేయాలని ఉంది...."

ఆమె నొచ్చుకుని - "చదువులో నీ పాటి చేయనని ఆయన అస్తమానూ అంటూంటాడు. ఆయన ఎమ్మెల్యే అయ్యాడు. ఆయన స్నేహితుడివి నువ్వు పనివాడిగా ఎలా ఉంటావ్?" అంది.

రామచంద్రుడు - ఇప్పటికీ తన్నెంతగానో తల్చుకుంటున్నందుకు గవర్రాజు మనసులోనే అతడినభినందించుకుని - "పుస్తకం చదివి అర్థం చేసుకుని పరీక్షలు రాసి పాసయ్యేవాళ్ళు కాదు గొప్పవాళ్ళు. జీవితంలో పదిమందిని ప్రభావితుల్ని చేసి, పదిమందికి నాయకులై ఎమ్మెల్యేలయిన వాళ్ళే గొప్పవాళ్ళు. అంత గొప్పవాడయ్యుండి వాడు నన్నింకా తల్చుకుంటున్నాడంటే - మా రామచంద్రుడు మనిషి కాదు. దేవుడు" అన్నాడు.

"అయితే ఏమంటావ్?"

"ఆ దేవుడింట్లో పనిచేసే అవకాశం దొరికితే అదే మహద్భాగ్యమనుకుంటాను..." అన్నాడు గవర్రాజు.

ఆమె ఒక్క క్షణం ఆలోచించి - "అయితే ఓ పనిచేద్దాం. నువ్వు డ్రయివింగు నేర్చుకో. కారు డ్రయివర్ ఉద్యోగం ఇప్పించడమయితే ఆయనకు చాలా సులభం" అంది.

గవర్రాజుకు డ్రయివింగు నేర్చుకోవాలని సరదాగానే ఉంది. ఉద్యోగం సంగతెలాగున్నా ముందు కాలక్షేపం కూడా అవుతుంది కదా అనిపించి ఒప్పుకున్నాడతడు.

రామచంద్రుడి భార్య అతడికో డ్రయివర్ నప్పగించింది. రెండు రోజుల్లోనే గవర్రాజు గురించిన వివరాలడిగాడు.

గవర్రాజు తనకీ, గౌరికీ ఉన్న సంబంధం చెప్పకుండా పల్లెటూళ్ళో భూపతి తన్ను బాధిస్తున్న విషయం చెప్పి - తర్వాత జరిగిందంతా యదార్థంగా చెప్పాడు. డ్రయివరు అంతా ఆశ్చర్యంగా విని - "నువ్వు ఎమ్మెల్యే గారి స్నేహితుడివయుండీ - కారు డ్రయివర్ అవుదామనుకుంటున్నావా! అందుకు వాళ్ళు ఒప్పుకున్నారా?" అని అన్నాడు.

"ఎవరి అర్హతకు తగిన ఉద్యోగం వాళ్ళకొస్తుంది. నాకేం పెద్ద ఆశలు లేవు. నేనెక్కడున్నానో నాకు తెలుసు..."

"వాళ్ళొప్పుకున్నారా?" అన్నాడు డ్రయివర్.

"నా స్నేహితుణ్ణి నేనింకా కలుసుకోలేదు. వాడి భార్య తనే నాకీ సలహా ఇచ్చింది..." అన్నాడు గవర్రాజు.

డ్రయివరాశ్చర్యంగా - "ఇంతవరకూ ఒక్కసారి కూడా నువ్వు నీ స్నేహితుణ్ణి కలుసుకోలేదా?" అన్నాడు.

"లేదు. వాడూళ్ళో లేడుగా..."

"ఊళ్ళో లేకపోతే ఫోన్ చెయ్యొచ్చుగా.."

"ఏమో - నాకు తెలియదు."

డ్రయివరు చుట్టూ చూసి స్వరం తగ్గించి - "అయితే ఇదంతా నాటకమయుంటుంది. ఇలాగంటున్నానని ఏమీ అనుకోకు" అన్నాడు.

"నాటకమేమిటి?"

"పెద్దవాళ్ళకు చిన్నవాళ్ళంటే చిన్నచూపు. మీ ఊరి రామచంద్రుడిప్పుడు నీకంటే చాలా గొప్పవాడు. ఆయనకు నిన్ను స్నేహితుడని చెప్పుకుందుకే సిగ్గుగా ఉంటుంది. నువ్వు వచ్చినట్లాయనకు భార్య ఫోన్ చేసి చెప్పే ఉంటుంది. నిన్ను కారు డ్రయివరు చేయమని ఆయనే సలహా ఇచ్చి ఉంటాడు."

"అయితే?"

డ్రయివరు గవర్రాజుకి వివరించాడు.

ఎమ్మెల్యేలకు కొందరు నమ్మకస్తులైన మనుషుల అవసరముంటుంది. ముఖ్యంగా కారు డ్రైవరు తనవాడైతే అందువల్ల ఎన్నో సదుపాయాలు. ఆయనెక్కడికి వెళ్ళినా అంతరంగిక రహస్యంలా డ్రైవరు కాపాడతాడు. రామచంద్రుడు గవర్రాజును తన కారుడ్రైవర్ని చేయాలనుకుంటున్నాడు. తనే చెప్పడానికి మొహమాటపడి - కథంతా భార్యద్వారా నడిపిస్తున్నాడు. చివర్లో తనొచ్చి - "అయ్యో! నాకు తెలిస్తే ఇలా జరగనిచ్చి ఉండేవాణ్ణి కాదే.." అంటాడు. అప్పటికి గవర్రాజు మానసికంగా డ్రైవరుద్యోగానికి సిద్ధపడి ఉంటాడు. రామచంద్రుడు మొహమాట పడుతున్నాడనడానికి నిదర్శనం - అతడు ఫోన్‌లో కూడా గవర్రాజుని పలకరించకపోవడం...."

"ఇదంతా నే నూహించలేదు..."

"ఇంకో రకంగా కూడా జరిగుండవచ్చు..." అన్నాడు డ్రైవరు.

"చెప్పు..." అన్నాడు గవర్రాజు.

"అసలు రామచంద్రుడికి నిన్ను చూడ్డంగానీ, నీతో మాటలాడడంగానీ, నీకు సాయపడ్డంగానీ ఇష్టంలేదు. నీకు డ్రయివరుద్యోగ మిప్పిస్తానంటే అవమానంగా ఫీలై వెళ్ళిపోతావనుకున్నాడు. అందునే నిన్ను కలుసుకోవడం లేదు. మాటలాడడం లేదు..."

"మా రామచంద్రుడలాంటివాడు కాదు..."

"మీ రామచంద్రుడి గురించి నాకు తెలియదు. కానీ చాలా మంది పెద్దవాళ్ళ వ్యవహారాలిలాగే ఉంటాయి."

"అయితే ఈ రోజే వెళ్ళి అన్నీ అడిగేస్తాను. నువ్వు చెప్పిందే నిజమయితే ఈ ఇంట్లో ఒక్క క్షణం కూడా ఉండను" అన్నాడు గవర్రాజు.

"బాబోయ్ అంత పని చేయకు. నా కొంప మునుగుతుంది" అన్నాడు డ్రైవరు కంగారుగా భయంగా.

గవర్రాజు అన్నంతపనీ చేశాడు. రామచంద్రుడి భార్య అతడి ఆరోపణలకాశ్చర్యపోయి - "ఎవరో నీకు నూరిపోశారు. ఇది నిజం కాదు" అంది.

"దీని కెవరో చెప్పాలా? ఇంట్లో ఫోనుంది. నువ్వెవరెవరితోనో మాట్లాడుతున్నావు. నీ భర్తతో మాట్లాడలేవంటే ఎలా నమ్మను? వాడికి నేనొచ్చినట్లొక్క మాట చెప్పలేవా! వాడు నాతో ఒక్క మాట మాట్లాడలేడా?"

"అదా నీ అనుమానం!" అందామె.

"అనుమానం కాదు - నమ్మకం..."

"అయితే అసలు విషయం నీకు చెప్పక తప్పదు..." అందామె.

"ఏమిటది?"

"ఇటీవల పార్టీలో చీలికలొచ్చే ప్రమాదం కనబడుతోంది ముఖ్యమంత్రికి తన పార్టీ ఎమ్మెల్యేలందరి మీదా అనుమానముంది. ప్రతిపక్షానికి బాగా ధన బలముంది. వాళ్ళు డబ్బిచ్చి ఎమ్మెల్యేలను కొనేసి తమ వయిపు తిప్పుకుని ముఖ్యమంత్రిని పడగొట్టాలని చూస్తున్నారు. అలా కొందరు నీ స్నేహితుడి దగ్గర క్క్యాడా వచ్చారు. అవిశ్వాస తీర్మానంలో ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా ఓటు చేస్తే - ఎంతిస్తామన్నారో తెలుసా! పదిహేను లక్షలు."

"నిజంగా పదిహేను లక్షలే.... వెంటనే ఒప్పేసుకోవలిసింది...." అన్నాడు గవర్రాజప్రయత్నంగా.

"నిజమే - డబ్బాకర్షణ అలాంటిది. ఒప్పేసుకోవాలనే అనిపిస్తుంది. కొందరయితే అప్పుడే డబ్బుకు లొంగిపోయారు కూడా. నిన్నటిదాకా దేవుడని ఈ రోజు రాక్షసుడంటున్నారు... అందుకని ముఖ్యమంత్రి అవిశ్వాస తీర్మానం గురించి బెంగపెట్టుకున్నాడు. తనను సపోర్టు చేసే ఎమ్మెల్యేలందర్నీ పిలిచి నిలదీశాడు. అంతా ఏకగ్రీవంగా ఆయనకే తమ మద్దతు నిస్తామన్నారు. అప్పుడాయన వాళ్ళను రెండు బస్సుల్లో ఎక్కించి ఎక్కడికో పంపించేశాడు. వాళ్ళెక్కడున్నారో ఆయనకు తప్ప ఇంకెవ్వరికి తెలియదు. మీ నేస్తానికిప్పుడు తన భార్యతో మాట్లాడే అవకాశం లేదు. తమ ఉనికి గురించి ఇతరులకు తెలియకుండా ఉండడం కోసం - వాళ్ళకు బయటి ప్రపంచంతో సంబంధం లేకుండా ఉంచాడు ముఖ్యమంత్రి. ఇదీ ఈనాటి రాజకీయాల వరస. అవిశ్వాస తీర్మానం రోజుదాకా వాళ్ళు బయటపడలేరు. ఈ విషయం చాలా కొద్దిమందికి తెలుసు. నీకు నేను చెప్పకూడదనే అనుకున్నాను కానీ చెప్పక తప్పలేదు నీ కారణంగా...." అందామె నీరసంగా.

"నువ్వు చెప్పేది నిజమా?" అన్నాడు గవర్రాజు.

"అనుమానముంటే మరో నలుగురు -పార్టీ ఎమ్మెల్యేలింటికి వెళ్ళు. వాళ్ళ విషయమూ అంతే! గడ్డితింటారన్న అనుమానమున్న ఎమ్మెల్యే లెవ్వరూ అయినవాళ్ళక్కూడా అయిపు తెలియకుండా మాయమయ్యారు."

"మా ఊరి రామచంద్రుడు చాలా గొప్పవాడయిపోయాడనుకున్నాను. వాడి పరిస్థితీ నాకులాగే 'బానిస' బతుకేనన్నమాట..." అన్నాడు గవర్రాజు నీరసంగా.

# అదృష్టవంతుడు

**చాలా కష్టాల్లో** ఉన్నాను నేను.

అప్పుడే నేను బియ్యే ప్యాసై రెండేళ్ళయ్యింది. పైసా సంపాదన లేదు. సంపాదించే నాన్న లేడు నాకు.

అమ్మకు ఆర్నెల్ల నుంచి అనారోగ్యం. డాక్టరు దగ్గరకు వెళ్ళక్కరలేదురా అంటోంది. వెళ్ళాలని నాకు తెలిసినా అసహాయత కారణంగా అమ్మ వద్దంది కదా అని ఊరుకున్నట్లు నటిస్తున్నాను.

చెల్లెలికిప్పుడు పద్దెనిమిది నిండాయి. దానికి సరైన బట్టలు లేవు. ఉన్నవాటికి చిరుగులు. అది ఇంటినుంచి బైటకు రావటానికే మొహమాటపడుతోంది. నాకిప్పుడు బట్టలెందుకురా అన్నయ్యా - అంటుంది నేను దాని పరిస్థితికి బాధపడితే! దాని మాటలు విని తృప్తిపడ్డట్లు నటిస్తాను.

తమ్ముడు టెన్తుక్లాసు చదువుతున్నాడు. తెలివైనవాడే కానీ ఇవి ట్యూషన్ రోజులు. టీచర్స్ ట్యూషన్ కుర్రాళ్ళకే ఇంట్లో పాఠాలు చెబుతారు. ఆ అలసటనుంచి విరామం కోసం కాసేపు బడికి వచ్చి వెడుతుంటారు. నేను తమ్ముడికి ట్యూషన్లు చెప్పించలేను. కనీసం

గైడ్స్ అయినా కొనిపెట్టాలి. అవీ నా వల్ల కావడం లేదు. తమ్ముడికి లౌక్యం తెలియదు. పుస్తకాలు కావాలని రోజా ఏడుస్తున్నాడు. పరీక్ష ఫీజు కట్టడమే కష్టంగా ఉన్న నాకు - పుస్తకాలు కొనడమెలా సాధ్యపడుతుంది?

నాన్న అర్ధాంతరంగా పోతే ఆఫీసునుంచి కొంత డబ్బు, ఇన్సూరెన్సు కంపెనీ నుంచి కొంత డబ్బు వచ్చాయి. అందులోంచి కొంత అవసరానికి ఖర్చుపెట్టి మిగతాది బ్యాంకులో డిపాజిట్ చేశాను. నెలకు మూడు వందల రూపాయల వడ్డీ వస్తోంది. మూడేళ్ళుగా ఆ వడ్డీయే మా జీవనాధారం. దానికి తోడుగా మా ఇల్లు సగం వాటా అద్దెకిచ్చాం. వచ్చే అద్దె రెండువందల రూపాయలు. అయిదువందల రూపాయలతో ఎలాగో నాలుగు నోళ్ళు నింపుకోవచ్చేమో కానీ - అంతకుమించి ఇంకేమీ సాధ్యపడదు కదా!

నేను ఉద్యోగం కోసం కాళ్ళరిగేలా తిరుగుతున్నాను. కనిపించిన ప్రతివాడికీ చెబుతున్నాను. పేపర్లో నా అర్హతలకు సరిపడ్డ ప్రతి ఉద్యోగానికీ దరఖాస్తు పారేస్తున్నాను. ఉద్యోగం రావడం లేదు.

నా పరిస్థితి చూసి జాలిపడి ఓ బట్టల దుకాణం యజమాని నాకు పద్దులు రాసే పని ఇచ్చాడు. అదంత సులభం కాదు. దుకాణం యజమాని పన్ను ఎగేయడానికి వీలుగా ఒక రకం, సేల్స్‌మెన్ తనను మోసం చేయడానికి వీల్లేకుండా మరో రకం - పద్దులు రాయాలి.

అదైనా అస్తమనూ పని ఉండదు. నెలకు పదిరోజులు పని ఉంటుంది. ఉన్నప్పుడు పదిగంటలు పని చేయించుకుని - గంటకో రుపాయి చొప్పున రోజు కూలి కింద పదిరూపాయలిస్తాడు. పనెప్పుడుంటుందో ఆయన చెప్పడు. రోజా వెళ్ళి అడుగుతుండాలి. పని ఉన్నరోజున నేనడక్కపోయినా - అదింకొకడి పరమైపోతుంది. పని చేయడానికాయనకు చాలామంది ఉన్నారు. ఆయనకు నా పరిస్థితి జాలి కలగడం వల్ల ఉద్యోగమిస్తున్నాడు తనకి మనుషులు దొరక్క కాదు.

మూడేళ్ళ నుంచి నేను అదపా దడపా అప్పులు చేస్తూనే ఉన్నాను. ఒకసారి చేసిన అప్పు తీర్చడం కష్టంగానే ఉంటోంది. సాధారణంగా అప్పులు తీర్చడానిక్కూడా కొత్త అప్పులు చేస్తుంటాను.

నాకు చాలా విషయాల్లో పోటీగా ఉంటాడు రామం.

రామం లేనివాడు కాదు కానీ వాడికి దురలవాట్లు బాగా ఉన్నాయి. ఇంట్లో వాళ్ళు వాడిని పోషించగలరు కానీ వాడి దురలవాట్ల ఖర్చులు భరించలేరు. అందు గురించి వాడు చిల్లర దొంగతనాలు చేస్తుంటాడు. అదపా తడపా వాళ్ళనీ వీళ్ళనీ మోసాలు చేస్తుంటాడు. వాడికి నీతీ నిజాయితీ గురించిన పట్టింపు లేదు.

వాడి కారణంగా నాకు రావలసిన రెండు మూడు మంచి అవకాశాలు పోయాయి. నాకు కబురు చెప్పమని అయినవాళ్ళు చెబితే చెప్పకుండా తనే వాటినుపయోగించుకోవాలనుకున్నాడు. వాడికా అవకాశం ఉపయోగపడకపోయినా నాకుపయోగపడకుండా పోయేది.

వాడూ నాకులాగే నాతోపాటే బియ్యే పాసయ్యాడు. మార్కులు నాకంటే బాగా తక్కువగా వచ్చాయి. వాడు నాకెన్నోసార్లు దురలవాట్లు చేయాలని ప్రయత్నించి విఫలుడయ్యాడు.

"నువ్వెలాగూ పాడయ్యావు - నన్ను పాడుచేయకు..." అన్నాను నేను వాడితో చాలా సార్లు..

"నేను పాడవలేదు. నువ్వు బాగుపడతావనే ఈ అలవాట్లు చేస్తున్నాను..." అన్నాడు వాడు నాతో చాలా సార్లు.

ఒక్కసారి మాత్రం నేను వాడితో వాదనకు దిగాను.



"నీకు తెలియదులే - దేశానికీ, ప్రపంచానికీ సంబంధించిన గొప్ప గొప్ప కీలక నిర్ణయాలనీ మందు పార్టీల సమయంలోనే జరుగుతాయి. పెద్దవాళ్ళతో పరిచయాలు కావాలంటే మందు పార్టీలకు వెళ్ళాలి. మందు కొట్టాలి." అని - "మందు పేరు చెప్పి ఏదో ఒకరోజున నేను చాలా పెద్దవాడినై పోతాను. అప్పుడు నువ్వు విచారిస్తావు..." అన్నాడు రామం.

"కనీసం నీకు నా పోటీ లేకుండా పోతుందిగా - సంతోషించు -" అన్నాను.

"అయ్యో! నువ్వు నా ఆప్తమిత్రుడివి..... నిన్ను నేను పోటీగా భావించడంలేదు. ఒకవేళ నువ్వు నాకంటే ముందు బాగుపడతావేమో - ఎవరు చెప్పగలరు? బాగుపడాలంటే నా అలవాట్లు నీకూ ఉండాలి. సిగరెట్ కాల్చకుండా, మందకొట్టకుండా, అమ్మాయి చెయ్యి పట్టుకోకుండా - జీవితంలో పైకెలా వస్తావు? నువ్వు పైకి రావాలనే నేను తంటాలు పడుతున్నాను......"

"అందువల్ల నీకు ప్రయోజనం?"

"చాలా పెద్దది. నేనూ పెద్దవాడినయ్యేదాకా నువ్వు నాకో సిగరెట్ పారేస్తావు. మందు పార్టీకి పిలుస్తున్నావు....." అన్నాడు రామం.

"ఛీ -" అనుకున్నాను కానీ పైకి అనలేదు.

రామం నా ముఖభావాలు చదివాడో ఏమో - "చూస్తుండు ఏదో ఒకరోజు నువ్వు నా కారణంగానే పైకి వస్తావు -" అన్నాడు.

2

ఆ రోజు రామం నా దగ్గరకు వచ్చి "గురూ - నీ దశ తిరిగింది. వెళ్ళి అనంతరామాన్ని కలుసుకో -" అన్నాడు.

"అనంతరామం ఎవరు?" అన్నానాశ్చర్యంగా.

"ఆయనో పెద్ద బిజినెస్ మాగ్నెట్. ఒక్కసారి వెళ్ళి ఆయన్ను కలుసుకుంటే నీ అదృష్టం దారి మళ్ళుతుంది" అన్నాడు రామం.

"ఆయన్ను నువ్వే ఎందుకు కలుసుకోకూడదు?" అన్నాను.

"ఆయనకు నిజాయితీపరులు కావాలి. నా నిజాయితీ మీద ఆయనకు నమ్మకం లేదు..." అన్నాడు రామం.

ముందు నాకు వాడు వేళాకోళమాడుతున్నాడేమోనని అనుమానం కలిగింది. కానీ వాడు సీరియస్‌గానే ఉన్నాడని తెలిసాక - వాడు చెప్పిన విధంగా బిజినెస్ మాగ్నెట్ అనంతరామాన్ని కలుసుకున్నాను.

అంతస్తులో ఆయన నాకంటే చాలా చాలా పెద్దవాడు. ఆయనతో మాట్లాడాలంటేనే నాకు భయం వేసింది. ఆయన నా వివరాలన్నీ ఒకటొక్కటే అడిగి తెలుసుకున్నాడు. నేను ఒక్క అబద్ధం కూడా చెప్పలేదు.

"ఖరీదయిన పని. పూర్తి కాగానే పదివేలిస్తాను. సెక్యూరిటీ కట్టగలవా?" అన్నాడాయన.

"సెక్యూరిటీ దేనికి?"

"నేను నీకో వజ్రాలహారాన్నిస్తాను. దాని ఖరీదు ఒక కోటీ పది లక్షల రూపాయలంటుంది. అది భద్రంగా నేను చెప్పిన చోట అందివ్వాలి. చెప్పిన పని పూర్తి చేస్తే నీకూ పదివేల రూపాయలు బహుమతి. కానీ నిన్ను నమ్మి వజ్రాలహారాన్నివ్వాలంటే నీ నుంచి కొంత నగదు సెక్యూరిటీ ఉంచుకోవాలి..."

"కోటి రూపాయల హారానికి నేనెక్కణ్నించి సెక్యూరిటీ తేగలను!" అన్నాను నిస్పృహగా.

"కోటి కాదు - కోటీ పది లక్షలు" అంటూ సవరించాడాయన.

"అవును... అదే" అంటూ నీళ్ళు నమిలాను.

"ఎంతో కొంత సెక్యూరిటీ చాలు నాకు. ఉదాహరణకు పదివేల రూపాయలే నీకు పెద్ద మొత్తం. అది ఎవరి దగ్గరయినా తీసుకుంటే ఆ వ్యక్తి నిన్ను చూసుకోగలడు. ఆ విధంగా నీవు చేయిజారిపోకుండా చూసుకునేందుకు నాకు మరో వ్యక్తి లభిస్తాడు. నాకు తృప్తిగా ఉంటుంది - నిన్ను నమ్మి పదివేల రూపాయలిచ్చేవాళ్ళున్నారని."

నేను దీనంగా - "అయ్యా! ఈ రోజుల్లో నమ్మకానికి నిజాయితీ ఒక్కటే చాలదు. నాకు బొత్తిగా ఏ ఆధారం లేదు. అందుకని ఎవ్వరూ నాకు అప్పివ్వరు...." అన్నాను.

"ఇల్లుందేమో?" అన్నాడాయన.

"నా ఇల్లు తాకట్టులో ఉంది. వీలున్నప్పుడల్లా కొంత బాకీ కడుతున్నాను. నాకు ఉద్యోగం వస్తే తప్ప ఆ బాకీ తీరదు" అన్నాను.

"ఓహ్ - నీ కుద్యోగం లేదు కదూ!" అంటూ ఆయన సాలోచనగా తలపంకించి - "ఈ పని పూర్తి చేసుకు వస్తే నేను నీకు నెలకు రెండువేల రూపాయల జీతం మీద ఉద్యోగం వేయిస్తాను సరా?" అన్నాడు.

"కానీ - సెక్యూరిటీ!" అన్నాను.

"సెక్యూరిటీ అవసరంలేదు నాకు..."

ఒక్కసారి నాలో ఉత్సాహం పొంగి పొరలింది - "ఓకే సర్!" అన్నాను.

"ఒక్క నిమిషం కూర్చో" అన్నాడాయన.

నేను బుద్ధిగా కూర్చున్నాను.

ఆయన లోపలకు వెళ్ళి పది నిముషాల తర్వాత తిరిగి వచ్చాడు. ఆయన చేతిలో చిన్న బ్రౌన్ కవరుంది. అదాయన నాకందించి - "లోపల ఏముందో చూడు..." అన్నాడు.

నేను కవరు చింపి లోపల కాగితం బయటకు తీశాను.

ఆ ఊళ్ళో క్రొత్తగా ప్రారంభమైన బిస్కట్ల కంపెనీలో నాకు మేనేజర్ ఉద్యోగానికి ఆర్డరది. జీతం నెలకు రెండువేల రూపాయలు.

నాకు వెంటనే ఆయన కాళ్ళ మీద పడిపోవాలనిపించింది.

"నువ్వు పని పూర్తిచేసుకుని రావడానికి పదిరోజులే గడువు. ఆర్డరు కాగితం మీద తేదీ చూశావు కదా. ఆ రోజే నువ్వుద్యోగంలో చేరాలి! ఆరోజు చేరకపోతే ఈ ఆర్డరు చెల్లదు."

"అలాగే సర్!" అన్నానుత్సాహంగా.

"అయితే ఇక నేను చెప్పేది విను...." అన్నాడనంతరామం.

నేను బుద్ధిగా ఆయన చెప్పేది వినసాగాను.

నేనాయనిచ్చిన హారం తీసుకుని హైదరాబాద్ వెళ్ళాలి. స్టేషన్‌లోంచి ఆయన చెప్పిన ఓ నంబరుకి ఫోన్ చేయాలి. అప్పుడు నాకోసం ఓ కారొస్తుంది.. ఆ కార్లో బయలుదేరి వెళ్ళి సుల్తాన్ అనే వ్యక్తిని కలుసుకుని హారాన్నందివ్వాలి. అతడు నన్ను వెళ్ళిపొమ్మనే దాకా అక్కడే ఉండాలి.

"ఈలోగా ఆర్డరు టైమయిపోతే?" అన్నాను కంగారుగా.

"సుల్తాన్ మనుషుల్ని ఒక్క రోజుకు మించి ఉంచుకోడు...."

"ఉంచుకుంటే?"

"అది నీ ఖర్మ....." అన్నాడాయన చిరాగ్గా.

నేను భయపడి ఊరుకున్నప్పటికీ అప్పుడు నా బుర్ర చురుగ్గా పనిచేయసాగింది.

ఇందులో ఏదో ప్రమాదముంది! ఇది మామూలు వ్యవహారం కాదు. బహుశా అవినీతికి సంబంధించినదై ఉండాలి.

నేను ఉద్యోగం గురించి ఆశపడి ఈ పనికొప్పుకుంటే ఏమైపోతాను! పోలీసులు నన్ను పట్టుకుంటే?

నాకిక జీవితంలో ఉద్యోగం దొరకదు.

"సార్ - ఈ పని మీద నేను వెడుతున్నప్పుడు పోలీసులు పట్టుకుంటారా?"

"ఫూల్!" అన్నాడాయన. "నీ ముఖం చూస్తే చాలు పోలీసులు నీకామడ దూరం పోతారు. వాళ్ళు నాలుగు డబ్బులు దొరుకుతాయన్న వాళ్ళ జోలికే వెడతారు. నీ బోటి దౌర్భాగ్యుల జోలికి వెళ్ళరు.........."

ఆయన నన్ను ఫూలన్నందుకు నాకు రవంత బాధ కలిగింది. కానీ పేదవాడి బాధ బయటపడకూడదు కదా!

"ఒకవేళ పట్టుకుని హారం తీసేసుకుంటే నేనేం చేయాలి?"

అనంతరామం నా భావాలన్నీ చదివినట్లున్నాడు. ఆయన నావంక చురుగ్గా చూస్తూ - "పోలీసులు నీనుంచి హారం తీసుకుంటే ఆ బాధ్యత నాది. నిన్నేమీ అనను. పైగా జామీను మీద నిన్ను విడిపిస్తాను. అంతేకాదు. నీకుద్యోగం కూడా ఆ పోలీసు కేసు కారణంగా రాకుండా పోదు. పైగా నేనిస్తానన్న పదివేలూ అదనం........" అన్నాడు.

ఆయన నన్నాశపెడుతున్నాడని నా కర్థమయింది. ఆయన ఆశపెడుతున్నాడంటే తనకున్న ప్రయోజనం సామాన్యమైనది కాదు. నాకున్న ప్రమాదమూ మామూలుది కాదు. కానీ ఇలాంటి అవకాశాలు చాలా అరుదుగా వస్తాయి. వచ్చిన అవకాశాన్నుపయోగించుకుంటే నా జాతకం తిరిగిపోవచ్చు. దశమారిపోవచ్చు. నేను ప్రమాదానికి గురైతే ఇంతకంటే పెద్ద దురదృష్టానికేం గురికాను.

ఆయన చెప్పిన వాటన్నింటికీ అంగీకార సూచనగా తలూపాను. ఆయన తృప్తిగా నవ్వి - తన జేబులోంచి చెక్కుబుక్కు తీసి అప్పటికప్పుడు నా పేరున ఓ చెక్కురాశాడు. మొత్తం పదివేలు. కనీ అది పోస్టుడేటెడ్ చెక్కు. పదిరోజుల తర్వత మాత్రమే నేనది మార్చుకోగలను.

"ఈ చెక్కుకు వెనకాల సంతకం పెట్టు. మీ ఇంట్లో ఇచ్చేయ్. అనుకోని కారణాలవల్ల నువ్వు రావడం ఆలస్యమైనా మీవాళ్ళకు డబ్బు మార్చుకునేందుకు వీలవుతుంది -" అన్నాడనంతరామం.

"థాంక్యూ సర్!" అన్నాను.

"తిరిగొచ్చేక నువ్వు నన్ను మళ్ళీ కలుసుకుందుకు ప్రయత్నించకుండా ఈ ఏర్పాట్లన్నీ! ఈ విషయంలో ఎక్కడా నా పేరు బయటకు రాకూడదు. అది గుర్తుంచుకో. వచ్చీ రాగానే ఆర్డరు తేదీ ప్రకారం ఉద్యోగంలో చేరు -"

"కానీ సర్ - మీరు నాకు చెక్కెందుకిచ్చారని ఎవరైనా అడిగితే?" అనడిగాను నా తప్పులేకుండా.

"చాలామంది పేదవాళ్ళకి నేను సాయం చేస్తూంటాను. ఎందరికో దానాలిచ్చాను. ఆ విషయం ఊరందరికీ తెలుసు. బ్యాంకులవాళ్ళకి తెలుసు. కాబట్టి నువ్వేం బెంగపెట్టుకోకు. ఎవరైనా అడిగితే నా దానగుణాన్ని పొగిడేయ్ -" అన్నాడనంతరామం.

"నేనుద్యోగంలో చేరాక అడక్కపోయినా మిమ్మల్ని పొగడ్డమే నా పని సార్ -" అన్నాను కృతజ్ఞతగా.

"ఆ పని చేయకు. నా పని పూర్తిచేశాక నా గురించి మర్చిపో - ఉద్యోగం నేనిప్పించినట్లెవరికి చెప్పకు....." అన్నాడనంతరామం..

"ఒకే సర్ - మీరెలాగంటే అలాగే -" అన్నాను.

అప్పుడాయన తనకోటు జేబులోంచీ ఒక చిన్నపెట్టి తీశాడు. దాని పొడవు పదంగుళాలుంది. వెడల్పు రెండున్నరంగుళాలుండవచ్చు.

ఆయన నన్ను దగ్గరగా పిలిచి - "ఈ పెట్టెను జాగ్రత్తగా చూడు..." అన్నాడు.

చూశాను.

పెట్టెమీద తాళం చెవి ఉంచడానికో చిన్న హోలుంది. దానికటూ ఇటూ వేలు పట్టేటంత కన్నాలున్నాయి.

"చూశావా?" అన్నాడాయన.

తలూపాను.

"ఇది ప్రత్యేకమైన లాకర్ సిస్టమ్. ఇదిగో ఈ కీ హోల్లో దీని తాళం చెవినుంచుతున్నాను చూడు -" అంటూ ఆయన ఓ తాళం చెవిని కీ హోల్లో ఉంచాడు. తర్వాత తన ఎడమచేతి చూపుడు వేలును కీ హోల్‌కు కుడిపక్కగా నున్న కన్నంలో ఉంచి తాళం చెవిని తిప్పాడు. పెట్టెమూత వెంటనే తెరుచుకుంది.

నాకళ్ళు జిగేల్మన్నాయి.

లోపల ధగధగా మెరిసిపోతోందో హారం. అలాంటి హారాన్ని నా జన్మలో చూసి ఉండను.

అనంతరామం తక్కున మూత వేసేశాడు.

"చూశావా?" అన్నాడు నన్ను చూసి.

"చూశానండి -" అన్నాను.

"అర్థమయిందా?"

"అయిందండి -"

"ఇవతల పక్క కన్నం ముందు రెండు చుక్కల గుర్తుంది. అది సుల్తాన్ కోసం. అవతల పక్క కన్నం ముందు ఒక చుక్క గుర్తుంది అది నాకోసం. కీహోల్లో తాళం చెవినుంచి నేనుగానీ సుల్తాన్ గానీ మాకు నిర్ణయించిన కన్నాల్లో వేళ్ళుంచి తాళం చెవి తిప్పితే ఈ పెట్టె మూత తెరుచుకుంటుంది. మళ్ళీ మూత నొక్కగానే తాళం పడిపోతుంది. ఆ కన్నాల్లో ఎవరులెవరైనా వేళ్ళుంచితే వాళ్ళకు ప్రమాదం. పెట్టె మూత తెరుచుకోదుకానీ - వాళ్ళు పేలి ముక్కలైపోతారు. ఈ పెట్టెను నువ్వు సుల్తాన్ కందించాలి" అన్నాడనంతరామం.

నా గుండెలు జలదరించాయి - "పొరపాటున ఈ కన్నంలో ఎవరైనా వేళ్ళుంచితే?" అన్నాను.

"తెలిసినవాళ్ళెవరూ ఇందులో వేళ్ళు పెట్టకూడదు. తెలియనివాళ్ళు వేళ్ళు పెట్టకుండా ఉండడానికో సదుపాయం.........." అంటూ ఆయన రెండు కన్నాలమీదా రెండు గుండ్రటి స్టిక్కర్సు అంటించాడు. ఆ స్టిక్కర్సు పెట్టె రంగులో కలిసిపోయాయి. పరీక్షగా చూస్తే తప్ప ఆ స్టిక్కర్ల ఉనికి తెలియదు. "ఎప్పుడు కావాలంటే అప్పుడీ స్టిక్కర్లను సులభంగా తొలిగించవచ్చు. నీకు నా సలహా ఏమీటంటే - ఈ స్టిక్కర్లు తొలిగించే బాధ్యత సుల్తానుకు వదిలిపెట్టు. నా సలహాలు హెచ్చరికల్లాంటివని మర్చిపోకు -" అన్నాడనంతరామం.

నేను వినయంగా పెట్టె తీసుకున్నాను.

"చాలా జాగ్రత్త! నీ ప్రాణాలకంటే భద్రంగా చూసుకోవాలి నువ్వు. సుల్తాన్ కందేలోగా పెట్టెపోయిందంటే నీ ప్రాణాలు పోయినట్లే భావించు....." అన్నాడనంతరామం.

ఆయన నాకో సంచి కూడా ఇచ్చాడు. అది భుజానికి తగిలించుకుని అందులో ఆయనిచ్చిన వస్తువుల్ని ఉంచాను.

"నేను నిన్ను మళ్ళీ చూడను. విష్ యూ ఆల్ ద బెస్ట్..." అనేసి అనంతరామం లోపలకు వెళ్ళిపోయాడు.

3

ఇంట్లో నేను జరిగిందెవ్వరికీ చెప్పలేదు. కానీ రామం నన్ను కలుసుకుని మొత్తం సమాచారమంతా రాబట్టాడు. ముందుగా వాడికేమీ చెప్పకూడదనే అనుకున్నాను, కానీ ఏదో బలహీనత నన్ను రహస్యం దాచనివ్వలేదు.

నేను తలపెట్టిన పనిలో ఏదయినా ప్రమాదముందేమోనన్న అనుమానం నాకుంది. ఆ అనుమానం నన్ను బాధిస్తోంది. మనసు దిటువు చేసుకునేందుకా బాధ నెవరితోనయినా పంచుకోవాలి. అమ్మ, చెల్లెలు, తమ్ముడు - ఈ బాధను నాతో పంచుకోలేరు. వాళ్ళు నన్ను నిరుత్సాహపరచటమే కాక ఇందుకు విముఖుల్ని కూడా చేస్తారు. కాబట్టి నేను బాధను పంచుకుందుకు రామన్నెన్నుకోక తప్పలేదు.

అంతా విని రామం - "అయితే నేనొక బంగారు అవకాశాన్ని పోగొట్టుకున్నానన్నమాట..." అన్నాడు.

"అంటే?"

"అనంతరామంగారి నుంచి పిలుపు ముందునాకే వచ్చింది."

"నేనాశ్చర్యపడి - "అలాగా!" అన్నాను.

"నేనా పిలుపునుపయోగించుకోలేదు. కారణమేమిటంటే అనంతరామంగారు చెప్పే పనులు సాధారణంగా ప్రమాదమైనవిగా ఉంటాయి. పులినోట్లో తల పెట్టమనేరకమాయన. చూస్తూ చుస్తూ ఎవరూ అలాంటి పని చేయలేరుకదా! పోనీ అని పని చేయనన్నా కుదరదు. ఒకసారి ఆయన చెప్పింది విన్న మనిషి ఆ పని పూర్తి చేసి తీరాలి. అలా చేయకపోతే ఆ మనిషి ఉండడు..."

నేనాశ్చర్యంగా - "నిజంగానా?" అన్నాను.

"అనంతరామంగారి గురించి నాకు కొంత తెలుసు. అందుకోసమే నేను రిస్కు తీసుకోలేదు. తంతే బూరెల గంపలోకి వెళ్ళిపడ్డట్టయింది నీ పని. అందుకే అంటారు అదృష్టవంతుణ్ణి పాడుచేయడం, దురదృష్టవంతుణ్ణి బాగుచేయడం సాధ్యపడదని! నీ విషయంలోనూ నా విషయంలోనూ అంతే అయింది. ఆయనేదో అడవుల్లోకి పొమ్మంటాడనీ, మంటల్లో దూకమంటాడనీ భయపడ్డాను........" అంటూ నిట్టూర్చాడు రామం.

"అయితే ఈ పనిలో ప్రమాదమే లేదంటావా?" అన్నానాశగా.

"ప్రమాదమా? జస్ట్ ఊరెళ్ళి రావడం లాంటిది...." అన్నాడు రామం, అవకాశం పోయిందన్న భావాలు ముఖంలో ప్రకటిస్తూ.

నాకు చాలా సంతోషం కలిగింది - "తిరిగొచ్చాక ఉద్యోగంలో చేరగానే నీకు మందుపార్టీ ఇస్తాను సరా?" అన్నాను.

"మందు పార్టీ వద్దు నాకు. నేనడిగిందిస్తావా ఇప్పుడు?"

"ఏమిటి?" అన్నాను.

"ఈ పని చేసే అవకాశం నాకివ్వు - అంతే!"

"నీకా? అదెలా సాధ్యం?"

"హారమున్న పెట్టె తీసుకుని హైదరాబాద్ వెళ్ళాలి. అది నువ్వయితేనేం? నేనయితేనేం?" అన్నాడు రామం.

"అమ్మో! అనంతరామం నన్ను బ్రతకనివ్వడు."

"ఆయన హారం నువ్వే ఇవ్వాలని చెప్పలేదు. సుల్తాన్‌కి అందచేయాలని చెప్పాడు - అవునా?" అన్నాడు రామం.

"అవును. కానీ ఆ బాధ్యత నాయన నాకే అప్పజెప్పారు.."

"ఒరేయ్ - నువ్వలాగనేయకు. అసలీ అవకాశం నాకు రావాల్సింది. నా నిజాయితీ మీద అనంతరామంగారికి నమ్మకం లేదు. నమ్మకముంటే ఇంత జరిగేది కాదు. నాకు నాలుగు దురలవాట్లున్నంత మాత్రాన నేను నిజాయితీపరుణ్ణి కాకుండాపోను. ఈ విషయం అనంతరామంగారికి ఋజువు కావాలంటే ఈ పని నేను చేసి తీరాలి.

"ఒరేయ్ - ఉద్యోగం నీది. పదివేలూ నీవి. పనిమాత్రం నేను చేసి పెడతాను. ఎందుకంటే - ఈ పనివల్ల నాపై అనంతరామంగారికి నమ్మకమూ ఏర్పడుతుంది. సుల్తాన్‌గారితో పరిచయమూ కలుగుతుంది. రెంటికిరెండూ నాకు మాత్రమే ప్రయోజనకరం. ఎందుకంటే వారిద్దరూ కూడా అవినీతికి పాల్పడుతుంటారు. నాకు అవినీతి గురించిన బెంగ లేదు.

అసలు నాకు ఆదర్శాలు లేవు. అనంతరామం, సుల్తాన్ వంటి వ్యక్తుల పరిచయం, నమ్మకం నాకెంతో అవసరం. అవి నువ్వు కలకాలం భరించలేవు. ఒకసారి పని జయప్రదంగా నిర్విహించినందుకు అనంతరామంగారు మళ్ళీ మళ్ళీ వేర్వేరు పనులకు నియోగించవచ్చు. అవి ఇంత తేలికగా ఉండకపోవనూవచ్చు, కాబట్టి - ప్లీజ్ - నన్నీ పనిమీద వెళ్ళనీ!'' అన్నాడు రామం.

అంతా విన్నాను కానీ కరగలేదు. నేను అనంత రామంతో రిస్క్ తీసుకోవడం సంగతటుంచి నాకు రామం మీద నమ్మకం లేదు. వాడీహారం పట్టుకుని ఉడాయిస్తే? హారాన్ని వాడు కాజేయలేకపోవచ్చు. కానీ దాంతో నా పనయిపోతుంది కదా!

రామం మరి కాసేపు ప్రయత్నించి విఫలుడై - ''సరే బయల్దేరే ముందు మా ఇంటికిరా - నీకు కొన్ని రహస్యాలు చెప్పాలి'' అన్నాడు.

అది నిజమేనని నమ్మడం నేను చేసిన పెద్దపొరపాటు.

4

బయలుదేరే ముందు పోస్టుడేటెడ్ చెక్కు అమ్మకిచ్చి ఏ తేదీన అది బ్యాంకులో జమచేయాలో చెప్పాను. చెక్కుకు వెనకాల ముందుగానే నా సంతకం పెట్టాను.

''ఎక్కడిదిరా ఇంత డబ్బు?'' అనడిగిందమ్మ.

''బహుశా నాకుద్యోగం వస్తుంది. ఇప్పుడో అర్జంట్ పనిమీద వెడుతున్నాను. రెండ్రోజుల్లో తిరిగొస్తాను. పదిరోజులు పట్టినా కంగారు పడకు. అన్నీ తిరిగొచ్చాక చెబుతాను......'' అన్నాను.

నేనింకా మెట్లు దిగకుండానే ఎదురయ్యాడు రామం.

''మా ఇంటి రావాలన్న విషయం గుర్తుంటుందో ఉండదో అని!'' అన్నాడు వాడు. అమ్మతో - ''స్టేషన్ దాకా వెళ్ళి దిగబెడతాను - '' అన్నాడు.

''అయితే వచ్చి కాస్త కబురు చెప్పి వెళ్ళు నాయనా!'' అందమ్మ వెంటనే.

''లేదు పిన్నీ! వీణ్ణి స్టేషన్లో రైలెక్కించాక - అక్కణ్ణించి బస్‌స్టాండ్‌కు వెళ్ళి మా ఊరెళ్ళాలి. తిరిగి రావడానికి వారం రోజులు పడుతుంది. అప్పటికి మీవాడే వచ్చేస్తాడు'' అన్నాడు రామం.

ఇద్దరం బయలుదేరాం. వాడు నన్నో గదికి తీసుకువెళ్ళాడు.

''ఇది మీ ఇల్లు కాదే!'' అన్నానాశ్చర్యంగా.

''కాదు. నేను వేరే గది తీసుకుని ఉంటున్నాను. మా ఇంట్లో వాళ్ళకి నా అలవాట్లు నచ్చవుగా!'' అన్నాడు రామం.

నేను గదిని చూశాను. విశాలంగానే ఉంది. గదిలో మంచం, పక్క నీటుగా వేసి ఉన్నాయి. గది శుభ్రంగా తుడిచివుంది. అది రామంగాడి గదంటే నమ్మశక్యంగా లేదు.

''ఈ గది నాకు బయటి ప్రపంచంతో సంబంధం లేకుండా హాయిగా, సుఖంగా ఉంచుతుంది. ఇక్కడ నేనేం చేసినా చెల్లుతుంది. ఒక ఏడాదిగా నేనిక్కడే సుఖపడుతున్నాను......'' అన్నాడు రామం.

''సరే - రహస్యాలన్నావవేమిటో చెప్పు...........'' అన్నాను.

''మొదటిసారి నా గదికి వచ్చావు. కాఫీ తాగాక అన్నీ చెబుతాను'' అంటూ ఫ్లాస్కులోంచి కాఫీ పోసిచ్చాడు వాడు నాకు.

''నువ్వూ తాగు'' అన్నాను.

''నేనిప్పుడు లైటుగా తాగాలంటే బీరు హాయిగా తాగాలంటే విస్కీ, బ్రాందీ, రమ్ము, జిన్...'' నవ్వాడు వాడు.

నేను మాట్లాడకుండా కాఫీ తాగేశాను. తాగుతుంటే ఏదోలాగుంది. పూర్తిగా తాగగానే కళ్ళు తిరుగుతున్నట్లనిపించింది.

"ఏదోలా ఉందిరా!: అన్నాను.

"ఒక్క నిముషం పడుకుని కళ్ళుమూసుకో..." అన్నాడు వాడు.

ఆ సమయంలో అంతకుమించి గత్యంతరం లేదు.

వెంటనే వెనక్కి వాలి మంచం మీద పడుకుని కళ్ళు మూసుకున్నాను. తర్వాతేమయిందో నాకు తెలియదు. కళ్ళు తెరిచేసరికి నేనింకా ఆ గదిలోనే ఉన్నాను. గదిలో రామం లేడు. వాడి స్థానంలో ఓ చీటీ ఉంది.

"మైడియర్ బాల్యస్నేహితుడా! నేను సుల్తాన్ దగ్గిరకు వెడుతున్నాను. అనంతరామంగారి పని జయప్రదంగా చేసుకుని నాపై నీకు, ఆయనకు కూడా నమ్మకం పుట్టించుకుంటాను. జీవితంలో స్థిరపడే ఏకైక అవకాశం నాకిది. అందుకే నిన్ను మోసం చేసి వెడుతున్నాను. ఇలా జరిగిందని నీవు వెళ్ళి అనంతరామంగారికి ఫిర్యాదు చేయకు. పొరపాటెవరిదయినా ముందాయన నీకు మరణశిక్ష విధిస్తాడు. ఈ గదిలో నీకు వారం రోజులకు సరిపడే టిన్డ్‌ఫుడ్ ఉంది. అటాచ్డ్ బాతుంది. నీకు తెలియకుండానే అవసరాలను గమనించే నా స్నేహితుడొకడున్నాడు. ప్రస్తుతానికి నీవిక్కడ బందీవి. నేను తప్పుచేశాననుకుంటే నన్ను క్షమించు.

సెలవు.

నీ రామం"

ఉత్తరం చదవగానే నా గుండె బేజారయింది. కానీ ఏం చేయను?

ఆ గదిలో పూర్తిగా వారం రోజులు బందీగా ఉన్నాను. గదిలోంచి పారిపోయే అవకాశం లేదు, బాత్రూంలోంచి కూడా పారిపోయే అవకాశం లేదు. గదిలో నేను చూడనప్పుడు ఎవరో కిటికీలోంచి ఇడ్లీ, దోస, ఉప్మా వగైరా టిఫిన్ పొట్లాలు - అన్నం సాంబారు, కూర, పెరుగు, పొట్లాలు - పడేస్తుండేవారు.

నేను దుఃఖిస్తూనే రోజులు గడుపుతున్నాను. ఇలా బందిఖానా ఎన్నాళ్ళో మరి!

గదిలో నాకేలోటూ లేదు కానీ బైటపడ్డాక నేనేమైపోతాను?

అసలు నేను బైటపడతానా?

వారంరోజుల బందిఖానా ముగిసాక ఎనిమిదవరోజున ఆ గది తలుపులు తీసి ఉండటం గమనించాను. అంతే.... ఉత్సాహంగా అక్కణ్ణించి బైటపడ్డాను. ఇంటికి వెళ్ళాను.

"ప్రయాణమెలా జరిగిందిరా?" అందమ్మ నన్ను చూస్తునే.

ఏడవలేక నవ్వాను.

ఆ తర్వాత.....

అనుకున్న రోజుకి ఉద్యోగానికి వెడితే నాకుద్యోగం వచ్చింది. కానీ అక్కడి చీఫ్ నా ఆర్డరు చూసి ఆశ్చర్యపోయాడు.

"ఇలాంటి ఆర్డరు కాగితంతో ఉద్యోగంలో చేరే మనిషి కోసం గత రెండు సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నాం. నువ్వు చాలా అదృష్టవంతుడివి" అన్నాడాయన.

ఆయన మాటలకర్థం నాకప్పుడు తెలియలేదు.

బ్యాంకులో నా చెక్కు కూడా క్యాష్ అయింది.

అంటే రామం నమ్మకంగానే ప్రవర్తించాడన్నమాట. వాడికి మందుపార్టీ ఇవ్వాలని నాకుంది. జీవితంలో స్థిరపడ్డానన్న ఉత్సాహంలో - నేను వాడి తప్పులన్నీ క్షమించగలుగుతున్నాను. కానీ వాడు మళ్ళీ నాకు కనపడలేదు. వాడేమయ్యాడోనన్న నా సందేహానికి ఓ ఏడాది తర్వాత నాకు సమాధానం దొరికింది.

సుల్తాన్ అనే స్మగ్లరు పోలీసులకు పట్టుబడ్డాడని పేపర్లో వచ్చింది. అతడు తన కార్యకలాపాలకు వేరే అనుచరులనుంచుకోడు. సరుకు - ఒకచోటినుంచి మరో చోటకు రవాణా కావడానికి అతడు కొత్తమనుషులను వాడుకుంటాడు. ఒక పని చేసినవాడిని ఆ పని పూర్తికాగానే చంపించేస్తాడు. సుల్తాన్‌కి వివిధ నగరాల్లోని ప్రముఖులతో సంబంధముంది.


ఆ వార్త ఎన్నో నా సందేహాలకు సమాధానాన్నిచ్చింది. అయితే ఆ సమాధానం నా మనసుకు తృప్తినివ్వలేదు.

నా వళ్ళు జలదరించింది. మనసు వణికిపోతోంది.

రామం దురదృష్టవంతుడు. వాడి దురదృష్టంలో అదృష్టముంది. వాడు నన్ను వారంరోజులు బందీగా ఉంచి ఉండవచ్చు. కానీ అదే నా ప్రాణాలు కాపాడింది.

ఆ రోజు గుడికి వెళ్ళి రామం ఆత్మశాంతికి ప్రార్థన చేసి - మైడియర్ బాల్యస్నేహితుడా - నా తప్పులేకపోయినా నావల్ల నీకు ప్రమాదం జరిగింది. నన్ను మన్నించు. నేను నీకు సర్వదా కృతజ్ఞుణ్ణి అనుకున్నాను.

## కిరాయి హంతకుడు




"నమస్కారమండి -" అన్నాడు జగ్గు.

పురుషోత్తం పేపరు చదువుతున్నవాడల్లా తలెత్తి చూశాడు. ఆయన కళ్ళలో ప్రశ్నార్థకం!

"నా పేరు జగ్గు........" అన్నాడు జగ్గు.

పురుషోత్తం కళ్ళలో ప్రశ్నార్థకం మాయం కాలేదు.

"విశాఖపట్నంలో ఏ పెద్దమనిషినడిగినా నాగురించి చెబుతాడండి. నేను కిరయి హంతకుణ్ణి" అన్నాడు జగ్గు.

పురుషోత్తం కళ్ళలో ప్రశ్నార్థకం మాయమై ఆశ్చర్యార్థకం వెలిసింది. అప్పుడాయన పెదవి విప్పి - "నాతో నీకేం పని?" అన్నాడు.

"మీరూ భూషయ్యగారు గొడవపడ్డారని విన్నాను."

"అయితే?"

"భూషయ్యగారు మీకో పెద్ద అడ్డుగా ఉన్నారని విన్నాను........."

"ఊఁ "

"నేను కిరాయి హంతకుణ్ణి..."

పురుషోత్తం భ్రుకుటి ముడతలు పడింది. జగ్గును కాసేపాగమనీ తానాలోచించుకోవాలనీ ఆయన కళ్ళు చెప్పాయి. ఆ భాష జగ్గు కర్థమయింది.

పురుషోత్తం ఆలోచిస్తున్నాడు.

భూషయ్య సామాన్యుడు కాదు. తన ఆయువుపట్టుమీద దెబ్బతీశాడు.

పురుషోత్తానికా ఊళ్ళో రెండు థియేటర్లు, ఓ రైసు మిల్లు, హోటలు, డిపార్ట్‌మెంటల్ స్టోరు ఉన్నాయి. ఇవి కాక ఆయన తన పేరున ఉన్న ఓ పెద్ద ప్లాటులో మిడిల్ ఇన్‌కం గ్రూపు ఫ్లాట్సు కట్టాలనుకుంటున్నాడు. దాంతో ఆయనకు కనకవర్షం కురుస్తుంది.

ఫ్లాట్సు కంట్రాక్టు భూషయ్యకు వెళ్ళాలి. కానీ అంతకు ముందు భూషయ్య కట్టిన రెండు ఫ్లాట్సు కూలిపోయి అతనికి చెడ్డపేరు, బోలెడు నష్టం వచ్చాయి. ఆ నష్టాన్ని ఈ కంట్రాక్టులో పూడ్చుకోవాలని భూషయ్యనుకున్నాడు.

ఖరీదు కాస్త ఎక్కువైనా తన కట్టడాలు పటిష్టంగా ఉండాలని పురుషోత్తం కోరుకుంటున్నాడు. అందుకని అతడా కంట్రాక్టును భూషయ్యక్కాక - దేశవ్యాప్తంగా పేరున్న నర్లీకర్ కంపెనీ కివ్వాలనుకున్నాడు. అతడు నర్లీకర్ కంపెనీకి కంట్రాక్టు ఇస్తాడని తెలియగానే - ఫ్లాట్సుకు మంచి రెస్పాన్స్ వచ్చింది.

భూషయ్య పురుషోత్తాన్ని కలిసి - "మనం మనం ఒకూరివాళ్ళం. ఎక్కడో నర్లీకర్ కంపెనీ మనలాభాలన్నీ పట్టుకుపోకూడదు. కాంట్రాక్టు నాకే ఇవ్వు. పకడ్బందీగా అన్నీ కడతానని హామీ ఇస్తున్నాను -" అన్నాడు. పురుషోత్తం అంగీకరించలేదు.

భూషయ్య పురుషోత్తాన్ని డబ్బుతో కొనాలని చూశాడు. పనికాలేదు. రాజకీయంగా ఒత్తిడి తెచ్చాడు.

పురుషోత్తం రెండింటికీ తట్టుకున్నాడు.

అప్పుడు భూషయ్య పురుషోత్తం ఆయువుపట్టు పట్టాడు.

పురుషోత్తం హోటలు, డిపార్టుమెంటల్ స్టోర్సు, థియేటర్సు, ప్రస్తుతం ఫ్లాట్సు కట్టాలనుకుంటున్న స్థలం - అనీ కూడా ఒకే వ్యక్తి నుంచి కొన్నాడు. ఆ వ్యక్తి పేరు ఆచారి.

ఆచారిది వడ్డీ వ్యాపారం. తాకట్టు మీద వస్తువులుంచుకుని వడ్డీకి అప్పులిస్తుంటాడు. బలహీన వర్గాలకు ప్రభుత్వం ఆ ఊళ్ళో కొన్ని స్థలాలు మంజూరు చేసింది. ఆ విధంగా మొత్తం యాభైమందికి ఊళ్ళో స్థలాలు వచ్చాయి. అయితే ఆ బలహీనవర్గాల వాళ్ళకు నగరంతో సంబంధం లేదు. ఆచారి ప్రోత్సాహంతో వాళ్ళు అప్లికేషన్స్ పెట్టారు.

ఆ స్థలాలను ఆచారి తాకట్టు పెట్టుకుని వాళ్ళకు కొంత డబ్బిచ్చాడు. ఆ డబ్బుతో వాళ్ళందరూ సమిష్టిగా పొలం కొనుక్కుని వ్యవసాయం చేసుకుంటూ పల్లెటూళ్ళో జీవిస్తున్నారు. ఆచారి తమ నడ్డుపెట్టుకుని - తమకిచ్చిందానికి నూరురెట్ల ప్రతిఫలం పొందుతున్నాడని వారికి తెలియదు. కొంతకాలం గడిచాక తాకట్టు డబ్బుకు వడ్డీ బాగా పెరిగిపోయిందని స్వల్పంగా కాంపెన్సేషనిచ్చి ఆ స్థలాలు తన పేరున రాయించుకున్నాడాచారి. కాంపెన్సేషనుకే ఎంతో సంతోషపడ్డారు పుచ్చుకున్నవాళ్ళు.

ఆ స్థలాల్లోంచే ఆచారి కొన్ని పురుషోత్తానికి అమ్మాడు. ఆ స్థలాల పేరు చెప్పి పురుషోత్తం కూడా లక్షల్లో లాభాలు ఆర్జిస్తున్నాడు.

ఇప్పుడు భూషయ్య ఉన్నట్టుండి అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడే వాడయ్యాడు. బలహీన వర్గాలకు జరిగిన అన్యాయానికి అతడి కడుపు తరుక్కుపోతోంది. గుండె మండిపోతోంది.

బలహీన వర్గాల నాయకుడు ఆదెయ్యకీ భూషయ్యకీ బాగా దూరపు బంధుత్వముంది. భూషయ్య ఆర్థికంగా బాగుపడ్డాక తన బంధువులను బంధువులని చెప్పుకోవడం కూడా మానేశాడు. కానీ ఇప్పుడతడు ఆదెయ్యతో బావా అంటూ వరసకలిపి జరిగిన ద్రోహమంతా చెప్పి - "కోర్టుకు వెడితే లక్షల్లో కలిసొస్తుంది మీకు. ఆచారి మిమ్మల్ని దారుణంగా మోసం చేశాడు" అన్నాడు.

ఆదెయ్య ముందు భయపడ్డాడు కానీ భూషయ్య ధైర్యంతో చివరికతడంగీరించాడు - ఫలితంగా ఆచారికీ, పురుషోత్తానికీ కూడా లాయరు నోటీసులందాయి.

ఇప్పుడు సమస్య ఆచారిదీ, పురుషోత్తానికి ధన నష్టం సమస్య!

ఆచారి మీద కోర్టులో నెగ్గడం - అంత సులభం కాదు అందులోనూ ఆదెయ్యవంటి అణాకానీ మనుషులకసలే సాధ్యం కాదు. కానీ ఆదెయ్యకు భూషయ్య అండ ఉంది.

ఆచారి, పురుషోత్తం లాయర్ని సంప్రదించారు. లాయరు కేసు పూర్వాపరాలు పూర్తిగా విచారించాక - "చట్టం ప్రకారం మీ కేసు కొంతవరకు నిలబడవచ్చు. కానీ ఇందులో రాజకీయపు జోక్యం వచ్చే ప్రమాదం ఉంది. అప్పుడు తట్టుకోవడం కష్టం" అన్నాడు.

ఇది బలహీన వర్గాలకు జరిగిన అన్యాయం. ఇటు ప్రభుత్వం, అటు ప్రతిపక్షం - రెండూ కూడా ఈ కేసులో ఆదెయ్యనే సపోర్టు చేస్తాయి.

ఆచారి ఆదెయ్యను మోసం చేశాడు. రాజకీయవాదుల మద్దతు ఉంటే - ఆ మోసం అతి సులభంగా బయటపడుతుంది.

లాయరు చెప్పింది విని పురుషోత్తం రాజకీయ వాదుల మద్దత్తు కోసం చూశాడు. ప్రభుత్వ పక్షం నుంచి ఓ ఎమ్మెల్యే అతడి కన్నివిధాల సాయపడతానని మాటిచ్చాడు. ఆ ఎమ్మెల్యే ఆదెయ్యను కలుసుకుని మంచి మాటలతో నచ్చజెప్పబోయాడు. కానీ అప్పటికే రంగంలో ఓ ప్రతిపక్షం ఎమ్మెల్యే దిగాడు.

ప్రభుత్వ పక్షం ఎమ్మెల్యే పురుషోత్తాన్ని కలుసుకుని "ప్రతిపక్షం ఎమ్మెల్యేల జోక్య మున్నప్పుడు ఇలాంటి వ్యవహారాల్లో నేను జోక్యం చేసుకోను. నా పరువు పేపర్లో కెక్కితే ముందు ముందు మంత్రయ్యే మాటటుంచి - మళ్ళీ ఎలక్షన్లకు ఎమ్మెల్యే టికెట్ కూడా దొరకదు. నువ్వు ముందు ప్రతిపక్షం ఎమ్మెల్యేతో రాజీ పడు" అన్నాడు.

పురుషోత్తం ప్రతిపక్ష ఎమ్మెల్యేను కలుసుకున్నాడు భూషయ్య అతడికే ఆశ పెట్టాడో కానీ ఆ ఎమ్మెల్యే పురుషోత్తాన్ని ఖాతరు చేయలేదు. భూషయ్యతో రాజీకి వస్తే తను రాజీకి వస్తానన్నాడు.

ఆదెయ్యకు సంబంధించినంతవరకూ అతడు చదరంగంలో పావు. అతడి గురించి ఎవరయినా అంతే ఆలోచిస్తున్నారు.

పురుషోత్తం మరోసారి ఆదెయ్యను కలుసుకుని - "కోర్టుల చుట్టూ తిరగటంవల్ల నాకు లక్షల్లో నష్టం వస్తుంది. అది నేను తట్టుకోగలను. నీకు జీవితం దుర్భరమౌతుంది. నీ ఇల్లు బూడిదవుతుంది. నీ పంట నీకు అందదు. ఈ బాధలన్నీ నీ కెందుకు! కేసు ఉపసంహరించుకో - నేను నీ క్షేమం చూస్తాను" అన్నాడు.

ఆదెయ్య వెంటనే - "అయ్యా! తమరు పెద్దలు. నాకు ప్రస్తుతం జీవితం సుఖంగానే వెళ్ళిపోతోంది. ఉన్నదానితో నాకు తృప్తిగా కూడా ఉంది. పెద్దోళ్ళతో గొడవలు నాకిష్టముండవు. కానీ ఏం చేసేది? నా క్షేమం చూస్తానంటూనే తమరు నన్ను బెదిరించారు. అలాగే ఇంకో పెద్దమనిషీ నన్ను బెదిరించాడు. ఎవరూ బెదిరించకపోతే నామానాన నేను బ్రతుకుతాను. ఇద్దరు రెండు రకాల బెదిరిస్తూంటే - ఎవరివల్ల నాకెక్కువ లాభమో వారిమాట వింటాను. ఇంతకు మించి నేనేమీ చెప్పలేను. తమరి మీద మాత్రం నాకు పగలేదు........." అన్నాడు.

కథకు మూల కారణం భూషయ్యేనని అర్థమయ్యిపోయింది పురుషోత్తానికి. ఆ భూషయ్య చస్తే అన్ని సమస్యలూ తొలిగిపోతాయి.

పురుషోత్తం భూషయ్యను చంపించాలనుకుంటున్నాడు కానీ ఆ విషయమతడి ఆంతరంగికులక్కూడా తెలియదు.

మరు జగ్గుకెలా తెలిసింది?

పురుషోత్తం ఆలోచనల్లోంచి బయటపడి జగ్గు వంక చూశాడు. ఆయన కళ్ళల్లో ప్రశ్నార్థకం చదివిన జగ్గు చిన్నగా నవ్వాడు ఆ నవ్వులో ఆయన ప్రశ్నకు సమాధానం కనబడింది.

"నిన్నెవరు పంపారు?" అన్నాడు పురుషోత్తం.

"నాకయి నేనే వచ్చాను.........."

"నాకూ భూషయ్యకూ గొడవలున్నాయని నీకెవరు చెప్పారు?"

"ఒకరు చెప్పేదేంటి బాబూ - లేడి వాసన పులికి తెలుస్తుంది. బేరమున్న చోటికి నేనే వెతుక్కుంటూ వెడతాను. ఇలాంటి బేరాలకోసమే కదా ఏడాదంతా ఎదురు చూస్తుంటాన్నేను......" అన్నాడు జగ్గు.

"భూషయ్యను చంపడం తేలిక కాదు......" సాలోచనగా అన్నాడు పురుషోత్తం.

"అదేమిటి బాబూ - ఆ మాట నేననాలి. పనిచేయడంలోని కష్టాల్ని యజమానే ముందు గుర్తిస్తే - నా రేటు పెరుగుతుంది......."

"ఎంత నీ రేటు?"

"యాభైవేలు....."

"ఓ మనిషి ప్రాణాలు తీయడానికి యాభయివేలా?"

"రోడ్డు పక్కన అమ్మితే రూపాయి చేసే బొమ్మ - షాపులో అద్దాల మధ్య కూర్చుంటే పదో పాతికో అవుతుంది. రోడ్డు పక్కన బడ్డీకొట్లో టీ కలిపే ఆడదాని జీతం రోజుకయిదు రూపాయలు. దానికే సినిమా ఛాన్స్ తగిలితే - డాన్సుకి లక్షరూపాయలు - తమకు తెలియందేముంది? భూషయ్య ఏ రిక్షావాడో అయితే అయిదువేలకే చంపేద్దును. అసలీ యాభయి వేలయినా కన్సెషన్ రేటు. భూషయ్యను చంపడం నాకూ ఇష్టమే కాబట్టి - కాస్త తక్కువ కొప్పుకుంటున్నాను........"

"భూషయ్యతో నీకు పరిచయముందా?"

"ఎందుకు లేదు బాబూ! ఆ మధ్య విశాఖపట్నం వచ్చినపుడూ నన్ను కలిసి చౌకలో మర్డరు చేయించుకున్నాడు. అప్పుడే నాకా బాబును కూడా చంపాలని మనసు పుట్టింది............"

"భూషయ్యను చంపి నువ్వు పట్టుబడితే?"

"మీ పేరు మాత్రం బయటకు రాదు..........అయినా అది నేను పట్టుబడ్డప్పటి మాట కదా! పదేళ్ళ నుంచి కిరాయి హంతకుడిగా ఉంటున్నాను. ఇంతవరకు పట్టుబడలేదు. నేను చంపిన వాళ్ళలో భూషయ్యకంటె పెద్దోళ్ళూ ఉన్నారు ఆదెయ్యకంటే చిన్నోళ్ళూ ఉన్నారు."

"నీ మాటలు నమ్మతగ్గవేనా?"

"తమరు పెద్దోళ్ళు. నిజానిజాలు తెలుసుకుందుకు తమ పద్ధతులు తమకుంటాయి. నేనీ ఊళ్ళో ఇంకో రెండురోజులుంటాను వెళ్ళేలోగా ఈ బేరం సెటిల్ చేసుకుని పని పూర్తిచేసుకుని పోవాలని నా కోరిక. ఆ పయిన మీ అదృష్టం, నా అదృష్టం. వెళ్ళేముందు తమకింకోసారి కనిపిస్తాను........." అని వెళ్ళిపోయాడు జగ్గు.

## 2

పురుషోత్తం చేతిలో కార్లున్నాయి, ఫోన్లున్నాయి, మనుషులున్నారు. ఒక్కరోజులో ఆయన జగ్గు గురించి చాలా సమాచారం సేకరించాడు.

జగ్గుది విశాఖపట్నం. కిరాయిహంతకుడిగా అతడికి పెట్టింది పేరు. హత్యలు చేయడానికతడు హైదరాబాదు, బొంబాయి, ఢిల్లీ కూడా వెళ్ళాడు. ఒక్కసారి కూడా అతడు అరెస్టు కాలేదు. వార్తా పత్రికల్లో కూడా అతడికి వ్యతిరేకంగా వచ్చిన వ్రాతలు తక్కువ.

జగ్గులో విశేషమేమిటంటే - అతడు నీతి తప్పి చరిస్తున్నా చట్టం పరిధిలోనే చేస్తున్నాడు. అతడు తప్పతాగి నడిరోడ్డుమీద సంచరించడు. ఎవరితోటీ పరుషంగా మాట్లాడడు. చేసే హత్యలు గోప్యంగా - చెవులే కానీ కళ్ళు లేని న్యాయదేవతకు హతుడి ఘోష వినపడని పద్ధతిలో చేస్తాడు.

హత్యలు చేయడం అతడి వృత్తి. సమాజంలో ఉంటూ అతడు భక్తి శ్రద్ధలతో తన వృత్తిని కొనసాగిస్తున్నాడు.

జగ్గు భూషయ్యను చంపితే - పురుషోత్తానికి వచ్చే లాభం ఇంతా అంతా కాదు. పురుషోత్తం జగ్గుకి యాభైవేలు కాదు - అయిదారు లక్షలిచ్చినా నష్టం లేదు - పురుషోత్తం పేరు బయటకు రాని పక్షంలో.

పురుషోత్తానికి జగ్గును ఉపయోగించుకోవాలనే ఉంది. కానీ ఒక్కటే ఆయనకు భయం.

జగ్గును ఎవరు పంపారు? తనకూ భూషయ్యకూ ఉన్న తగువు కారణంగా తను భూషయ్యను చంపించాలనుకుంటున్నట్లు జగ్గుకెలా తెలిసింది?

తన ప్రత్యర్థి భూషయ్య. అతడు సామాన్యుడు కాడు. అనుకున్నది సాధించడం కోసం ఏమైనా చేయగలడు. నక్క జిత్తుల్లో అతడికతడే సాటి.

జగ్గును అతడే తన వద్దకు పంపాడా? తమ సంభాషణను రహస్యంగా టేప్ చేయించి - తన ప్రాణాలకు రక్షణ కల్పించుకోవాలనుకుంటున్నాడా?

తనకూ భూషయ్యకూ పూర్వ పరిచయముందని జగ్గు చెప్పనే చెప్పాడు! ఇప్పుడు తనేం చేయాలి?

భూషయ్య పీడ వదిలించుకునేటందుకు జగ్గు ఒక అద్భుతావకాశం. ఇలాంటి అవకాశం తనకు మళ్ళీ రాదు. కానీ ఇది తనను ట్రాప్ చేయడానికే అయితే!

జగ్గు తన్ను వెరుక్కుంటూ రావడమే ఒక విశేషం........అదే అనుమానించతగ్గ విషయం కూడా!

జగ్గు వెళ్ళి ఇంకా ఇరవయి నాలుగు గంటలయినా కాకుండా పురుషోత్తం అనుమానానికి కొంత సమాధానం లభించింది.

భూషయ్యకు కాంట్రాక్టుల్లో సహాయపడే రమణరావు అతడితో వేగలేక విడిపోయి వేరే వ్యాపారం ప్రారంభించాడు. భూషయ్య అతడిపై పగబట్టి - అతడి వ్యాపారానికి అడుగడుగునా అడ్డు తగులుతున్నాడు. రమణరావుకు విషమ పరిస్థితి ఏర్పడింది - తిరిగి భూషయ్యతోనయినా కలవాలి - లేదా వ్యాపారం మానుకోవాలి.

పురుషోత్తాన్ని కలుసుకునే ముందు జగ్గు రమణరావుని కలుసుకున్నాడు. తను భూషయ్యను చంపుతాననీ - యాభయి వేలు కావాలనీ అడిగాడు. రమణరావుకు జగ్గు పద్ధతి నచ్చింది. కానీ అతడు హత్యకు పాతికవేలు మించి ఇవ్వలేనని చెప్పాడు. జగ్గు నిరాకరించి వెళ్ళిపోయాడు.

జగ్గు వెళ్ళిపోయాక రమణరావు బాగా ఆలోచించాడు. భూషయ్య చనిపోతే తన సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. తనకు యాభయివేలిచ్చుకోగల స్తోమత లేదు. అలాంటప్పుడేం చేయాలి?

భూషయ్యవల్ల చాలామంది ఇబ్బంది పడుతున్నారు. అతణ్ణి చంపాలని చాలామందికి వుంటుంది. అలాంటి కొందరు కలిసి యాభయివేలు పోగుచేసి జగ్గూకిస్తే ఖర్చూ తగ్గుతుంది - పనీ అవుతుంది.

భూషయ్యతో శత్రుత్వం కారణంగా రమణరావుకీ, పురుషోత్తానికీ కొంత స్నేహం కలిగింది. అది పురస్కరించుకుని రమణరావు పురుషోత్తాన్ని కలుసుకుని విషయం వివరంగా చెప్పాడు.

"తన శత్రువుల పన్నాగం తెలుసుకునేందుకిది భూషయ్య పన్నిన పన్నాగం కాదుగదా!" అన్నాడు పురుషోత్తం.

"కాదని నా నమ్మకం......"

ఇద్దరూ కాసేపు మాట్లాడుకున్నాక తన వాటా పాతికవేలూ పురుషోత్తం వద్ద వదిలి వెళ్ళడానికి రమణరావు అంగీకరించాడు.

ఇది పురుషోత్తానికి సంతృప్తిని కలిగించింది.

ఈ డబ్బును తను జగ్గుకు అడ్వాన్సుగా ఇవ్వచ్చు. ఇది తన డబ్బు కాదు కాబట్టి - ఈ కేసులో తను ట్రాప్‌కాడు.

రమణరావు వెళ్ళిపోయిన - ఆరుగంటలకు జగ్గు వచ్చి పురుషోత్తాన్ని కలుసుకుని - "మీరు నిర్ణయమేమిటి? ఈ ఊళ్ళో నేనిక కొన్ని గంటలు మాత్రమే ఉంటాను" అన్నాడు.

"నీకు యాభయివేలూ ఇవ్వడానికి నిశ్చయించుకున్నాను. అడ్వాన్సుగా పాతికవేలిస్తాను. మిగతా పాతికా -పని పూర్తయ్యాక..."

"సరే......... కానీ పాతిక కాదు - యాభై...."

"అంటే.......?"

"రమణరావు మిమ్మల్ని కలుసుకుని పాతికవేలిచ్చాడని నాకు తెలుసు. భూషయ్యను చంపడానికది అతడి వాటా మాత్రమే. మీరిచ్చే యాభయిలో ఒక్క పయిసా కూడా తగ్గదు. మొత్తం డెబ్బై అయిదువేలూ ఇచ్చే మాటయితేనే - నేనిందుకు ఒప్పుకుంటాను..........."

పురుషోత్తం ఆశ్చర్యంగా - "యూ ఆర్ వెరీ స్మార్ట్!" అన్నాడు

పురుషోత్తం అతడికి పాతికవేలూ ఇచ్చి - "పని పూర్తికాగానే మిగతాది..........." అన్నాడు.

"యాభైవేలూ సిద్ధంగా ఉంచండి. రేపు రాత్రికే వచ్చి తీసుకుంటాను" అన్నాడు జగ్గు.

## 3

వాహనాలాట్టే తిరిగే రోడ్డుకాదది. సాయంత్రం ఆరుగంటల సమయంలో ఆ రోడ్డు నిర్మానుష్యంగా ఉంది.

భూషయ్య సాధారణంగా ఆ రోడ్డుమీంచే వెడతాడు. కారులో వెనకసీట్లో అతడున్నాడు. ముందు సీట్లో డ్రైవరున్నాడు.

భూషయ్య దేనిగురించో తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. ఉన్నట్లుండి కారాగడంతో అతడికి ఆలోచనాభంగము అయింది.

"ఏమయింది?"

"సార్ - రోడ్డుకడ్డంగా బండరాళ్ళున్నాయి........." అన్నాడు డ్రైవరు వినయంగా.

భూషయ్య అనుమానంగా డోరు తెరచుకుని కారు దిగాడు.

అప్పుడు చెట్టు పక్కలోంచి చటుక్కున వచ్చాడు జగ్గు - భూషయ్య అతణ్ణి చూసి ఆశ్చర్యపడి ఏదో అనబోయేలోగా - "భూషయ్యా.. నేను జగ్గుని" అన్నాడు.

అప్పటికి భూషయ్యని సమీపించాడు. డ్రైవరు గురించసలతడు పట్టించుకోనేలేదు.

"ఏం కావాలి నీకు?" అన్నాడు భూషయ్య.

"నీ ప్రాణాలు.........." అంటూ జగ్గు బొడ్లోంచీ కత్తి తీశాడు. అడుగున్నర పొడవున్న ఆ కత్తి పదును మెరుపులో కనపడుతోంది.

ఈలోగా డ్రైవరు పిల్లిలా అడుగులో అడుగు వేసుకుంటూ వెనకనుంచి జగ్గును సమీపించాడు. జగ్గు చేతి మీద దెబ్బతీసి కత్తిని పడగొట్టాలని అతడి సంకల్పం.

భూషయ్య ఓరకంట డ్రైవర్ని గమనిస్తూ భయంగా జగ్గు చేతిలోని కత్తినే చూస్తున్నాడు.

డ్రైవర్ చేయి గాల్లోకి లేచేలోగా జగ్గు కాలు వెనక్కు లేచింది.

డ్రైవర్ మూడు పల్టీలు కొట్టాడు.

అప్పుడు జగ్గు భూషయ్యను ఛాతీలో, కడుపులో వరుసగా మూడుపోట్లు పొడిచాడు.

చివ్వున చిమ్మింది రక్తం.

కెవ్వుమన్న భూషయ్య ఆర్తనాదం గాల్లో కలిసిపోయింది.

భూషయ్య నేలకూలిపోయాడు. నేల కూలుతూనే భూషయ్య ప్రాణాలు పోయాయి.

అప్పటికి డ్రైవరు లేచి నిలబడ్డాడు.

చేతిలో కత్తితో అతడివైపు తిరిగాడు జగ్గు.

డ్రైవర్ కాళ్ళలో వణుకు.

"నువ్వు నన్ను చూడలేదు" అన్నాడు జగ్గు.

డ్రైవర్ మాట్లాడలేదు.

"నువ్వు నన్ను చూడలేదు" రెట్టించాడు జగ్గు.

"నేను నిన్ను చూడలేదు" అన్నాడు డ్రైవర్.

"నువ్వు నన్ను చూడనంతకాలం నీకే ప్రమాదం లేదు. భయపడకు" అన్నాడు జగ్గు.

అతడి మాటలు డ్రైవర్ని మరింతగా భయపెట్టాయి.

"పోలీసులడిగితే జరిగింది జరిగినట్లు చెప్పు. కానీ నువ్వు నా మొహం మాత్రం చూడలేదు. గుర్తుంచుకో..."

"గుర్తుంచుకుంటాను. ఇలాంటి కేసుల్లో పోలీసులు నావంటివాళ్ళనే అనుమానిస్తారు."

"పారిపోవడానికి ప్రయత్నించకు. జరిగింది జరిగినట్లు చెప్పుకో. నీ నిజాయితీ నిన్ను రక్షించగలదు........."

"నేను నిన్ను చూడలేదు" అన్నాడు డ్రైవర్ తన నిజాయితీనతడికి గుర్తుచేస్తూ.

జగ్గు నవ్వి వెళ్ళిపోయాడక్కణ్ణించి

## 4

"హలో!" అన్నాడు పురుషోత్తం.

"నేను రమణరావుని - మాట్లాడుతున్నాను......"

"ఏమిటి విశేషం?"

"చాలా పెద్ద విశేషం - భూషయ్య హత్యచేయబడ్డాడు. డేర్ డెవిల్ మర్డర్....."

"నిజంగా" అన్నాడు పురుషోత్తం ఆయన గొంతులో కానీ కళ్ళలో కానీ ఆశ్చర్యం లేదు. మనిషి నిలువెల్లా సంతోషంతో పరవశించిపోతున్నాడు.

"నిజం........." అంటూ రమణరావు హత్యగురించి ఎలా జరిగిందో వివరించి చెప్పాడు.

"చంపిందెవరో తెలిసిందా?"

"పోలీసుల చేతిలో డ్రైవరున్నాడు. డ్రైవర్ హంతకుడి ముఖం చూడలేదంటున్నాట్ట. అతడు చూసే ఉంటాడనీ చెప్పడానికి భయపడుతున్నాడనీ పోలీసులనుకుంటున్నారు. హత్య చేసింది డ్రైవరై ఉండడని భూషయ్య భార్యకూడా అంటోందిట. పోలీసులా విషయం నమ్ముతున్నారు. హంతకుడి ఆచూకీ తెలియడం కష్టమనిపిస్తోంది........"

"సరే - థాంక్స్ ఫర్ ది ఇన్ఫర్మేషన్ - హంతకుడి ఆచూకీ తెలిస్తే మాత్రం నాక్కూడా చెప్పండి.........."

"తప్పకుండా -"

పురుషోత్తం ఫోన్ పెట్టేసరికి పనివాడొకడు "సార్ మీకోసం ఓ మనిషి వచ్చాడు. తన పేరు జగ్గు అని చెప్పాడు" అన్నాడు.

"జగ్గు అంటే - ఇదివరకు వచ్చాడు - అతడేనా?"

"అవును సార్........."

"లోపలకు పంపు - తలుపు వేసెయ్" అన్నాడు పురుషోత్తం.

జగ్గు లోపలకు వచ్చాడు. తలుపులు వెనకనుంచీ మూసుకున్నాయి.

"పనైపోయింది. యాభై వేల కోసం వచ్చాను.........." అన్నాడు జగ్గు.

"థాంక్స్ - కానీ నా సంగతి నీకు తెలియదు -" అన్నాడు పురుషోత్తం.

"మీ సంగతి నేను తెలుసుకున్నాను. భూషయ్య నీకు డబ్బిస్తానని చెప్పి నీ చేత పని చేయించుకున్నాడు. పని చేయించుకున్నాక నీకు మొండిచేయి చూపించాడు. దాంతో నువ్వతడిమీద పగబట్టావు. అతణ్ణి చంపడానికి నీ కారణాలు నీకున్నాయి. భూషయ్య చావడం వల్ల నీ పగ తీరింది. అలాంటప్పుడందుకు నా దగ్గర్నుంచి డబ్బు లాగాలనుకోవడం అన్యాయం!" అన్నాడు పురుషోత్తం.

"అయితే ఏమంటారు?"

"అనడానికేమీ లేదు. ఇచ్చిన పాతికే ఎక్కువ నీకు! నీ పనికి, పగకు - నాదగ్గర్నుంచి డబ్బు వసూలు చేయడం అన్యాయం!"

"పురుషోత్తంగారూ! భూషయ్యగారు చేసిన తప్పే మీరూ చేయకండి - ఫలితం తీవ్రంగా ఉంటుంసి......"

"ఏం - నన్ను చంపుతావా?"

"బహుశా........."

"చంపాలంటే ఇప్పుడే చంపు. నీ ధైర్యం నేను చూస్తాను. నన్ను చంపటం వల్ల ఫలితం నీకూ తెలుస్తుంది" అన్నాడు పురుషోత్తం.

"నేను మిమ్మల్నిప్పుడు చంపను......"

"తెలుసు నాకు. ధైర్యం చాలదు నీకు........"

"భూషయ్యగారు కూడా నన్నిలాగే సవాలు చేశాడు. నేను వదిలిపెడితే అది నా అసహాయత అనుకున్నాడు - చివరికి ఫలితమనుభవించాడు......."

"నన్ను చంపాలంటే ఇదే అవకాశం నీకు" అన్నాడు పురుషోత్తం.

"మిఠాయి దుకాణం వాడు తను తినాలని దుకాణం పెట్టడు. నేను కిరాయి హంతకుణ్ణి హత్యలతో డబ్బు సంపాదించాలనుకుంటాను తప్ప స్వంత పగలకు హత్యలు చేయను నేను. ఇది అర్థంకాక భూషయ్య నాకు పదివేలు ఎగేస్తే ఆయన ప్రాణాలకు యాభైవేలు విలువకట్టాను. నా కిప్పుడూ మీమీద పగేర్పడితే - మీ ప్రాణాలకు లక్ష రూపాయలు విలువకట్టే మనిషికోసం వెతుకుతాను. నేను కిరాయి హంతకుణ్ణి. కిరాయికే తప్ప హత్యలు చేయను. కాబట్టి నేను వెళ్ళిపోతాను. మీ ప్రాణాలకు లక్షరూపాయలు విలువకట్టే మనుషులు లేరనుకుంటేనే మీరు నిశ్చింతంగా ఉండండి. లేకుంటే భూషయ్యకు పట్టిన గతే ఒకరోజు మీకూ పడుతుంది........" అన్నాడు జగ్గు హెచ్చరికగా.

పురుషోత్తం దెబ్బతిన్నాడు. ఈనాడు తను భూషయ్యను చంపాలనుకున్నట్టే - ఒకరోజు తన్ను మరొకడు చంపాలనుకోవచ్చు తన వ్యాపార జీవితమలాంటిది. జగ్గు తన శత్రువుకోసం అన్వేషించడం మంచిదికాదు.

ఆయన వెంటనే జగ్గుకి యాభైవేలూ ఇచ్చేశాడు.

"మీరు తెలివైనవారు. మీకు కిరాయి హంతకుల బాధ ఉండదు" అని వెళ్ళిపోయాడు జగ్గు.

అది ఆశీర్వాదమో, అభిలాషో, అభినందనో పురుషోత్తానికి తెలియలేదు.